


గడ్డి పరకతో విప్లవం

దక్షిణ జపానులోని షికోకు దీవిలోని ఓ చిన్న గ్రామంలో ఫుకుఓకా పుట్టారు. ...క్రోబయాలజీలో శిక్షణ పొంది పంటల తెగుళ్ళ నిపుణుడయ్యాడు. యొకోహామాలో ...స్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. జీవితం సాఫీగా, ఖుషీగా గడిచిపోతుందను ...ంటున్న సమయంలో ఎన్నో ప్రశ్నలు అతన్ని పీడించాయి. 25 ఏళ్ళ ప్రాయంలో ...పొందిన అనుభవం అతని జీవితాన్ని మార్చివేసింది. మానవ ప్రయత్నమంతా వృథా ...ని అతనికి బోధపడింది. చేస్తున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టి పల్లెకు చేరాడు. ఆధునిక ...వ్యవసాయాన్ని సవాలు చేస్తూ పొలాన్ని దున్నకుండా, ఎరువులూ, పురుగుల మందుల్లూ, ...లుపునాశిని మందులూ, యంత్రాలూ కూడా వ్యవసాయం చేయసాగాడు. ప్రకృతిని ...[illegible]గా అనుసరిస్తూ 'ఏమీ చెయ్యనవసరం లేని' వ్యవసాయ విధానాన్ని ...రూపొందించారు. అతను అవలంబించిన పద్ధతుల వల్ల నేల ఏ ఏటికాఏడు సారవంతం ...వుతూ వచ్చింది. జపానులో మరే ప్రాంతానికీ తీసిపోని దిగుబడులు పొందుతున్నాడు. ...న అనుభవసారాన్నంతా ఈ పుస్తకంలో నింపాడు. ఆహార సంస్కృతి గురించి, ...ప్రకృతి జీవనం గురించి ఇందులో వివరించాడు. ఇది జపనీస్ భాషలో 1975 లో ...ప్రచురితమయ్యింది. 1978 లో ఇంగ్లీషులోకి అనువాదమయ్యింది. ఆ తరువాత దేశ ...దేశాల్లో ఎన్నో భాషల్లోకి అనువాదం అయ్యి, ఎన్నో ముద్రణలను పొందింది. వ్యవ ...సాయానికి జీవితానికి సంస్కృతికి, మధ్య విడదీయరాని సంబంధం ఉందని ఫుకుఓకా ...విశ్వాసం ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకోవాలని ఉన్న ప్రతి ఒక్కరూ ...చదవదగిన పుస్తకమిది.

రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన విశ్వభారతి విశ్వవిద్యాలయం మసనోబు ...ఫుకుఓకాకు 1988 లో 'దేశికోత్తమ' బిరుదునిచ్చి గౌరవించింది. ఆ సందర్భంలో ...యన హైదరాబాదు కూడా సందర్శించారు. వ్యవసాయం వ్యాపారం కాదు జీవిత ...విధానమన్న భారతీయ సంప్రదాయానికి జీవం పోసే పుస్తకమిది.

గడ్డిపరకతో విప్లవం

ప్రకృతి వ్యవసాయ పరిచయం



మసనోబు ఫుకుఓకా

గడ్డిపరకతో విప్లవం

ప్రకృతి వ్యవసాయ పరిచయం



మసనోబు ఫుకుఒకా

టింబక్టు కలెక్టివ్ ప్రచురణ

Gaddi Parakato Viplavam Telugu Translation of Masanobu Fukuoka's 'The One Straw Revolution' originally published in Japanese as 'Shizen Noho Wara Ippon No Kakumei'. The Telugu Translation is being published with the permission from the author obtained through Friends Rural Centre, Rasulia, Hoshangabad, M.P. - 461 001

అనువాదం : సురేష్, సంపత్

ప్రచురణ సంఖ్య : 1

ప్రతుల సంఖ్య : 3,000

కవర్ డిజైన్ : గంగాధర్

వెల :

సాదా ప్రతి : రూ. 30/-

మేలు ప్రతి : రూ. 50/-

పుస్తకం వెలలో
10 శాతం వ్యక్తనిధికి
చేరుతుంది.

టింబక్టు కలెక్టివ్ ప్రచురణ

మొదటి ముద్రణ : నవంబరు, 1990

ప్రతులకు :

టింబక్టు కలెక్టివ్,
చెన్నకొత్తపల్లి, పోస్ట్ & మండల్
అనంతపురం జిల్లా - 515 101

సుబ్బయ్య,
3-6-671/A, ఫస్ట్‌ఫ్లోర్
10వ వీధి, హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029

ముద్రణ : ప్రింటోరియం, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029

విషయసూచిక

ముందు మాట

కేవలం వ్యవసాయం గురించే ఈ పుస్తకంలో ఉంటుందనుకొనే పాఠకులు ఆహారం గురించీ, ఆరోగ్యం గురించీ, సాంస్కృతిక విలువలు గురించీ, మానవ జ్ఞాన పరిమితుల గురించీ కూడా ఇందులో ఉండటం చూసి ఆశ్చర్యపోతారు. ఈ పుస్తకంలోని తత్వ సిద్ధాంతాల గురించి ఆ నోటా ఈ నోటా విన్న పాఠకులు దీంట్లో వరి, శీతాకాలపు పంటలు, పండ్లు, కూరగాయలు ఎలా పండించాలో ఉండటం చూసి ఆశ్చర్యపోతారు.

ఒక పుస్తకం కేవలం ఒకే విషయం గురించి ఉంటుందన్న అభిప్రాయంతో మనమీనాడున్నాం. అందుకే 'గడ్డి పరకతో విప్లవం' వంటి పుస్తకాల ఆవశ్యకత ఉంది. ఇది కార్యాచరణకు తోడ్పటమే కాకుండా తాత్వికమైందికూడా. అందుకే ఈ పుస్తకం ఎంతో విలువయింది. కేవలం వ్యవసాయానికే పరిమితంకాని ఈపుస్తకం ఎంతో ప్రేరణనిస్తుంది.

పుకుఓకా అనుసరించిన విధానాలు మన పొలాల్లో ఆచరించలేమని ఎవరికయినా ఇట్టే అర్థమయిపోతుంది. అందుకని ఈపుస్తకంలో దీనికి సంబంధించిన అంశాలు ఎందుకూ పనికిరావనుకొంటే పొరబడినట్లే. నూతన ఉత్సాహంతో, పారలు కమ్మని కళ్ళతో, శ్రద్ధతో భూమి, వాతావరణం, పంటలనూ చూసినప్పుడు ఏమిసాధించవచ్చో ఈ అనుభవాలు తెలియచేస్తాయి. మనం ఏమి చేయవచ్చో సూచించటమేకాకుండా మనలో ఉత్సాహాన్నినింపుతాయి. అందుకే ఇవి ఎంతో విలువయినవి. ఆసక్తితో తెలుసుకోతగినవి. ఈపుస్తకం చదువుతున్న రైతులకు దీనిలోని అంశాలకూ,తమపొలాల్లోని వాస్తవాలకు సంబంధాలు కనపడతాయి.

చాలా మందిలాగా, అయితే అతిచిన్న వయస్సులోనే,జీవితంలోని ఒక అంశాన్నిమరోదానినుంచి వేరుచెయ్యలేమని పుకుఓకా గుర్తించారు. మనం

పంటలు పండించే పద్ధతి మార్చటంద్వారా మన ఆహార అలవాట్లనీ, మన సమాజాన్ని, మనవిలువలనూ మార్చుతున్నాం. అందుకే సంబంధాలు,కార్యకరణాల పట్ల దృష్టికేంద్రికరించటం గురించి ఈపుస్తకం చెపుతుంది. మనకు తెలిసిన దానిపట్ల బాధ్యత వహించాలనికూడా ఈ పుస్తకం తెలియ చేస్తుంది.

సేంద్రియ వ్యవసాయంతో పరిచయమున్నవారికి పుకు ఓకాకీ పాశ్చాత్య దేశాల్లో సేంద్రియ వ్యవసాయానికి ఆద్యుడయిన సర్ ఆల్బర్ట్ హెూవార్డ్‌కి మధ్య పోలికలు కనపడతాయి. ఇద్దరూ ప్రయోగశాలలో శాస్త్రజ్ఞులుగా పనిచేశారు. ఇద్దరూ దీని పరిమితుల్ని గుర్తించారు. ఇతరులకు చెప్పేముందు తాను ఆచరించి చూపాలని హెూవార్డు ప్రయోగశాల విడిచిపెట్టి వ్యవసాయం మొదలుపెట్టాడు. పుకుఓకా కూడా ఇదే బాట అనుసరించాడు: "నా ఆలోచనలకు ఒకరూపాన్ని ఇవ్వాలనుకొన్నాను. ఆచరణలో పెట్టాలనుకొన్నాను. దీనిద్వారా ఇవి సరయినవో కావో తెలుసుకొందామనుకొన్నాను. వ్యవసాయం చేస్తూ జీవితాన్ని గడిపే మార్గాన్ని ఎన్నుకొన్నాను." అంతేకాదు: "వంద వివరణల కంటే ఒక ఆచరణ ఎన్నోరెట్లు నయంకదా?" అంటాడు. ఒకనిపుణుడు తన సలహాలను తానేపాటిస్తే, తానుచెప్పేది చేసిచూపిస్తే అతని చుట్టూ ఉన్న గోడలు బద్దలైపోతాయి. అప్పుడు అతను కేవలం జ్ఞానంతోనేకాక అనుభవంతో కూడుకొన్న జ్ఞానంతో మాట్లాడటంవల్ల అతను చెపుతున్నదానిని శ్రద్ధగా వింటాం.

"ఏమీ చెయ్యనవసరంలేని" వ్యవసాయ విధానంగురించి పుకుఓకా మాట్లాడుతున్నప్పుడు పాశ్చాత్యులకు సేంట్‌మత్తయ్య 6:26 లోని ఈవాక్యాలు గుర్తుకొస్తాయి: "ఆకాశ పక్షులను చూడుడి, అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయిననూ మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు." ఈరెండింటి ఉద్దేశం ఒకటేనని నా అభిప్రాయం. ప్రపంచంలో మనస్థానాన్ని ఇవి తెలియ చేస్తున్నాయి. ఈప్రపంచానికీ, మనుషులకూ మనం సృష్టికర్తలంకాము. జీవితాన్ని ఉపయోగించుకొంటూ బతుకుతున్నాం. అంతేకాని దానిని సృష్టించటంలేదు. అయితే వెతక్కుండా పిట్టలకు కూడా ఆహారం అందనట్లే పనిచెయ్యకుండా రైతుకూడా వ్యవసాయం చెయ్యలేడు. ఈ విషయాన్నే పుకుఓకా కూడా తెలియ చేస్తున్నాడు : "ఏమీ చెయ్యనవసరంలేని వ్యవసాయం గురించి నేనుప్రచారం చేస్తుంటాను. దాంతో ఇక్కడ భూతలస్వర్గముందనీ, మంచం మీదనుంచి దిగకుండా హాయిగా గడిపెయ్యవచ్చనీ చాలామంది

వస్తుంటారు. ఇటువంటివాళ్ళకు నిరాశే మిగులుతుంది". అసలుపనివద్దని కాదు ఇక్కడ చెప్పేది, అనవసరమయిన పని వద్దని మాత్రమే చెబుతున్నారు. కోర్కెల కారణంగా ప్రజలు అవసరానికి మించి ఎంతో కష్టపడుతుంటారు. ఒకోసారి వాళ్ళుకోరుకొనేది వాళ్ళకి అవసరముండదు.

తమకే అంతా తెలుసునన్న గర్వంతో నిపుణులు పెత్తందారి పోకడలు పోతుంటారు. దీనికి నిరసనగా ఇంగిత జ్ఞానం 'ఏమీ చెయ్యనవసరంలేని' వ్యవసాయంవైపు మొగ్గుతుంది: "ఇది చెయ్యకుండా ఉంటే ఎలా ఉంటుంది? అదిచెయ్యకుండాఉంటే ఎలా ఉంటుంది? -ఇదీ నాఆలోచనా విధానం." గుడ్డెద్దు చేలో పడ్డట్టు ప్రవర్తించే నిపుణులకు భిన్నంగా పిల్లలూ, కొంత మంది పెద్దవాళ్ళు "ఎందుకు" అని ప్రశ్నించకుండా ఏమీచెయ్యరు.

శాస్త్రవిజ్ఞానం పట్ల, లేదా శాస్త్రవిజ్ఞానంగా చలామణి అవుతున్నదానిపట్ల, అపనమ్మకమున్న శాస్త్రవేత్త పుకుఓకా. అంత మాత్రాన జ్ఞానం అంటే చిన్నచూపు ఉందని కాదు. అతను చెప్పేది ఆచరణీయంకాదని అనుకోటానికి వీల్లేదు. వాస్తవానికి అతని ఆచారణనుంచీ, అతని జ్ఞానం నుంచీ అతని అనుమానాలు పుట్టాయి. ఆల్బర్ట్ హెూవార్డ్‌లాగే పుకుఓకా కూడా జ్ఞానాన్ని ముక్కలు ముక్కలుగా చూడటాన్ని వ్యతిరేకిస్తాడు. వీరిద్దరూ ఒకవిషయాన్ని సమగ్రంగా చూడాలంటారు. తెలిసినదానితోపాటు తెలియనవీ ఉన్నాయని వీళ్ళుమరిచిపోరు. ఆధునిక విజ్ఞానశాస్త్రం అద్భుతాలను చులకనగా చూస్తుంది. తనకు తెలియనిదానిని పట్టించుకోనవసరంలేదనే ఊహతో తెలిసిన దానికే జీవితాన్ని పరిమితం చేస్తుంది -ఇది వీరి భయం. "విధ్వంసానికి గురయిన ప్రకృతే శాస్త్రీయ విజ్ఞానానికి బోధపడుతుంది. ఇది ఆత్మలేని అస్థిపంజరం లాంటిది" అని పుకుఓకా అంటాడు. ఈమాటలు వర్డ్స్‌వర్త్ పదాలను గుర్తుకుతెస్తాయి:

మన జోక్యందారీ బుద్ధికి బలియై
సహజసుందర వస్తుజాలం రూపుమారిపోతుంది
తెలుసుకోడం కోసం హత్యలు చేస్తాం మనం

పుకుఓకా విజ్ఞానం ఆరాధన భావంతో మొదలై, దానితోనే ముగుస్తుంది. మానవుని బుద్ధికి అర్థమయినదంతా కుంచించుకుపోతుందన్న ఎరుక అతనికుంది. ఒక విషయాన్ని జ్ఞానం ద్వారా సమగ్రంగా అర్థంచేసుకోలేమని అతని విశ్వాసం. అర్థం చేసుకోవాలని లేకపోవటం ద్వారా వచ్చే ఆనందంతోటి ఇది సాధ్యమవుతుంది.

ఈ భావం గాస్పెల్స్‌లోనూ, విలియం బ్లేక్ కవితలోనూ కనపడుతుంది:

చిన్ని ఆనందానికి బంధించుకునేవాడు
స్వేచ్ఛావిహంగమజీవితానికి పగవాడు
ఎగిరే ఆనందాన్ని ముద్దాడగలిగేవాడు
అనంతపుసూర్యోదయంలో జీవిస్తాడు

ఈవిధమయిన ఆలోచననుంచే ఫుకుఓకా వ్యవసాయ విధానం పుట్టింది: "దేనినయినా పొందాలని తాపత్రయ పడినప్పుడు దాంట్లోని ఆనందాన్ని కోల్పోతామని గుర్తించిననాడు ప్రకృతి వ్యవసాయ సారం బోధపడుతుంది."

ఆద్యంతం ఆదరణ భావంతో నిండిన ఈవిధమయిన "ప్రకృతి" వ్యవసాయం అన్ని చోట్లా మానవీయంగా ఉంటుంది. మానవ కళ్యాణం లక్ష్యంగా ఉన్నపుడు మనుషులు బాగా పని చేస్తారు. కానీ ఇప్పటివరకు వ్యాపార సరళిలోని వ్యవసాయలక్ష్యాలు "అధిక దిగుబడులు", "అధిక సామర్థ్యం" మాత్రమే. అందుకే ఫుకుఓకా అంటాడు: "వ్యవసాయం అంతిమలక్ష్యం పంటలు పండించటంకాదు, పరిపూర్ణ మానవుడిని తయారుచేయటం." అందుకే వ్యవసాయం ఒక జీవిత విధానం అంటాడు: "ప్రతిరోజూ తన పొలాన్ని చూసుకొంటూ రోజంతా స్వేచ్ఛగా ఆనందిస్తూ గడపటమే ఒకప్పటి వ్యవసాయ విధానం అయ్యుంటుంది." పరిపూర్ణమయిన వ్యవసాయంమనిషిని శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంచుతుంది. కేవలం అన్నంతినటంవల్లనే మనం బతకటంలేదు.

వెండెల్ బెర్రీ

పరిచయం

దక్షిణ జపాన్‌లోని షికోకు దీవిలో ఒక పల్లె. ఇక్కడ మసనోబు ఫుకుఓకా ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రూపొందించారు. ఆధునిక వ్యవసాయం చేసిన నష్టాన్ని సరిచెయ్యటానికి ఇది తోడ్పడుతుంది. ప్రకృతి వ్యవసాయానికి యంత్రాలు అక్కర్లేదు. రసాయనాలు అక్కరలేదు. కలుపు తీయాల్సిన అవసరముండదు. ఫుకుఓకా పొలాన్ని దున్నరు. తయారుచేసిన పెంట పోగు ఎరువు వాడరు. పంట ఉన్నంతకాలం వరిచేలో నీళ్ళు నిలవగట్టటం ప్రపంచమంతటా తరతరాలుగా వస్తున్న అలవాటు. ఫుకుఓకా ఈపనీ చెయ్యరు. దశాబ్దాలపాటు పొలాన్ని దున్నకపోయినా ఇక్కడి దిగుబడులు జపానులో అధికంగా ఉత్పత్తి చేసే పొలాలతో పోటీపడుతున్నాయి. మిగతావాటికంటే ఈపద్ధతిలో శ్రమ తక్కువ. కాలుష్యం ఉత్పన్నం కాదు. శిలాజ ఇంధనాలు వాడాల్సిన అవసరం ఉండదు.

ఫుకుఓకా గురించి మొదట్లో విన్నప్పుడు అంతగా నమ్మకం కలగలేదు. పొలాన్ని దున్నకుండా విత్తులు చల్లి, వరి, శీతాకాలపు పంటల్లో అధిక దిగుబడులు పొందగలగటం ఎలాసాధ్యం? ఇంతకుమించి ఏదో ఉండి ఉండాలి.

క్యోటో ఉత్తరంగా ఉన్న కొండ మీద మరికొంత మందితో కలిసి చాలాకాలంగా వ్యవసాయం చేస్తున్నాను.వరి,రై, బార్లీ, సోయాచిక్కుడు, వివిధకూరగాయలు పండించటానికి సంప్రదాయ జపనీసు పద్ధతుల్ని పాటించే వాళ్ళం. మాపొలం చూడటానికి వచ్చేవాళ్ళు ఫుకుఓకా గురించి చెప్పేవారు. వీళ్ళల్లో ఎవ్వరూ అక్కడ ఎక్కువకాలం ఉండి ఆయన పద్ధతుల గురించి వివరంగా తెలుసుకోలేదు. వాళ్ళమాటలు విన్న తరువాత నాలో కుతూహలం కలిగింది.

మాపొలంలో పనులు వత్తిడి లేనపుడు నేను దేశయాటన చేస్తుండే వాడిని. రైతుల పొలాల్లోనూ, సహజీవన కేంద్రాల్లోనూ ఉంటూ చిన్నచిన్న

పనులు చేసేవాడిని. ఫుకుఓకా గురించి స్వయంగా తెలుసుకొందామని ఒకసారి అక్కడికి వెళ్ళాను.

ఆయన గురించి ఏమి ఊహించుకొన్నానో ఖచ్చితంగా గుర్తులేదు. కానీ ఆయన గొప్పతనం గురించి విన్ననాకు మామూలు జపనీస్సురైతు వేసుకొనే బూట్లు, బట్టల్లో ఆయన్ని చూసి ఆశ్చర్యం కలిగింది. అయినా అతని తెల్లని మేకగడ్డం, చురుకయిన స్వభావం, ఆత్మ విశ్వాసం అతనొక అసాధారణ వ్యక్తని తెలియ చేశాయి.

మొదటసారి అక్కడికి వెళ్ళినపుడు పండ్లతోటలో కొన్ని నెలలు ఉన్నాను: పొలం పనులు ద్వారా, సాయంత్రాలు మట్టి గుడెసలో తోటి విద్యార్థులతో చర్చల ద్వారా ఫుకుఓకా విధానమూ, దానికి ఆధారమయిన తాత్వికచింతనా బోధపడసాగాయి.

ఫుకుఓకా పండ్లతోట కొండవాలుల్లో ఉంది. అక్కడినుంచి చూస్తే మత్సుయామా సముద్రం కనపడుతుంది. విద్యార్థులు ఈకొండమీదేఉండి, పని చేస్తారు. ఇక్కడకు వచ్చే వాళ్ళలో చాలామంది నాకులాగానే ఏమి కావాలో తెలియకుండానే వస్తారు. కొన్ని రోజులో, కొన్నివారాలో ఇక్కడ గడిపి వచ్చిన దారినే వెళ్ళిపోతారు. ఒకసంవత్సరమన్నా ఇక్కడగడిపినవాళ్ళు కనీసం నలుగుర యిదుగురు ఉంటారు. ఎంతోమంది స్రీ పురుషులు ఇక్కడకు వచ్చివెళ్ళారు.

ఇక్కడ ఆధునిక సౌకర్యాలు ఏమీలేవు. కిందనున్నకాలవనుంచి మంచినీళ్ళు బక్కెట్లతో మోసుకురావాలి. కట్టెలమీద అన్నంవండుకోవాలి. రాత్రుళ్ళు కొవ్వొత్తులు, కిరోసిన్ బుడ్డి వెలుగుమాత్రమే ఉంటుంది. కొండలనుండి రకరకాలమూలికలు,కూరగాయమొక్కలూతెచ్చుకోవాలి.కాలవలో రకరకాలచేపలు, ఇన్‌లాండ్‌సముద్రంనుంచి సముద్ర ఆహారం పట్టితెచ్చుకోవాలి.

వాతావరణాన్నిబట్టీ, కాలాన్నిబట్టీ ఇక్కడ పనులు మారుతుంటాయి. ఉదయం ఎనిమిది గంటలకు పని మొదలవుతుంది. చీకట్లు ముసిరేముందు గుడిసెలకు తిరిగివస్తారు. మధ్యలో ఒకగంట భోజనానికి ఉంటుంది. వేసవిలో అయితే భోజన విరామం రెండు, మూడు గంటలుంటుంది.వ్యవసాయ పనులుకాకుండా నీళ్ళు చేరవేయటం, కట్టెలు కొట్టడం, వంట, వేడినీళ్ళుకాయటం, మేకలసంరక్షణ, కోళ్ళకు మేతవెయ్యటం, గుడ్లు సేకరించటం, తేనెతుట్టెలు చూడటం, ఇళ్ళమరమ్మతు, అప్పుడప్పుడు కొత్తఇళ్ళుకట్టటం, మిసో (సోయా

చిక్కుళ్ళ రుబ్బుడుపిండి), టోఫు (సోయాచిక్కుళ్ళ పాలతో చేసే పెరుగు) తయారుచేయటం వంటి పనులుంటాయి.

ఇక్కడ నివసించేవారి అవసరాలకు ఫుకుఓకా కొంతడబ్బుసమకూరుస్తారు. ఇక్కడ ఉత్పత్తి చెయ్యటానికి వీలుకాని సోయా సాస్, వంటనూనె వంటివి ఈ డబ్బుతో కొంటారు. మిగిలిన అవసరాలకు ఇక్కడ పండే పంటల మీదా, వనరులమీదా, తమశక్తియుక్తులమీదా ఆధారపడాల్సిందే. ఆదిమకాలాన్ని పోలిన ఈజీవిత విధానంలోనే ఫుకుఓకా సంవత్సరాల తరబడి జీవిస్తున్నారు. ఈవిధమయిన జీవిత విధానంతోనే ప్రకృతి సేద్యం అనుసరించటానికి అవసరమయిన స్పందనను అలవరచుకోగలుగుతారని అతని అభిప్రాయం.

ఫుకుఓకా నివసిస్తున్న ప్రాంతంలో మైదానప్రాంతంలో వరినీ, కొండ వాలుల్లో చీనీ జాతుల పండ్లతోటలనూపండిస్తారు. ఫుకుఓకాకి ఒకటింపావు ఎకరం వరిచేనూ, పన్నెండున్నర ఎకరాల పండ్లతోటలు ఉన్నాయి. పాశ్చాత్యులకు ఇదా చాలా తక్కువ విస్తీర్ణం అనిపించవచ్చు. కానీ పని అంతా సంప్రదాయ పరికరాలతోనే చేస్తారు కాబట్టి ఈ కొద్దిపొలాన్ని చూడటానికి చాలాసమయం పడుతుంది.

పొలాల్లోనూ, పండ్లతోటలోనూ మిగిలిన వాళ్ళతోపాటు ఫుకుఓకా కూడా పనిచేస్తారు. పని జరుగుతున్నచోటుకి అతనుఎప్పుడు వస్తాడో ఎవరూ చెప్పలేరు. ఎవరూ ఊహించని సమయంలో ప్రత్యక్షం కావటం ఆయన ప్రత్యేకత. ఎంతో చురుకుగా, ఏదోఒకటి మాట్లాడుతూఉంటారు. పనిచేస్తున్న వాళ్ళని దగ్గరికి పిలిచి పనిగురించి చర్చిస్తారు. ఆ పనిని ఇంకా తేలికగా, త్వరగా ఎలా చేయవచ్చో చెబుతారు. ఒక్కొక్కసారి ఒక కలుపుమొక్క జీవిత చక్రంగురించో,తెగులు గురించో వివరిస్తారు.తన అనుభవాల గురించి చాలా అరుదుగా చెబుతారు. తన విధానం గురించి తెలియ చెయ్యటమేకాకుండా వ్యవసాయంలో మౌలిక నైపుణ్యాన్ని గురించి చెబుతారు. పరికరాలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతారు. వాటి ఉపయోగాలను పదే పదే ప్రదర్శించి కూడా చూపిస్తారు.

'ప్రకృతి వ్యవసాయం' అంటే హాయిగా పడుకొంటే ప్రకృతే వ్యవసాయం చేస్తుందనుకొనేవాళ్ళకు తెలుసుకోవాల్సిందీ, చెయ్యాల్సిందీ చాలా ఉంటుందనీ ఫుకుఓకా స్పష్టపరుస్తారు. ఖచ్చితంగా చెప్పాలంటే వేటాడటం, ఏరుకోవటం

మాత్రమే అసలయిన ప్రకృతి సేద్యం కిందకొస్తాయి. వ్యవసాయ పంటలు పండించటం అన్నది నాగరికత ద్వారా వచ్చింది. దీనికి ఎంతో తెలిసి ఉండాలి, నిరంతరం శ్రమపడాలి. ప్రకృతిని జయించి మెరుగుపరచాలనుకోకుండా,ప్రకృతితో కలిసి పనిచెయ్యటంలోనేతేడా అంతా.

చాలా మంది ఒకపూట ఉందామనివస్తారు. వాళ్ళకు ఫుకుఓకా తన పొలాలన్నిటినీ చూపిస్తారు. ఆయన అలుపూసొలుపూలేకుండా కొండ ఎక్కుతుంటే వెనుక పదిపదిహేను మంది రొప్పుతూ ఎక్కటం సాధారణంగా కనపడే దృశ్యం. ఇంతకు ముందు వచ్చిపోయేవాళ్ళు ఎక్కువగా ఉండేవారుకారు. కొన్నిసంవత్సరాలుగా అసలు బయటప్రపంచంతో సంబంధంలేకుండా ఫుకుఓకా గడిపారు.

చిన్న వయస్సులోనే ఫుకుఓకా పల్లె విడిచి యోకోహామా చేరి అక్కడ మైక్రోబయాలజీలో శిక్షణ పొందాడు. పంటల తెగుళ్ళలో నిపుణుడయ్యాడు. కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచెయ్యటం మొదలుపెట్టాడు. అప్పుడు అతనికి 25 ఏళ్ళు. ఆ వయస్సులోనే అతని జీవితగమ్యాన్ని మార్చివేసిన అనుభూతి పొందాడు. 'గడ్డిపరకతో విప్లవం' అన్న ఈ పుస్తకం సందేశం కూడా ఇదే. ఉద్యోగం వదిలి పెట్టి తన భావాలు సరయినవో కావో ఆచరణలో తేల్చి చూడటానికి పల్లెకు తిరిగి వచ్చాడు.

చాలా కాలంగా సాగు చెయ్యని పొలం పక్కగా వత్తుగా పెరిగిన గడ్డి, కలుపుమొక్కలమధ్య ఆరోగ్యంగా పెరుగుతున్న వరి మొక్కలను చూశాడు. ఇలాగే ఎందుకు చెయ్యకూడదు అన్న భావన వచ్చింది. అప్పటినుంచి తన వరిపొలంలో నీరు నిలవకట్టడం మానుకొన్నాడు. సహజ పరిస్థితుల్లో వరి పంట తయారయ్యి ఆకురాలే కాలం (శిశిరం)లో గింజ రాలుతుంది. అందుకని ఫుకుఓకా కూడా వసంతంలో వరి విత్తటం మానుకొని ఆకురాలే కాలంలోనే గింజలు వెదజల్లటం మొదలుపెట్టాడు. కలుపు మొక్కల్ని అరికట్టడానికి పొలాన్ని దున్నకుండా నేలను కప్పి ఉంచే క్లోవరు సాగు చేయటం, పంటనూర్చిన తరువాత గడ్డిని తిరిగి పొలం మీద పరవటం వంటి పద్ధతులు చేపట్టాడు. పైర్లకు అనువయిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తించిన తరువాత ఫుకుఓకా చెయ్యాల్సిన పని చాలా తగ్గిపోయింది.

ఈ పుస్తకంలో ఛాలాసార్లు ఫుకుఓకా వరిసాగు గురించి ప్రస్తావిస్తుంటారు.

చాలా మందికి దీని గురించి తెలియదు కాబట్టి జపనీసు సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల గురించి కొంత వివరంగా తెలుసుకొందాం.

వర్షాకాలంలో నదీ జలాలు ముంచెత్తిన మైదాన ప్రాంతాల్లో నేరుగా వరి విత్తనం చల్లేవారు. ఆ తరువాత వరదలు తగ్గినపుడు పొలాల్లో నీళ్ళు నిల్వ ఉండటానికి గట్లు వేసేవారు.

రెండవ ప్రపంచ యుద్ధం చివరి వరకు జపానులో వరిసాగుకు సంప్రదాయ పద్ధతి ఆచరణలో ఉండేది. దీంట్లో ముందుగా నారుమడిని చక్కగా తయారు చేసి నారు పెంచుతారు. పొలం మీద పెంటపోగు, ఎరువులు చల్లి, నీళ్ళు కట్టి, మెత్తగా దమ్ము చేస్తారు. నారు మొక్కలు 20 సెం.మీ. ఎత్తు పెరిగినప్పుడు పీకి నాట్లు వేస్తారు. బాగా అనుభవమున్న వ్యక్తి ఒక రోజులో ఎకరంలో మూడవ వంతు నాట్లు వెయ్యగలుగుతాడు.

వరినాట్లు వేసిన తరువాత వరుసల మధ్య అంతరకృషి చేస్తారు. చేతితో కలుపు తీస్తారు. కనీసం ఒక అంగుళం లోతు నీళ్ళు ఉండేట్లు పొలంలో మూడు నెలల పాటు నిలవకడతారు. కోతకు కొడవళ్ళు ఉపయోగిస్తారు. వరి మోపులు కట్టి కొన్ని వారాల పాటు ఎండనిచ్చి నూరుస్తారు. ఈ విధంగా నాట్లు నుంచి, కోత వరకు పొలమంతా కనీసం నాలుగుసార్లు అయినా తిరగాల్సి ఉంటుంది.

వరి కోతలయిన తరువాత పొలాన్ని దున్ని చాళ్ళు పోస్తారు. రెండు చాళ్ళ మధ్య అడుగు దూరం ఉంటుంది. ఇది కాలువగా పని చేస్తుంది. చాలుమీద రై, లేదా బార్లీ విత్తనం చల్లి మట్టితో కప్పుతారు. నాటే/విత్తే సమయాన్ని ఖచ్చితంగా పాటించటంవల్లా, పొలాలకు కావలసిన సేంద్రియ పదార్థం, పోషక పదార్థాలు జాగ్రత్తగా అందించటం వల్లా ఈ విధమయిన పంటలు సాగు చెయ్యగలిగేవారు. సంప్రదాయ పద్ధతులననుసరించి ప్రతి సంవత్సరం వరి, శీతాకాలపు పంటలను భూసారం ఏమాత్రం తగ్గకుండా వందల సంవత్సరాల పాటు సాగు చేశారంటే ఆశ్చర్యం కలుగుతుంది.

సంప్రదాయ పద్ధతిలో చాలా మంచి లక్షణాలున్నాయని ఫుకుఓకా అంటారు. అయితే దీంట్లో అనవసరమయిన పని చాలా ఉందని అతని అభిప్రాయం. తన పద్ధతిని 'ఏమీ చెయ్యాల్సిన అవసరం లేని' పద్ధతిగా పేర్కొంటాడు. అంతమాత్రాన ఎటువంటి ప్రయాస పడకుండా అతని పద్ధతిలో వ్యవసాయం చేయవచ్చని కాదు. క్రమం తప్పకుండా పనులు చెయ్యటం వల్లనే ఈ పాలాలు

ఇలా ఉన్నాయి. పని కొంచమయినా ఎంతో శ్రద్ధతో, ఎంతో జాగ్రత్తగా చేస్తారు. ఒక పొలంలో వరో లేదా కూరగాయలో పండించాలని నిర్ణయించిన తరువాత రైతు దానికి బాధ్యత వహించాలి. ప్రకృతిలో జోక్యం చేసుకొని ఆ తరువాత వదిలిపెట్టడం బాధ్యతారాహిత్యమూ, ప్రమాదకరమూ అవుతుంది.

ఆకురాలే కాలంలో పుకుఓకా వరి, క్లోవరు, శీతాకాలపు పంట విత్తనాలు చల్లుతారు. ఆ తరువాత వరిగడ్డి పొలమంతా చల్లుతారు. బార్లీ, లేదా రై, క్లోవరు వెంటనే మొలకెత్తుతాయి. వసంత కాలం వరకు వరి విత్తనం నేలలో వేచి ఉంటుంది.

పొలాల్లో శీతాకాలపు పంటలు ఎదుగుతూ, పాలు పోసుకొనే దశలో కొండమీద పండ్లతోటలో పనులు మొదలవుతాయి. నవంబరు మధ్య నుంచి ఏప్రిల్ వరకు నారింజ పండ్లు కొయ్యాల్సి ఉంటుంది.

మే నెలలో రై, బార్లీ కోతకు వస్తాయి. వారం, పదిరోజులు పొలంలో ఎండబెట్టిన తరువాత నూరుస్తారు. ధాన్యం పోతపట్టి సంచుల్లో నింపి నిల్వ చేస్తారు. ఈ గడ్డినంతటినీ ముక్కలుగా కత్తిరించకుండా నేరుగా పొలంలో వెదజల్లుతారు. జూన్‌లో వర్షాలు మొదలయినప్పుడు కొన్ని రోజులపాటు వరి పొలంలో నీళ్ళు నిలవగడతారు. దీనితో క్లోవరు, కలుపు మొక్కలు కొంత బలహీనపడతాయి. వరి మొక్కలకు పైకి వచ్చే అవకాశం దొరుకుతుంది. పొలంనుంచి నీళ్ళు తీసేసిన తరువాత క్లోవరు వ్యాపించి నేలనంతటిని కప్పేస్తుంది. ఇప్పటి నుంచి కోత వరకు సంప్రదాయ పద్ధతుల్ని పాటించే రైతుకు ఊపిరాడని పని ఉంటుంది. ఇక్కడ మాత్రం పొలంలో నీళ్ళు సరిచూసుకోవటం, కాలిబాటల్లోని గడ్డి కత్తిరించటం మించి పనులుండవు.

అక్టోబరులో వరి కోతకొస్తుంది. వరి మోపులను వేలాడగట్టి ఆ తరువాత నూరుస్తారు. ఆకురాలే కాలంలో విత్తటం పూర్తయ్యేనాటికి ముందుగా కోతకు వచ్చే నారింజ, బత్తాయి పండ్లు కోతకు తయారవుతాయి.

పావు ఎకరం వరిపొలం నుంచి 500-585 కిలోల దిగుబడి పొందుతారు. ఈ ప్రాంతంలో సంప్రదాయ పద్ధతుల్లోనూ, రసాయనిక పద్ధతుల్లోనూ పండించే పంటల దిగుబడితో ఇది సరితూగుతుంది. శీతాకాలపు పంటల్లో చాళ్ళలో సాగు చేసే సంప్రదాయ, రసాయనిక పద్ధతుల కంటే ఇక్కడ ఎక్కువ దిగుబడి లభిస్తుంది.

సంప్రదాయ, రసాయనిక, ప్రకృతి వ్యవసాయాల్లో దిగుబడుల్లో అంతగా తేడా లేకపోయినప్పటికీ భూసారంపై చూపే ప్రభావంలో చెప్పకోదగ్గ మార్పు ఉంటుంది. పుకుఓకా పొలాల్లో ఏ ఏటికి ఆ ఏడు నేల మరింత సారవంతం అవుతూ ఉంటుంది. పొలాలను దున్నటం మానేసిన నాటి నుంచి నేలసారం, నిర్మాణం, నీటిని పట్టి ఉంచే గుణం మెరుగవుతూ ఉన్నాయి. సంప్రదాయ పద్ధతుల్లో నేల పరిస్థితుల్లో ఎటువంటి మార్పూ ఉండదు. రైతు పెంటపోగు ఎరువు వేసిన దానిబట్టి దిగుబడులు పొందుతాడు. రసాయనిక పద్ధతులు అవలంబించే పొలాల్లో కొద్దికాలంలోనే నేల జీవరహితమయిపోయి, సహజసారాన్ని కోల్పోతుంది.

వరి పైరులో నిత్యం నీళ్ళు నిలవగట్టాల్సిన అవసరం లేకపోవటం పుకుఓకా పద్ధతిలోని మరో లాభసాటి అంశం. ఇది సాధ్యమంటే చాలామంది నమ్మరు. ఇది సాధ్యమని పుకుఓకా నిరూపించటమే కాక, ఈ విధంగానే వరి బాగా పెరుగుతుందని రుజువు చేశారు. ఇక్కడి పొలాల్లో వరి మొక్కల వేళ్ళు లోతుకు వెళతాయి. కాండం బలంగా ఉంటుంది. పుకుఓకా సాగు చేస్తున్న సంప్రదాయ వరి రకం కంకికి 250-300 గింజలను కలిగి ఉంటుంది.

నేలను ఎప్పుడూ కప్పి ఉంచటం వల్ల నీటిని పట్టి ఉంచే శక్తి పెరుగుతుంది. ప్రకృతి వ్యవసాయం అవలంబించడం ద్వారా చాలా ప్రాంతాల్లో సాగునీటి అవసరం లేకుండా పోతుంది. ఈ విధంగా ఇంతకు ముందు పండించని ప్రాంతాల్లో సైతం వరి, అధిక దిగుబడి నిచ్చే ఇతర పంటలో సాగు చెయ్యవచ్చు. నేల కోతకు గురి అవుతుందన్న భయం లేకుండా వాలు భూములనూ, సారవంతం కాని ప్రాంతాలను సాగు కిందకు తీసుకురావచ్చు. ప్రస్తుత వ్యవసాయ విధానాల వల్లా, రసాయనాల వల్లా దెబ్బతిన్న నేలలను ప్రకృతి వ్యవసాయం ద్వారా బాగు చేయవచ్చు.

పంట పొలాల్లోనూ, పండ్లతోటలోనూ పురుగులూ, తెగుళ్ళూ ఉంటాయి. అయితే పంట పూర్తిగా ఎప్పుడూ నష్టపోదు. బలహీనమయిన మొక్కల్నే ఇవి దాడిచేస్తాయి. ఆరోగ్యమయిన వాతావరణంలో పంటలను సాగుచెయ్యటంకంటే చీడపీడలను అదుపులో ఉంచటానికి మరో మంచి మార్గం లేదని పుకుఓకా దృఢ అభిప్రాయం.

కొయ్యటానికి తేలికగా చెట్లు కిందకి ఉండేలా కొమ్మలను పుకుఓకా కత్తిరించడు. చెట్లను వాటి విలక్షణమయిన, సహజ ఆకారంలో పెరగనిస్తాడు. నేల తయారు చేయనవసరం లేకుండానే కొండవాలుల్లో కూరగాయలు, మూలికలు సాగు చేస్తాడు. వసంతంలో పెద్ద వాన పడటానికి ముందు రకరకాల కూరగాయ విత్తనాలు కలిపి వెదజల్లుతాడు. ఈ పద్ధతి అన్ని ప్రాంతాల్లో పని చెయ్యకపోవచ్చు. జపానులో వసంత కాలంలో క్రమం తప్పకుండా వానలు పడటంవల్ల ఇక్కడ ఇది సాధ్యమవుతోంది. పుకుఓకా పండ్లతోట బంకమట్టినేలతో కూడింది. సేంద్రియ పదార్థంతో పై పొరలు మెత్తగా ఉండి ఎక్కువ నీళ్ళు పట్టి ఉంచగలుగుతుంది. చాలా సంవత్సరాల పాటు పండ్లతోటలో కలుపుమొక్కలు, క్లోవరు పెరగటం వల్ల పై పొరలు ఈ విధంగా తయారయ్యాయి.

కూరగాయల మొక్కలు చాలా చిన్నగా ఉన్నపుడు కలుపు మొక్కల్ని కత్తిరించాల్సి ఉంటుంది. ఇవి నిలదొక్కుకొన్న తరువాత ఇక ఏమీ చెయ్యాల్సిన పని లేదు. కొన్ని కొయ్యకుండా మిగిలిపోవటం వల్ల విత్తనాలు పడి మరు సంవత్సరం వాటంతట అవే మొలుచుకొస్తాయి. ఒకటి రెండు సంవత్సరాలలో ఎదుగుదలలోనూ, రుచిలోనూ ఇలా పడి మొలిచిన మొక్కల లక్షణాలు అడవిరకాలను పోలి ఉంటాయి. ఇటువంటి మొక్కలకు ఎటువంటి సంరక్షణా అవసరముండదు. పుకుఓకా దగ్గరకు వచ్చిన మొదట్లో పండ్లతోటలో తిరుగుతున్నప్పుడు నిలువెత్తు గడ్డిలో కాలుకి ఏదో గట్టిగా తగిలింది. గడ్డి తొలగించి చూస్తే క్లోవరు మధ్య దోసకాయలు, పుచ్చకాయలు కనపడ్డాయి.

రకరకాల పుస్తకాల్లో, పత్రికల్లో తన పద్ధతి గురించి పుకుఓకా రాశాడు. రేడియోలోనూ, టెలివిజన్‌లోనూ ఎన్నోసార్లు ఇంటర్వ్యూ చేశారు. కాని అతని పద్ధతిని ఒక్కరూ అనుసరించ లేదు. ఆ సమయంలో సమాజం అతనికి సరిగ్గా వ్యతిరేక దిశలో పయనిస్తోంది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత జపాన్‌లో ఆధునిక రసాయనిక వ్యవసాయాన్ని అమెరికన్లు ప్రవేశపెట్టారు. సంప్రదాయ పద్ధతులనవుసరించి పొందినంత దిగుబడిలే దీంట్లోనూ పొందినప్పటికీ రైతు శ్రమ సగానికి పైగా తగ్గింది. దీంతో రైతుల కల పండినట్లయ్యి కొద్ది కాలంలోనే అందరూ రసాయనిక వ్యవసాయాన్ని చేపట్టసాగారు.

పంటమార్పిడి, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట పైర్ల ద్వారా శతాబ్దాలపాటు నేలలోని సేంద్రియ పదార్థం తగ్గి పోకుండా జపనీస్ రైతులు చెయ్యగలిగారు. ఈ పద్ధతులను విడనాడి, సత్వర ఫలితాలనిచ్చే రసాయనిక ఎరువులు వాడటంతో నేలలోని సేంద్రియ పదార్థం ఇట్టే మాయమయ్యింది. నేల తీరు దెబ్బతింది. పంటలు బలహీనమయ్యి రసాయనిక పోషక పదార్థాల మీద ఆధారపడసాగాయి. తగ్గిన శ్రమకు పణంగా భూసారాన్ని బలిచేశారు.

జపాను భూములూ, సమాజమూ గత నలభై సంవత్సరాలుగా క్షీణించి పోవటాన్ని పుకుఓకా నిరశనతో చూస్తుండిపోయారు. పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో జపాను గుడ్డిగా అమెరికాను అనుసరించసాగింది. పల్లెపట్టులోంచి రైతులు పారిశ్రామిక వాడలలోకి వలసపోసాగారు. పుకుఓకా, అతని తాత ముత్తాతలు ఈ పల్లెలో శతాబ్దాల తరబడీ ఉంటున్నారు. మత్సుయామా నగరం విస్తరించుకొంటూ దీని శివారు పట్టణాలు ఇప్పుడు ఈ పల్లె అంచుల దాకా వచ్చాయి. పుకుఓకా వరిపొలాలను చీలుస్తూ ఇప్పుడొక జాతీయ రహదారి పడింది. పట్టణ నాగరికతకు నిదర్శనంగా ఈ రోడ్డుకిరుపక్కలా పారేసిన ఖాళీసీసాలూ, సంచులూ కనపడతాయి.

తన సిద్ధాంతం ఏ మతం పైనా ఆధారపడి లేదని పుకుఓకా చెపుతారు. కానీ అతని బోధనా పద్ధతిపైనా, ఉపయోగించే పదజాలం పైనా జెన్, బౌద్ధం, టావోఇజమ్‌ల ప్రభావం బాగా ఉంది. అప్పుడప్పుడు అతను చెపుతున్న దానిని మరింత బాగా వివరించటానికో, చర్చను ప్రేరేపించటానికో బైబిల్ నుంచీ, క్రైస్తవ మతం నుంచీ ఉదాహరణలు ఇస్తుంటాడు.

వ్యక్తి ఆధ్యాత్మిక ఆరోగ్యం నుంచి ప్రకృతి సేద్యం పుట్టుకొస్తుందని పుకుఓకా నమ్మకం. భూమిని బాగుపరచటం, మానవ ఆత్మను ప్రక్షాళన చేయటం ఒకటేనని అతని అభిప్రాయం. ఈ ఏకత్వాన్ని సాధించగల వ్యవసాయ విధానాన్ని అతను ప్రతిపాదిస్తున్నాడు.

ప్రస్తుత పరిస్థితుల్లో పుకుఓకా అభిప్రాయాలన్నీ ఆచరణలోకి రావటం అతని జీవిత కాలంలో జరిగేపనికాదు. ముప్పై సంవత్సరాలు గడిచినప్పటికీ అతని పద్ధతులు ఇంకా పరిణామ దశలోనే ఉన్నాయి. ఆధ్యాత్మికంగా సంతృప్తికరమయిన జీవితానికి దారితీసే రోజువారీ పనులు ప్రపంచాన్ని సుందరంగా, అర్థవంతంగా

మారుస్తాయని నిరూపించటమే అతను మనకిచ్చిన కానుక.

రసాయనిక వ్యవసాయం వల్ల దీర్ఘ కాలంలో సంభవించే సమస్యలను ఈనాడు గుర్తిస్తున్నారు. అందుకే ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ మార్పుకు జపానులో ఫుకుఓకా ముందు నిలిచాడు. 1975 అక్టోబరులో 'గడ్డి పరకతో విప్లవం' (జపాను భాషలో) అచ్చుకావడంతో జపనీసు రైతుల్లో ప్రకృతి వ్యవసాయం విశేష ఆదరణ పొందింది.

ఫుకుఓకా దగ్గర దాదాపు సంవత్సరంన్నర ఉన్నాను. ఆ కాలంలో అప్పుడప్పుడు క్యోటోలోని మా పొలానికి వెళ్ళి వస్తుండేవాడిని. అక్కడి వాళ్ళందరూ ఈ పద్ధతులను ఆచరణలో పెట్టడానికి ఎంతో ఉత్సాహం చూపించారు. క్రమేపి మా పొలాన్నంతటిని ప్రకృతి సేద్యం కిందకు తీసుకు వచ్చాం.

సంప్రదాయ పద్ధతిలో వరి, రై కాకుండా ఫుకుఓకా పద్ధతిలో గోధుమ, బక్‌వీట్, బంగాళాదుంప, మొక్కజొన్న, సోయాచిక్కుడు సాగుచేస్తున్నాం. మొక్కజొన్న మాదిరి ఆలస్యంగా మొలిచే రకాలకు కర్రపుల్లతో కన్నాలు చేసి ఒక్కొక్క కన్నంలో ఒక్కొక్క విత్తనం వేస్తాం. ఈ విధంగా మొక్కజొన్న, సోయాచిక్కుడు కలిపి పండించాం. ఈ విత్తనాలకు మట్టి పట్టించి వెదజల్లే పద్ధతిని అనుసరించాం. ఆ తరువాత గడ్డి, క్లోవరు కత్తిరించి గడ్డి పరిచాం. మొక్కజొన్న, సోయా చిక్కుడు నిలదొక్కుకొన్న తరువాత క్లోవరు తిరిగి మొలుచుకొచ్చింది.

కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చి ఫుకుఓకా సహాయపడ్డారు. అయితే చాలా సందర్భాల్లో తప్పులు చేస్తూ మా పరిస్థితులకు, మా పంటలకు అనుగుణంగా పద్ధతులు రూపొందించుకొన్నాం. మా పొలాలూ, మా ఆత్మలూ ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళడానికి కొంత కాలం పడుతుందని తెలుసు. మార్పు నిరంతర ప్రక్రియ.

ల్యారీ కార్న్

తెలుగు ప్రతికి ముందుమాట

అన్ని వృత్తులలోకి వ్యవసాయం మహత్తరమయినది. 'అందరికీ అన్నం పెట్టేవాడు రైతే' అని మన నానుడి. అంటే అన్ని రంగాలకూ వ్యవసాయమే ఆధారం. సేద్యం నిలిచిపోయిన నాడు ఇంకేదీ పురోగమించలేదు.

అడ్డూ అదుపూ లేకుండా విస్తరించిన పారిశ్రామిక విధానం దుష్పరిణామాలను ఈనాడు ప్రపంచం ఎదుర్కొంటోంది. ప్రస్తుత పారిశ్రామిక వ్యవసాయ విధానం ఏదో ఒకనాడు కుప్పకూలి పోయేదేనని లాభాలవేటలో ఉన్న స్వార్థపర శక్తులూ, దూరదృష్టి లేని రాజకీయ నాయకులూ తప్ప అందరూ అంగీకరిస్తున్నదే. ఆహార రంగంలో ఎదుర్కొనున్న సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేయటానికే ఈ స్వార్థపరశక్తులు తమ శక్తియుక్తులన్నీ కేంద్రీకరించి కృషి చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు అర్థవంతమయిన, స్వయం సమృద్ధమయిన ప్రత్యామ్నాయాలు, ప్రత్యేకించి ఆహార ఉత్పత్తిలో ప్రత్యామ్నాయాల కోసం అన్వేషిస్తున్నారు.

ఒకవైపున వినాశనం, మరోవైపు మనుగడ ఉన్న కూడలిలో మానవాళి ఈనాడు చేరుకొంది. ఇటువంటి విషమపరిస్థితిలో ఎలా ఇరుక్కున్నాం అని ప్రశ్నించుకొంటే ప్రకృతినుంచీ మనిషి మూర్ఖంగా దూరం కావడమేనన్న సమాధానం ఒక్కటే మిగులుతుంది.

ఫుకుఓకా మాటల్లో చెప్పాలంటే : "మానవ ప్రాణం కేవలం తన శక్తి ద్వారా నిలబడటం లేదు. మానవులకు జన్మనిచ్చి, వాళ్ళప్రాణాలను ప్రకృతి కాపాడుతోంది. ప్రకృతికీ మనిషికీ మధ్య ఉన్న సంబంధం ఇది."

జీవనప్రదాయిని అయిన ఈ సంబంధాన్నే మనం తెగ నరుక్కున్నాం. ఇదే సమస్యలన్నిటికీ మూలం. మానవాళి బట్టకట్టి, మనగలగాలంటే ఆలోచనల్లోనూ, ఆచరణల్లోనూ ఈ సంబంధాన్ని పునరుద్ధరించాలి. ఇందుకు మించి

మరో మార్గంలేదు. ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాల గురించి విస్తృతంగానే చర్చించినప్పటికీ ఈ పుస్తకంలో పుకుఓకా చెప్పదలుచుకున్నది కూడా ఇదే.

ఆధునికత విధ్వంసక రూపాన్ని ముందుగానే చూడగలిగి, సూత్రీకరించినవాళ్ళలో గాంధీజీ ఒకరు. దీని ఆధారంగానే ఆయన ఒక ప్రజా ఉద్యమం చేపట్టాడు. ఈ ఉద్యమం విఫలమయ్యిందన్నది చరిత్ర చెబుతున్న సత్యం. పాశ్చాత్య దేశాలకు నకలుగా ఏర్పడిన పారిశ్రామిక విధానానికీ మన వ్యవసాయ విధానానికీ మధ్యనున్న వైరుధ్యాలను అర్థం చేసుకోటానికి మనం తిరిగి ప్రయత్నాలు కొనసాగించవలసిన అవసరం ఎంతయినా ఉంది.

ఈ తెలుగు అనువాదం మనల్ని ఈ దిశలో కార్యోన్ముఖుల్ని చేస్తుందని ఆశిద్దాం.

నవంబరు,1990

వెంకట్
పర్మాకల్చర్ రిసోర్సెస్
117, ఈస్ట్‌మారేడ్‌పల్లి
సికింద్రాబాద్

ప్రచురణకర్తల మాట

గత దశాబ్దకాలంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కొంతమంది కలిసి 'టింబక్టు కలెక్టివ్'గా ఏర్పడ్డారు. స్వేచ్ఛాయుత, సమసమాజ స్థాపన దిశలో జరిగే పనికి జీవావరణ సంరక్షణ, స్వయంసమృద్ధి కోణాలను సమకూర్చటమే ఈ కలెక్టివ్ ఉద్దేశం.

టింబక్టు ప్రాంతాన్ని పంట పొలాలతో, హరిత వనంతో కార్యకర్తలకూ, కళాకారులకూ విశ్రాంతిస్థలంగా రూపొందిస్తున్నాం. కొత్త ఆలోచనలకూ, కొత్త భావాలకూ ఇది కేంద్రంగా ఉంటుంది. చుట్టుపక్కల ఉన్న క్రియాశీలక సంస్థల ద్వారా తన అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకువెళుతుంది. అన్ని సహజీవన కేంద్రాలలో మాదిరి ఇక్కడ కూడా రానున్న సంవత్సరాలలో ఒక ప్రత్యామ్నాయ బడి, మొక్కల నర్సరీ, స్థానిక మూలికల నర్సరీ, కోలుకొనే కేంద్రం, సాంస్కృతిక కేంద్రం, కష్టాల్లో ఉన్న మహిళలకు వసతి ఏర్పడనున్నాయి.

స్వేచ్ఛ సమానత్వం, న్యాయం కోసే సాగే సుదీర్ఘ ప్రయాణంలో టింబక్టు ఒక మజిలి. నిరశన తెలియచేసే సంస్కృతికి ఇది ప్రతీక. ప్రపంచాన్ని నాశనం చేయటానికి పూనుకొన్న శక్తులను తిప్పికొట్టేవాళ్ళందరు దీని చుట్టూ ఐక్యమవుతారని ఆశిస్తున్నాం.

టింబక్టు అంటే 'చివరి సరిహద్దు రేఖ'. టింబక్టు అన్వేషణలో మమ్మల్ని ప్రభావితం చేసిన చాలా కొద్ది పుస్తకాల్లో 'The One Straw Revolution' ఒకటి. ఈ పుస్తకం మాలో ఆశను రేపింది, దిశను చూపించింది, కార్యాచరణకు దారి చేసింది. ఈ పుస్తకాన్ని ఇతరులతోటి పంచుకోవాలన్న అభిప్రాయం సహజంగానే కలిగింది. అందుకే దీని తెలుగు ముద్రణతో ముందుకొస్తున్నాం.

ఈ ప్రచురణ వెలుగును చూస్తోందంటే దీని వెనుక ఎందరివో సహాయ సహకారాలున్నాయి. దీనిని అనువదించిన సురేష్‌కి, అతనికి సహకరించిన సంపత్‌కి

ప్రత్యేక కృతజ్ఞతలు. భారతదేశంలో ఇంగ్లీషు ముద్రణతో పాటు ప్రాంతీయ భాషలలో ప్రచురణ హక్కు పొందిన ఫ్రెండ్స్ రూరల్ సెంటర్ తరపున శ్రీ డే తెలుగు ప్రచురణకు అనుమతినిచ్చారు. ఆర్థిక అవరోధాలు, ఇతర సమస్యలు ఎదుర్కోటానికి సహకరించిన వారికి, ఈ పుస్తకం చక్కగా రూపు దిద్దుకోవడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ మరొకసారి కృతజ్ఞతలు.

ఈ పుస్తకం వెలలో పదిశాతం 'వృక్షనిధి'కి కేటాయిస్తున్నాం. ఈ విధంగా కూడిన మొత్తాన్ని చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించటానికి ఉపయోగిస్తాం. ఈ విధంగా ఈ పుస్తకం ముద్రించటానికి కాగితంగా మారిన చెట్లను ఈ విధంగా తిరిగి వృద్ధి చేసినట్లవుతుంది.

నవంబరు,1990

టింబక్టు కలెక్టివ్
చెన్నేకొత్తపల్లి
అనంతపురం జిల్లా – 515 101

I



ఈ పంటను చూడండి

ఈ గడ్డి పరక నుంచి ఒక విప్లవం మొదలవుతుందని నా నమ్మకం. పరాకుగా చూస్తే గడ్డిపరకేగా అనిపించవచ్చు. ఇది విప్లవం తీసుకు రాగలదంటే ఎవ్వరూ నమ్మకపోవచ్చు. దీని శక్తిని నేను గుర్తించాను. దీనితో విప్లవం తీసుకు రావడం సాధ్యమేనని నాకు తెలుసు.

ఈ రై[1], బార్లీ పొలాలను చూడండి. పావు ఎకరం నుంచి 585 కిలోల దిగుబడి వస్తుంది. జపానులో కెల్లా సారవంతమయిన భూములున్న ఎహైమ్ ప్రాంతం[2] లోని అత్యధిక దిగుబడులతో ఇది సరితూగుతుంది. కాబట్టి ఇక్కడి దిగుబడులు దేశంలోని ఏ ప్రాంతపు దిగుబడులకూ తీసిపోవు. కానీ ఈ పొలాలను 25 ఏళ్ళనుంచి దున్నలేదు.[3]

ఈ పంటలను నాటడం ఏమంత కష్టమయిన పని కాదు. వరి పంట కోయకముందే రై, బార్లీ విత్తనాలు చల్లుతాను. కొన్ని వారాల తరువాత వరి కోసి, నూర్చి గడ్డిని తిరిగి పొలంలో చల్లేస్తాను.

---

1. బార్లీ, గోధుమలను పోలిన శీతాకాలపు పంట.
2. మనదేశంలో జిల్లా అన్నట్లు జపానులో Prefecture (ప్రాంతం) అంటారు.
3. ఈ పుస్తకం 1975 అక్టోబరులో జపాను భాషలో ముద్రితమైంది. అన్ని విషయాలు అప్పటికి సంబంధించినవని గుర్తుంచుకోవాలి.

వరి నాటడం కూడా ఇంతే. ఇప్పుడున్న శీతాకాలపు పంటలు[1] మే 20 నాటికి అటూ ఇటూగా కోతకు వస్తాయి. కోతకు రెండు వారాల ముందే రై, బార్లీ పొలాల్లో వరి విత్తనాలు చల్లుతాను. ఈ పంటలు కోసి, నూర్చిన తరువాత గడ్డిని పొలంలో పరుస్తాను.

వరి, శీతాకాలపు పంటలను ఒకే విధంగా విత్తటం ఇక్కడి ప్రత్యేకత. అయితే ఇంత కంటే తేలిక పద్ధతి కూడా ఉంది. పక్క మడిలో ఈ విధానాన్ని అనుసరించాను. దీంట్లో వరిని కూడా శీతాకాలపు పంటలతో పాటు విత్తాను. దీనివల్ల ఈ మడిలో విత్తే కార్యక్రమమంతా జనవరికి పూర్తి అయ్యింది.



"ఈ పొలాన్ని 25 ఏళ్ళ నుంచి దున్నలేదు."

1. శీతాకాలంలో సాగుచేసే రై, బార్లీ పంటలను ఫుకుఓకా శీతాకాలపు (చలికాలపు) పంటలుగా వ్యవహరిస్తారు.

ఈ పొలాల్లో పంట మొక్కలతో పాటు తెల్లక్లోవరు[1], కలుపు మొక్కలు కూడా పెరుగుతుండటం మీరు గమనించే ఉంటారు. క్లోవరును రై, బార్లీ కంటే ముందు అక్టోబరు మొదట్లో వరి పొలంలో చల్లుతాను. కలుపు మొక్కల విత్తనాలు నేను చల్లాల్సిన అవసరం లేదు. వాటంతట అవే మొలుచుకొస్తాయి.

ఇక్కడ విత్తే కార్యక్రమం ఈ విధంగా ఉంటుంది: వరి ఉన్నపుడే అక్టోబరు మొదట్లో క్లోవరు విత్తనం చల్లుతాను; ఆ తరువాత అక్టోబరు మధ్యలో శీతాకాలపు పంటల విత్తనాలు చల్లుతాను. నవంబరు మొదట్లో వరి కోతలు పూర్తవుతాయి. ముందు సంవత్సరానికి వరి విత్తి, గడ్డిని పొలాల్లో పరుస్తాను. మీరు చూస్తున్న రై, బార్లీ పంటలు ఈ విధంగా సాగు చేసినవే.

ఒకరిద్దరు మనుషులు కొన్ని రోజుల పనితో పావు ఎకరంలో వరి, శీతాకాలపు పంటలు పండించగలరు. పంటలను ఇంతకంటే తేలికగా పండించే విధానం మరొకటి ఉండదు.

ఈ విధానం ఆధునిక వ్యవసాయ పద్ధతులకు పూర్తిగా భిన్నమయినది. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానాన్నీ, తరతరాలుగా రైతులు పాటిస్తున్న పద్ధతుల్నీ ఈ విధానం తుంగలో తొక్కుతుంది. ఈ విధానంలో యంత్రాల అవసరం లేదు. ఎరువుల అవసరం లేదు. పురుగుల మందుల అవసరం లేదు. అయినప్పటికీ దేశ సగటు దిగుబడుల కంటే ఎక్కువ దిగుబడి పొందుతున్నాను.

మీ కళ్ళ ముందు పాలు పోసుకుంటున్న ఈ పైరే దీనికి రుజువు.

1. White Clover– కాయజాతి (లెగ్యూమ్)కి చెందిన బహువార్షికపు మొక్క. పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. మన ప్రాంతంలో సాగు కాదు. లూసర్న్ (ఆల్ఫాల్ఫా)ను పోలి ఉంటుంది. కలుపును అదుపులో ఉంచడానికీ, నేలను సారవంతం చేయడానికి ఫుకుఓకా క్లోవరును వినియోగిస్తారు.

ఏమీ లేదు

నేను ఈ విధమయిన వ్యవసాయం మొదలుపెట్టి చాలా సంవత్సరాలయ్యింది. ఇది ఎందుకు మొదలు పెట్టావని ఇటీవల అందరూ నన్ను అడుగుతున్నారు. ఈ విషయాన్ని నేను ఇంతవరకు ఎవరితోనూ చర్చించలేదు. నేను ఈ పద్ధతిని ఎందుకు చేపట్టానన్నది మాటల్లో చెప్పటం కష్టం ఓ మెరుపు, ఓ అదురుపాటు, ఓ చిన్న అనుభవం దీనికంతటికీ మూలం.

ఆ అనుభవం నా జీవితాన్నంతటినీ మార్చివేసింది. దీన్ని గురించి చెప్పడానికి ఏమీ లేదు; కాని చెప్పాలంటే ఇలా ఉంటుంది : "మానవాళికి అసలు ఏమీ తెలియదు. దేనికయినా గానీ దానంతట దానికే ఏ విలువా ఉండదు. ప్రతి చర్యా వ్యర్థం, అనవసర శ్రమ". ఇది చాలా విపరీతంగా మీకు అనిపించవచ్చు. కానీ మాటల్లో ఇంత కంటే వేరే విధంగా వివరించలేం.

యుక్త వయస్సులోనే ఈ 'ఆలోచన' ఉన్నట్టుండి నాకు వచ్చింది. మానవ ప్రయత్నం, ప్రయాస వృథా అన్న నా ఆలోచన సరయినదో కాదో నాకు తెలియదు. ఈ ఆలోచనను పరిశీలించు కొన్నప్పుడూ, నా మెదడు లోంచి తొలగించటానికి ప్రయత్నించి నపుడూ ఇందుకు వ్యతిరేకమయిన దేదీ నాకు కనపడలేదు. ఇది ఇంతే నన్న భావన ఒక్కటే నాలో నిత్యమూ మండుతుండేది.

మానవ విజ్ఞానానికి మించింది లేదనీ, మానవులు సృష్టికే తలమానికం వంటి వారనీ, సంస్కృతీ, చరిత్రలలో ప్రతిబింబిస్తున్న

తమ శక్తి సామర్థ్యాలు అమోఘమయినవనీ అందరూ అభిప్రాయ పడుతుంటారు.

నా ఆలోచన ఇందుకు పూర్తి వ్యతిరేకంగా ఉండేది. అందుకే నా అభిప్రాయాలు ఎవరితోనూ పంచుకోలేక పోయేవాడిని. చివరకు నా ఆలోచనలకు ఒక రూపం ఇచ్చి, ఆచరణలో పెట్టి అవి సరయినవో, కావో తేల్చుకోవాలనిపించింది. ఇందుకు వ్యవసాయం చేస్తూ, వరి, శీతాకాలపు పంటలు పండిస్తూ జీవితాన్ని గడిపి వేసే మార్గాన్ని ఎన్ను కొన్నాను.

నా జీవితాన్నే మార్చి వేసిన ఆ అనుభవం ఏమిటి ?

నలభై ఏళ్ళ నాటి మాట. అప్పుడు నా వయసు 25 సంవత్సరాలు. యోకోహామా కస్టమ్స్ బ్యూరోలో మొక్కల తనిఖీ విభాగంలో పని చేస్తుండే వాడిని. ఎగుమతి, దిగుమతి అవుతున్న మొక్కల్లో రోగాలు వ్యాప్తి చేసే పురుగులు ఏవైనా ఉన్నాయేమో పరిశీలించటం నా పని. నాకు చాలా తీరిక సమయం ఉండేది. నేను మొక్కల తెగుళ్ళ గురించి చదువుకొన్నాను. నా అభిరుచి కూడా దీంట్లోనే. పరిశోధనలు చేస్తూ నా తీరిక సమయాన్ని ప్రయోగశాలలో గడిపివేసే వాడిని. ఈ ప్రయోగశాల యమాటె పార్కు పక్కనే ఉంది. పై నుంచి చూస్తే దూరంగా యోకోహామా రేవు కనపడేది. ప్రయోగశాలకు ఎదురుగా కాథలిక్ చర్చి ఉండేది. తూర్పు వైపున ఫెర్రిస్ బాలికల పాఠశాల ఉండేది. ఈ ప్రాంతమంతా చాలా ప్రశాంతంగా ఉండేది. పరిశోధనలు కొనసాగించటానికి ఇంతకంటే చక్కని వాతావరణం దొరకదు.

ప్రయోగశాలలో ఈచి కురొసావా తెగుళ్ళపై పరిశోధనలు చేస్తుండేవారు. గీపు వ్యవసాయ ఉన్నత పాఠశాలలో మాకోటొ ఒకెరా వద్ద మొక్కల తెగుళ్ళ గురించి అధ్యయనం చేశాను. ఆ తరువాత ఓకాయామా ప్రాంతీయ వ్యవసాయ కేంద్రంలో సుహికో ఇగాటా వద్ద శిక్షణ పొందాను.

ఆచార్య కురొసావా వద్ద పనిచేసే అవకాశం లభించటం నా అదృష్టం. బయట ప్రపంచానికి ఆయన గురించి అంతగా తెలియదు. వరిలో 'బకనే' (Bakanae) తెగులును కలుగ చేసే శిలీంధ్రాన్ని మొట్ట మొదటిసారి వేరు చేసి, ప్రయోగశాలలో వృద్ధి చేయటంలో సఫలమయ్యారు. బూజు నుంచి 'జిబ్బరిల్లిన్' అనే హార్మోనును వేరు చేసిన మొదటి వ్యక్తి ఆయనే. ఈ హార్మోనును తక్కువ మోతాదుల్లో తీసుకొన్నప్పుడు లేత వరి మొక్క చాలా ఎత్తు పెరుగుతుంది. మోతాదు ఎక్కువైతే ఎదుగుదల కుంటుపడి మొక్క పొట్టిగా ఉండిపోతుంది. జపానులో ఈ పరిశోధనల్ని ఎవరూ పట్టించుకోలేదు. విదేశాల్లో మాత్రం దీనిపై ఎన్నో పరిశోధనలు జరిగాయి. జిబ్బరెల్లిన్ హార్మోనును ఉపయోగించి అమెరికా శాస్త్రజ్ఞుడు విత్తనాలు లేని (సీడ్ లెస్) ద్రాక్షను రూపొందించాడు.

కురొసావా సాన్[1] ను నేను తండ్రిగా గౌరవించే వాడిని. ఆయన సహకారంతో ఒక సూక్ష్మదర్శినిని తయారు చేశాను. అమెరికా, జపానులకు చెందిన చీనీ, బత్తాయి[2] రకాల్లో ఆశించే బంక తెగులు పై పరిశోధనల్లో మునిగిపోయాను.

సూక్ష్మదర్శినిలో బూజుదారాలను పరిశీలిస్తుండేవాడిని. వేరు వేరు శిలీంధ్ర రకాలను సంకర పరచి తెగులును కలుగ చేసే కొత్త రకాలను తయారు చేశాను. ఈ పనిలో తన్మయత్వం పొందేవాడిని. దీనికి ఎంతో ఓపిక, శ్రద్ధ కావాలి. పని ఒత్తిడి వల్ల ఒక్కొక్కసారి పని చేస్తూ చేస్తూ స్పృహ తప్పి పోతుండేవాడిని.

---

1. సాన్ అన్నది జపనీసు భాషలో స్త్రీ, పురుషులకు గౌరవసూచకంగా వాడే పదం. తెలుగులో 'గారు' మాదిరి.
2. చీనీ, బత్తాయి జాతి చెట్లు (citrus trees); కమలాపండు, నారింజ చెట్లు ఈ జాతికిందకే వస్తాయి.

అయితే 24 గంటలూ ప్రయోగశాలలోనే గడిపేవాడిని కాను. యవ్వనోత్సాహంతో, సరదాగా తిరుగుతుండేవాడిని. ఆటపాటలతో కాలక్షేపం చెయ్యడానికి యోకోహామా రేవు పట్టణం చాలా అనువైంది. ఆ రోజుల్లో జరిగిన ఒక ఘటన నాకు ఇంకా గుర్తుంది. ఒకరోజు కెమేరా తీసుకొని తీరం వెంట షికారుకు బయలు దేరాను. దారిలో ఒక అందమయిన మహిళ ఎదురయ్యింది. ఫోటోకు సరిపోయే వర్చస్సనిపించి అనుమతి అడిగాను. దగ్గరలో లంగరేసి ఉన్న విదేశీ నౌక పైకి ఎక్కటానికి ఆమెకు సహాయం చేసి ఇటు చూడమనీ, అటు చూడమనీ చాలా ఫోటోలే తీశాను. ఫోటోలు తయారయిన తరువాత తనకు కూడా కాపీలు పంపమని కోరింది. ఏ చిరునామాకు పంపించాలని అడిగాను. 'ఒపునాకి' అని ఊరుపేరు మాత్రం చెప్పి తన పేరు చెప్పకుండా వెళ్ళి పోయింది.

రీలు కడిగి, ప్రింట్లు వేసిన తరువాత వాటిని ఒక మిత్రునికి చూపించాను. ఫోటోల్లోని వ్యక్తిని అతడు గుర్తు పట్టి "ఈమె ప్రఖ్యాత సినీతార మీకోటాకామినె" అని ఆశ్చర్యపోయాడు. వెంటనే పది ఫోటోలు పెద్దవి చేసి ఆమె పేరున ఒపునా నగరానికి పంపించాను. ఆ ఫోటోల మీద ఆమె సంతకం చేసి నాకు తిరిగి పంపించింది. ఒక ఫోటో మాత్రం తిరిగి రాలేదు. దీని గురించి ఆలోచించగా ఆ ఫోటో ఆమె ముఖాన్ని ఒక పక్క నుంచి బాగా దగ్గరగా తీసినదని గుర్తుకు వచ్చింది. బహుశ దాంట్లో ఆమె ముఖం మీది ముడతలు కనపడుతున్నాయేమో. సాగరమంతటి స్త్రీ మనస్తత్వంలో ఒక తరంగం బోధపడినట్లు మురిసిపోయాను.

నాకు డాన్స్ చెయ్యటం అంత బాగా రాకపోయినా అప్పుడప్పుడు నాన్‌కింగాయిలోని డాన్స్ హాల్‌కి వెళుతుండేవాడిని. అక్కడ ఒకసారి ప్రఖ్యాత గాయిని నోరికో అవయా పరిచయమయ్యింది. నాతో డాన్సు

చేయమని ఆమెను అడిగాను. ఆ సాయంత్రాన్ని నేను ఎప్పటికీ మరువను. ఆమె భారీ కాయం నన్ను ముంచివేసింది. ఆమె నడుము నా చేతిలో ఇమడ లేదు.

మొత్తానికి రోజంతా ప్రయోగశాలలోనూ, సాయంత్రాలు ఆటపాటలతోనూ తీరిక లేకుండా గడిచిపోయేవి. సూక్ష్మదర్శినిలో నేను చూసే ప్రపంచమూ, ఈ విశాల విశ్వమూ ఒకే రకంగా గోచరించి అద్భుతంగా అనిపించేది. అప్పుడప్పుడు ప్రయోగశాలలో మూర్ఛపోవడానికి కారణం ఒక విధంగా లక్ష్యం లేని బతుకూ, పని ఒత్తిడీ అనుకుంటా! వీటి ఫలితంగా నేను తీవ్ర న్యూమోనియాకు గురయ్యాను. చికిత్సకు నన్ను పోలీసు ఆసుపత్రిలో చేర్పించారు. నా గది పైఅంతస్తులో ఉండేది.

అది శీతాకాలం. పగిలిపోయిన కిటికీ నుండి చల్లని గాలులతోపాటు మంచు కూడా పడుతుండేది. రగ్గు కింద వళ్ళు వెచ్చగానే ఉన్నా ముఖం మంచుగడ్డలా చల్లగా అయిపోయేది. అప్పుడప్పుడు ఒక నర్సు వచ్చి టెంపరేచర్ చూసి వెంటనే వెళ్ళిపోయేది.

నాది ప్రైవేటు రూము కావడంతో ఎవ్వరూ తొంగైనా చూసేవారు కారు. ఉన్నట్లుండి ఒంటరితనం నన్ను చుట్టుముట్టింది. మొట్టమొదటిసారి చావు అంటే భయం ఏర్పడింది. ఇప్పుడు ఆ సంఘటన గుర్తుకు వస్తే అనవసరంగా భయపడ్డానని నవ్వుకొంటాను. కానీ అప్పుడు ఆ భయం నిజంగా నన్ను పీడించింది.

చివరకు ఆసుపత్రి నుంచి బయట పడ్డాను. కానీ నిరాశా వాదం నుంచి బయట పడలేదు. అప్పటివరకు దేని మీద నమ్మకంతో బతికాను? ఏ విషయమూ పట్టకుండా సంతోషంగా తిరిగేవాడిని. కానీ నాకు తృప్తి నిచ్చిన విషయమేమిటి? ఇటువంటి ప్రశ్నలు నన్ను వెంటాడసాగాయి. చావు, పుట్టుకలు అంటే ఏమిటి అన్న అనుమానం

పీడించసాగింది. వీటితో నిద్ర పట్టేది కాదు. పనిలో కూడా మనసు నిలిచేది కాదు. రాత్రులు తీరం వెంట తిరిగినా ఉపశమనం దొరికేది కాదు.

ఒక రాత్రి తిరిగి తిరిగి అలసిపోయాను. కొండమీద నుంచి రేవు కనపడుతోంది. రేవు కేసి చూస్తూనే ఒక పెద్ద చెట్టు మొదలుకు ఆనుకుని మత్తులోకి జారుకొన్నాను. నిద్ర, మెలకువ కాని స్థితిలో పొద్దు పొడిచే వరకు గడిపాను. ఆరోజు మే 15. అదంతా నా జ్ఞాపకాల పొరల్లో చెరగని ముద్రలా నిలిచిపోయింది. సూర్యోదయం, ఆ వెలుగులో రేవు నిండిపోవడం కలలో లాగ అనిపించింది. అంతా చూస్తూనే ఉన్నాను. కానీ ఏమీ చూడటం లేదనిపించింది. కొండ కింద నుంచి గాలి వీచి ఒక్కసారి మంచుతెర విడిపోయింది. అదే క్షణంలో ఒక నీటి కొంగ ఒక్క అరుపు అరిచి దూర తీరాలకు ఎగిరిపోయింది. దాని రెక్కల చప్పుడు నాకు స్పష్టంగా వినిపించింది. ఆ సమయంలోనే నాలోని అనుమానపు తెరలు తొలగిపోయాయి. నాలోని అయోమయపు మబ్బులు విడిపోయాయి. అప్పటి వరకు నేను నమ్మినవీ, నేను పట్టుకు వేళ్ళాడుతున్నవీ గాలితో పాటు కొట్టుకుపోయాయి. “ఈ ప్రపంచంలో ఏమీ లేదు....” అన్న మాటలు నా నోటి నుంచి అప్రయత్నంగా వెలువడ్డాయి. నేను అర్థం చేసుకొంది ఏమీ లేదు.[1]


అప్పటి వరకు నేను పట్టుకు వేలాడుతున్న సిద్ధాంతాలు, నా ఉనికి సైతం ఉత్తభ్రమే అని తెలుసుకోగలిగాను. నా ఆత్మ తేటతెల్లమయ్యి, తేలిక పడింది. నేను ఆనందంతో గెంతులు వేశాను. చెట్లలో దాగిన చిన్న చిన్న పిట్టల కిలకిలారావాలు నాకు వినిపించాయి. దూరంగా ఎండలో తళతళామెరుస్తున్న అలలు కనిపించాయి. పచ్చని ఆకులు మిసమిసలాడుతూ నాట్యం చేస్తున్నాయి. భువిలో స్వర్గం ఇదేనని

---

1. ‘అర్థం చేసుకొంది ఏమీలేదు’ అంటే మానవజ్ఞాన పరిమితుల్ని గుర్తించటం.

పించింది. వ్యధలూ, బాధలూ మటుమాయమయ్యి, నా 'నిజమైన ప్రకృతి' బోధపడినట్లు అనిపించింది.

ఆనాటి తొలి పొద్దు అనుభవంతో నా జీవితమే మారిపోయిందనటంలో ఏ మాత్రం సందేహం లేదు.



నేను ఒక సాధారణ మూర్ఖుడను. దాంట్లో అప్పుడూ, ఇప్పుడూ ఏ మార్పూ లేదు. బయటనుంచి చూస్తే నాలో ఏ ప్రత్యేకతా లేదు. నా దినచర్యలోనూ ఎటువంటి విశిష్టత లేదు. ఆ ఒక్క విషయం తెలుసుకొన్నానన్న నమ్మకం మాత్రం ఆనాటి నుంచీ ఏ మార్పూ లేకుండా అలానే నిలిచిపోయింది. నేనేమైనా పొరబడ్డానా అని గత ముప్పైనల్లబై సంవత్సరాల నుంచి ఆలోచిస్తూనే ఉన్నాను. పరిశీలిస్తూనే ఉన్నాను. నా అభిప్రాయం తప్పనటానికి ఇంతవరకు ఒక్క నిదర్శనం కూడా దొరకలేదు.

నేను కనుగొన్న విషయం చాలా విలువైనదయినంత మాత్రాన నాకేదో ప్రత్యేక విలువ ఉన్నట్లు కాదు. నేను అదే సాధారణ వ్యక్తిని. ఓ ముసలి కాకిని. స్వల్ప పరిచయం ఉన్నవారికి నేను అణుకువ గల వ్యక్తిగానో లేదా పొగరుబోతుగానో కనిపించవచ్చు. నన్ను అనుకరించడానికి ప్రయత్నించవద్దనీ, ప్రకృతిలో జీవించటం నేర్చుకోమనీ ఇక్కడకొచ్చే యువతీ యువకులతో పదేపదే చెబుతుంటాను. ఈ మాటలు లెక్క చెయ్యని వాళ్ళని చూస్తే నాకు చిర్రెత్తుకొస్తుంది. నిజంగానే నాలో ఏ ప్రత్యేకతా లేదు. కాని నేను కనుగొన్నది మాత్రం చాలా ముఖ్యమయిన విషయం.

పల్లె పట్టుకి

ఈ అనుభవం అయిన మరుదినం, అంటే మే 16న, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాను. నా అధికారులూ, మిత్రులూ ఆశ్చర్యపోయారు. నన్ను ఎలా అర్థం చేసుకోవాలో వాళ్ళకి తెలియలేదు. అప్పటివరకు ఎటువంటి సమస్యలు లేకుండా పరిశోధనలో పూర్తి శ్రద్ధాసక్తులతో పని చేస్తున్న నేను ఉన్నట్లుండి రాజీనామా చెయ్యటంతో వాళ్ళకి ఏమీ అర్థం కాలేదు. సముద్ర తీరాన ఉన్న ఒక రెస్టారెంట్‌లో నాకు వీడ్కోలు విందు ఏర్పాటు చేశారు. అందరిలోకి నవ్వుతూ, సంతోషంగా ఉన్నది నేనొక్కడినే.

వీడ్కోలు పలుకుతూ నేను ఇలా అన్నాను. "ఈ వైపున తీరం ఉంది, ఆ వైపున సముద్రం ఉంది. జీవం ఈ వైపున ఉందని మీరు అనుకొంటుంటే మరణం ఆ వైపున ఉంది. మరణం అన్న భావన తొలగించుకోవాలంటే ఈ వైపున జీవం ఉందన్న అభిప్రాయం వదులుకోవాలి. జీవం, మరణం రెండూ ఒక్కటే".

ఈ విధంగా మాట్లాడే సరికి అందరూ మరింత ఆందోళన పడ్డారు. "ఏం మాట్లాడుతున్నాడు? పిచ్చిగాని పట్టలేదు కదా" అని అనుకొని ఉంటారు. విచార వదనాలతో అందరూ వీడ్కోలు పలికారు. నేను మాత్రం ఉత్సాహంగానే అక్కడినుంచి బయటపడ్డాను.

ఆ సమయంలో నాతో పాటు ఉంటున్న మిత్రుడు నా గురించి చాలా ఆందోళన పడ్డాడు. బోసో ప్రాంతానికి వెళ్ళి విశ్రాంతి తీసుకో

వలసిందిగా సలహా ఇచ్చాడు. నాకూ ఎక్కడికైనా వెళ్ళాలనే ఉంది. మిత్రుని సలహా పై బోసో వెళ్ళడానికి బస్సు ఎక్కాను. కిటికీ లోంచి పొలాలు, పల్లెలు, చూస్తూ వందలమైళ్ళు ప్రయాణం చేశాను. ఒకచోట బస్సు ఆగినప్పుడు 'యుతోపియా'[1] కి దారి చూపిస్తూ ఒక బోర్డు కనపడింది. బస్సు దిగేసి దానిని వెతుక్కుంటూ పోయాను.

అది సముద్ర తీరాన ఉన్న ఒక చిన్న హోటలు. కొండ ఎక్కితే చాలు కనువిందు చేసే దృశ్యాలెన్నో! పచ్చని బీళ్ళ మధ్య తిరుగుతూ, సముద్రాన్ని చూస్తూ అక్కడ బద్ధకంగా గడిపేశాను. కొన్ని రోజులు ఒక వారమో, ఒక నెలో - ఎంత కాలమో గుర్తు లేదు. కాలం గడుస్తున్న కొద్దీ నాతొలి నాటి ఉత్సాహం కొంచెంకొంచెంగా తగ్గసాగింది. జరిగిన దానిని మళ్ళీ మననం చేసుకోసాగాను. నన్ను నేను తిరిగి గుర్తింపసాగానని చెప్పవచ్చు.

టోక్యోకి వెళ్ళి అక్కడ కొన్ని రోజులు ఉన్నాను. రోడ్లవెంటా, పార్కుల వెంటా తిరుగుతూ దారిన పోయే మనుషులను ఆపి వారితో మాట్లాడేవాడిని. ఎక్కడ పడితే అక్కడ నిద్రపోయాను. నా గురించి ఆందోళన పడిన మిత్రుడు నేను ఎలా ఉన్నానో చూసి పోదామని వచ్చాడు. "నువ్వు భ్రమల్లో, కలల ప్రపంచంలో బతకటం లేదా?" అని అడిగాడు. "కాదు. నువ్వే మిథ్యా ప్రపంచంలో బతుకుతున్నావు" అని బదులిచ్చాను. ఎవరికి వాళ్ళం ఎదుటి వ్యక్తి కలల ప్రపంచంలో బతుకుతున్నాడని అనుకొన్నాం. వీడ్కోలు చెప్పటానికి మిత్రుడు వెనుతిరిగినప్పుడు "విడిపోవటం కేవలం విడిపోవటమే. వీడ్కోలు చెప్పనవసరం లేదు" అన్న అర్థం వచ్చే మాటలన్నాను. దీంతో నా మిత్రుడు నాపైన పూర్తిగా ఆశ వదులుకొన్నట్లున్నాడు.

---

1. హింస, దోపిడి, సొంత ఆస్తి లేని ఆదర్శ సమాజం. 'ఊహాస్వర్గం'. ఇక్కడ హోటలు పేరు.

టోక్యో విడిచి కాన్సాయ్ ప్రాంతంలోని ఒసాకా, కోబె, క్యోటోల ద్వారా దక్షిణాదిన ఉన్న క్యుషు చేరుకొన్నాను. ఒక ప్రదేశం నుంచి ఇంకో ప్రదేశానికి ఇష్టమొచ్చినట్లు తిరుగుతూ ఉల్లాసంగా గడపసాగాను. నాకు తారస పడిన వారిలో చాలా మందితో దేనికీ అర్థం లేదనీ, విలువ లేదనీ, ప్రతిదీ చివరకు శూన్యానికి చేరుకొంటుందనీ వాదించసాగాను.

రోజు వారీ జీవితంలో పడి కొట్టుకొంటున్న వారికి ఈ విషయాలు ఎలా అర్థమవుతాయి? అందుకే ఎవరితోనూ సంభాషణ కొనసాగేది కాదు. ప్రస్తుతం ప్రపంచంలో అందరూ ప్రవాహ వేగంలో పడి కొట్టుకు పోతున్నారు. ఏ పనికీ అర్థం లేదన్న నా సిద్ధాంతం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని భావించాను. దీనిని దేశమంతటా ప్రచారం చెయ్యాలన్న ఉద్దేశంతోనే పట్టణాలు తిరుగుతున్నాను. కానీ ఎక్కడికి వెళ్ళినా నన్ను ఓ పిచ్చివాడిని చూసినట్లు చూసి పట్టించుకొనే వారు కారు. దీనితో మా పల్లెలోని పొలాలకు తిరిగి వెళ్ళాను.

ఆ సమయంలో మా నాన్న చీనీ చెట్లు సాగు చేస్తున్నారు. నేను కొండమీద ఉన్న ఒక గుడిసెలో నివసిస్తూ సాధారణ జీవితం గడపసాగాను. నేను తెలుసుకొన్న సత్యాన్ని పండ్లూ, ఆహారధాన్యం పండిస్తూ ఆచరణలో చూపిస్తే ప్రపంచం గుర్తిస్తుందని భావించాను. వంద వివరణలు ఇవ్వడంకన్నా ఒక ఆచరణ ఎన్నో రెట్లు నయం కదా? ఈ ఆలోచన తోటే 'ఏమీ చెయ్యనవసరం లేని'[1] నా వ్యవసాయ విధానం మొదలయ్యింది. అది 1938[2] వ సంవత్సరం.

1. మిగతా వ్యవసాయ విధానాలతో పోలిస్తే ఫుకుఓకా విధానం చాలా తేలిక. అంతేకాని అస్సలు **పనే** ఉండదని కాదు. కోతలప్పుడు నడుము విరిగేలా పని ఇందులోనూ ఉంటుంది.
2. మన శాలివాహన శకం లాగ జపానులో చక్రవర్తుల శకాలున్నాయి. 1938వ సంవత్సరాన్ని ఫుకుఓకా 'ప్రస్తుత చక్రవర్తిపాలనలో 13వ సంవత్సరం'గా పేర్కొన్నారు. అప్పుడు చక్రవర్తి హిరోహిటో. 1989లో మరణించాడు.

కొండమీద నేను చీకూ చింతా లేకుండా కాలం గడపసాగాను. బాగా కాస్తున్న పండ్లతోట బాధ్యతను మానాన్న నాకు అప్పగించాడు. అప్పటికే ఆయన పండ్లు కోయటానికి అనువుగా కొమ్మలను కత్తిరించారు. నేను వాటిని ఆస్థితిలోనే వదిలివేశాను. కొమ్మలు పెరిగి ఒకదానితో ఒకటి అల్లుకుపోయి, పురుగులు ఎక్కువయ్యి చూస్తుండగానే చెట్లన్నీ చచ్చిపోయాయి.

చెట్లు వాటంతటవే పెరుగుతాయనీ, వాటిని మనం పెంచనవసరం లేదనీ నా నమ్మకం. ప్రతి దాన్నీ తన సహజ ఆకారం తీసుకోనివ్వాలని నేను తోటలో ఏమీ చెయ్యలేదు. అయితే ఈ ఆలోచనా విధానాన్ని ఒక్కసారి అమలు చేస్తే చెడు ఫలితాలు వస్తాయని ఈ అనుభవంతో గుర్తించాను. ఇది నిర్లక్ష్యమే గానీ "ప్రకృతి వ్యవసాయం" కాదు.

నా పనులు చూసి మానాన్నకు పిచ్చి ఎక్కినంత పని అయ్యింది. ఆయన గ్రామ పెద్ద. కొండపైన ఆదిమ మానవుడిలా బతుకుతున్న నాతో ఏ విధంగా వ్యవహరించాలో గ్రామస్థులకు తెలియలేదు. ఉద్యోగంలో చేరి, క్రమశిక్షణ అలవర్చుకొని, తిరిగి మనిషిని అయ్యాక రమ్మనమని మా నాన్న సలహా ఇచ్చాడు. ఆ సమయంలో యుద్ధం[1] ముంచుకు వస్తోంది. సైన్యంలో చేరటం నాకిష్టం లేదు. అందుకనీ, మానాన్న అభిప్రాయం మన్నించి నట్లుంటుందనీ ఉద్యోగంలో చేరాను.

ఆ సమయంలో సాంకేతిక నిపుణుల కొరత ఉండేది. కోచి ప్రాంతంలోని పరిశోధన కేంద్రం వారు నా గురించి విని పురుగులు, తెగుళ్ళ నివారణలో ప్రధాన పరిశోధకుని ఉద్యోగం ఇస్తామన్నారు. ఇక్కడ మొత్తం ఎనిమిది సంవత్సరాల పాటు పనిచేశాను. చేరిన కొంత కాలానికే అక్కడి శాస్త్రీయ వ్యవసాయ విభాగానికి సూపర్వైజర్ని

1. రెండవ ప్రపంచ యుద్ధం (1939-46).

అయ్యాను. యుద్ధ సమయంలో ఆహార ఉత్పత్తి పెంపొందించటంపై మా పరిశోధనలు కేంద్రీకృతమై ఉండేవి. ఈ ఎనిమిది సంవత్సరాలలోనూ శాస్త్రీయ వ్యవసాయానికీ, ప్రకృతి వ్యవసాయానికీ మధ్య సంబంధం గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. మానవ తెలివితేటల పై ఆధార పడిన రసాయనిక వ్యవసాయం మెరుగయినదన్న అభిప్రాయం అందరికీ ఉంది. ఆధునిక విజ్ఞానానికి జవాబుగా ప్రకృతి వ్యవసాయం నిలవగలదా అన్న ప్రశ్న నా బుర్రను తొలుస్తుండేది.

యుద్ధం ఆగిపోవటంతో స్వేచ్ఛ పొందినవాడిలా హాయిగా ఊపిరి పీల్చుకొన్నాను. తిరిగి వ్యవసాయం చేపట్టడానికి మా ఊరు చేరుకొన్నాను.

ఏమీ చెయ్యనవసరం లేని వ్యవసాయం

గత ముప్పై సంవత్సరాలుగా ఇక్కడ వ్యవసాయం చేస్తున్నాను. ఈ కాలంలో బయట ప్రపంచంతో ఎటువంటి సంబంధమూ లేదు. 'ఏమీ చెయ్యనవసరం లేని' వ్యవసాయ విధానం దిశగా పయనిస్తూ వచ్చాను.

ఏదయినా ఒక కొత్త పద్ధతిని రూపొందించేటప్పుడు "ఇది చేసి చూస్తే ఎలా ఉంటుంది?" "అది చేసి చూస్తే ఎలా ఉంటుంది?" అని ప్రయత్నిస్తుంటారు. దీని ద్వారా ఒకదాని తరువాత ఒకటి కొత్త పద్ధతులను కనిపెడుతుంటారు. ఆధునిక వ్యవసాయం కూడా ఇదే విధంగా ఉంటుంది. ఫలితంగా రైతుకు ఊపిరి తీసుకోటానికి తీరిక లేనంత పని ఏర్పడుతుంది.

నా విధానం ఇందుకు విరుద్ధమయినది. పనిభారం పెంచటం కాక, పనిని తగ్గించి, ఆనందాన్నిచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని[1] రూపొందించటం నా ఉద్దేశం. "ఇది చెయ్యకపోతే ఎలా ఉంటుంది? అది చెయ్యకపోతే ఎలా ఉంటుంది?" అన్నది నా ఆలోచనా విధానం. ఈ విధానాన్ని అనుసరిస్తూ పొలాన్ని దున్ననవసరం లేదనీ, ఎరువులు

---

1. ఆధునిక వ్యవసాయంలో రానురాను సంక్లిష్ట పద్ధతులను ఉపయోగిస్తూ ప్రకృతి నుంచి సాధ్యమయినంత రాబట్టాలనే తాపత్రయం ఉంటుంది. దీనికి విరుద్ధంగా ప్రకృతి వ్యవసాయంలో సాధ్యమయినంత వరకు ప్రకృతిలో భాగంగా, ప్రకృతి సహకారంతో సాగు చేస్తారు.

వెయ్యనవసరం లేదనీ, పెంటపోగు చెయ్యనవసరం లేదనీ, పురుగుల మందులు చల్లనవసరం లేదనీ కనుగొన్నాను. నిజానికి తప్పనిసరిగా చెయ్యాల్సిన వ్యవసాయ పనులు చాలా తక్కువ.

మానవుని చర్యల వల్ల ప్రకృతి సమతూకం తీవ్రంగా దెబ్బతిన్నది. ఫలితంగా భూమి మానవుని చర్యల మీద ఆధారపడసాగింది. అందుకే పైన పేర్కొన్న పనులన్నీ అవసరమనిపిస్తాయి.

ఈ విమర్శ కేవలం వ్యవసాయానికే కాక సమాజంలోని ఇతర అంశాలకు కూడా వర్తిస్తుంది. అనారోగ్యకరమయిన వాతావరణాన్ని మానవులు సృష్టించిన తరువాతే మందులు అవసరమయ్యాయి. డాక్టర్లు అవసరమయ్యారు. బడికి వెళ్ళి చదువుకోటానికి సహజంగా ఏ విలువా ఉండదు. 'విద్యావంతు' లైతే గానీ బతకలేని పరిస్థితులు సృష్టించిన తరువాత దీని అవసరం ఏర్పడింది.

యుద్ధానికి ముందు వ్యవసాయంలో నా అనుభవాల్ని ఇంతకు ముందు చెప్పాను. ప్రకృతి విధానాన్ని అనుసరిస్తున్నాననుకొని చెట్ల



"గత ముప్పై సంవత్సరాలుగా ఇక్కడ వ్యవసాయం చేస్తున్నాను."

కొమ్మలు కత్తిరించకుండా వదిలివేశాను. కొమ్మలు ఒకదానితో ఒకటి అల్లుకొనిపోయి, పురుగుల దాడికి గురయ్యి రెండు ఎకరాలలోని చీనీ చెట్లు చచ్చిపోయాయి. అప్పటి నుంచీ "ప్రకృతి విధానం (pattern) ఎలా ఉంటుంది?" అన్న ప్రశ్న నన్ను వెంటాడుతుండేది. ఈ ప్రశ్నకు జవాబు దొరికేలోగా మరో 400 చెట్లు చచ్చిపోయాయి. చివరికి "ఇదీ ప్రకృతి విధానం" అని ఖచ్చితంగా చెప్పగల స్థితికి వచ్చావనుకొంటున్నాను.

ప్రకృతిస్వరూపానికి ఎంత భిన్నంగా చెట్లు పెరుగుతుంటే అంతగా కొమ్మల కత్తిరింపూ, పురుగుల నివారణా అవసరమవుతాయి. అదే విధంగా మానవ సమాజం ప్రకృతి నుంచి ఎంతగా దూరమయితే అంతగా బడి అవసరం ఏర్పడుతుంది. బడికి వెళ్ళి చదువుకోటానికి ప్రకృతిలో ఎటువంటి ఉపయోగమూ లేదు.

నేను పండ్ల తోటలో మొట్టమొదట చేసిన పొరపాటే పిల్లల్ని పెంచడంలో చాలామంది తల్లిదండ్రులు చేస్తుంటారు. ఉదాహరణకు చెట్ల కొమ్మలు కత్తిరించటం ఎంత అనవసరమో, పిల్లలకు సంగీతం నేర్పించటం కూడా అంతే అనవసరం. పిల్లలు సహజంగానే సంగీతాన్ని గ్రహించగలుగుతారు. ప్రకృతిలోని ప్రతిశబ్దమూ – ఏటి గలగలలు, కప్పల బెకబెకలూ, పిట్టల కిలకిలలూ – సంగీతమే. ఇదే నిజమయిన సంగీతం. రకరకాల ఇతర శబ్దాలు పిల్లలను గందరగోళ పరచినప్పుడు నిజమయిన సంగీతాన్ని ఆనందించగల శక్తి క్రమేపి తగ్గుతుంది. ఇదే విధంగా కొనసాగనిస్తే పిట్టల కువకువలలోనూ, వాటి రెక్కల చప్పుళ్ళలోనూ ఉన్న సంగీతాన్ని గ్రహించలేరు. ఇటువంటప్పుడు సంగీతం నేర్పించటం పిల్లలకు ఉపయోగపడుతుందనుకొంటారు.

సంగీతాన్ని ఆనందించ గలిగిన మనసుతో పెరిగిన పిల్లలు పియానో వాయించలేకపోవచ్చు, వయొలిన్ మీద పాటలు పాడలేకపోవచ్చు. సంగీత వాయిద్యాలు ఉపయోగించ లేనంత మాత్రాన,

పాడలేకపోయినంత మాత్రాన నిజమయిన సంగీతం విని ఆనందించ లేరని చెప్పలేం. గుండె పాటతో నిండినపుడే మనిషికి సంగీతాన్ని ఆనందించగల శక్తి ఉంటుందని చెప్పవచ్చు.

"ప్రకృతి" మంచిదేనని అందరూ అంటారు. సహజమైన దానికీ, అసహజమైన దానికీ మధ్యగల తేడాని చాలా కొద్దిమంది మాత్రమే గుర్తించ గలుగుతారు.

చెట్టునుంచి కొత్తగా తొడుగుతున్న ఒక చిగురు మొగ్గను కత్తిరిస్తే చాలు. సరిచేయ లేనంతటి గందరగోళం ఏర్పడుతుంది. సహజంగా పెరుగుతున్నప్పుడు చెట్లు ఒక నిర్దిష్ట ఆకారాన్ని తీసుకొంటాయి. కొమ్మలన్నీ చక్కగా పరుచుకొని ఆకులన్నిటికీ ఎండ పొడ తగులుతుంది. ఈ క్రమాన్ని చెడగొట్టినపుడు కొమ్మలు ఒక దానితో ఒకటి పోటీ పడి చిక్కు పడతాయి. ఎండ పొడ తగలని ఆకులు వడలిపోతాయి. పురుగుల తాకిడి ఎక్కువవుతుంది. ఆ సంవత్సరం కొమ్మలు కత్తిరించకపోతే మరు సంవత్సరం మరిన్ని కొమ్మలు ఎండిపోతాయి.

మానవులు ముందు తమ చర్యల వల్ల ఏదో ఒక నష్టం కలుగ జేస్తారు. ఇది తీవ్రరూపం దాల్చేదాకా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటారు. చివరకు తప్పును సరిచేయడానికి శాయశక్తులా కృషి చేస్తారు. ఇది మంచి ఫలితాల నిచ్చినపుడు ఏదో అద్భుతం సాధించామని జబ్బలు చరుచుకొంటారు. మళ్ళీ మళ్ళీ ఇదే విధంగా ప్రవర్తిస్తుంటారు. ఇది ఎలా ఉంటుందంటే ఒక మూర్ఖుడు ముందు ఇంటి పైకి ఎక్కి పెంకులు పగలగొట్టాడంట. వానపడి ఇల్లంతా కారుతుంటే హడావుడిగా పైకి ఎక్కి పెంకులు సరిచేసి ఏదో ఘనకార్యం సాధించినట్లు సంతోషించా డంట.

శాస్త్రజ్ఞులూ ఇందుకు మినహాయింపేం కాదు. వెనుకటికో శాస్త్రజ్ఞుడు మసకచూపుకు కళ్ళద్దాలు కనిపెడదామని రేయింబవళ్ళు పుస్తకాలు తెగ చదివి మసక చూపు తెచ్చుకొన్నాడంట.

తిరిగి ప్రకృతి ఒడిలోకి

పండ్లతోటలో పని చేసుకొంటూ ఒక క్షణం ఆగి దూరాన ఉన్న కొండల కేసి, దిగువనున్న గ్రామం కేసి చూస్తూ ఉండిపోతుంటాను. రుతువుల కంటే త్వరగా మారిపోతున్న ప్రజల సిద్ధాంతాలను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుంది.

నేను అనుసరిస్తున్న ఈ ప్రకృతి సేద్యం కొంతమందికి వింతగా కనపడుతుంది. అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్న శాస్త్రీయ విజ్ఞానానికి ఇది ప్రతి చర్య అని కొందరు భావిస్తారు. ఇక్కడ మారుమూల పల్లెలో వ్యవసాయం చేస్తూ మానవాళికి ఏమీ తెలియదన్న ఒక్క విషయమే నేను నిరూపించదలుచుకొన్నాను. ప్రపంచం వ్యతిరేక దిశలో చాలా వేగంగా పయనిస్తుండటంవల్ల నేను వెనుకబడ్డ వాడిలా కనిపించవచ్చు. నేను అనుసరిస్తున్నదే సరయినదన్న దృఢ విశ్వాసం మాత్రం నాకుంది.

ప్రకృతి వ్యవసాయంలో ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య గత కొద్ది సంవత్సరాలలో గణనీయంగా పెరిగింది. శాస్త్రీయ ప్రగతి తన ఎల్లలను చేరుకొన్నట్లుంది. దీని లోటు పాట్లను గ్రహించసాగారు. దీనిని అంచనా వేసే సమయం ఆసన్నమయ్యింది. ఆదిమ కాలపు నాటిది, వెనుకబడినది అని ఇంతవరకు అనుకొన్న ప్రకృతి సేద్యమే నేడు ఆధునిక విజ్ఞానాని కంటే ఎంతో ముందుంది. ఇది ఇతరులకు వింతగా అనిపించవచ్చుకాని నాకు ఏ మాత్రం వింతగా లేదు.

ఇటీవల ఈ విషయాలను క్యోటో విశ్వవిద్యాలయంలో ఆచార్యులయిన ఈనుమాతో చర్చించాను. వెయ్యేళ్ళ క్రితం జపాన్‌లో దున్నకుండానే వ్యవసాయం చేసేవారు. 300–400 సంవత్సరాల క్రితం టోకుగావా శకంలో పైపైన దున్నటం మొదలయ్యింది. భూమిని లోతుగా దున్నటం పాశ్చాత్య వ్యవసాయ విధానంతోనే మొదలయ్యింది. సమస్యలను ఎదుర్కోటానికి ముందుతరాలవాళ్ళు దుక్కితో పనిలేని పద్ధతుల్ని అవలంబిస్తారని నేనన్నాను.

పొలందున్నకుండా పంటలు పండించటం వెనుకబడిన పద్ధతిగా మొదట్లో అనిపించవచ్చు. విశ్వవిద్యాలయపు ప్రయోగశాలల్లోను, దేశంలోని పలు వ్యవసాయ పరిశోధన కేంద్రాలలోను ఇంతకంటే తేలికయిన, సమర్ధమయిన మరో ఆధునిక విధానం లేదని పలుమార్లు నిరూపితమయ్యింది. అసలు ఆధునిక విజ్ఞానాన్నే ఈ వ్యవసాయ విధానం తృణీకరిస్తుంది. ఇది ఆధునిక వ్యవసాయాభివృద్ధి కంటే ఎంతో ముందుంది.

దున్నకుండా నేరుగా శీతాకాలపు పంటలు, వరివిత్తే విధానం గురించి మొట్టమొదటిసారి 20 సంవత్సరాల క్రితం వ్యవసాయ పత్రికల్లో రాశాను. అప్పటినుంచి దీనిగురించి ఎన్నోపత్రికల్లో అచ్చయ్యింది. రేడియో,టి.వీల్లో ఎన్నో కార్యక్రమాలు ప్రసారమయ్యాయి. అయినప్పటికీ అంతగా పట్టించుకొన్నవారెవరూలేరు.

ఇప్పుడు ఉన్నట్లుండి కథ మారి పోయింది. ప్రకృతి వ్యవసాయం పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారు. నా పొలాలు చూడటానికి పెద్ద సంఖ్యలో విలేఖర్లూ, అధ్యాపకులూ, పరిశోధకులూ వస్తున్నారు.

దీనిని వేరు వేరు వ్యక్తులు వేరు వేరు కోణాల నుంచి చూస్తారు. ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిలో అర్థం చేసుకొంటారు. ఒకరు ఇది ఆదిమకాలపు పద్ధతి అంటారు. మరొకరు ఇది ఎంతో వెనుకబడిన

పద్ధతంటారు. వ్యవసాయంలో ఇంతకంటే ప్రగతి సాధించ లేరని ఇంకొకరు తేల్చి పారేస్తారు. భవిష్యత్తు బాట ఇదేనని మరొకరు నిర్ణయించేస్తారు. మొత్తానికి ఇది పాతకాలానిదో లేదా రాబోయే కాలానిదో అంటారు. మార్పు, చలనం లేని స్థిరమయిన కేంద్రం నుంచి ప్రకృతి వ్యవసాయం పుట్టిందని చాలా కొద్దిమంది మాత్రమే గుర్తిస్తారు.

ప్రకృతి నుంచి ఎంతగా విడిపోతే మూలం (source) నుంచి అంత దూరంగా మానవులు పరిభ్రమిస్తుంటారు. తిరిగి మూలానికి, ప్రకృతికి చేరుకోవాలన్న తహతహ కూడా ఇదే సమయంలో పుడుతుంది. ఇది కేవలం ప్రతిచర్యగా ఉంటే కుడివైపుకో, ఎడమ వైపుకో వెళతాం కానీ ప్రకృతిని చేరుకోలేం. దీనివల్ల పని పెరగటం తప్పించి వేరే ప్రతిఫల ముండదు. సాపేక్ష సిద్ధాంతానికి అందని నిశ్చలకేంద్రం ఎవరి దృష్టికీ ఆనలేదు. ప్రకృతి విధానాలకు అనుగుణంగా, కాలుష్యానికి వ్యతిరేకంగా జరుగుతున్న చర్యలు మెచ్చుకోదగినవే. ఇవి ప్రస్తుత అభివృద్ధికి వ్యతిరేకంగా మొదలయినవే కానీ నిజమయిన పరిష్కారాన్నిచ్చే దిశలో పయనించటం లేదు.

ప్రకృతిని చూసే విధానం యుగయుగానికి మారవచ్చు కానీ ప్రకృతి మారదు. ఏ యుగమైనాసరే వ్యవసాయానికి ఆలంబనగా ప్రకృతి సేద్యం ఉండనే ఉంటుంది.

ప్రకృతి సేద్యం విస్తరించకపోవడానికి కారణం

వరి, శీతాకాలపు పంటల్లో గత ఇరవై, ముప్పై సంవత్సరాలుగా నేను అనుసరిస్తున్న విధానాలను విభిన్న వాతావరణ పరిస్థితులల్లో విభిన్న భౌగోళిక పరిస్థితుల్లో పరీక్షించి చూశారు. జపానులోని ధాదాపు అన్ని ప్రాంతాల్లో ఈ పరిశోధనలు జరిగాయి. మామూలుగా వరి, రై, బార్లీ సాగుచేసే విధానాన్ని, 'దున్నకుండా నేరుగా విత్తే' నా విధానాన్ని పోలుస్తూ ప్రయోగాలు చేశారు. నేను అనుసరిస్తున్న విధానం అన్ని ప్రాంతాల్లోనూ ఆచరణీయమని ఫలితాలనిచ్చాయి.

మరి ప్రకృతి సేద్యం ఎందుకు విస్తరించలేదన్న అనుమానం ఎవరికైనా రావచ్చు. నిపుణులు ఎక్కువయిపోయి విషయాన్ని సమగ్రంగా గ్రహించలేకపోవటం ఒక కారణం కావచ్చు. ఉదాహరణకు కోచి ప్రాంతీయ పరిశోధన కేంద్రం నుంచి కీటక శాస్త్ర నిపుణుడు ఇక్కడకు వచ్చాడు. పురుగుల మందులు వాడకపోయినా నా పొలంలో పచ్చదోమ, సుడిదోమ (లీఫ్‌హాపర్స్) తక్కువగా ఉండటానికి కారణమేమిటో తెలుసుకోవాలని అతని తపన. పంట పరిశీలించగా దోమ, వాటి సహజశత్రువులు, సాలీడు పురుగులు సమతూక స్థితిలో ఉన్నాయనీ, పరిశోధన కేంద్రంలో పలుమార్లు విషపుమందులు చల్లిన తరువాత ఎన్ని దోమలు మిగిలి ఉన్నాయో నా పొలంలోనూ అన్నే దోమలు మిగిలి ఉన్నాయనీ తెలిసింది.

నా పొలంలో హాని చేసే పురుగులు తక్కువగా ఉండటమే కాక మందులు పిచికారి చేసిన పొలంలో కంటే సహజశత్రువులు చాలా

ఎక్కువ సంఖ్యలో ఉండటం చూసి ఆ నిపుణుడు ఆశ్చర్యపోయాడు. వివిధ పురుగుల మధ్య ఏర్పడిన సహజ సమతూకం కారణంగా నా పొలాలు ఈ విధంగా ఉన్నాయని అతనికి బోధపడింది. నా పద్ధతులను విస్తృతంగా ఆచరించి దోమను అరికట్టవచ్చని చెప్పి చక్కా కొరెక్కి కోచి వెళ్ళిపోయాడు.

పరిశోధన కేంద్రంనుంచి భూసారనిపుణులూ, పంటల నిపుణులూ ఇక్కడకు రాలేదు. ఏదయినా సమావేశంలో ఈనా పద్ధతుల్ని, లేదా పద్ధతి లేకపోవటాన్ని పెద్ద ఎత్తున ఆచరించమని సలహా ఇస్తే నిపుణుల సమాధానం ఇలా ఉంటుందనుకొంటున్నాను: "అప్పుడే ఎలా చెబుతామండి. అన్ని కోణాలనుంచి ఎన్నో ప్రయోగాలు చేసిన తరువాతే దీనిని సిఫారసు చెయ్యాలి". ఈ పరిశోధనలు పూర్తి అయ్యేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది.

జపాను నలుమూలల నుంచీ శాస్త్రజ్ఞులూ, సాంకేతిక నిపుణులూ ఎంతో మంది ఇక్కడకు వచ్చివెళ్ళారు. ప్రతి ఒక్కరూ తమ తమ దృక్కోణం నుంచి చూసి ఈ పొలాలు బ్రహ్మాండంగా ఉన్నాయనకపోయినా సంతృప్తిని వ్యక్తపరిచారు. కోచి పరిశోధన కేంద్రం నుంచి కీటకశాస్త్ర నిపుణుడు వచ్చి వెళ్ళి అయిదారు సంవత్సరాలయ్యింది. కాని అక్కడ ఏ మార్పులూ లేవు.

ఈ సంవత్సరమే కింకి విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ శాఖ ప్రకృతి సేద్యంపై ఒక బృందాన్ని ఏర్పరిచింది. దీనిలో భాగంగా వివిధ శాఖలకు చెందిన విద్యార్థులు ఇక్కడకు వచ్చి పరిశోధనలు కొనసాగిస్తారు. ఇది ఒక ముందడుగు. దీని తరువాత రెండు అడుగులు వెనక్కి వేస్తారని నా అనుమానం.

తమను తాము నిపుణులుగా భావించేవారు "ఇదంతా బాగానే ఉంది. కానీ వరిని యంత్రాలతో కోయటం సులువుగా ఉంటుంది"

[illegible], "కొన్ని ప్రత్యేక పరిస్థితులు, సందర్భాలలో ఎరువులూ, పురుగుల మందులూ వాడటం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చు కదా" అనో, అంటారు. ప్రకృతిసేద్యాన్నీ ఆధునిక విధానాలనూ కలపాలని ప్రయత్నించేవాళ్ళు ఎప్పుడూ ఉంటారు. ఈ విధంగా ప్రయత్నించటమంటే అసలు విషయాన్ని గ్రహించకపోవటమే. ఈ ధోరణిని అవలంబించే రైతు శాస్త్రవిజ్ఞానాన్ని మౌలికస్థాయిలో ఎన్నడూ ప్రశ్నించలేదు.

ప్రకృతి సేద్యం సుతి మెత్తనిది. దీనిని అవలంబించటమంటే వ్యవసాయ మూలానికి చేరుకోవటమే. ఒక్క తప్పటడుగు వేసినా దారి తప్పిపోతాం.

మానవాళికి ప్రకృతి బోధపడదు

శాస్త్రజ్ఞులూ, నిపుణులూ, రాజకీయవేత్తలూ, కళాకారులూ, తత్వవేత్తలూ, మతగురువులూ, గ్రామికులూ ఇక్కడ సమావేశమై పొలాల కేసి చూస్తూ అన్ని విషయాలు కలిసి చర్చించుకోవాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్న అభిప్రాయం ఇటీవల నాలో బలపడుతోంది. అప్పుడు గానీ మనుషులు తమ సంకుచిత దృష్టిని వదలి విశాలంగా ఆలోచించరు.

శాస్త్రజ్ఞులు ప్రకృతిని అర్థం చేసుకోగలమని అనుకొంటారు. అలాగని చెప్పుకొంటారు కూడా. కాబట్టే ప్రకృతిని పరిశోధించటానికీ, ఉపయోగించుకోటానికీ పూనుకొంటున్నారు. ప్రకృతిని అర్థం చేసుకోగలగటం మానవుని తెలివి తేటలకు సాధ్యం కాదని నా అభిప్రాయం.

నాకు సాయపడదామనో, ప్రకృతి సేద్యం గురించి నేర్చుకొందామనో వచ్చి కొండమీద గుడిసెల్లో ఉంటున్న వాళ్ళతో ఇలా అంటుంటాను: కొండమీద చెట్లను అందరూ చూసే ఉంటారు. పచ్చని ఆకులూ, వరి పొలాలూ చూసి ఉండవచ్చు. దాంతో పచ్చదనం ఏమిటో అర్థమయ్యిందను కొంటారు. పగలూ, రాత్రీ పొలాల్లో పని చేయటం వల్ల ప్రకృతి గురించి తెలిసిందనుకోవచ్చు. ప్రకృతి అర్థమవుతోందని అనుకోవటం మొదలు పెట్టారంటే దారి తప్పారని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ప్రకృతిని అర్థం చేసుకోవటం ఎందుకు సాధ్యం కాదు? ప్రకృతి

అనేది ఆయా వ్యక్తుల మెదడులో జనించే ఊహ మాత్రమే. నిజమయిన ప్రకృతిని పిల్లలొక్కరే చూడగలరు. వాళ్ళు ఏమీ ఆలోచించకుండా హాయిగా, ఆనందంగా చూస్తారు. కనీసం చెట్ల పేర్లు తెలిసినా, ఇది చీనీ చెట్టు, ఇది దేవదారు చెట్టు అని తెలిసినా, ప్రకృతి అసలు రూపాన్ని చూడలేరు.

ఒక వస్తువును మొత్తం నుంచి వేరు చేసి ప్రత్యేకంగా చూస్తే అది దాని అసలయిన వస్తుతత్వాన్ని కోల్పోతుంది.

వివిధ విషయాల నిపుణులు వరిపొలంలో చేరి ఒక దుబ్బును పరిశీలిస్తున్నారనుకొందాం. కీటక శాస్త్ర నిపుణుడు పురుగుల వల్ల జరిగిన హానిని మాత్రమే చూస్తాడు. పోషక శాస్త్ర నిపుణుడు మొక్క ఎంత ఏపుగా పెరుగుతోందో చూస్తాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అనివార్యమై పోయింది.

నా వరి పొలంలో దోమ-సాలీడు పురుగుల మధ్య సంబంధాన్ని పరిశీలించటానికి కోచి పరిశోధన కేంద్రం నుంచి వచ్చిన నిపుణుడికి కూడా ఇదే చెప్పాను. "అయ్యా! దోమకు ఎన్నో సహజశత్రువు



లున్నాయి. వీటిల్లో నువ్వు పరిశోధనలు చేస్తున్నదీ, నీకు ఆసక్తి ఉన్నదీ ఒక సాలీళ్ళపైనే. ఈ సంవత్సరం సాలీళ్ళు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. కానీ పోయిన సంవత్సరం బావురుకప్పలు దోమలను అదుపులో ఉంచాయి. అంతకు ముందు కూడా కప్పలే ఈ పని చేశాయి. దోమలను అదుపులో ఉంచే అంశాలు ఎన్నో ఉన్నాయి".

రకరకాల పురుగుల మధ్య ఉన్న వివిధ సంబంధాల నుంచి వేరుచేసి ఒక సమయంలో ఒక సహజశత్రువు గురించి మాత్రమే అవగాహన ఏర్పరచుకోవటం సాధ్యమయ్యే విషయం కాదు. కొన్ని కాలాల్లో సాలీళ్ళ సంఖ్య ఎక్కువగా ఉండటంవల్ల దోమ అదుపులో ఉంటుంది. ఒక్కొక్కసారి వానలు బాగా పడి కప్పలు వచ్చి సాలీళ్ళను మిగల్చవు. ఒకోసారి వానలు సరిగా లేక దోమలూ ఉండవు, కప్పలూ ఉండవు.

రకరకాల పురుగుల మధ్య సంబంధాలను పట్టించుకోని నివారణ చర్యలు ఎందుకూ పనికి రావు. సాలీళ్ళ - దోమలపై పరిశోధన చేసేవాళ్ళు కప్పల - సాలీళ్ళ మధ్య సంబంధాన్ని కూడా లెక్కలోకి తీసుకోవాలి. పరిస్థితులు ఇంత దాక వచ్చినపుడు కప్పల నిపుణుడు కూడా అవసరమవుతాడు. సాలీళ్ళు-దోమల నిపుణులూ, వరి నిపుణులూ, నీటి యాజమాన్యం నిపుణులూ మన సమావేశానికి రావాల్సి ఉంటుంది.

సాలీళ్ళలో కూడా ఎన్ని రకాలున్నాయనుకొన్నారు. కొన్ని సంవత్సరాల నాటి మాట. ఒకరోజు ఉదయం ఒక వ్యక్తి కంగారుగా నా ఇంటికి వచ్చి పొలాల మీద పట్టు వల ఏమైనా కప్పావా అని అడిగాడు. అతను అంటున్నది ఏమిటో అర్థం కాక అసలు విషయం తెలుసుకొందామని వెంటనే నేను కూడా హడావిడిగా పొలానికి వెళ్ళాను.

అంతకు ముందు రోజే వరి కోత పూర్తయ్యింది. వరి మోళ్ళమీదా,

గడ్డిమీదా అంతటా పట్టు వల మాదిరి సాలీడు గూళ్ళు పరుచుకొని ఉన్నాయి. ఉదయపు మంచులో ఆ గూళ్ళు కదులుతూ, మెరుస్తూ వింత అనుభూతిని కలిగించాయి.

ఎన్ని సంవత్సరాలకో ఒకసారి గానీ ఇలా జరగదు. ఈ గూళ్ళు ఒకటి రెండు రోజులకు మించి ఉండవు. జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రతి చదరపు అంగుళంలోనూ ఎన్నో సాలీళ్ళు కనపడతాయి. ఒకదానికి ఇంకోదానికి మధ్య ఖాళీలేనంత వత్తుగా ఇవి ఉంటాయి. ఒక పావు ఎకరంలో కొన్ని వందల వేల సాలీళ్ళు ఉండవచ్చు. ఒకటి రెండు రోజుల్లో సాలీడు గూళ్ళు సన్నటి దారాలుగా మారి ఎగరటానికి సిద్ధంగా ఉన్న పిట్టల మల్లే ఉంటాయి. ఒక్కొక్కదారపు పోగుకు అయిదారు సాలీళ్ళు వేలాడుతుంటాయి. దారాలతో పాటు సాలీళ్ళు కూడా ఆకాశంలోకి ఎగిరిపోతాయి. ఇవి చూడటానికి గాలిలో ఎగురుతున్న జిల్లేడు విత్తనాల మాదిరి ఉంటాయి.

ఇదంతా ఒక అద్భుతమయిన దృశ్యరూపకంలాగా ఉంటుంది. ఇది చూస్తే సమావేశానికి కవులూ, నాటక కర్తలూ కూడా వచ్చితీరాలని మీరు అంటారు.

పొలంలో రసాయనాలు ఉపయోగించినపుడు ఇదంతా చిటికలో మాయమవుతుంది. పొయ్యిలోని బూడిద పంటపొలాల్లో వేయటం వల్ల ఎటువంటి నష్టమూ ఉండదని ఒకప్పుడు అనుకునేవాడిని.[1] దీనివల్ల ఒకసారి చాలా తీవ్ర పరిణామాలు సంభవించాయి. రెండు మూడురోజుల్లో ఒక్క సాలీడు కూడా మిగలకుండా చనిపోయాయి. ఏ హాని చెయ్యదనుకున్న గుప్పెడు బూడిద వల్ల ఎన్ని వేల సాలీళ్ళు చనిపోయాయో? పురుగుల మందుల వల్ల కేవలం దోమలు, వాటి

1. వంటింటి చెత్త, బూడిదతో పెంటపోగు ఎరువు చేసి ఫుకుఓకా పెరటితోటలో ఉపయోగిస్తారు.

సహజశత్రువులే నాశనం కావు. ప్రకృతిలోని ఇతర అంశాలు కూడా ప్రభావిత మవుతాయి.

వరికోతల తరువాత వేల సంఖ్యలో సాలీళ్ళు రావటం, ఒక్క ఉదయం అన్నీ మాయమవ్వటం అంతుపట్టని కథ వంటిది. అవి ఎక్కడి నుంచి వస్తున్నాయి, శీతాకాలంలో ఎలా బతుకుతాయి, ఎక్కడికి ఎగిరిపోతున్నాయి అన్న విషయాలు ఎవరికీ తెలియదు.

కాబట్టి మందులను ఉపయోగించటమన్నది ఒక్క కీటక శాస్త్ర నిపుణుల సమస్య మాత్రమే కాదు. పొలాల్లో పురుగుల మందులు వాడవచ్చా లేదా, సేంద్రియ ఎరువుల ప్రభావమైనా సరే పొలాల్లో ఎట్లా ఉంటుంది అన్న విషయాలు తేల్చటానికి తత్వవేత్తలు, మతగురువులు, కళాకారులు, కవులు కూడా సహాయం చెయ్యాలి.

ఇక్కడ పావు ఎకరం నుంచి 585 కిలోల వరి, 585 కిలోల శీతాకాలపు ధాన్యం పొందవచ్చు. ఒక్కొక్కసారి దిగుబడి 771 కిలోల వరకు చేరుకొంటుంది. జపానులో ఇంతకంటే ఎక్కువ దిగుబడి ఎక్కడా పొందలేదు. ఇక్కడ పంటలు పండించటానికి ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి ఏమీ సంబంధం లేదు. కాబట్టి ఆధునిక శాస్త్ర విజ్ఞానాకి ఇది సవాలుగా నిలుస్తుంది. ఈ పొలాలను చూసి మానవులకు ప్రకృతి గురించి తెలుసో లేదో, మానవ తెలివితేటల పరిధిలో ప్రకృతిని అర్థం చేసుకోవచ్చో లేదో ఎవరికి వారే తేల్చుకోవచ్చు.

మానవజ్ఞానం ఎంత అల్పమయిందో రుజువు చెయ్యటానికి మాత్రమే శాస్త్ర విజ్ఞానం తోడ్పడింది.

II



ప్రకృతి సేద్యానికి నాలుగు సూత్రాలు

ఈ పొలాల్లో మీరు చాలా జాగ్రత్తగా దారి చేసుకొంటూ నడవాలి. ఇక్కడ సీతాకోక చిలుకలూ, తూనీగలూ హడావిడిగా తిరుగుతుంటాయి. తేనెటీగలు తేనె సేకరిస్తూ ఒక పూరెమ్మ నుంచీ మరో పూరెమ్మ మీదకు ఎగురుతుంటాయి. ఆకులు తొలగించి చూస్తే అడుగున రకరకాల పురుగులు, సాలీళ్ళు, కప్పలు, తొండలు, ఇంకా అనేక రకాల చిన్న చిన్న ప్రాణులు కనపడతాయి. మట్టిలో వానపాములు, కుమ్మరి పురుగుల వంటివి ఉంటాయి.

సమతూక జీవావరణాన్ని ప్రతిబింబిస్తున్న వరిపొలం ఇది. వృక్షజాలం, జంతుజాలం మధ్య స్థిరమైన సంబంధాలు ఏర్పడి ఉన్నాయి. చుట్టుపక్కల ప్రాంతమంతటా తెగుళ్ళు తీవ్రంగా వ్యాపించి పంటను నష్టపరిచినప్పటికీ ఇక్కడ పంట ఎప్పుడూ నష్టపోలేదు.

ఒక్క క్షణంసేపు పక్క రైతుల పొలాలు చూడండి. కలుపునాశిని మందులు వాడి కలుపు లేకుండా చేశారు. పొలాల్లో వాడుతున్న విషపు మందుల కారణంగా నేలలో ఉండే పురుగూ పుట్రా అంతరించి పోయాయి. రసాయనిక ఎరువుల వల్ల మట్టిలో సేంద్రియ పదార్థం లేకుండాపోయింది. సూక్ష్మజీవులు మటుమాయమయ్యాయి. వేసవిలో రైతులు ముఖాలకూ, చేతులకూ తొడుగులు వేసుకొని పనిచేస్తుంటారు. 1,500 సంవత్సరాల నుంచి సాగులో ఉన్న పొలాలివి. ఒక్కతరంలోనే నేలసారాన్ని పీల్చి పిప్పి చేసి ఎందుకూ పనికి రాకుండా చేశారు.

నాలుగు సూత్రాలు

ప్రకృతిసేద్యానికి మూలమైన నాలుగు సూత్రాల్లో మొదటిది **దుక్కిచెయ్యవద్దు.** అంటే పొలాన్ని దున్నకూడదు, తిరగవెయ్యకూడదు. పంటలు పండించటానికి నాగలి తప్పనిసరని కొన్ని శతాబ్దాల నుంచి రైతులు భావిస్తూ వస్తున్నారు. ప్రకృతిసేద్యంలో దుక్కి చెయ్యకపోవడ మన్నది మూలసూత్రం. వేళ్ళులోపలికి చొచ్చుకుపోవడం వల్లా, సూక్ష్మజీవులూ, వానపాములూ, ఇతర జంతుజాలం వల్లా భూమి తనంతట తాను దుక్కి చేసుకొంటుంది.

రెండవసూత్రం **రసాయనిక ఎరువులుగానీ, తయారు చేసిన పెంటపోగు కానీ వాడవద్దు.**[1] మానవులు మొదట ప్రకృతిలో జోక్యం చేసుకొంటారు. ఆ తరువాత ఎంత ప్రయత్నించినా చేసిన గాయాలు మాన్పలేరు. సాగులో అవలంబించే నిర్లక్ష్య విధానాలవల్ల ఏటా పోషక పదార్థాలు నష్టపోయి నేలసారం తగ్గిపోతుంటుంది. ప్రకృతికి తన పని చేసుకోటానికి వీలు కలిగిస్తే జంతు, వృక్ష జాలాల జీవిత చక్రాల కనుగుణంగా భూసారం ఎప్పటికీ తగ్గకుండా ఉంటుంది.

కలుపు తియ్యటానికి దున్న వద్దు, కలుపునాశిని మందులు వాడవద్దు అన్నది మూడవ సూత్రం. భూసారాన్ని కాపాడటంలోనూ, జీవరాశుల మధ్య సమతూకం ఏర్పరచటంలోనూ కలుపుమొక్కలు తమ వంతు పాత్ర వహిస్తాయి. అందువల్ల కలుపుమొక్కల్ని అదుపులో ఉంచటానికి ప్రయత్నించాలే కాని నిర్మూలించకూడదు. పంట నూర్చిన తరువాత నేల మీద గడ్డి పరచి ఉంచడం వల్లా, పంట మధ్య తెల్ల క్లోవరు నేల అంతా కప్పి ఉంచటం వల్లా, కొద్ది రోజుల పాటు పొలంలో నీళ్ళు

1. ఎరువుకోసం ఫుకుఓకా నేలను కప్పి ఉంచే తెల్లక్లోవరు సాగుచేస్తారు. పంట నూర్చిన తరువాత గడ్డిని పొలం మీద తిరిగి చల్లి కొద్దిగా కోడి పెంట వేస్తారు.

నిల్వ కట్టడంతోనూ నా పొలంలో కలుపు అదుపులో ఉంటుంది.

నాలుగవ సూత్రం **రసాయనాల మీద ఆధారపడవద్దు.**[1] దుక్కి చెయ్యటం, ఎరువులు వెయ్యటం వంటి అసహజమైన పనులవల్ల మొక్కలు బలహీనమై పురుగులూ, తెగుళ్ళూ పెద్ద సమస్య అయి కూర్చుంటాయి. ప్రకృతిని తన మానానికి తనని వదిలివేస్తే చక్కని సమతూకం ఏర్పడుతుంది. పురుగులూ, తెగుళ్ళూ పొలంలో ఉంటాయి కానీ మందుల పిచికారి అవసరమయ్యేంతగా ఏ ఒక్కటీ పేట్రేగిపోదు. వీటిని అదుపు చెయ్యడానికి ఆరోగ్యకరమయిన వాతావరణంలో, బలమయిన మొక్కలను పెంచడం సరయిన మార్గం.

దుక్కి

పొలాన్ని దున్నినపుడు గుర్తించ లేనంతగా సహజవాతావరణం మారిపోతుంది. దీని ప్రతికూల ఫలితాలను ఎదుర్కొనే సరికి తల ప్రాణం తోకకు వస్తుంది. ఈ విధంగా తరతరాల నుంచి రైతు కిందా మీదా పడుతున్నాడు. ఉదాహరణకు కొత్తగా ఒక ప్రాంతాన్ని దుక్కి చేసి సాగులోకి తెచ్చారనుకొందాం. దీని ఫలితంగా ఒక్కోసారి మొండి కలుపు మొక్కలు మొలుచుకొస్తాయి. అందువల్ల ప్రతి సంవత్సరం కలుపు తీసే పని తప్పని సరి అవుతుంది. ఒక్కొక్కసారి కలుపు చాలా తీవ్రంగా పెరిగి పొలాన్ని సాగు చెయ్యకుండా వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.


ఇటువంటప్పుడు సమస్యకు దారితీసిన పనులకు ముందు స్వస్తి చెప్పాలి. ఆ తరువాత జరిగిన నష్టాన్ని సరిచెయ్యడానికి బాధ్యత

1. ఫుకుఓకా ఎటువంటి రసాయనాలు వాడరు. చీనీ చెట్లమీద పొలుసు పురుగుల్ని అరికట్టడానికి మాత్రం అప్పుడప్పుడూ ఇంజిన్ ఆయిల్ ఎమల్షన్ పిచికారి చేస్తారు. ఇంతకుమించి ఎటువంటి పురుగుల మందులూ వాడరు.

వహించాలి. అంటే పొలం దున్నడం ఆపివేయాలి. యంత్రాలనుపయోగించీ, మందులు చల్లీ యుద్ధం ప్రకటించే బదులు పొలంలో గడ్డి పరవటం, తెల్లక్లోవరు విత్తనాలు చల్లటం వంటి సుతిమెత్తని చర్యలు తీసుకొంటే ప్రకృతి ప్రతిస్పందించి సహజ సమతూకానికి చేరుకొంటుంది. ఈ దశలో ఎంత మొండి కలుపు మొక్కలయినా అదుపులో ఉంటాయి.

ఎరువులు

"ప్రకృతిని తన మానానికి తనని వదిలివేస్తే భూసారం, తగ్గుతుందా, పెరుగుతుందా?" అని ఇక్కడకు వచ్చిన భూసార నిపుణులను అడగటం నా అలవాటు. "ఆ, ఎరువులు వెయ్యకపోతే... భూసారం తగ్గుతుంది. కాదు, కాదు. ఒకే పొలంలో ఎరువులు వేయకుండా వరసగా వరిసాగు



చేస్తే పావు ఎకరానికి 236 కిలోల దగ్గర దిగుబడులు స్థిరపడతాయి. భూసారం తరగదు, పెరగదు" అన్న సమాధానమిస్తారు.

పైన చెప్పిన సమాధానం దుక్కి చేసి, నీటి కింద సాగు చేస్తున్న వరిపొలాలకు వర్తిస్తుంది. ప్రకృతిలో అయితే భూసారం పెరుగుతుంటుంది. మొక్కల నుంచీ, జంతుజాలం నుంచీ సేంద్రియ పదార్థం నేలకు చేరుతుంది. సూక్ష్మజీవుల వల్ల ఈ సేంద్రియ పదార్థం కుళ్ళిపోతుంది. వానపడినప్పుడు వాననీళ్ళతో పాటు పోషక పదార్థాలు నేలలోపలి పొరల్లోకి చేరుకొంటాయి. ఇక్కడ ఇవి వానపాములకూ, ఇతర చిన్న చిన్న జీవులకూ ఆహారంగా ఉపయోగపడతాయి. మొక్కల వేళ్ళు కూడా లోపలి పొరల్లోంచి పోషక పదార్థాలను గ్రహించి వాటిని తిరిగి పైకి తీసుకువస్తాయి.

భూమి సహజసారం గురించి తెలియాలంటే కొండమీదికి వెళ్ళి చూడండి. ఎవరు దుక్కి చేశారని, ఏ ఎరువులు వేశారని అడవిలో చెట్లు అంత పెద్దగా పెరిగాయి? నిజానికి ప్రకృతి సారం మన ఊహకు అందదు.

అడవిని నరికి వేసి దేవదారు చెట్లు పెంచి చూడండి. అనతి కాలంలోనే భూమి సారం కోల్పోయి కోతకు గురి అవుతుంది. అదే ఏ చెట్టూ లేని కొండ చరియల్లో దేవదారు చెట్లు నాటి నేలను కప్పి ఉంచటానికి క్లోవరును గానీ, ఆల్ఫాల్ఫాను గానీ విత్తి చూడండి. క్లోవరూ, ఆల్ఫాల్ఫా పచ్చిరొట్టగా ఉపయోగపడి భూమి మెత్తబడి సారవంతం అవుతుంది. చెట్ల కింద కలుపుమొక్కలూ, పొదలూ పెరుగుతాయి. ఇవన్నీ ఒకదానికొకటి తోడ్పడుతూ ఉంటాయి. పది ఏళ్ళలోనే నాలుగంగుళాల మేర సారవంతమయిన మట్టి పొర ఏర్పడిన సందర్భాలున్నాయి.

వ్యవసాయంలో పెంట పోగు తయారు చేసి పొలానికి వేసే

పద్ధతికి స్వస్తి పలకవచ్చు. నేలను ఎల్లప్పుడూ కప్పి ఉంచే పచ్చిరొట్ట పైరు సాగు చేస్తూ మొత్తం గడ్డినీ, పొట్టునీ పొలంలో వేస్తే ఏ ఎరువులూ వెయ్యాల్సిన అవసరం ఉండదు. గడ్డి తేలికగా కుళ్ళటానికి కొంత పెంట చల్లితే బాగుంటుంది. ఇందుకు నేను పొలంలో బాతులను వదిలేవాడిని. వరి లేత దశలో బాతు పిల్లలను పొలంలో వదిలితే వరితో పాటు బాతులూ పెరుగుతాయి. పావు ఎకరానికి అవసరమయిన పెంటను పదిబాతులు అంద చెయ్యటమే కాక కలుపును కూడా అదుపులో ఉంచుతాయి.

ఈ పద్ధతిని నేను అనేక సంవత్సరాలు కొనసాగించాను. ఆ తరువాత పొలాల మధ్య జాతీయ రహదారి ఏర్పడి బాతులకు గూడు నుంచి పొలాలకూ, పొలాల నుంచి గూడుకూ వెళ్ళటం కష్టమై ఈ పద్ధతిని మానుకొన్నాను. ఇప్పుడు గడ్డిని కుళ్ళ బెట్టడానికి కొద్దిగా కోడిపెంట ఉపయోగిస్తున్నాను. వీలయిన చోట్ల మాత్రం బాతులనూ, చిన్న జంతువులనూ పెంచవచ్చు.

ఎరువు మోతాదు ఎక్కువయినా సమస్యలకు దారి తీస్తుంది. ఒకసారి వరి ఊడ్పులయిన తరువాత ఒకటింపావు ఎకరాన్ని ఒక సంవత్సరానికి కౌలుకు తీసుకొన్నాను. దీనిని అయిదు మడులుగా చేసి నీటిని బయటకు తీసేశాను. రసాయనిక ఎరువులు వేయకుండా కొద్దిగా కోడి పెంట వేశాను. నాలుగు మడులు బాగానే వచ్చాయి. అయిదో మడిలో ఏం చేసినా మొక్కలు వత్తుగా పెరిగి అగ్గి తెగులుకు గురయ్యాయి. పొలం ఆసామిని విషయమేమిటని అడిగితే అంతకు ముందు శీతాకాలంలో కోడి పెంటనంతా ఆ మడిలో వేశానన్నాడు.

రసాయనిక ఎరువులూ, పెంట పోగు ఎరువూ లేకుండానే గడ్డి, పచ్చిరొట్టపైరు, కొంత కోడి పెంటతో అధిక దిగుబడులు సాధించవచ్చు. గత కొన్ని దశాబ్దాలుగా నేను హాయిగా కూర్చొని ప్రకృతి పొలందున్నే

విధానం, ఎరువులు వేసే విధానం గమనిస్తూ వచ్చాను. పుడమితల్లి సహజసారంతో ఇబ్బడి ముబ్బడిగా ఇస్తున్న కూరగాయలు, పండ్లు, వరి, శీతాకాలపు ధాన్యాన్ని బహుమతిగా పొందుతున్నాను.

కలుపును ఎదుర్కోవడం

కలుపును ఎదుర్కొనేటప్పుడు ముఖ్యంగా ఈ కింది విషయాలు గుర్తుంచుకోవాలి:

పొలాన్ని దున్నటం ఆపివెయ్యటంతో కలుపు మొక్కల రకాలు తగ్గిపోతాయి. ఎటువంటి కలుపుమొక్కలు మిగులుతాయన్నది పొలాన్ని బట్టి ఉంటుంది.

ఒక పంట తయారవుతుండగానే రెండవ పంట విత్తనాలు చల్లితే ఇవి కలుపుకంటే ముందే మొలుస్తాయి. శీతాకాలపు కలుపు మొక్కలు వరి కోసిన తరువాతే మొలుస్తాయి. ఆ పాటికి మన శీతాకాలపు పంటలు ఏపుగా ఎదిగి ఉంటాయి. అలాగే వేసవి కాలపు కలుపు మొక్కలు బార్లీ, రై కోసిన తరువాత గాని మొలవవు. కానీ అప్పటికే వరి చక్కగా పెరుగుతూ ఉంటుంది. రెండు పంటల మధ్య ఏ విధమయిన ఎడం లేకుండా ఉండేట్లు విత్తితే అసలు కలుపు పెద్దగా పుట్టదు.

కోతలు పూర్తయి, ధాన్యం నూర్చిన తరువాత గడ్డి మొత్తం తిరిగి పొలం మీద కప్పితే చాలా వరకు కలుపు మొక్కలు మొలకెత్తవు. నేలను కప్పి ఉంచే విధంగా ధాన్యంతోపాటు తెల్లక్లోవరు విత్తితే కలుపును అదుపులో ఉంచుతుంది.

కలుపును అరికట్టడానికని సాధారణంగా పొలం దున్నుతారు. మొలకెత్తటానికి వీలులేనంత లోతులో ఉన్న కలుపువిత్తనం దున్నటం వల్ల పైకి వచ్చి మొలకెత్తే అవకాశం ఉంటుంది. అంతే కాక దీనివల్ల తొందరగా మొలిచి, తొందరగా ఎదిగే కలుపు రకాలకు అనువయిన పరిస్థితులు కల్పించినట్లు అవుతుంది. అంటే కలుపును అరికట్టడానికి

పొలాన్ని దున్నే రైతు వాస్తవానికి కలుపు విత్తనాలు చల్లుతున్నాడన్నమాట.

"చీడపీడల" నియంత్రణ

సస్యరక్షణ మందులు వాడకపోతే కళ్ళ ఎదుటే పండ్లతోటలూ, పంట పొలాలూ పూర్తిగా నాశనమవుతాయని నమ్మేవారు ఇప్పటికీ ఉన్నారు. నిజానికి మందులు వాడటం వల్లే తమ భయాలు నిజమయ్యే పరిస్థితిని కొని తెచ్చుకొంటున్నారు.

ఇటీవల బెరడును తొలిచే ముక్కు పురుగుల బారికి జపనీస్ ఎర్రదేవదారు చెట్లు గురయ్యి తీవ్రంగా నష్టపోతున్నాయి. ఈ నష్టాన్ని నివారించటానికి అటవీశాఖ అధికారులు హెలికాప్టర్లు ఉపయోగించి మందులు చల్లిద్దామనుకొంటున్నారు. దీనివల్ల తక్షణ ఫలితాలుంటాయనటంలో సందేహం లేదు. కానీ ఇంతకంటే వేరే మార్గం లేదా ?

సరికొత్త పరిశోధనల్లో ఈ ముక్కు పురుగు నేరుగా దాడి చెయ్యదని తెలిసింది. నులి పురుగుల తాకిడికి గురయిన చెట్లనే ముక్కు పురుగులు దాడి చేస్తాయి. ఇవి చెట్టు బెరడులో వృద్ధి చెంది నీరు, పోషక పదార్థాల సరఫరాను అడ్డుకొంటాయి. దీనివల్ల చెట్టు వాడిపోయి ఎండిపోతుంది.

చెట్టు బెరడులో ఉండే ఒక విధమయిన శిలీంధ్రంపై ఆధారపడి నులి పురుగులు పెరుగుతాయి. ఈ శిలీంధ్రం చెట్లలో తీవ్రంగా వ్యాపించడానికి కారణమేమిటి? ముందు నులిపురుగులు దాడి చేసిన తరువాత శిలీంధ్రం వ్యాపించసాగిందా? లేకపోతే శిలీంధ్రం ఉండటం వల్లే నులి పురుగు దాడిచెయ్యగలిగిందా? అన్న ప్రశ్నలకు ప్రస్తుతం సమాధానం లేదు.

శిలీంధ్రంతో పాటు మరో సూక్ష్మజీవి కూడా ఉంటుంది. దీన్ని గురించి మనకు ఇంకా అంతగా తెలియదు. శిలీంధ్రానికి హానికరమయిన ఒక వైరస్ కూడా ఉంటుంది. ఒకదాని నుంచి మరో దానికి ప్రతి

దిశలోనూ ఎన్నో లంకెలున్నాయి. దేవదారు చెట్లు పెద్ద సంఖ్యలో ఎండిపోతున్నాయని మాత్రమే ఖచ్చితంగా చెప్పగల పరిస్థితిలో మనం ఉన్నాం.

దేవదారు చెట్లు ఎండిపోవటానికి అసలు కారణం ప్రజలకు బోధపడదు. 'పరిష్కార' చర్యల అంతిమ పరిణామాలు ఎలా ఉంటాయో కూడా వాళ్ళకు తెలియదు. ఏమీ తెలియకుండా ఏదో చెయ్యబోతే మరో పెద్ద విపత్తును కొని తెచ్చుకోవటమే అవుతుంది. పురుగుల మందులు చల్లటం వల్ల ముక్కు పురుగు సమస్య కొంత తగ్గింది కదా అని నేను సంబర పడలేను. ఇటువంటి సమస్యల పరిష్కారానికి పురుగుల మందులపై ఆధారపడటం కంటే తెలివితక్కువ పని మరొకటి ఉండదు. ఇది ముందు ముందు మరిన్ని సమస్యలకు దారి తీస్తుంది.


దుక్కి చేయవద్దు; రసాయనిక ఎరువులూ, పెంటపోగు ఎరువులూ వాడవద్దు; దున్నటం ద్వారా గానీ, కలుపునాశిని మందుల ద్వారా గానీ కలుపు నివారించవద్దు; పురుగుల మందులపై ఆధారపడవద్దు అన్న నాలుగు సూత్రాలూ ప్రకృతికి అనుగుణంగా ఉండి, ప్రకృతి తిరిగి కోలుకోటానికీ, సుసంపన్నం కావటానికీ తోడ్పడతాయి. నా ప్రయత్నాలన్నీ ఈ దిశలోనే కొనసాగాయి. ఈ సూత్రాల ఆధారంగానే నేను కూరగాయలు కాయించాను, పండ్లు పండించాను, ధాన్యం పండించాను.

కలుపు మధ్య సాగు

ఈ పొలంలో ధాన్యం, క్లోవరుతో పాటు ఎన్నో రకాల కలుపు మొక్కలు పెరుగుతున్నాయి. ఇంతకు ముందు పొలం మీద పరిచిన వరిగడ్డి కుళ్ళి మంచి ఎరువు (హ్యూమస్)గా మారింది. పావు ఎకరం నుంచి దాదాపు 585 కిలోల ధాన్యం వస్తుంది.

పచ్చిక బీళ్ళలోని గడ్డిమొక్కల నిపుణుడయిన ఆచార్య కవాసె నిన్న వచ్చి ఈ పొలాలు చూశారు. ఆయనతోపాటు పురాతన మొక్కల రకాలపై పరిశోధన చేస్తున్న ఆచార్య హిరో కూడా ఉన్నారు. బార్లీ పంట, పచ్చిరొట్ట పైరు పెరుగుతున్న తీరు చూసి దీనిని ఒక గొప్ప కళాఖండంగా వర్ణించారు. నా పొలం నిండా కలుపు మొక్కలుంటాయనుకొంటూ వచ్చిన ఒక స్థానిక రైతు రకరకాల మొక్కల మధ్య బార్లీ ఏపుగా పెరగటం చూసి ఆశ్చర్యపోయాడు. సాంకేతిక నిపుణులు కూడా కలుపు మొక్కలు, క్లోవరు అంతటా పెరగటం చూసి ఆశ్చర్యంతో తలలు ఊపుకుంటూ వెళ్ళిపోయారు.

పండ్లతోటల్లో శాశ్వతంగా నేలను కప్పి ఉంచే రకాలను సాగు చెయ్యమని ఇరవై ఏళ్ళ క్రితం నుంచే ప్రోత్సహించసాగాను. అప్పట్లో పండ్లతోటలో చూద్దామన్నా ఒక్క గడ్డి పరక ఉండేది కాదు. నాబోటి వాళ్ళ పండ్ల తోటలు చూసి కలుపు, గడ్డిమొక్కల మధ్య పండ్ల చెట్లను పెంచవచ్చన్న అభిప్రాయానికి రైతులు వచ్చారు. ఈనాడు జపాను అంతటా ఎక్కడ చూస్తే అక్కడ గడ్డితో నేలను కప్పి ఉన్న తోటలే కనపడతాయి. గడ్డిలేని తోటలు అరుదయ్యాయి.



"ఒక్కరోజులోనే చాలా ఎకరాలకు వరిపొను పెళ్ళలు తయారు చేయవచ్చు"

పంట పొలాలయినా ఇంతే. సంవత్సరం పొడవునా పొలమంతా క్లోవరు, కలుపు మొక్కలు కప్పి ఉన్నా వరి, బార్లీ, రై పంటలను విజయవంతంగా సాగు చేయవచ్చు.

ఈ పొలాల్లో విత్తటం, కోతల గురించి కొంత వివరంగా తెలుసుకొందాం. వరిపొలాల్లో కోతకు ముందే అక్టోబరు మొదట్లో తెల్ల క్లోవరు, త్వరగా ఎదిగే శీతాకాలపు ధాన్యం విత్తనాలు వెదజల్లుతాను. వరి కోతకు వచ్చేటప్పటికి క్లోవరు, బార్లీ, రై మొలకెత్తి అంగుళం రెండు అంగుళాల ఎదిగి ఉంటాయి. కోత సమయంలో కాళ్ళకింద మొక్కలు కొంత నలిగినా తిరిగి త్వరగానే కోలుకొంటాయి. నూర్పిడి అయిన తరువాత వరి గడ్డిని పొలమంతటా చల్లుతాను.

ఆకురాలే కాలంలో వరివిత్తి కప్పకుండా ఉంచితే విత్తనాలను పిట్టలో, ఎలుకలో తినివేసే ప్రమాదముంది. ఒక్కొక్కసారి విత్తనం మట్టిలో కుళ్ళిపోతుంది. కాబట్టి వరి విత్తనాన్ని మట్టి పెళ్ళలో కప్పుతాను. వరి విత్తనాలను తట్టలోనో, పళ్ళెంలోనో తీసుకొని జల్లెడ తిప్పినట్లు తిప్పుతాను. పై నుంచి మెత్తటి మన్ను చల్లుతూ

నీళ్ళు చిలకరిస్తుండాలి. ఇలా చేస్తే విత్తనాలతో కూడుకొన్న చిన్న చిన్న మట్టి పెళ్ళలు తయారవుతాయి.

మట్టిపెళ్ళలు తయారు చెయ్యటానికి మరో పద్ధతి ఉంది. ముందు కొన్ని గంటలపాటు వరి విత్తనాలను నీళ్ళలో నానబెట్టాలి. తరువాత వీటిని తడిమట్టిలో వేసి చేతితోనో, కాళ్ళతోనో కలపాలి. దీనిని జల్లెడ మీద నుంచి రుద్దితే మట్టి ముద్దలుగా కిందికి దిగుతుంది. వీటిని ఒకటి రెండు రోజులు ఆరనిచ్చి అరచేతితో రుద్ది పెళ్ళలుగా చెయ్యాలి. ఒక్కొక్క పెళ్ళలో ఒక్కొక్క విత్తనం మాత్రమే ఉండాలి.



మరు సంవత్సరానికి విత్తే కార్యక్రమం పూర్తయిన తరువాత అక్టోబరులో గడ్డిని పొలంలో వెదజల్లుతారు.

ఈ విధంగా ఒక్కరోజులోనే చాలా ఎకరాలకు సరిపోను పెళ్ళలు తయారు చేయవచ్చు.

పరిస్థితులను బట్టి ఒక్కొక్కసారి వరితోపాటు ఇతర ధాన్యాల, కూరగాయల విత్తనాలు కలిపి పెళ్ళలు తయారు చేస్తాను.

లేత బార్లీ, రై మొక్కల మధ్య నవంబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు వరి విత్తటానికి అనువయిన సమయం. వసంతకాలంలో కూడా వరిని విత్తవచ్చు. గడ్డి త్వరగా కుళ్ళటానికి పలచగా కోడిపెంట చల్లితే ఇక ఆ సంవత్సరానికి విత్తేపని పూర్తయినట్లే.

మే నెలలో శీతాకాలపు పంట కోతకు వస్తుంది. నూర్పిడి అయిన తరువాత గడ్డిని పొలమంతా చల్లాలి.

ఆ తరువాత వారం పదిరోజుల పాటు పొలంలో నీళ్ళు నిలవకట్టాలి. దీనివల్ల కలుపుమొక్కలు, క్లోవరు కొంత బలహీనపడతాయి. గడ్డిలోంచి వరి మొలుచుకురావడానికి సహాయ పడుతుంది.



పరిచిన గడ్డిలోంచి డిసెంబరు కల్లా శీతాకాలపు పంట మొక్కలు మొలుచుకొస్తాయి; వరి గింజలు వసంతకాలం వరకు వేచి ఉంటాయి.



మే నెలలో శీతాకాలపు పంటలు కోతకొస్తాయి. వరి మొక్కలు కాళ్ళ కింద నలుగుతాయి కానీ త్వరలోనే తిరిగి నిలదొక్కుకొంటాయి.

జూన్,జూలైలలో వాన నీళ్ళుచాలు. ఆగస్టులో నీరు నిలవకట్టకుండా వారానికి ఒకసారి కొత్తనీళ్ళు పారకట్టాలి. దీనితో వరి పంట పని పూర్తయినట్లే.

ఇదీ ప్రకృతి సేద్యంలో వరి, శీతాకాలపు పంటలు పండించేవిధానం. ఇది ప్రకృతిని ఎంతో బాగా అనుకరిస్తుంది. అందుకే దీనిని వ్యవసాయ విధానం అనడం కంటే ప్రకృతి విధానం అనడం సబబుగా ఉంటుంది.

ఒకపావు ఎకరంలో విత్తనాలు చల్లి, గడ్డి వెదజల్లటానికి ఒకవ్యక్తికి ఒకటి-రెండు గంటలకు మించి పట్టదు. ఒక్క కోత పనితప్పించి శీతాకాలపు పంటల పనులన్నీ ఒక్కరే పూర్తి చేయగలరు. పాతరకం పనిముట్లు ఉపయోగించినప్పటికీ వరిసాగుకు ఇద్దరు ముగ్గురు సరిపోతారు. ధాన్యం పండించటానికి ఇంతకంటే తేలికయిన పద్ధతి మరొకటి ఉండదు. విత్తనాలు చల్లటం, గడ్డి వెదజల్లటం తప్ప వేరేపని లేదు.

ఇంతతేలికయిన పద్ధతికి చేరుకోటానికి నాకు ముప్పైసంవత్సరాలు పట్టింది.

నేను అనుసరిస్తున్న ఈ విధానం జపాన్ దీవుల్లోని సహజ పరిస్థితులకు అనుగుణంగా వృద్ధి చెందింది. ఇతర ప్రాంతాల్లో, ఇతర పంటలతో ప్రకృతి సేద్యాన్ని అమలు చెయ్యవచ్చు. ఉదాహరణకు నీళ్ళు అంతగా దొరకని ప్రాంతాల్లో మెట్టవరి, జొన్న లేదా ఇతర చిరు ధాన్యాలు పండించవచ్చు. తెల్ల క్లోవరుకు బదులు క్లోవరులో మరో రకమో, ఆల్ఫాల్ఫానో, లుపిన్ గడ్డో నేలను కప్పి ఉంచటానికి అనువుగా ఉండవచ్చు. ఆయా ప్రాంతాల వాతావరణ, భౌగోళిక పరిస్థితులనుబట్టి ప్రకృతి సేద్యం ఒక విశిష్ట రూపాన్ని సంతరించు కొంటుంది.

మొదట్లో పెంటపోగు తయారు చేయటం, కలుపు తీయటం, కొమ్మలు కత్తిరించటం వంటి పనులు కొంత అవసరం కావచ్చు. ఈ పనులను క్రమేపి తగ్గించుకొంటూ పోవాలి. ఈ పద్ధతిలో చివరకు మొక్కలు పెంచే విధానం కంటే రైతు మానసిక స్థితి ముఖ్యమవుతుంది.

ప్రకృతి సేద్యంలో గడ్డి ఉపయోగాలు

పొలంలో గడ్డి పరవటం అంత ముఖ్యం కాదని కొందరు అనుకోవచ్చు. వరి, శీతాకాలపు పంటలను నేను సాగు చేసే విధానానికి ఇది మూలం. నేల సారానికీ, విత్తనం మొలకకూ, కలుపును అదుపులో ఉంచటానికీ, పిట్టలను ,నివారించటానికీ, నీటి యాజమాన్యానికీ గడ్డి పరవటంతో సంబంధం ఉంది. ప్రకృతి సేద్యంలో సిద్ధాంత రీత్యానే కాక ఆచరణలోనూ గడ్డి కీలక పాత్ర వహిస్తుంది. దీని గురించి ఎంత చెప్పినా ఎవరూ సరిగా అర్థం చేసుకోవటం లేదు.

గడ్డిని కత్తిరించ కుండానే పరవాలి

ఓకాయామా పరిశోధన క్షేత్రంలోని 80 శాతం విస్తీర్ణంలో నేరుగా వరి విత్తే విధానాన్ని ప్రయత్నించి చూస్తున్నారు. గడ్డిని కత్తిరించకుండానే పొలంలో పరవమని నేను సలహా ఇచ్చాను. ఇది సరయినదిగా వాళ్ళకు అనిపించినట్లు లేదు. యంత్ర సహాయంతో గడ్డిని ముక్కలుగా కత్తిరిస్తున్నారు. పొలాన్ని గడ్డిపరిచిన మడులు, ముక్కలుగా కత్తిరించి గడ్డి పరిచిన మడులు, గడ్డి పరవని మడులుగా విభజించి ప్రయోగాలు చేస్తున్నారు. ఈ విధమయిన ప్రయోగాలు ఎన్నో సంవత్సరాల పాటు చేసిన తరువాత గడ్డి కత్తిరించకుండా ఉన్నప్పుడే మంచి ఫలితాలు పొందవచ్చని గమనించి ఈ పద్ధతిని అవలంబిస్తున్నాను.

షిమేని ప్రాంతంలోని యాసుకి వ్యవసాయ ఉన్నత పాఠశాలలో

పనిచేస్తున ఫూజి నేరుగా వరి విత్తే విధానాన్ని అనుసరించాలన్న ఉద్దేశంతో నా పొలం చూడటానికి వచ్చారు. గడ్డిని కత్తిరించకుండానే పొలం మీద పరవమని చెప్పాను. సంవత్సరం తరువాత వచ్చి తన ప్రయత్నం విఫలమయ్యిందని చెప్పాడు. పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకోటానికి ఏమేమి చేశాడో వివరించి చెప్పమన్నాను. అతను గడ్డిని చక్కగా వరుసల్లో పేర్చాడట. దీని వల్ల మొలక సరిగా రాదు. బార్లీ, రై గడ్డిని ఒద్దికగా పేరిస్తే వరి మొక్క పైకి రావటానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. సహజంగా పడిందా అనిపించేట్లు చిందర వందరగా గడ్డిని వెదజల్లాలి.

వరిగడ్డి శీతాకాలపు పంటలకూ, శీతాకాలం పంటల గడ్డి వరికీ బాగా ఉపయోగిస్తాయి. దీనిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. వరిపైరులో తాజా వరిగడ్డి వేస్తే తెగుళ్ళు సంక్రమించే ప్రమాదముంది. ఈ వరి తెగుళ్ళు శీతాకాలపు పంటలను ఆశించవు. వరిగడ్డిని ఆకురాలే కాలంలో పరిస్తే వసంతంలో మళ్ళీ వరి మొలిచేనాటికి పూర్తిగా కుళ్ళిపోతుంది. తాజా వరిగడ్డి ఇతర ధాన్యాలకు మంచిది. ఇదే విధంగా ఇతర ధాన్యాల గడ్డిని వరికి ఉపయోగించవచ్చు.

నూర్పిడి అయిన తరువాత మొత్తం గడ్డినీ, పొట్టునీ పొలంలో చల్లాలి.

గడ్డి వల్ల భూమి సారవంతం అవుతుంది.

పొలంలో తిరిగి గడ్డి వెదజల్లటం వల్ల నేల భౌతిక గుణాలు మెరుగు పడతాయి. భూమి సారవంతం అవుతుంది. తయారు చేసిన పెంట పోగు వాడనవసరం లేదు. పొలం దున్నే పని కూడా ఉండదు. గత ఇరవై సంవత్సరాల నుంచీ జపాన్‌లో పొలం దున్నని వాడిని నేను ఒక్కడినే ఏమో! ఫలితంగా ప్రతి సంవత్సరమూ నేల తీరు మెరుగు పడుతోంది. నాలుగంగుళాల మేర హ్యూమస్ ఏర్పడి నేల సారవంతంగా

మారింది. ధాన్యం తప్పించి పొలంలో పండినదంతా తిరిగి పొలంలో వెయ్యటం వల్లే ఇది సాధ్యమయ్యింది.

పెంటపోగు తయారు చేయాల్సిన పనిలేదు

పొలంలో గడ్డి పరిచిన తరువాత కొద్దిగా కోడిపెంట లేదా బాతుపెంట చల్లితే ఆరు నెలల్లో పూర్తిగా చీకిపోతుంది. కాబట్టి ప్రత్యేకంగా పెంటపోగు తయారు చేయాల్సిన పని లేదని నా అభిప్రాయం.

నేను అవలంబించే పద్ధతికి కష్టపడనవసరం లేదు. పెంటపోగు తయారు చెయ్యాలంటే రైతులు నడుము విరిగేలా పని చేయాల్సి ఉంటుంది. ముందు వరిగడ్డిని ముక్కలుగా కత్తిరించాలి. దీనికి నీళ్ళు, సున్నం కలపాలి. ఒకసారి పెంటపోగును తిరగ వెయ్యాలి. పెంటపోగు తయారయిన తరువాత పొలానికి చేరవెయ్యాలి. ఇది 'మెరుగయిన పద్ధతి' అనుకోవటం వల్లే రైతులు ఇంత కష్టపడుతున్నారు.

పశ్చిమ జపాన్‌లోని టొకైడోకి రైలులో ప్రయాణిస్తున్నప్పుడు వరిగడ్డిని పెద్ద పెద్ద ముక్కలుగా కత్తిరించి పొలాల్లో పరవటం గమనించాను. వరిగడ్డిని తిరిగి పొలంలో ఉపయోగించండని నేను మొదట చెప్పినపుడు ఇంకా చిన్న ముక్కలుగా కత్తిరించి వేసేవారు. ప్రస్తుత మార్పునకు రైతులను అభినందించాలి. పొలం నుంచి వచ్చే గడ్డిలో సగం ఉపయోగిస్తే మంచిదని ఈనాటి నిపుణులు చెబుతున్నారు. పొలం నుంచి వచ్చిన గడ్డినంతటినీ తిరిగి వెయ్యమని వీళ్ళు ఎందుకు చెప్పరు? రైతులు సగం గడ్డిని కత్తిరించి పొలంలో చల్లి మిగిలిన సగాన్ని వృథా చేస్తున్నారు.

జపాన్ రైతులందరూ మొత్తం గడ్డిని తిరిగి పొలంలో వెయ్యటం మొదలుపెడితే భూమికి ఎంతో ఎరువు వేసినట్లవుతుంది.

మొలక

బలమయిన నారు పెంచాలని నారు మడి తయారు చెయ్యటానికి రైతులు ఎంతో కష్టపడుతున్నారు. వందల సంవత్సరాల నుంచి ఈ



కాలితో నడిపే సంప్రదాయ పరికరం (క్యోటో)తో పంటను నూరుస్తారు. ధాన్యాన్ని తూర్పార పట్టి నిల్వ చేస్తారు. గడ్డిని తిరిగి పొలంలో వెదజల్లుతారు.

పనులు చేస్తున్నారు. దేవుని మంటపాన్ని శుభ్రపరిచినంత జాగ్రత్తగా నారు మడులను శుభ్రపరుస్తారు. మెత్తని దుక్కి వచ్చేదాకా పలుమార్లు దున్నుతారు. ఇసుక, కాల్చిన ఊక పొలమంతా చల్లుతారు. మొక్కలు బాగా మొలవాలని మొక్కు కొంటారు.

శీతాకాలపు పంటలు, కలుపు మొక్కలు, కుళ్ళుతున్న గడ్డి మధ్య విత్తులు చల్లే నన్ను గ్రామస్థులు పిచ్చివాని కింద లెక్క గట్టారంటే ఆశ్చర్యమేముంది ?

బాగా దున్నిన పొలంలో నేరుగా విత్తులు చల్లితే మొలక బాగా ఉంటుందనటంలో సందేహం లేదు. కానీ వర్షం పడి నేలబురద బురదగా మారితే పొలంలోకి దిగి విత్తులు చల్లలేం. కాబట్టి విత్తే కార్యక్రమం వాయిదా పడుతుంది. నేను అనుసరించే విధానంలో ఇటువంటి ఇబ్బందులుండవు. నా విధానంలో విత్తుల్ని పిట్టలు, ఎలుకలు, పురుగులు తినే ప్రమాదముంది. దీనిని పరిష్కరించడానికి విత్తనాలకు మట్టి పట్టించి పెళ్ళలుగా చేస్తాను.

మామూలు పద్ధతిలో శీతాకాలపు పంటలను విత్తిన తరువాత మట్టితో కప్పాలి. విత్తనం మరీ లోతుగా పడితే కుళ్ళి పోతుంది. ఇలా కాదని చిన్నచిన్న కంతల్లో, చాళ్ళల్లో విత్తి, కప్పకుండా ఉంచిచూశాను. నా అనుభవంలో రెండు విధానాల్లోనూ ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి.

ఇటీవల నాకు బద్ధకం మరీ పెరిగిపోయింది. కంతలు, చాళ్ళు చెయ్యకుండా విత్తనానికి మట్టి పట్టించి నేరుగా పొలం మీద చల్లటం మొదలు పెట్టాను. పైన పడిన విత్తనాలకు ప్రాణ వాయువు బాగా అందటం వల్ల మొలక బాగా ఉంటుంది. గడ్డి కింద పడిన విత్తనం కూడా బాగా మొలకెత్తుతుంది. పెద్ద వాన పడినా ఈ విత్తనం కుళ్ళిపోదు.

గడ్డి కలుపును అదుపులో ఉంచుతుంది, పిట్టల సమస్యను తీరుస్తుంది.

బార్లీ పంట బాగా పండినప్పుడు పావు ఎకరం నుంచి 405 కిలోల గడ్డి లభిస్తుంది. ఈ గడ్డినంతటినీ తిరిగి అదే పొలంలో పరిస్తే నేలనంతటినీ కప్పుతుంది. ఇలా చేస్తే ఎంత మొండి కలుపైనా అదుపులో ఉంటుంది.

పిచ్చుకలు నాకు చాలా తలనొప్పి తెచ్చిపెట్టాయి. వీటిని ఎదుర్కోలేకపోతే నేరుగా విత్తే విధానం విజయవంతంకాదు. చాలా ప్రాంతాల్లో కేవలం పిట్టల సమస్యల వల్లే నేరుగా విత్తే విధానం వ్యాపించలేదు. పిట్టలతో బాధలనెదుర్కొంటున్న వాళ్ళకి నేను చెప్పేది తేలికగా అర్ధమవుతుంది.

ఒకవైపున మొదలు పెట్టి విత్తే పని పూర్తి అయ్యే లోపలే వెనుకనుంచి పిట్టలు తినేసిన సంధర్భాలున్నాయి. దిష్టి బొమ్మల్ని ఉపయోగించాను. వలలు ఉపయోగించాను. డబ్బాలో రాళ్ళువేసి మోగించి బెదర గొట్టాలని చూశాను. ఒక్కటీ పని చెయ్యలేదు. ఏదయినా పని చేసిందని సంబరపడితే ఒకటి రెండు పంటల తరువాత మళ్ళీ కథ మొదటికి వచ్చేది.

పొలంలో పంట ఉండగానే చల్లితే గడ్డిలోను, క్లోవరులోనూ పడి విత్తనం మరుగున ఉంటుంది. పంట కోసి నూర్చగానే తిరిగి గడ్డి పొలంలో పరవటం వల్ల కూడా విత్తనం మరుగున ఉంటుంది. ఈ విధంగా పిట్టల సమస్యను సమర్ధంగా ఎదుర్కోవచ్చని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్నాను.

నేను ప్రయోగాలు చేసిన పలు సంవత్సరాల్లో ఎన్నో తప్పులు చేశాను. ఎన్నోవైఫల్యాలను చవి చూశాను. పంటలు పండించేటప్పుడు ఏఏ తప్పులు జరగవచ్చో జపాన్‌లో కెల్లా నాకే బాగాతెలుసుననటం

అతిశయోక్తికాదు. అమెరికాను కనుగొన్నప్పుడు కొలంబస్ ఎంత సంతోషించాడో పొలం దున్నకుండా వరి, శీతాకాలపు పంటలను మొట్టమొదటిసారి విజయవంతంగా సాగుచేయగలిగినపుడు నేనూ అంత సంతోషించాను.

వరిసాగుకు ఎక్కువ నీళ్ళు అక్కరలేదు

ఆగస్టు మొదటి వారానికి పక్కపొలాల్లో వరి మొక్కలు నడుం ఎత్తు వరకు పెరిగి ఉంటాయి. నా పొలంలో మొక్కలు వీటికి సగం ఎత్తే ఉంటాయి. జూలై ఆఖరులో నా పొలం చూడటానికి వచ్చిన వాళ్ళందరికీ అనుమానమే. " ఫుకుఓకా గారూ! ఈ పొలం నుంచి మంచి దిగుబడులువస్తాయంటారా ?" అని అడుగుతారు. "తప్పకుండా ఏ మాత్రం దిగులు పడాల్సిన అవసరం లేదు" అని నేను బదులిస్తాను.

పెద్ద ఆకులతో త్వరగా ఎదిగే మొక్కల్ని పెంచటానికి నేను ప్రయత్నించను. మొక్కలు సాధ్యమయినంత పొట్టిగా ఉండాలని చూస్తాను. కంకి కూడా చిన్నదిగా ఉండాలి. ఎక్కువ ఎరువులు వేయకుండా వరిమొక్కలను తమ సహజ రూపంలో పెరగనిస్తాను.

మూడునాలుగు అడుగులు పెరిగిన వరి మొక్కలు పచ్చగా ఉండి చాలా ఎక్కువ దిగుబడినిస్తాయన్న అభిప్రాయాన్ని కలుగ చేస్తాయి. వీటిలో ఆకులు మాత్రమే బలంగా పెరుగుతున్నాయి. పిండి పదార్థాల ఉత్పత్తి ఎక్కువగానే ఉంటుంది. కానీ సమర్ధత లోపిస్తుంది. మొక్క ఎదగటానికే చాలా శక్తి ఖర్చవటం వల్ల గింజలో నిల్వ చేయటానికి కొంచమే మిగులుతుంది. ఉదాహరణకు ఏపుగా పెరిగిన వరి పైరు 900 కిలోల గడ్డినీ, 450-540 కిలోల ధాన్యాన్నీ ఇస్తుంది. నా పొలంలో

ఉన్నట్లు మొక్కలు పొట్టిగా ఉంటే గడ్డి దిగుబడి, ధాన్యం దిగుబడీ 900 కిలోలు ఉంటుంది. ఒక్కొక్క సారి పంట బాగున్నప్పుడు నా పొలంలో ధాన్యం దిగుబడి వరిగడ్డి దిగుబడి కంటే ఇరవైశాతం ఎక్కువ ఉంటుంది.

నీళ్ళు లేకుండా వరిసాగు చేసినప్పుడు వరి ఎత్తుగా పెరగదు. సూర్యరశ్మి అంతటా సమంగా పడి మొక్క మొదలుకూ, కింది ఆకులకూ కూడా సోకుతుంది. ఆరు వరి గింజలు తయారు కావటానికి ఆకులోని ఒక చదరపు అంగుళం వైశాల్యం అవసరం. మూడునాలుగు చిన్న ఆకులు ఉంటే వంద గింజలు పాలుపోసుకోగలుగుతాయి. నేను కొంచెం వత్తుగా విత్తుతాను. చదరపు



జూన్‌లో కొన్ని రోజులపాటు నీళ్ళు నిలకడితే కలుపూ, క్లోవరూ బలహీనమవుతాయి. వరి మొక్కలు పైకి రావటానికి అవకాశం దొరుకుతుంది.

గజంలో 250-300 కంకులు (20-25 దుబ్బులు) ఉంటాయి. మొక్కల్ని ఏపుగా పెంచటానికి బదులు ఎక్కువ మొక్కలు పెంచితే మంచి దిగుబడులు సాధించటం ఏమంత కష్టంకాదు. గోధుమ, రై, యవలు, ఇతర ధాన్యాలకు కూడా ఇది వర్తిస్తుంది.

వరి పైరు ఉన్నంత కాలం పొలంలో కొన్ని అంగుళాల లోతు నీరు నిలవ కట్టడం సాధారణ పద్ధతి. ఇది రైతులకు శతాబ్దాల తరబడి అలవాటయిపోయింది. వరి సాగుకు వేరేపద్ధతి ఉందంటే వీరు నమ్మరు. మాగాణికి ఉద్దేశించిన వరి రకాలు పొలంలో నీరు నిలవ కట్టినపుడు బాగానే పెరుగుతాయి. అయితే ఈ విధంగా వరిసాగు చెయ్యడం మంచిది కాదు. నేల నీటిని పట్టి ఉంచగలిగిన దాంట్లో 60 80 మాత్రమే నీరు పెట్టినపుడు వరి ఆరోగ్యంగా పెరుగుతుంది. నీరు నిల్వలేనప్పుడే వరి వేళ్ళుబలంగా వృద్ధిచెందుతాయి. మొక్క చీడపీడలను బాగా నిరోధించగలుగుతుంది.

కలుపు మొక్కల్ని అరికట్టాలని వరి పొలల్లో ముఖ్యంగా నీళ్ళు నిలవ కడతారు. నీళ్ళున్నప్పటికీ కొన్ని కలుపు మొక్కలు బతికుంటాయి. వీటిని నిర్మూలించడానికి ప్రతి పంట కాలంలోను పలుమార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. దీనికి చాలా సమయం పడుతుంది. పైగా నడుము పట్టేసే పని.

వర్షాలు పడుతున్నప్పుడు జూన్‌లో ఒకవారం పాటు నేను పొలంలో నీరు నిలవ కడతాను. ప్రాణవాయువు లోపించటంవల్ల చాలా కలుపుమొక్కలు వడలిపోతాయి. క్లోవరు కూడా వడలి పసుపు రంగుకు తిరుగుతుంది. దీనివల్ల క్లోవరు కొంత బలహీన మయ్యి వరి నిలదొక్కుకోటానికి అవకాశం లభిస్తుంది. పొలం నుంచి నీళ్ళు (సాధ్యమయినంత త్వరలో) తీసేస్తే క్లోవరు కోలుకొని పెరుగుతున్న వరిమొక్కల కింద పొలాన్నంతటినీ కప్పుతుంది. ఆ తరువాత నీటి యాజమాన్యానికి ప్రత్యేకంగా నేనేమి చెయ్యను. సగం పంటకాలం



పూర్తయ్యేవరకు అసలు నీరు పెట్టను. అతి తక్కువ వర్షం పడిన సంవత్సరాలలో కూడా గడ్డి, పచ్చిరొట్టపైరుకింద నేల తేమగా ఉంటుంది. ఆగస్టులో అప్పుడప్పుడు కొద్దిగా తడిపెడతాను. అంతే గాని నీళ్ళు నిలవ కట్టను.

నాపొలంలో నుంచి వరి మొక్కను ఏ రైతుకు చూపించినా అది

సరిగ్గా వరి మొక్క ఉండాల్సిన తీరులో ఉందని వెంటనే గుర్తిస్తారు. నాటు వెయ్యలేదనీ, సహజంగా మొలిచి పెరిగిందనీ చెప్పగలుగుతారు. నీరు నిలవ కట్టని మడిలో పెరిగిందనీ, రసాయనిక ఎరువులు దీనికి వేయలేదనీ తెలుస్తుంది. మొక్క తీరు, వేళ్ళ ఆకారం, కణువుల మధ్యదూరం చూసి ఏ రైతైనా ఈవిషయాలను తేలికగా చెప్పగలుగుతాడు. అసలు వరిమొక్క ఎలా ఉంటుందో ముందు తెలుసుకొంటే వివిధ వాతావరణ పరిస్థితుల్లో దీనిని సాధించటం ఏమంత కష్టమయిన పనికాదు.

పైనుంచి నాలుగవ ఆకు అన్నిటికంటే పొడవుగా ఉన్నపుడు వరిదిగుబడి ఎక్కువగా ఉంటుందని ఆచార్య మత్సుషిమా అభిప్రాయం. నేను దీనితో ఏకీభవించను. ఒక్కొక్కసారి పైనుంచి రెండవ, లేదా మూడవ ఆకు పొడవుగా ఉన్నపుడు మంచి ఫలితాలొస్తాయి. తొలిదశలో మొక్క ఎదుగుదలను అదుపులో ఉంచినపుడు సాధారణంగా పైనుంచి రెండవ లేదా మూడవ ఆకు పొడవుగా ఉండి, దిగుబడులు అధికంగా ఉంటాయి.

నారుమడిలో పెంచి నాట్లువేసి, ఎరువులు వేసి పెంచిన నాజూకు వరి మొక్కల పై జరిపిన ప్రయోగాల ఆధారంగా ఆచార్య మత్సుషిమా తన సిద్ధాంతం తయారు చేశారు. దీనికి విరుద్ధంగా పిచ్చిగా పెరుగుతున్నాయా అనిపించేంతగా వరి సహజ జీవిత చక్రాన్ని నాపొలం లోని వరి మొక్కలు అనుసరిస్తున్నాయి. అవి సహజరీతిలో పెరిగి, తయారయ్యే దాకా నేను ఓపికతో వేచి ఉంటాను.

గత కొద్ది సంవత్సరాలుగా దక్షిణాది నుంచి తెచ్చిన పాత వరిరకాన్ని సాగు చేస్తున్నాను. ఒక్కొక్కవిత్తనంనుంచి 12 పిలకలు పుడతాయి. ఒక్కొక్క కంకిలో 250 గింజలుంటాయి. పొలానికి అందే సూర్యరశ్మిని వినియోగించుకొని సిద్ధాంతరీత్యా సాధించగల అత్యధిక దిగుబడిని ఏదో ఒకరోజు ఈ రకంతో పండించగలనన్న

నమ్మకం నాకు ఉంది. ఇప్పటికే పొలంలో అక్కడక్కడా పావు ఎకరానికి 702.5 కిలోల చొప్పున దిగుబడి పొందుతున్నాను.

సాంకేతిక నిపుణుల అనుమానపు దృష్టికి నా విధానం తాత్కాలికంగా మంచి దిగుబడులనిస్తోందనిపించవచ్చు. అటువంటి వాళ్ళు "దీర్ఘకాలంలో ఏదో ఒక సమస్య రాకపోతుందా" అంటారు. నేను గత రెండు దశాబ్దాలనుంచి ఈ విధంగానే వరిసాగు చేస్తున్నాను. దిగుబడులలో మార్పు లేదు, నేల మాత్రం ఏ యేటి కా యేడు సారవంతం అవుతోంది.

పండ్ల తోట యాజమాన్యం

నా యింటికి దగ్గరగా ఉన్న కొండ వాలుల్లో చాలా రకాల చీనీ, బత్తాయి చెట్లను పెంచుతున్నాను. యుద్ధం తరువాత నేను వ్యవసాయం చేపట్టినపుడు పావు తక్కువ రెండు ఎకరాల చీనీ, బత్తాయి తోట, నలభై సెంట్ల వరిసాగు ఉండేది. ఇప్పుడు చీనీ బత్తాయి తోట కిందే 12.5 ఎకరాలు ఉన్నాయి. చుట్టుపక్కల సాగుచేయకుండా వదిలేసిన కొండవాలులను తిరిగి సాగు చెయ్యడం వల్ల ఇది సాధ్యమయ్యింది. దీనినంతటినీ నా చేతులతోనే సాగు చేశాను.

ఈ ప్రాంతాన్ని నేను సాగుకు చేపట్టటానికి కొన్ని సంవత్సరాల క్రితం దేవదారు చెట్లను నరికి వేశారు. కాంటూరు గట్ల మీద గుంతలు తవ్వి, చీనీ, బత్తాయి మొక్కలు నాటాను. నరికి వేసిన దేవదారు చెట్లు మళ్లీ ఇగురులు తొడగ నారంభించాయి. కాలం గడచిన కొద్దీ జపనీస్ పంపాస్ గడ్డి, కోగన్ గడ్డి, బ్రాకెన్[1] పెరగసాగాయి. రకరకాల మొక్కల మధ్య చీనీ బత్తాయి మొక్కలు కనపడకుండా పోయాయి.

చిగిర్చిన దేవదారు మొక్కలలో చాలా వరకు కొట్టేసి కొన్నింటిని మాత్రం గాలి నిరోధకాలుగా పెరగనిచ్చాను. ఒత్తుగా పెరుగుతున్న రకరకాల మొక్కల్ని నరికి క్లోవరు విత్తాను.


ఆరు, ఏడు సంవత్సరాల తరువాత చీనీ, బత్తాయి కాపుకు

1. ఫెర్న్ జాతికి చెందిన మొక్క. కొండ ప్రాంతాల్లో పెరుగుతుంది. లేత ఆకులను కూరగా వాడతారు.

వచ్చాయి. చెట్ల వెనక భూమిని చదును చేసి సమతలంలో ఉండే మడులు చేశాను. ఇంతకు ముందు అడవి మాదిరి ఉండేది. ఇప్పుడు ఇదికూడా పండ్లతోట మాదిరి కనబడుతోంది.

దుక్కి చేయవద్దు, రసాయనిక ఎరువులు వాడవద్దు, పురుగుల మందులూ, కలుపునాశిని మందులూ వాడవద్దు అన్న నాలుగు సూత్రాలను పొల్లు పోకుండా పాటించాను. ఇక్కడ ఒక ఆసక్తికరమయిన విషయం చెప్పాలి. ఒత్తుగా ఉన్న రకరకాల గడ్డి మొక్కల మధ్య పెరుగుతున్నంత కాలం చీనీ, బత్తాయిలకు ఎటువంటి పురుగూ ఆశించలేదు. గడ్డినీ, మొక్కల్నీ కత్తిరించిన తరువాతే పురుగుల సమస్య మొదలయ్యింది.

మొట్టమొదటినుండీ పండ్ల చెట్టును తనసహజ రూపాన్ని తీసుకోనివ్వటమే మంచిది. చెట్టు ప్రతి సంవత్సరం కాపుకు వస్తుంది. కొమ్మలు కత్తిరించే పని ఉండదు. చీనీ, బత్తాయి చెట్ల ఎదుగుదల కూడా దేవదారు చెట్ల మాదిరే ఉంటుంది. అంటే ప్రధాన కాండంమీద ఒకదాని తరువాత ఒకటి కొమ్మలు ఏర్పడి నలువైపులా విస్తరిస్తాయి. అట్లని అన్ని రకాల చీనీ, బత్తాయి చెట్లు ఒకే ఎత్తు, ఒకే ఆకారం కలిగి



ఉంటాయని కాదు. హస్సాకు, షాడ్డాక్ రకాలు పొడవుగా పెరుగుతాయి. శీతాకాలపు ఉన్షూ కమలా రకం చెట్లు పొట్టిగా గుబురుగా ఉంటాయి. సాత్సుమా రకం కమలా చెట్లు చిన్నగా ఉన్నపుడే కాపుకు వస్తాయి.

సహజ శత్రువులను చంపవద్దు

పండ్ల తోటలను సాధారణంగా ఆశించే పొలుసు పురుగులకు సహజ శత్రువులుంటాయని అందరికీ తెలుసు. కాబట్టి పొలుసు పురుగులను అదుపులో ఉంచటానికి పురుగుల మందులు వాడనవసరం లేదు. ఒకప్పుడు ఈ పురుగులను అరికట్టడానికి జపాన్‌లో పుసాల్ అనే మందును వాడేవారు. దీని వల్ల సహజ శత్రువులన్నీ అంతరించిపోయాయి. ఫలితంగా ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. పురుగుల సహజ శత్రువులను అంతరింప చేయటమంటే కోరి కష్టాలను తెచ్చుకోవటమని ఈ అనుభవంతో చాలామంది రైతులు గ్రహించారనుకొంటున్నాను.

పొలుసు పురుగునీ, నల్లినీ అదుపులో ఉంచటానికి మెషీన్ ఆయిల్ పిచికారి చెయ్యవచ్చు. ఇది సహజశత్రువులకు హానికరమయినది కాదు. ఆయిలును 200 నుంచి 400 రెట్ల నీళ్ళలో కలిపి నడివేసవిలో పలచగా పిచికారి చేసి ఊరుకోవాలి. దీనితో హానిచేసే పురుగుల, వాటి సహజశత్రువుల మధ్య సహజమయిన సమతూకస్థితి ఏర్పడుతుంది. ఆ తరువాత సమస్య దానంతట అదే పరిష్కారమవుతుంది. ఆర్గానో ఫాస్ఫరస్ వర్గానికి చెందిన పురుగుల మందులు[1] చల్లటం వల్ల సహజ శత్రువులు అంతరించిపోతాయి. ఆ తరువాత కేవలం మెషీన్ ఆయిలు పిచికారి చేసినా ప్రయోజనముండదు.

అట్లని హానికరం కాని ఉప్పు-వెల్లుల్లి ద్రవం, మెషీన్ ఆయిలు వంటి సేంద్రియ పురుగుల మందులను ఉపయోగించవచ్చని నా

1. ఉదా : పారాథియాన్, మలాథియాన్ డయాజినాన్ మొదలయినవి.

అభిప్రాయం కాదు. పురుగులను అరికట్టడానికి ప్రత్యేకంగా బయటనుంచి సహజ శత్రువులను తీసుకొచ్చి తోటలో వదలటం సైతం నాకు సమ్మతం కాదు. చెట్లు బలహీన పడినప్పుడే పురుగులు ఆశిస్తాయి. చెట్లు ఏ మేరకు సహజ రూపానికి భిన్నంగా ఎదుగుతుంటాయో ఆ మేరకు పురుగులు దాడి చేస్తాయి. ఒక చెట్టు అసహజంగా పెరుగుతున్నప్పుడు దానిని ఆ స్థితిలోనే వదిలేస్తే కొమ్మలు ఒకదానితో ఒకటి చిక్కుపడి పురుగుల బారిన పడతాయి. ఈ విధంగా కొన్ని ఎకరాల చీనీ, బత్తాయి తోటను నేను నష్టపోయిన సంగతి ఇంతకు ముందే వివరించాను.

అలాకాకుండా క్రమంగా చెట్లను సరిచేసుకొంటూపోతే అవి తిరిగి తమ సహజ రూపానికి చేరుకొంటాయి. చెట్లు ఆరోగ్యంగా ఉంటే సస్యరక్షణ చర్యల అవసరం ఉండదు. ఒక చెట్టును జాగ్రత్తగా నాటి, మొదటి నుంచీ సహజ రూపానికి అనుగుణంగా పెరగనిస్తే కొమ్మలు కత్తిరించే పని ఉండదు. ఎటువంటి మందులూ చల్లాల్సిన అవసరం ఉండదు. నర్సరీలోనే పండ్ల మొక్కలు కత్తిరించి ఉంటాయి, వేళ్ళు దెబ్బతిని ఉంటాయి. దీనివల్ల వీటికి మొదటినుంచీ కొమ్మల కత్తిరింపు అవసరమవుతుంది.

పండ్ల తోటలో భూమిని మెరుగుపరచటానికి నేను చాలా రకాల చెట్లను నాటి చూశాను. వాటిలోమోరిషిమాతుమ్మ ఒకటి. ఇది సంవత్సరం పొడుగునా పెరుగుతూ అన్ని కాలాల్లోచిగురు తొడుగుతుంది. ఈ చిగురుకు పేనుబంకఆశించి, బాగా వృద్ధిచెందుతుంది. పేనుబంకను తినడానికి లేడీబర్డ్ బీటిల్స్[1] వస్తాయి. తుమ్మ చెట్ల మీది పేనుబంకను

1. పెంకుజాతికి చెందిన పురుగు; గుండ్రంగా ఉండి, సాధారణంగా ఎరుపు మీద 2-6 నలుపు మచ్చలు కలిగి ఉంటుంది. రైతుకు మేలుచేసే పురుగుల్లో ముఖ్యమయినది.

తుడిచిపెట్టిన తరువాత ఇవి చీనీ, బత్తాయి చెట్ల మీదకు చేరి పేనుబంకనూ, హానికరమయిన ఇతర పురుగుల్నీ తింటాయి.

కొమ్మలు కత్తిరించకుండా, ఎరువులు వేయకుండా, రసాయనిక మందులు చల్లకుండా పండ్లు పండించటం కేవలం ప్రకృతి సహజ వాతావరణంలోనే సాధ్యమవుతుంది.

పండ్ల తోటలోని భూమి

భూసారాన్ని పెంచడం పండ్లతోట యాజమాన్యంలో ముఖ్యమని నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రసాయనిక ఎరువులు వాడినట్లయితే చెట్లు మరింత పెద్దగా పెరగవచ్చు కానీ భూమి ఏ ఏటికి ఆ ఏడు సారం కోల్పోతూ ఉంటుంది. రసాయనిక ఎరువులు నేలసారాన్ని పూర్తిగా పీల్చేస్తాయి. వీటిని ఒకతరం పాటు ఉపయోగిస్తే నేల చాలావరకు దెబ్బతింటుంది.

వ్యవసాయంలో భూసారాన్ని పెంపొందించటం కంటే సరయిన మార్గం మరొకటి లేదు. ఇరవై సంవత్సరాల క్రితం మొక్కన్నది లేకుండా ఈ కొండవాలులు ఎర్రగా ఉండేవి. గునపం పెట్టి పొడిచినా దిగనంత గట్టిగా నేల ఉండేది. ఈ ప్రాంతమంతా దాదాపు ఇలాగే ఉండేది. బంగాళాదుంప సాగు చేసి, నేలసారాన్ని పీల్చి పిప్పి చేసి పొలాలను వదిలి రైతులు వెళ్ళిపోయారు. ఇక్కడ పండ్ల చెట్లు, కూరగాయల సాగుకు బదులు నేల సారం పెంపొందించటానికి నేను పాటు పడ్డానని చెప్పవచ్చు.

బీడు వారిన ఈ కొండవాలులను ఎలా బాగు చేశానో తెలుసుకొందాం. యుద్ధం తరువాత పండ్లతోటల్లో లోతుగా దుక్కిచేసే విధానాన్ని, గోతులు తవ్వి సేంద్రియ పదార్థం వేయడాన్ని బాగా ప్రోత్సహించారు. పరిశోధన స్థానం నుంచి తిరిగి వచ్చిన తరువాత నేను కూడా ఈ పద్ధతిని అనుసరించాను. సంవత్సరాలు గడిచినా ఈ పద్ధతి వల్ల కాయకష్టం తప్ప నేలసారం వీసమెత్తు కూడా పెరగలేదు.

మొదట కొండ మీద నుంచి గడ్డి, ఫెర్న్ మొక్కలు మోసుకొచ్చి నేలలో పూడ్చి పెట్టాను. వీటిని కిందకు మోసే సరికి నడుము పట్టేసేది. ఈ విధంగా మూడు సంవత్సరాలు కష్టపడినా సేంద్రియ పదార్థం ఏమాత్రం ఏర్పడలేదు. గడ్డిగాదం వెయ్యటానికి తవ్విన పొడవాటి గోతుల అంచులు జారిపోయి పెద్ద పెద్ద గుంటల్లా అయ్యాయి.

ఆ తరువాత దుంగలను వేయటం మొదలుపెట్టాను. భూసారం మెరుగు పరచటానికి గడ్డి బాగా ఉపయోగపడుతుందనిపించవచ్చు.



"ఇరవై సంవత్సరాల క్రితం మొక్కన్నది లేకుండా ఈ కొండవాలులు ఎర్రగా ఉండేవి. గునపం పెట్టి పొడిచినా దిగనంత గట్టిగా నేల ఉండేది."

వాస్తవానికి దుంగలు మెరుగు. కొట్టి వెయ్యడానికి చెట్లున్నంతకాలం ఈ పద్ధతి ఫరవాలేదు. చెట్లు లేనప్పుడు ఎక్కడివాటినో నరికి మోసుకొచ్చే బదులు తోటలోనే వాటిని పెంచడం మేలు.

నా తోటలో దేవదారు చెట్లున్నాయి. కొన్ని బేరిపళ్ళచెట్లు (ఇంగ్లీషులో పియర్, హిందీలో నష్పతి), పెర్సిమాన్(తునికి చెట్టును పోలినది; పండ్లు తింటారు), జపనీస్ బెర్రి[1], ఇతర రకాల చెట్లున్నాయి. అన్నిటిలోకి ఆసక్తికరమైన చెట్టు మోరిషిమా తుమ్మ. ఇది ఆస్ట్రేలియా నుంచి జపాన్‌కు వచ్చింది. ఇంతకు ముందు పేనుబంక, లేడీబర్డ్ బీటిల్ పురుగుల సందర్భంలో ఈ చెట్టు గురించే చెప్పుకొన్నాం. దీని కలప చాలా గట్టిగా ఉంటుంది. ఆకులు పశువుల మేతగా ఉపయోగపడతాయి. పూలు తేనెటీగలను ఆకర్షిస్తాయి. పండ్ల తోటలో పురుగుల దాడిని అరికట్టడానికి సహకరిస్తుంది. గాలి నిరోధకంగా పని చేస్తుంది. వీటి వేళ్ళపై ఉండే రైజోబియం బ్యాక్టీరియా నేలను సారవంతం చేస్తాయి.

దీనంత వేగంగా పెరిగే చెట్టును నేను చూడలేదు. కొద్ది నెలల్లోనే వేళ్ళు చాలా లోతుకు పోతాయి. ఆరేడు సంవత్సరాలలో టెలిఫోను స్తంభమంత ఎత్తు పెరుగుతుంది. ఈ చెట్టు నత్రజనిని స్థిరీకరిస్తుంది. పావు ఎకరంలో ఆరునుంచి పది చెట్లు పెంచితే నేల లోపలి పొరలు కూడా సారవంతమవుతాయి. దుంగలను మోసుకొచ్చే పని తప్పుతుంది.

నేల పై పొరలు సారవంతం చెయ్యడానికి తెల్లక్లోవరు, ఆల్ఫాల్ఫా కలిపి చల్లాను. ఈ బీడు భూమిలో ఇవి నిలదొక్కుకోటానికి

కొన్ని సంవత్సరాలు పట్టింది. ఆ తరువాత ఇవి కొండ వాలుల్ని పచ్చటి పరుపుతో కప్పివేశాయి. జపనీస్ ముల్లంగి (డాయికాన్)ని కూడా నాటాను. దీని వేళ్ళు బాగా లోతుకు చొచ్చుకుపోతాయి. నేలలో గాలి ప్రసరణకూ, నీటి ప్రసరణకూ మార్గాలు ఏర్పరచటమే కాక సేంద్రియ పదార్థాన్ని అందజేస్తుంది. విత్తనం పడి దానంతట అదే తిరిగి మొలుస్తుంది. కాబట్టి ఒకసారి విత్తితే మళ్ళీ దీని గురించి పట్టించుకోనవసరం లేదు.

భూసారం పెరుగుతుండటంతో కలుపు మొక్కలు రాసాగాయి. ఏడెనిమిది సంవత్సరాలకు కలుపు మొక్కల్లో క్లోవరు కనపడకుండా పోయింది. వేసవి చివరిలో కలుపు మొక్కలు కోసివేసి క్లోవరు చల్లసాగాను. ఈ విధంగా కలుపూ, క్లోవరూ వత్తుగా పెరగటం వల్ల 25 సంవత్సరాల క్రితం ఎర్రగా, గట్టిగా బీడు బారి ఉన్న ఈ పొలం ఇప్పుడు నల్లగా, మెత్తగా, సేంద్రియ పదార్థంతో, వానపాములతో సారవంతంగా తయారయింది.

నేల పై పొరలను సారవంతం చెయ్యడానికి పచ్చిరొట్టపైరూ, లోపలి పొరలను సారవంతం చెయ్యటానికి మోరిషిమా తుమ్మ వేళ్ళు ఉండగా పండ్లతోటకి ఎరువుల అవసరం ఉండదు. చెట్ల మధ్య పొలాన్ని దున్నే అవసరం ఉండదు. ఒక అంచున పొడవాటి చెట్లు గాలి నిరోధకాలుగా పనిచేస్తున్నాయి. మధ్యలో చీనీ, బత్తాయి చెట్లు ఉన్నాయి. నేలను కప్పుతూ క్లోవరు, కలుపు మొక్కలున్నాయి. పండ్లతోట తన బాగోగులను తానే చూసుకొనేలా చేసి నేను హాయిగా విశ్రాంతి తీసుకొంటున్నాను.

---

1. ఇవన్నీ కొండవాలుల్లో, ఉప-ఉష్ణ మండలంలో పెరిగే పండ్ల చెట్లు. మన దేశంలో దిగువ హిమాలయపు కొండల్లోనూ, నీలగిరి కొండల్లోనూ ఈ రకాలూ, వీటిని పోలిన రకాలూ ఉన్నాయి.

అడవి మొక్కల మాదిరి కూరగాయల సాగు

ఇప్పుడు కూరగాయల సాగు గురించి తెలుసుకొందాం. ఇంటికి సరిపోయే కూరగాయలను పెరడులోనే కాయించవచ్చు. లేదా నిరుపయోగంగా, ఖాళీగా ఉన్న ప్రదేశాలలో కాయించవచ్చు.

పెరటితోటతో పెంటపోగు, సేంద్రియ ఎరువులతో సారవంతమయిన నేలలో ఏ కాలంలో కాసే కూరగాయలను ఆ కాలంలో కాయించాలి. ప్రకృతి మార్పులకూ, పరిణామాలకూ అనుగుణంగా ఒకప్పుడు కూరగాయల సాగు ఉండేది. పెరడులోని పండ్ల చెట్ల కింద పిల్లలు ఆటలాడుకొనేవారు. వంటింటి చెత్తను తిని పందులు పెరట్లో తిరిగేవి. కుక్కలు మొరుగుతూ పరుగులెత్తేవి. సారవంతమయిన నేలలో రైతు విత్తనం చల్లేవాడు. కూరగాయలతో పాటు పురుగులూ పెరిగేవి. కోళ్ళు పురుగుల్ని తిని గుడ్లుపెట్టేవి.

ఇరవై సంవత్సరాల క్రితం వరకు జపాన్ గ్రామీణ కుటుంబాల్లో పెరటి తోటలు ఈ విధంగా ఉండేవి.

కాలం బట్టి సాగు చేయటం ద్వారా, సేంద్రియ పదార్థాన్నంతా తిరిగి పొలంలో వేసి నేలను సారవంతంగా ఉంచడం ద్వారా, పంట మార్పిడి ద్వారా తెగుళ్ళను అదుపులో ఉంచేవారు. హానికరమయిన పురుగుల్ని చేతితో ఏరివేసేవారు, కోళ్ళూ తినేవి. దక్షిణ షికోకు ప్రాంతానికి చెందిన ఒక ప్రత్యేకమయిన కోడిజాతి మొక్కలకు హాని చెయ్యకుండా, తవ్వి పాడు చెయ్యకుండా కూరగాయలపైన ఉన్న పురుగుల్ని మాత్రమే తింటుంది.

పశువుల పెంట, మానవ మలం ఉపయోగించటం చాలా అనాగరికమయిన, అపరిశుభ్రమయిన పద్ధతని చాలామంది అనుకోవచ్చు. ఇవ్వాల్టి ప్రజలకు శుభ్రమయిన, కూరగాయలు కావాలి. అందుకని రైతులు అద్దాల ఇళ్ళలో అసలు మట్టేలేకుండా ఇసుక, మొరుం, నీటిలో కూరగాయలు పండిస్తున్నారు. ఈ ఇళ్ళకు వినైల్[1] తో చేసిన కప్పు ఉంటుంది. రసాయనిక పోషక పదార్థాలతో ఈ విధంగా పండించిన కూరగాయలు 'శుభ్రమయిన'వనీ, తినటానికి మంచివనీ



1. ఒక విధమయిన ప్లాస్టిక్ పదార్థం.

ప్రజలు భావించటం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. పురుగులూ, సూక్ష్మ జీవులూ, చీకుతున్న పశువుల పెంటతో సారవంతమయిన నేలలో పండించిన కూరగాయలకు మించి శుభ్రమయినవీ, ఆరోగ్యకరమయినవీ ఇంకేమి ఉండవు.

ఖాళీప్రదేశాల్లోనో, నది ఒడ్డునో, బంజరు భూముల్లోనో పిచ్చి మొక్కల్లాగా కూరగాయలు పండించే పద్ధతిలో విత్తుల్ని వెదజల్లి, కలుపుతో పాటు కూరగాయల మొక్కల్నీ పెరగనివ్వాలి. కొండవాలులో చీనీ, బత్తాయి చెట్ల మధ్య కూరగాయల్ని నేను ఈ విధంగానే సాగు చేస్తున్నాను.

ఏ మొక్కను ఏ కాలంలో విత్తాలో తెలుసుకోవటం అన్నిటి కంటే ముఖ్యం. వసంతకాలంలో కాసే కూరగాయలను శీతాకాలపు కలుపు మొక్కలు చనిపోతుండగా, ఇంకా వేసవి కలుపుమొక్కలు మొలవక ముందే విత్తాలి[1]. ఆకురాలే కాలంలో వేసవి కలుపు చనిపోతుండగా, శీతాకాలపు కలుపు రాకముందు విత్తులు చల్లాలి.

కొన్ని రోజులపాటు వానపడిన తరువాత విత్తటం మంచిది. కలుపు మొక్కల్ని కొద్దిగా కత్తిరించి కూరగాయల విత్తులు చల్లాలి. వీటిని మట్టితో కప్పనవసరం లేదు. కోసిన కలుపు మొక్కల్నే తిరిగి కప్పితే సరిపోతుంది. ఇలా కప్పిన గడ్డి విత్తుల్ని కోళ్ళ నుంచీ, పిట్టల నుంచీ రక్షిస్తుంది. కూరగాయల మొక్కలు బాగా పెరగటానికి సాధారణంగా

1. ఈ విధంగా కూరగాయలు పండించడానికి ఫుకుఓకా ఎన్నో ప్రయోగాలు చేశారు. చివరకు స్థానిక పరిస్థితులకు అనుగుణమయిన విధానాన్ని రూపొందించారు. ఆయన నివసిస్తున్న ప్రాంతంలో సంవత్సరం పొడుగునా కూరగాయలు పండించవచ్చు. వసంత కాలంలోనూ మంచి వర్షాలు పడతాయి. అనేక సంవత్సరాల అనుభవం వల్ల ఏ రకం కలుపు మొక్కల మధ్య ఏ రకం కూరగాయలు పెరుగుతాయో ఆయనకు తెలుసు. ఏ మొక్కలకు ఎటువంటి సంరక్షణ అవసరమో తెలుసు.

కలుపును రెండు - మూడు సార్లు కత్తిరించాల్సి ఉంటుంది. ఒక్కొక్కసారి ఒకసారితోనే సరిపోతుంది.

కలుపు మొక్కలు, క్లోవరు వత్తుగా లేని చోట వాటిని కత్తిరించకుండానే విత్తుల్ని చల్లవచ్చు. కొన్ని విత్తనాలను కోళ్ళు తిన్నా, చాలావరకు మొలుచుకొస్తాయి. పెంకు పురుగులూ, ఇతర పురుగులూ తిన్నగా నడుస్తాయి. విత్తనాలను చాళ్ళలో వరుసగా చల్లితే వీటిని పురుగులు తినేస్తాయి. ఒక మడి శుభ్రం చేసి విత్తినపుడు కోళ్ళన్నీ అక్కడకు చేరి కెలికివేస్తాయి. అందుకే విత్తుల్ని అక్కడక్కడా వెదజల్లటం సరయినదని అనుభవం ద్వారా తెలుసుకొన్నాను.

ఈ విధంగా పండించినపుడు కూరగాయలు చాలా పుష్టికరంగా ఉంటాయి. కలుపు మొక్కల కంటే కూరగాయ మొక్కలు ముందు మొలిచినప్పుడు కలుపు వల్ల హాని జరగదు. బచ్చలి, కారట్ వంటివి తేలికగా మొలకెత్తవు. వీటి విత్తుల్ని ఒకటి రెండు రోజులు నానబెట్టి మట్టి పెళ్ళలో పెట్టి విత్తాలి.

జపనీస్ ముల్లంగి, టర్నిప్[1] వసంతకాలపు ఆకుకూరలను కొంచెం వత్తుగా విత్తితే ఇవి శీతాకాలపు కలుపు మొక్కల్నీ, వసంత కాలపు తొలి కలుపు మొక్కల్నీ బాగా ఎదుర్కొంటాయి. ప్రతిసారి కొన్నింటిని కోయకుండా వదిలేస్తే ఇక ఏటా విత్తనాలు వాటంతట అవే మొలుచుకొస్తాయి. ఇలా మొలిచిన కూరగాయలు ఒక విశిష్టమయిన రుచిని కలిగి ఉంటాయి. తినటానికి చాలా బాగుంటాయి.

కొండవాలుల్లో అక్కడక్కడా రకరకాల కూరగాయలు పెరగటం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. జపనీస్ ముల్లంగి, టర్నిప్ సగం నేలలోనూ, సగం నేలపైనా పెరుగుతుంటాయి. కారట్, బర్డాక్ పొట్టిగా, లావుగా ఊరి చాలా వేళ్ళు ఉంటాయి. ఇవి కొంచెం వగరుగా

1. ఒక విధమయిన దుంప. హిందీలో 'షల్జమ్' అంటారు.

ఉంటాయి. ఈ రకాల అడవి మొక్కల[1] రుచి కూడా ఇలాగే ఉండి ఉంటుందని నా అభిప్రాయం. వెల్లుల్లి, జపనీస్ ఉల్లి, చైనీస్ వెల్లుల్లి వంటివి ఒకసారి విత్తితే చాలు, విత్తనం పడి ప్రతి సంవత్సరం అవే మొలుస్తాయి.

కాయధాన్యపు రకాలను నాటడానికి వసంతకాలం అనువయిన సమయం. అలసందలు, చిక్కుళ్ళు సాగు చేయటం తేలిక. అధిక



1. ప్రస్తుతం సాగులో ఉన్న రకాలన్నీ అడవి రకాలనుంచి పరిణామం చెందినవే. పిచ్చిమొక్కల లాగా పెంచిన కూరగాయలు వీటి తాలూకూ అడవి రకాలూ ఒకే రుచి కలిగి ఉంటాయని ఫుకుఓకా అంటున్నారు.

దిగుబడుల నిస్తాయి. బఠాణి, సోయాచిక్కుడు వంటివి సాగు చేసేటప్పుడు కలుపు కంటే ముందు మొలక వచ్చేలా చూడటం ముఖ్యం. సరిపడా వాన పడందే ఇవి తేలికగా మొలవవు. ఈలోగా విత్తుల్ని పిట్టలూ, పురుగులూ తినకుండా ఒక కన్నేసి ఉంచాలి.

టొమాటొ, వంగ మొక్కలు చిన్నవిగా ఉన్నపుడు కలుపుతో పోటీ పడలేవు. కాబట్టి వీటిని వేరేగా నారుమడిలో పెంచి తరువాత అవసరమయిన చోట నాటాలి. టొమాటొ మొక్కల్ని నిలబెట్టి వాటికి ఊతంగా కర్రని కట్టే బదులు కింద పాకనివ్వటమే మంచిది. ప్రధానమయిన కొమ్మ మీద కణుపుల దగ్గర వేళ్ళు పుట్టి కొత్త కొమ్మలు వేసి, కాయలు కాస్తాయి.

దోసజాతిలో నేలమీద పాకే రకాలు మంచివి. మొక్కలు చిన్నవిగా ఉన్నపుడు మొదట్లో గడ్డిని కత్తిరిస్తూ కొంత సంరక్షణ చెయ్యాలి. ఆ తరువాత అవి ఏపుగా పెరుగుతాయి. వాసాలు లేదా చెట్ల కొమ్మలను నేలపై పరిస్తే తీగ వాటి మీద అల్లుకొంటుంది. కాయలు నేలను తాకవు కాబట్టి కుళ్ళిపోవు. పుచ్చకాయలు, ఇతర తీగజాతులను ఈ విధంగా సాగుచేయవచ్చు.

బంగాళాదుంప, చేమ చాలా బలమయిన మొక్కలు. ఒక్కసారి నాటి, దుంప తవ్వేటప్పుడు కొంత నేలలో వదిలి పెడితే ప్రతి సంవత్సరం అదే ప్రాంతంలో మళ్ళీ మళ్ళీ పుట్టుకొస్తాయి. కలుపు అల్లుకుపోదు. నేల బాగా గట్టిగా ఉంటే ముందు జపనీస్ ముల్లంగిని పండించాలి. వీటి వేళ్ళు నేలను గుల్లబరుస్తాయి. కొంతకాలం తరువాత ఆ ప్రాంతంలో బంగాళా దుంప పండించవచ్చు.

కలుపును అదుపులో ఉంచటానికి తెల్లక్లోవరు ఉపయోగ పడుతుందని అనుభవంతో తెలుసుకొన్నాను. ఇది వత్తుగా పెరిగి ఎంతటి మొండి కలుపు మొక్కలనయినా అదుపులో ఉంచుతుంది.

కూరగాయలు విత్తనాలతో పాటు తెల్లక్లోవరు విత్తనాలు కలిపి చల్లితే ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. నేలను కప్పి ఉంచి తేమను కాపాడుతుంది. నేలపొరల్లోకి గాలి చొరబడేలా చేస్తుంది. నేలను సారవంతం చేస్తుంది.

కూరగాయల మాదిరే క్లోవరు విత్తనం చల్లటానికి అనువయిన సమయం ఎన్నుకోవటం చాలా ముఖ్యం. వేసవి చివరిలోనో, ఆకురాలే కాలంలోనో విత్తటం మంచిది. శీతాకాలంలో వేళ్ళు బాగా పెరిగి వసంతంలో మొక్క బాగా పుంజుకొని కలుపును ఎదుర్కో గలుగుతుంది. వసంతం ఆరంభంలో విత్తినపుడు కూడా క్లోవరు బాగా వస్తుంది. క్లోవరు విత్తనాన్ని వెదజల్లవచ్చు, లేదా అడుగు దూరం వరుసల్లో విత్తవచ్చు. ఒకసారి క్లోవరు నిలదొక్కు కొన్న తరువాత మళ్ళీ అయిదారు సంవత్సరాల వరకు విత్తే పని ఉండదు.

ఖాళీగా, నిరుపయోగంగా ఉన్న భూమిలో సాధ్యమయినంత సహజంగా కూరగాయలను పండించటమే ఈ విధానం ముఖ్య ఉద్దేశం. మెరుగయిన సాంకేతిక పద్ధతులను ఉపయోగించటానికో, అధిక వెగుబడులను సాధించటానికో జరిగే ప్రయత్నాలన్నీ చివరకు విఫలమవుతాయి. చాలా సందర్భాల్లో పురుగులూ, తెగుళ్ళ వల్ల సమస్యలు ఎదురవుతాయి. రకరకాల మూలికలూ, కూరగాయలూ కలిపి సహజ వృక్ష జాలం మధ్య పెంచినపుడు పురుగులూ, తెగుళ్ళ వల్ల నష్టం చాలా తక్కువగా ఉంటుంది. మందులు పిచికారి చేయాల్సిన అవసరం ఏ మాత్రం ఉండదు. పురుగుల్ని చేతితో ఏరాల్సిన పనీ ఉండదు.

కలుపు మొక్కలు పెరుగుతున్న అన్ని ప్రాంతాల్లోనూ కూరగాయలూ పండించవచ్చు. ఏఏ రకం కలుపు మొక్కలు, ఏఏ రకం కూరగాయలు ఏ కాలంలో మొలుస్తాయో, ఎప్పుడు కాస్తాయో బాగా

తెలిసి ఉండాలి. ఏ రకం కలుపు మొక్కలు ఉన్నాయి, ఎలా పెరుగుతున్నాయి అనేదాన్ని బట్టి అక్కడి నేలసారం గురించీ, పోషక పదార్థాల లోపం గురించీ తెలుసుకోవచ్చు.

నా పండ్లతోటలో పిచ్చి మొక్కల మాదిరి బర్డాక్, కాబేజి, టొమాటొ, కారెట్, ఆవాలు, చిక్కుళ్ళు, టర్నిప్, రకరకాల మూలికలు, ఇతర కూరగాయలు పండిస్తున్నాను.

రసాయనాలు వదిలి పెట్టడానికి షరతులు

జపానులో వరిసాగు ఇప్పుడు కీలకమయిన కూడలిలో ఉంది. ఏ దిశలో పయనించాలో తెలియక రైతులూ, శాస్త్రజ్ఞులూ తికమకపడుతున్నారు. ఒక మార్గం వరి నాట్లు వేసే విధానం. రెండవది నేరుగా విత్తే విధానం. నేరుగా విత్తే విధానం ఎన్నుకొంటే పొలం దున్నాలా, దున్నవసరం లేదా అన్న సమస్య ఉంది. పొలం దున్నకుండా నేరుగా విత్తటం ఉత్తమమయినదని నేను గత ఇరవై సంవత్సరాల నుండీ చెబుతున్నాను.ఓకాయామా ప్రాంతంలో ఈ విధానం బాగా విస్తరిస్తోంది.

రసాయనాలు లేకుండా వ్యవసాయం చేస్తే దేశానికి సరిపోయే ఆహారం ఉత్పత్తి చేయలేమని కొందరి అభిప్రాయం. వరిలో ప్రధాన సమస్యలయిన కాండం కుళ్ళే తెగులు, అగ్గి తెగులు, బాక్టీరియా వల్ల వచ్చే ఆకు ఎండే తెగులు నివారించడానికి తప్పనిసరిగా రసాయనాలు వాడాలని వీళ్ళు అంటారు. బలహీనంగా ఉండే 'అధిక దిగుబడి' వంగడాలు విత్తకుండా, ఎక్కువ నత్రజని వెయ్యకుండా, సాగునీటిని తగ్గించి వేళ్ళు బలంగా పెరిగేలా చేస్తే ఈ తెగుళ్ళు మటుమాయమవుతాయి. రసాయనాలు పిచికారి చెయ్యాల్సిన అవసరమే ఉండదు.

మొదట్లో నా పొలం ఎర్ర బంక మట్టితో బలహీనంగా ఉండి వరి సాగుకు అనువుగా ఉండేది కాదు. తరచు గోధుమరంగు మచ్చ తెగులు ఆశించేది. పొలం సారవంతమయిన కొద్దీ ఆకుమచ్చ తెగులు ఉద్ధృతం తగ్గుతూ వచ్చింది. ఇటీవల కాలంలో ఈ తెగులు అసలు ఆశించనే లేదు.

పురుగుల విషయంలో సహజ శత్రువులను చంపకపోవటం చాలా ముఖ్యం. పొలంలో ఎప్పుడూ నీళ్ళు నిల్వ కట్టి ఉంచడం, లేదా కలుషిత నీరు ఉపయోగించడంవల్ల పురుగుల సమస్య ఎక్కువవుతుంది. పొలానికి నీళ్ళు తక్కువగా పెట్టడం ద్వారా తీవ్ర సమస్య అయిన దోమకాటు (సుడి తెగులు)ను కూడా అదుపులో ఉంచవచ్చు.

చలికాలంలో ఆకుపచ్చ దోమ కలుపు మొక్కల్లో బతుకుతుంది. ఇది వైరస్ తెగుళ్ళను వ్యాప్తి చేస్తుంది. దీని వల్ల అగ్గితెగులు ఆశించి 10 నుంచి 20 శాతం పంట నష్టమవుతుంది. మందులు పిచికారి చెయ్యని పొలంలో సాలీడు పురుగులు పెరిగి దోమను ఆరికడతాయి. ఏ మాత్రం తేడా వచ్చినా సాళ్ళ సంఖ్య తగ్గిపోతుంది. అందుకే ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

రసాయనిక ఎరువులూ, పురుగుల మందులూ వాడకపోతే ఇప్పుడున్న దాంట్లో నూరవ వంతు దిగుబడి మాత్రమే ఉంటుందని చాలా మంది అభిప్రాయం. పురుగుల మందులు వాడటం మానేసిన తొలి సంవత్సరంలో పురుగుల వల్ల నష్టం 5 శాతం పెరుగుతుందని నిపుణుల అంచనా. రసాయనిక ఎరువులు వాడకపోవటం వల్ల మరో 5 శాతం దిగుబడి తగ్గుతుందనుకోవచ్చు.

అంటే వరిసాగులో నీటి వాడకాన్ని తగ్గించి, వ్యవసాయ సహకార సంఘాలు ప్రోత్సహిస్తున్న రసాయనిక ఎరువులూ, పురుగుల మందులూ వాడటం మానేసిన మొదటి సంవత్సరం దిగుబడులు పది శాతం దాకా తగ్గుతాయి. తొలి సంవత్సరం నష్టం తరువాత ప్రకృతి తిరిగి కోలుకునే శక్తి అందరి ఊహలను మించి పోతుంది. తరువాత సంవత్సరాలలో మొదట ఉన్నదానికంటే ఎక్కువ దిగుబడులు వస్తాయి.

కోచి పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్నపుడు కాండం తొలిచే పురుగులపై పరిశోధనలు చేశాను. ఈపురుగు కాండం లోపలకు చేరి తొలుచుకు తినటంవల్ల కాండం ఎండిపోయి తెల్లబడుతుంది. తెల్లబడ్డ



పండ్లతోటలో ఒక గుడిసె

మొక్కలను లెక్క పెట్టడం ద్వారా నష్టాన్ని అంచనా వేయవచ్చు. వంద మొక్కలకు ఎన్ని మొక్కలు తెల్లబడ్డాయో లెక్క కడతారు. పురుగు ఉద్ధృతంగా ఉండి పంటంతా నాశనమయ్యిందనిపించేటప్పుడు కూడా నష్టం 30 శాతానికి మించి ఉండదు.

ఒక మడిలో కాండం తొలిచే పురుగులను చంపటానికి మందులు చల్లాం. ఇంకో మడిని అలాగే వదిలివేశాం. పరిశోధనలు ముగిసి ఫలితాలు చూస్తే మందులు వాడని పొలంలో ఎక్కువ మొక్కలు ఎండిపోయినట్లనిపించినప్పటికీ ఎక్కువ దిగుబడి వచ్చింది. మొదట్లో నేను దీనిని నమ్మలేకపోయాను. ప్రయోగంలో ఎక్కడయినా పొరపాటు జరిగి ఉంటుందనుకొన్నాను. కానీ ప్రయోగమంతాసరిగా ఉండటంతో లోతుగా పరిశీలించసాగాను.

నిజానికి ఏమి జరిగిందంటే కాండం తొలిచే పురుగులు బలహీనమయిన మొక్కలపై దాడిచేసి ఒక విధంగా పొలాన్ని పలచన చేశాయి. కొన్ని మొక్కలు ఎండిపోవడంతో మిగిలిన మొక్కలకు మరింత స్థలం దొరికింది. కింద ఆకులకు కూడా సూర్యకాంతి ప్రసరించసాగింది. మిగిలి ఉన్న వరి దుబ్బులు చాలా బలంగా పెరిగి

ఎక్కువ పిలకలు వేసి, కంకిలో మామూలు కంటే ఎక్కువ గింజలు వేశాయి. పురుగులు ఆశించనప్పుడు మొక్కలు వత్తుగా ఉండి పొలం పచ్చగా కనపడుతుంది కానీ చాలా సందర్భాలలో దిగుబడి తక్కువగా ఉంటుంది.

రకరకాల పురుగుల మందుల పనితీరుపై పరిశోధన కేంద్రాలు చేసిన ప్రయోగ ఫలితాలను ప్రకటిస్తుంటారు. కానీ అన్ని ఫలితాలూ ప్రకటితం కావు. అబద్ధాలు ప్రకటిస్తారని కాదు. మందులు తయారు చేసే కంపెనీలు ఇచ్చే ప్రకటనలు చూస్తే ఏదో కప్పిపుచ్చే ప్రయత్నంలో ఉన్నారనిపిస్తుంది. కాండం తొలిచే పురుగులపై నేను జరిపిన ప్రయోగాల్లో లాగా తక్కువ దిగుబడి వచ్చిన ఫలితాలను పొరపాట్లుగా తీసేస్తారు. అంటే పురుగుల మందులు వాడినప్పుడు దిగుబడులు తగ్గిన సందర్భాలను చాలా అరుదుగా ప్రకటిస్తారు.

రైతులు వాడుతున్న రసాయనాల్లో కలుపునాశిని మందులు మాన్పించటం అన్నిటికంటే కష్టం. తరతరాలనుండి రైతు 'కలుపు మొక్కలతో యుద్ధంలో' మునిగి ఉన్నాడు. పొలం దున్నడం, అంతరకృషి, వరినాట్లు – ఇవన్నీ కలుపును అరికట్టడానికి చేపట్టిన పద్ధతులే. కలుపునాశిని మందులు రాకముందు రైతు ప్రతి పంటకాలంలోనూ నిల్వ నీళ్ళలో వరిచాళ్ళ మధ్య కలుపునివారణ పరికరంతో పైకి కిందకీ కొన్ని వందలసార్లు తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో కలుపునాశిని మందులను దేవుడిచ్చిన వరంగా భావించటం ఆశ్చర్యం కలిగించదు. పంట నూర్చిన తరువాత గడ్డిని తిరిగి పొలంలో పరిచి, క్లోవరు పెంచి, నీళ్ళు తక్కువగా పెట్టడం ద్వారా కలుపు మొక్కల్ని తేలికగా అదుపు చేసే పద్ధతిని నేను కనుగొన్నాను. కలుపు నివారిణి పరికరం తీసుకొని ఎండలో వరి చేనులో చాళ్ళ మధ్య నడుం విరిగేలా నడవాల్సిన పనిలేదు. కలుపునాశిని మందులు చల్లాల్సిన అవసరం అంతకాన్న లేదు.

శాస్త్రీయ పద్ధతి – పరిమితులు

పరిశోధకులయ్యే ముందు ఎవరయినా సరే తత్వవేత్తలు కావాలి. మానవ లక్ష్యం ఏమిటి? మానవాళి ఏమి సృష్టించాలి ? అన్న విషయాలు పరిశీలించాలి. జీవనానికి మనిషి దేని మీద ఆధారపడి ఉన్నాడో డాక్టర్లు ముందు నిర్ణయించాలి.

నా సిద్ధాంతాన్ని వ్యవసాయానికి అన్వయించటంలో రకరకాల ప్రయోగాలు చేశాను. ప్రకృతికి సాధ్యమయినంత దగ్గరగా ఉండే విధానాన్ని రూపొందించటమే నా ఉద్దేశం. అనవసరమయిన వ్యవసాయ పనులన్నీ వదిలి పెడుతూ చివరకు గమ్యం చేరుకొన్నాను.

ఆధునిక శాస్త్రీయ విధానానికి ఒక దృక్పథం అంటూ లేదు. గుడ్డెద్దు చేనులో పడ్డట్టు పరిశోధనలు చేస్తుంటారు. దిగుబడులను ప్రభావితం చేసే వందలాది కారణాల్లో ఒక్కొక్క కారణాన్ని పట్టుకుని ఒక్కొక్క పరిశోధకుడు వేలాడుతుంటాడు. దిగుబడిని ప్రభావితం చేసే కారణాలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి, ఒక సంవత్సరం నుంచి మరో సంవత్సరానికి మారుతుంటాయి.

ఆధునిక పరిశోధన ప్రకృతిని చిన్న చిన్న ముక్కలుగా చేసి ప్రయోగాలు చేస్తుంది. ఇవి ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండవు. రైతు సమస్యలతో పొంతన ఉండదు. ప్రయోగ ఫలితాలు కూడా రైతు అవసరాలకు అనుగుణంగా కాక పరిశోధకులకు అనువుగా అమర్చి ఉంటాయి. ఈ ఫలితాలను రైతుల పొలాల్లో

విజయవంతంగా అమలు చేయవచ్చనుకొంటే పొరపాటే అవుతుంది.

మొక్కల్లో జరిగే జీవన ప్రక్రియ (మెటబాలిజం)కీ, వరి దిగుబడులకూ మధ్య సంబంధాన్ని వివరిస్తూ ఎహైమ్ విశ్వవిద్యాలయం లో పని చేస్తున్న ఆచార్య త్సునో ఇటీవల ఒక పెద్ద పుస్తకం రాశారు. ఈయన తన విద్యార్థులతో తరచు నా పొలాలకు వస్తుంటారు. నేల తవ్వి ఎలా ఉందో చూస్తారు, సూర్యకిరణాలు ఏ కోణంలో పడు తున్నాయో పరిశీలిస్తారు. ప్రయోగశాలలో విశ్లేషించటానికి కొన్ని మొక్కలు తీసుకువెళతారు. "తిరిగి వెళ్ళిన తరువాత పొలం దున్నకుండా, నేరుగా విత్తే విధానం ప్రయత్నించి చూస్తారా?" అని నేనడుగుతుంటాను. ఆయన నవ్వేసి "నా పని పరిశోధనల వరకే. ఆచరణ నీకు వొదిలేస్తున్నాను" అని వెళ్ళిపోయేవారు.

మొక్క జీవన ప్రక్రియ ఎలా ఉందో పరిశీలిస్తావు. నేల లోంచి పోషక పదార్థాలను తీసుకొనే సామర్థ్యం గురించి అధ్యయనం చేస్తావు. ఒక పుస్తకం రాస్తావు. వ్యవసాయశాస్త్రంలో డాక్టరేటు పట్టా పుచ్చుకొంటావు. నీ సిద్ధాంతానికీ, వాస్తవ దిగుబడులకూ మధ్య సంబంధం ఉందా అని అడిగితే "ఆ ఒక్కటి మాత్రం అడగకు" అంటావు.

ఉష్ణోగ్రత 29 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉన్నపుడు అన్నిటికంటే పై ఆకు ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రభావితం చేసే తీరును వివరించ గలిగినప్పటికీ ఉపయోగం ఏమిటి? 29 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత లేని ప్రాంతాలున్నాయి. ఎహైమ్‌లో ఈసంవత్సరం ఉష్ణోగ్రత 29 డిగ్రీలుంటే వచ్చేసంవత్సరం 24 డిగ్రీలుండవచ్చు. మొక్కజీవన ప్రక్రియ పెరిగితే పిండి పదార్థాల ఉత్పత్తి పెరిగి దిగుబడి పెరుగుతుందను కొంటే పొరబడినట్లే. స్థానిక భౌగోళిక పరిస్థితులు, నేలపొరలు,మట్టితీరు, మురుగునీరు పోయేసౌకర్యం, సూర్యరశ్మి ప్రసరణ, పురుగుల మధ్య

సంబంధాలు, ఉపయోగించిన విత్తనం ఇలా చెప్పు కొంటూ పోతే ఎన్నో కారణాలుంటాయి. ఇవన్నీ కలిసి దిగుబడులను ప్రభావితం చేస్తాయి. అన్ని కారణాలనూ లెక్కలోకి తీసుకొని శాస్త్రీయ పద్ధతిలో ప్రయోగం చేపట్టడం అసాధ్యం.

"వరి అధికోత్పత్తి ఉద్యమం" అనీ, "హరిత విప్లవ"మనీ ఇటీవల ఎక్కువగా వినబడుతోంది. బలహీనంగా ఉండే "అభివృద్ధి పరిచిన" వంగడాలపై ఈ విధానాలు ఆధారపడి ఉన్నాయి. అందుకే రైతులు ఒక పంటకాలంలోనే 8-10 సార్లు రసాయనాలూ, పురుగుల మందులూ పిచికారిచేయవలసి వస్తోంది. దీని వల్ల అతితక్కువ కాలంలోనే నేలలో ఉన్న సేంద్రియ పదార్థం, సూక్ష్మ జీవులూ అంతరించి పోతున్నాయి. నేల జవమూ, జీవమూ కోల్పోవటంవల్ల పంటలకు రసాయనిక ఎరువుల రూపంలో వేసే పోషక పదార్థాలు తప్పని సరి అవుతాయి.

"శాస్త్రీయ" పద్ధతులు అవలంబించినపుడు మంచి ఫలితాలు వచ్చాయనిపిస్తుంది. నేలసహజ సారాన్ని పీల్చి పిప్పి చెయ్యకపోతే శాస్త్రీయ పద్ధతుల సహాయం అక్కరలేదు.

నేను పంట నూర్చిన తరువాత గడ్డిని తిరిగి పొలంలో పరుస్తాను. క్లోవరు సాగు చేస్తాను. సేంద్రియ పదార్థం మొత్తంతిరిగి నేలకు అంద చేస్తాను. వరి, శీతాకాలపు ధాన్యాలను సంవత్సరాలతరబడి సాగు చెయ్యడానికి భూమికి కావలసిన పోషక పదార్థాలన్నీ ఈచర్యల ద్వారా లభిస్తున్నాయి. దున్నటం వల్లా, రసాయనాల వాడకం వల్లా నిస్సారమయిన భూములను ప్రకృతి సేద్యం ద్వారా పునర్జీవింప చేయవచ్చు.

III



ఒక రైతు అభిప్రాయం

జీవావరణం క్షీణించి పోవడం, ఆహారం కలుషితం కావటంవల్ల జపాన్‌లో ఇటీవల ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది మెచ్చుకోదగినది. రాజకీయ నాయకులూ , పారిశ్రామిక వేత్తలూ ఈ విషయం పట్టించుకోకపోవడం వల్ల ఆగ్రహం చెందిన ప్రజలు ఘెరావులు చేశారు. పెద్ద ఎత్తున ప్రదర్శనలు నిర్వహించారు. కానీ ప్రస్తుతం ఉన్న తీరులోనే ప్రజల ఆందోళన కొనసాగితే ఆ శ్రమంతా వృధా అవుతుంది. మూలకారణాలను పట్టించు కోకుండా కాలుష్యానికి గురయిన ప్రాంతాలను శుభ్రపరచాలని కోరటం రోగానికి కాకుండా రోగలక్షణాలకు వైద్యం చేయటమవుతుంది.

ఉదాహరణకు కాలుష్యం గురించి చర్చించడానికి రెండు సంవత్సరాల క్రితం జరిగిన సమావేశాన్నే చూడండి. వ్యవసాయ యాజమాన్య పరిశోధన కేంద్రం, సేంద్రియ వ్యవసాయ సంఘం, 'నాడా' సహకార సంఘం సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహించాయి. జపనీస్ సేంద్రియ వ్యవసాయ సంఘనాయకుడయిన టెరువో ఇచి రాకు ఈ సమావేశానికి అధ్యక్షతవహించారు. ప్రభుత్వ సహకార సంఘంలో ఈయన ఉన్నత పదవిలో ఉన్నారు. ఏ పంటలను పండించాలి, ఏ రకాలమపండించాలి, ఎరువులు ఎంత వాడాలి, ఏ రసాయనాలను ఉపయోగించాలి అన్న విషయాల్లో ఈ సంఘ సిఫారసులనే జపాను లోని రైతులందరూ దాదాపుగా ఆచరిస్తారు.

ఎంతోమంది ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొనడం వల్ల కాలుష్యనివారణకు ముఖ్యమయిన నిర్ణయాలు తీసుకొంటారనీ, వీటిని అమలులో పెడతారనీ ఆశతో నేను వెళ్ళాను.

ఆహార పదార్ధాలలో కల్తీ గురించి ప్రచారం చేయటంలో ఈ సమావేశం విజయవంతమయ్యిందనే చెప్పాలి. కానీ ఇతర సమావేశాల్లో మాదిరే ఇక్కడ కూడా కలుషిత ఆహారం గురించి తమ పరిశోధనలతో కూడుకొన్న సాంకేతిక పత్రాలను ఒకరి తరువాత ఒకరు చదువు కొంటూ పోయారు.

ట్యూనా చేపలు పాదరసం (మెర్క్యురీ) కాలుష్యానికి గురవటం గురించి మాట్లాడిన మత్స్య శాఖ ప్రతినిధి విషయమే తీసుకోండి. మొదట అతను కాలుష్యం గురించి వివరించాడు. ఆరోజుల్లో పాదరసం కాలుష్యం గురించి వార్తాపత్రికల్లోనూ, రేడియోలోనూ విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ఇతను ఏమి చెపుతాడోనన్న ఆసక్తితో అందరూ ఉన్నారు.

ఉత్తర,దక్షిణ ధృవ ప్రాంతాల్లో పట్టిన ట్యూనా చేపల్లో సైతం పాదరసం మోతాదు చాలా ఎక్కువగా ఉందని అతను చెప్పాడు. అయితే వందల ఏళ్ళ క్రితం పట్టి, ప్రయోగ శాలలో నిల్వ ఉంచిన ట్యూనా చేపను కోసి విశ్లేషించి చూసినపుడు దాని శరీరంలోనూ పాదరసం ఉందట. చేపలు బతకటానికి పాదరసం అవసరమేమోనన్న అభిప్రాయాన్ని అతను కలిగించాడు.

శ్రోతలు అయోమయంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకొన్నారు. జీవావరణ కాలుష్యాన్ని ఎట్లా ఎదుర్కోవాలో దానిని ఎట్లా సరి చెయ్యాలో నిర్ణయించటానికి ఈ సమావేశం ఏర్పాటయ్యింది. కాని మత్స్యశాఖ ప్రతినిధి ట్యూనా చేపల మనుగడకు పాదరసం అవసరమని చెబుతున్నాడు. కాలుష్యం మూల కారణాలను గ్రహించ లేకపోవటం,

విషయాలను సంకుచిత దృష్టితో, పైపైన పరిశీలించటం అంటే ఇదే.

నేను లేచి నిలబడి కాలుష్యాన్ని ఎదుర్కోటానికి ఒక సంయుక్త కార్యాచరణ పథకాన్ని రూపొందిద్దామని సలహా ఇచ్చాను. కాలుష్యానికి కారణమయిన రసాయనాలను వాడక పోవటంగురించి మాట్లాడితే చాలా ఉపయోగకరంగా ఉంటుంది కదా! ఉదాహరణకు టువంటి రసాయనాలనూ వాడకుండా వరి పైరునూ, చీనీ బత్తాయి తోటలనూ సాగు చేయవచ్చు. ఇదే విధంగా కూరగాయలను పండించటం కూడా ఏమంత కష్టమయిన పనికాదు. అనేక సంవత్సరాలనుంచి నేను ఇటువంటి పద్ధతుల్ని అనుసరిస్తున్నానని చెప్పాను. రసాయనాల ఉపయోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నంత కాలం వీటిని విడనాడటానికి రైతు లెవ్వరూ ముందుకు రారని కూడా చెప్పాను.

వ్యవసాయ, అటవీ శాఖల అధికారులూ, వ్యవసాయ సహకార సంఘసభ్యులూ, మత్స్యశాఖప్రతినిధులూ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ అధికారులూ, సమావేశానికి అధ్యక్షత వహించిన ఇచిరాకు మనస్ఫూర్తిగా తలుచుకొంటే ఎన్నో మార్పులు చెయ్యగలిగి ఉండేవారు. దేశంలోని రైతులందరినీ రసాయనాలు వాడకుండా పండించమని వీళ్ళు సిఫారసు చేస్తే ఈ మార్పులు వచ్చేవి.

అయితే ఇక్కడొక సమస్య ఉంది. రసాయనాలూ, ఎరువులూ, యంత్రాలూ లేకుండా పంటలు పండిస్తే వీటిని తయారుచేస్తున్న పెద్ద పెద్ద కంపెనీల అవసరం ఉండదు. ప్రభుత్వ వ్యవసాయ సహకార సంఘం కూడా కుప్ప కూలిపోతుంది. ఎరువుల్లో, వ్యవసాయ పరికరాల్లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టడం ద్వారానే సహకార సంఘాల, ఆధునిక వ్యవసాయ విధాన నిర్ణేతల అధికారం కొనసాగుతోంది. వ్యవసాయంలో యంత్రాలనూ, రసాయనాలనూ వాడటం మానేస్తే సామాజిక, ఆర్థిక రంగాల్లో విప్లవాత్మకమయిన మార్పులను తీసు

కొస్తుంది. అందుకే కాలుష్య నివారణకు అసలయిన చర్యలను ప్రభుత్వం గానీ, సహకార సంఘాలు గానీ చేపడతాయని నేననుకోను.

నేను ఈ విధంగా మాట్లాడేసరికి "ఫుకుఓకా, మీ మాటలతో ఈ సమావేశాన్ని కల్లోల పరుస్తున్నారు"అని అధ్యక్షుడు నానోరు నొక్కేశారు. ఇదీ జరిగింది.

జటిల సమస్యకు తేలిక పరిష్కారం

దీన్ని బట్టి ప్రభుత్వానికి కాలుష్యాన్ని నివారించే ఉద్దేశం లేదని తెలుస్తోంది. కలుషిత ఆహార సమస్యను పరిష్కరించాలంటే దీనికి సంబంధించిన అన్ని కోణాలను ఒక్కసారే ఎదుర్కోవాలి. ఒక్క కారణాన్నో, లేదా కొన్ని అంశాలనో పట్టుకొని పాకులాడుతున్నంత వరకు సమస్య పరిష్కారం కాదు.

అంతేకాదు. ప్రతి ఒక్కరి చేతన, ఆలోచనా విధానం మౌలికంగా మార్పు చెందనిదే కాలుష్య నిర్మూలన జరగదు.

ఉదాహరణకు ఇన్‌లాండ్ సముద్ర[1] కాలుష్యం తనకు సంబంధించిన విషయం కాదని రైతు అనుకొంటాడు. సముద్రంలోని చేపల బాధ్యత మత్స్యశాఖ అధికారులదీ, కాలుష్య నివారణ బాధ్యత పర్యావరణ సంఘానిదీ అని అతని అభిప్రాయం. ఈ విధంగా ఆలోచించటంలోనే సమస్య ఇమిడి ఉంది.

పొలాల్లో అమోనియం సల్ఫేటు, యూరియా, సూపర్ ఫాస్ఫేటు వంటి రసాయనిక ఎరువులు విరివిగా వాడుతున్నారు. వీటిల్లో కొంత మొత్తాన్ని మాత్రమే పంటలు వినియోగించుకోగలుగుతాయి. మిగిలినది సాగునీటి ద్వారా కాలవల్లో, నదుల్లో కలసి చివరకు ఇన్‌లాండ్ సముద్రంలోకి చేరుతుంది. నీటిలోని నాచుకూ (ఆల్గే), ప్లవకాలకూ (ప్లాంక్‌టన్) ఈ ఎరువులు పోషక పదార్థంగా ఉపయోగపడతాయి.

1. హొన్షు, క్యూషు, షికోకు దీవుల మధ్య ఉన్న చిన్న సముద్రం.

[illegible]తో ఇవి వేగంగా వృద్ధి చెంది నీటి మీద దళసరి పొరలాగా ఏర్పడతాయి. పరిశ్రమల నుంచి వచ్చే పాదరసం, ఇతర వ్యర్థ పదార్థాలు కూడా సముద్రపు నీటిని కలుషితం చేస్తున్నాయి. కాని జపాన్‌లో కాలుష్యానికి ప్రధాన కారణం వ్యవసాయంలో ఉపయోగిస్తున్న రసాయనాలే.

కాబట్టి సముద్రపు నీటి మీద ఏర్పడుతున్న నాచుపొరకు రైతు బాధ్యత వహించాలి. కాలుష్యానికి దారితీసే రసాయనాలను ఉపయోగిస్తున్న రైతూ, వీటిని తయారుచేస్తున్న పారిశ్రామికవేత్తలూ, వీటి వాడకాన్ని ప్రోత్సహిస్తున్న గ్రామీణ అధికారులూ – ప్రతి ఒక్కరూ తీవ్రంగా స్పందిస్తేనే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

కాలుష్యం వల్ల తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న వాళ్ళే ప్రస్తుతం ఉద్యమిస్తున్నారు. ఉదాహరణకు మిజుషిమా రేవుకు దగ్గరగా ఉన్న పెద్ద పెద్ద ఆయిల్ కంపెనీల వల్ల సముద్ర జలాలు పెట్రోలియంతో కలుషితమయినపుడు దానివల్ల ప్రభావితమయ్యే స్థానిక మత్స్యకారులే ప్రతిఘటించారు. ఇంకోవైపు విశ్వ విద్యాలయాల్లో పని చేస్తున్న శాస్త్రవేత్తలు వాస్తవంతో సంబంధం లేని పరిష్కారాలు సూచించారు. షికోకు దీవిని చీలుస్తూ కాలవ చేసి పసిఫిక్ సముద్రపు నీటిని ఇన్‌లాండ్ సముద్రంలోకి ప్రవహింప చెయ్యటంవల్ల సమస్యను పరిష్కరించవచ్చని వీరి ప్రతిపాదన. దీని మీద ఎన్నో పరిశోధనలు జరుగుతాయి. పలుమార్లు ప్రయత్నించి కూడా చూస్తారు. కానీ సమస్యకు ఇది పరిష్కారం కాదు.

వాస్తవానికి ఈ విధంగా పరిష్కరించాలనుకొన్న కొద్దీ సమస్య మరింత జటిలమవుతుంది.

ఉదాహరణకు షికోకు దీవిని చీలుస్తూ పైపులైను వేశామనుకొందాం. మోటారు సహాయంతో పసిఫిక్ సముద్రపునీటిని ఇన్‌లాండ్ సముద్రంలోకి తోడామనుకొందాం. ఇన్‌లాండ్ సముద్రపు నీటితో పోలిస్తే పసిఫిక్ సముద్రపు నీళ్ళు బాగుంటాయి కానీ ఇవీ స్వచ్ఛమయినవి కావు. అయినప్పటికీ పసిఫిక్ సముద్రపు నీటివల్ల ఇన్‌లాండ్ సముద్రపు కాలుష్య సమస్య పరిష్కారమవుతుందనుకొందాం. దీనికి స్టీలు పైపులు కావాలి కదా. వీటిని తయారు చేసే ఫ్యాక్టరీకి విద్యుచ్ఛక్తి ఎక్కడినుంచి వస్తుంది ? నీటిని తోడటానికి అవసరమయిన విద్యుచ్ఛక్తి ఎక్కడి నుంచి వస్తుంది? ఈ అవసరాలు తీర్చటానికి అణు విద్యుచ్ఛక్తి కేంద్రం నెలకొల్పాలి. దీని నిర్మాణానికి సిమెంటు, కంకర దండిగా అవసరమవుతాయి. యురేనియం శుద్ధి చేసే కర్మాగారాన్ని నెలకొల్పాలి. ఈ విధంగా ఒకదానికొకటి జోడించుకొంటూ పోతే పరిష్కారానికి బదులు మునుపటి కంటే విస్తృతమయిన, హానికరమయిన కాలుష్య సమస్యలను కొని తెచ్చుకొంటాం.

ఆశపోతు రైతు ఒకడు తన పొలంలోకి ఎక్కువ నీళ్ళు రావాలని పెద్ద గండి కొట్టాడట. నీటి వేగానికి కాలవగట్టే కొట్టుకుపోయింది. గట్టును తిరిగి బలంగా వేసేటప్పుడు కాలవ వెడల్పు చేయాల్సి వచ్చింది. కాలవలో ఎక్కువ నీరు ప్రవహించటం వల్ల ఈసారి మళ్ళీ ఇటువంటి సమస్య ఏర్పడితే గట్టు మరింత ఎక్కువ కొట్టుకుపోతుంది. తిరిగి వెయ్యటానికి మరింత ప్రయాస పడాల్సి ఉంటుంది. మన పరిస్థితీ ఇలాగే ఉంది.

రోగలక్షణాలకు వైద్యం చేయటం ద్వారా రోగమే నయమవుతుందనుకొంటారు. ఇలా ఎన్నటికీ జరగదు. ఈ విషయం శాస్త్రవేత్తలకు బోధపడినట్లు లేదు. సమస్యను సంకుచిత దృష్టితో చూసి పరిష్కారాలకు పూనుకొంటారు. మానవుని చర్యలూ, ప్రతిచర్యలూ పరిమిత శాస్త్రీయ సత్యాల మీదా, అంచనాల మీదా ఆధారపడి ఉన్నాయి.[1] ఈ విధానం వల్ల ఎన్నటికీ అసలయిన పరిష్కారాన్ని అందుకోలేరు.

---

1 ఈ ప్రపంచాన్ని మానవ మేధస్సు అర్థం చేసుకొన్న తీరూ, నిర్మించుకొన్న తీరునే ఫుకుఓకా "పరిమిత శాస్త్రీయ సత్యం, అంచనా" అంటున్నారు. తను ఊహలతో తయారుచేసుకొన్న చట్రానికి ఇది పరిమితమై ఉంది.

నేను సూచించే పరిష్కారం చాలా తేలికయినది. పొలంలో గడ్డి పరవటం వల్లా, క్లోవర్ సాగు చేయటం వల్లా కాలుష్యం ఉండదు. సమస్య అసలు కారణాన్ని ఎదుర్కొంటున్నాం కాబట్టి శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. పెద్ద పెద్ద సాంకేతిక విధానాల పై విశ్వాసం వదులుకోక పోతే సమస్య మరింత తీవ్రమవుతుంది తప్ప పరిష్కారం కాదు.

కష్టకాలపు పండ్లు

వ్యవసాయం వల్ల జరిగే కాలుష్యానికి తమకూ ఎటువంటి సంబంధం లేదని వినియోగదారులు అనుకొంటారు. రసాయనాలు లేని ఆహారం కావాలని చాలా మంది అంటారు. కానీ ఒకే ఆకారంలో ఉండి, పెద్దగా, నున్నగా, మచ్చలేని పండ్లు, కూరగాయలకు ఎక్కువ ధర చెల్లించటానికి సిద్ధంగా ఉంటారు. ఈ కారణంగా అయిదారు సంవత్సరాల క్రితం వ్యవసాయంలో వాడకంలో లేని రసాయనాలు ఇప్పుడు వాడకం లోకి వస్తున్నాయి.

దోసకాయలు గుండ్రంగా ఉన్నాయా, ఒంకరగా ఉన్నాయా, పైకి చూడటానికి బాగున్నాయా, లేవా అన్న విషయాలు తమకు పట్ట వని ప్రజలు అం టుంటారు. టోక్యో మార్కెట్లో టోకు ధరలను పరిశీలిస్తే అసలు విషయం తెలుస్తుంది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ధరల్లో ఎంతో తేడా ఉంటుంది. కాయ కొంచెం బాగా కనపడితే పౌను[1]కు అయిదు – పది సెంట్లు[2] ఎక్కువ ధర పలుకుతుంది. కాయలను 'చిన్నవి', 'మధ్యవి', 'పెద్దవి' అని మూడు రకాలుగా విభ జిస్తారు. చిన్న వాటికంటే మధ్యరకం వాటికి రెండు–మూడు రెట్లు ఎక్కువ ధర పలుకుతుంది. ఇదే విధంగా మధ్యరకం వాటికీ పెద్ద రకం వాటికీ ధరలో తేడా ఉంటుంది.

1. పౌను = 0.45 కిలోలు.
2. రూపాయికి వందపైసలున్నట్లు డాలర్(అమెరికా, ఇతర దేశాల్లో చలామణి అయ్యే నోట్లు)కి 100 సెంట్లు.

కాలం కాని కాలంలో పండించిన కూరగాయలకూ, పండ్లకూ వినియోగదారులు ఎక్కువ ధర చెల్లించటానికి సిద్ధంగా ఉన్నారు. రసాయనాలను ఉపయోగించి, కృత్రిమంగా ఉత్పత్తి చేసే విధానాలకు ఇది ప్రోత్సాహమిస్తోంది. గాజు గృహాలలో పండించి ఉన్షు కమలాలను వేసవిలో అందించినపుడు[1] వీటికి మామూలు కంటే పది-ఇరవై రెట్లు ఎక్కువ ధర లభిస్తుంది. ఈ విధంగా కొన్ని వేల డాలర్లు ఖర్చు పెట్టి తగిన పరికరాలు కొని, ఇంధనం సమకూర్చుకొని, కొన్ని ఎక్కువ గంటలు కష్టపడితే దండిగా లాభాలు పొందవచ్చు.

కాలం కాని కాలంలో పండించటం రోజురోజుకీ వ్యాప్తి చెందుతోంది. ఒకనెల రోజుల ముందు కమలాలు తినటానికి పట్టణ ప్రజలు అదనపు ధర చెల్లించటానికి సిద్ధంగా ఉన్నారు. ఒక నెలరోజులు ముందుగా కమలాలు తినాల్సిన అవసరం ఏమీ లేదు. నెల ముందుగా కమలాలు తినాలన్న కోరికకు డబ్బే కాక మరెంతో మూల్యం చెల్లిస్తున్నాం.

కాయలకు రంగు తెప్పించే రసాయనం కొన్ని సంవత్సరాల క్రితం వాడేవారు కాదు. ఇప్పుడు వాడుతున్నారు. ఈ రసాయనం ఉపయోగించటం వల్ల ఒక వారం రోజులు ముందుగానే కాయ రంగు తిరుగుతుంది. అక్టోబరు 3న ఉన్న ధర, అక్టోబరు 10కి సగానికి సగం పడిపోతుంది. అందుకే త్వరగా రంగు తెప్పించే రసాయనాలు రైతులు వాడుతున్నారు. పొలంలోనే కాకుండా కాయలు కోసిన తరువాత కూడా ఒక గదిలో పెట్టి రంగు రావటానికి రసాయనాలు వాడుతున్నారు.

ఈ విధంగా ముందు కోతకు వచ్చేట్లు చేసి, కృత్రిమంగా మగ్గబెట్టిన పండ్లు అంత తియ్యగా ఉండవు. అందుకని తీపిని కలిగించే పదార్థాలను రైతులు వాడుతున్నారు. కృత్రిమంగా తీపిని కలిగించే

1. ఉన్షు కమలాలు ప్రకృతిలో ఆకురాలే కాలంలో కోతకు వస్తాయి.

పదార్థాల వాడకాన్ని ఇతరత్రా నిషేధించారు కానీ, చీనీ, బత్తాయి తోటలలో ప్రత్యేకంగా నిషేధించలేదు. ఇది వ్యవసాయంలో వాడుతున్న రసాయనం కిందకి వస్తుందా, రాదా అన్నదే ఇంకా తేలలేదు. ఏమయినప్పటికీ దీనిని రైతులందరూ వాడుతున్నారు.

ఆతరువాత గ్రేడింగ్ చేయటానికి పండ్లను సహకార కేంద్రానికి తీసుకు వెళతారు. దీనికోసం కన్వేయరు బెల్టు మీద కాయలను దొర్లిస్తారు. దీనివల్ల కాయ దెబ్బతినటం సహజం. గ్రేడింగు కేంద్రం ఎంత పెద్దదయితే కాయ అంత బాగా నలిగిపోతుంది. కాయలను నీటితో కడిగి నిలవ ఉంచటానికి ఉపయోగపడే రసాయనాలు చల్లుతారు. రంగునిచ్చే పదార్థాన్ని పూస్తారు. చివరిగా పారాఫిన్ మైనం పూతవేసి నిగనిగ లాడేటట్లు రుద్దుతారు. పండ్లు మిల్లులో తయారయ్యి వచ్చేయంటే అతిశయోక్తి కాదు.

కాయ కోయక ముందు నుంచి మార్కెటుకు చేరేలోపు అయిదారు రసాయనాలన్నా ఉపయోగిస్తున్నారు. ఇవి కాక తోటలో చెట్టూ, కాయ ఎదిగే దశలో మరెన్నో రసాయనాలు, ఎరువులు ఉపయోగిస్తారు. కాయ కొంచెం తీరుగా కనబడాలన్న వినియోగదారుని కోర్కెను తీర్చటానికే ఈ పాట్లన్నీ.

రైతు ఇష్టంతో, సంతోషంగా ఈ పనులు చెయ్యటం లేదు. వ్యవసాయ శాఖ అధికారులకు కూడా రైతు పై అదనపు భారం వెయ్యాలన్న సరదా లేదు. కానీ వినియోగదారుని విలువలు మారనిదే ఈ పరిస్థితి మారదు.

నలభై ఏళ్ళ క్రితం నేను యోకోహామా కస్టమ్స్ కార్యాలయంలో పని చేస్తున్నప్పుడు నిమ్మ, కమలా పండ్లలో పై పద్ధతులన్నీ అవలంబించేవారు. వీటిని జపానులో ప్రవేశ పెట్టడాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకించాను. కాని నా మాటలు వీటి వ్యాప్తిని ఆపలేకపోయాయి.

అదనపు శ్రద్ధ, ప్రయాసలకు అదనపు లాభాలు వస్తాయన్న

ఉద్దేశ్యంతో మొదట ఒక సహకార సంఘం కమలాపండ్లకు మైనం పట్టించే పద్ధతిని కొత్తగా అవలంబించిందనుకొందాం. ఇతర సహకార సంఘాలు కూడా ఈ విధానాన్ని అవలంబించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. మైనం పట్టించని పండుకు మార్కెటులో సరయిన ధర పలకదు. రెండు మూడు సంవత్సరాలలో దేశంలో అందరూ పండ్లకు మైనం పట్టించటం మొదలు పెడతారు. మైనం పట్టించిన కాయలకు ముందు లభించిన అదనపు ధర ఇక లభించదు. రైతుకు మాత్రం అదనపు ఖర్చు, అదనపు శ్రమ తప్పవు. మైనం పట్టించే పని నుంచి అతను కావాలనుకొన్నా తప్పించుకోలేడు.

దీని ఫలితంగా వినియోగదారుడు కూడా దెబ్బతింటాడు. తాజావి కాని పండ్లు కూడా తాజాగా కనిపించటం వల్ల అమ్ముడు పోతాయి. ధ్యానంలో ఉన్న వ్యక్తిలో జీవన ప్రక్రియ, శ్వాస, శక్తి వినియోగం అతి తక్కువగా ఉన్నట్లు కొద్దిగా వడిలి ఉన్న పండ్లూ, కూరగాయల్లో శ్వాస ప్రక్రియ, శక్తి వినియోగం సాధ్యమయినంత తక్కువ స్థాయిలో ఉంటాయి. ఈ కారణంగా వీటి ఆహార విలువలను సాధ్యమయినంత ఎక్కువ కాలం కాపాడుకోగలుగుతాయి.

కూరగాయలు అమ్మే వాళ్ళు అవి తాజాగా కనపడేటట్లు చెయ్యటానికి తరచు నీళ్ళు చిలకరిస్తుంటారు. ఇలా చేయటం వల్ల ప్రయోజనం లేదు. కూరగాయలు తాజాగా కనపడినప్పటికీ వాటి రుచినీ, పోషక విలువలనూ ఎప్పుడో కోల్పోయి ఉంటాయి.

ఏది ఏమయినప్పటికీ ఈ విధమయిన అనవసర పనులన్నీ చేపట్టడానికి వ్యవసాయ సహకార సంఘాలు సమాఖ్యగా ఏర్పడి ఆధునిక పరికరాలను సమకూర్చుకొన్నాయి. దీనినే 'ప్రగతి' అంటారు.

ఒక్క మాటలో చెప్పాలంటే నాణ్యత కన్నా పరిమాణానికి, పోషక విలువల కన్నా చూపులకూ విలువనిచ్చే మనస్తత్వం మారనిదే కలుషిత ఆహార సమస్యకు పరిష్కారం లేదు.

ప్రకృతి ఆహార విక్రయం

రసాయనాలు వాడకుండా, ఎరువులు వాడకుండా పండించిన 'ప్రకృతి ఆహారం' అమ్మే దుకాణాలు ప్రత్యేకంగా ఉన్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఈ దుకాణాలకు నేను గత కొద్ది సంవత్సరాల్లో 2700 కిలోల బియ్యం పంపించాను. సుగినామి జిల్లా సహకార జీవన సంఘానికి ఒక్కో పెట్టెలో 15 కిలోల కమలాలున్న 400 పెట్టెలను లారీల్లో ఎగుమతి చేశాను.

చిన్నా, పెద్దా కాయలు కలగలిపి ఉన్నాయని, తోలు కొంచెం మురికిగా ఉందని, కాయలు కొద్దిగా వడలినట్లున్నాయని మొదటి సంవత్సరం కొన్ని ఆరోపణలు వచ్చాయి. పెట్టెల మీద నేను ఏమీ రాయకుండా పంపించటం వల్ల అది ఏరివేసిన సరుకేమోనని కొంతమంది అనుకొన్నారు. అప్పటినుంచి పెట్టెల మీద 'ప్రకృతి కనుగుణంగా పండించిన కమలాలు' అని రాస్తున్నా.

చాలా తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో ప్రకృతి ఆహారాన్ని పండించవచ్చు. అందుకే దీనిని అతి తక్కువ ధరకు అమ్మాలని నా అభిప్రాయం. గత సంవత్సరం టోక్యో ప్రాంతంలో నేను పంపించిన పండ్లే అతి చవకగా అమ్ముడు పోయాయి. చాలామంది దుకాణదారులు వీటి రుచి అద్భుతంగా ఉందని చెప్పారు. పండ్లని స్థానికంగా అమ్మగలిగితే రవాణాకు అయ్యే వ్యయ ప్రయాసలు తప్పుతాయి, పండ్లు మరింత రుచిగా ఉంటాయి.

ప్రకృతి ఆహారం స్థానికంగా అమ్ముడు పోవటానికి ఎంత వరకు అవకాశాలున్నాయి? రసాయనాలు ఉపయోగించి పండ్ల తోటలు సాగు చేసే రైతులు ఇటీవల ఆర్థిక పరమయిన ఇబ్బందులకు గురి అవుతున్నారు. రసాయనాలు లేకుండా పండ్లు ఉత్పత్తి చేయటం లాభదాయకంగా కనిపించి ముందు ముందు దీనిని చేపట్టవచ్చు. రసాయనాలు, రంగు తెప్పించే పదార్థాలు చల్లి, మైనం పట్టించి ఎంతో కష్టపడి నప్పటికీ పండ్లు అమ్మ జూపే సరికి పలికే ధర ఖర్చులకు బొటాబొటిగా సరిపోతోంది. ఈ సంవత్సరం మంచి పండ్లు ఉత్పత్తి అయిన తోటల్లో పౌనుకు అయిదు సెంట్లకు మించి లాభం ఉండదు. నాణ్యత తగ్గిన పండ్ల తోటల్లో లాభాల ప్రసక్తే లేదు.

గత కొద్ది సంవత్సరాలుగా కమలా పండ్ల ధరలు బాగా పడిపోతున్నాయి. దీనితో వ్యవసాయ సహకార సంఘాలూ, గ్రేడింగు కేంద్రాలూ చాలా ఖచ్చితంగా వ్యవహరిస్తూ కేవలం నాణ్యమయిన కాయలనే తీసుకొంటున్నాయి. పగలంతా కాయలు కోసి ఒక్క దగ్గరికి చేరవేసిన తరువాత రైతు రాత్రి 11, 12 గంటల దాకా కూర్చుని ఒక్కొక్కదాన్నీ చూస్తూ మంచి పండ్లను వేరు చెయ్యాలి.[1]

అయితే ఈ 'మంచి పండ్లు' పంటలో 50 శాతం, ఒక్కొక్కసారి 25 శాతమే ఉంటాయి. వీటిలో కూడా కొన్నిటిని సహకార సంఘాల వాళ్ళు ఏరేస్తూ ఉంటారు. పౌనుకు రెండు మూడు సెంట్ల లాభం వచ్చినా అక్కడికి సంతోషమే. అంటే రైతులు నడుం విరిగేటట్లు రేయింబవళ్ళు పనిచేసినా ప్రతిఫలం అంతంత మాత్రమే.

పొలం దున్నకుండా, రసాయనాలు చల్లకుండా, ఎరువులు వెయ్యకుండా పండ్లు పండిస్తే శ్రమ తక్కువ. ఖర్చులు తక్కువ.

1. రసం తీసే ఫ్యాక్టరీలకు ఏరివేసిన కాయలను మార్కెటు ధరలో సగానికి అమ్ముతారు.

కాబట్టి లాభాలు ఎక్కువగా ఉంటాయి. నేను మార్కెట్టుకు పంపించే పండ్లను గ్రేడింగు చెయ్యను. కోసినవి కోసినట్లు పెట్టెలో పెట్టి మార్కెటుకు పంపించి పొద్దు పోగానే హాయిగా నిద్రపోతాను.

తాము ఎంత శ్రమ పడినప్పటికీ ఏమీ ప్రతిఫలం ఉండటం లేదని నా చుట్టు పక్కల రైతులు గ్రహించసాగారు. రసాయనాలూ, ఎరువులూ లేకుండా పండ్లు సాగు చెయ్యటం వింత కాదని వీళ్ళు గుర్తిస్తున్నారు. ఈ విధానాన్ని అవలంబించటానికి కొంతమంది సిద్ధంగా ఉన్నారు. అయితే ఇలా ఉత్పత్తి అయ్యే ఆహారం స్థానికంగా అమ్ముడు పోయే అవకాశాలు లేనంతవరకు తన పంటకు గిరాకి ఎలా ఉంటుందోనన్న భయం సగటు రైతును పీడిస్తూనే ఉంటుంది.

ప్రకృతి ఆహారానికి ఎక్కువ ధర ఉండాలన్న అభిప్రాయం వినియోగదార్లలో సాధారణంగా ఉంటుంది. ఎక్కువ ధర లేకపోతే అది ప్రకృతి ఆహారమేనా అన్న అనుమానం వాళ్ళకి వస్తుంది. అధిక ధర లేకపోతే ప్రకృతి ఆహారాన్ని ఎవరూ కొనరని ఒక దుకాణదారుడు నాతో అన్నాడు.

ప్రకృతి ఆహారం అన్నిటికంటే చవకగా లభ్యం కావాలన్నదే నా అభిప్రాయం. చాలా సంవత్సరాల క్రితం టోక్యోలోని ఒక దుకాణదారుడు నేను పంపించిన తేనె, కోడిగుడ్లు చాలా ఎక్కువ ధరలకు అమ్ముతున్నాడని తెలిసి మండిపోయాను. ఈ విధంగా వినియోగదారుల నుంచి అధిక మొత్తం గుంజుతున్న అతను లాభాల కోసమని ప్రకృతి సిద్ధంగా పండించిన బియ్యంలో మామూలు బియ్యం కలిపి మొత్తాన్ని ఎక్కువ ధరకు అమ్మడని నమ్మకమేమిటి? అప్పటి నుంచి అతనికి సరుకు పంపించటం లేదు.

ప్రకృతి ఆహారానికి చాలా ఎక్కువ ధర తీసుకొంటుంటే వ్యాపారి అధిక లాభాలు గడిస్తున్నాడని అర్థం. అంతే కాకుండా వీటి

ధరలు ఎక్కువగా ఉంటే బాగా డబ్బున్న వాళ్ళు మాత్రమే కొనుక్కోగలుగుతారు.

ప్రకృతి ఆహారం విస్తృత ఆదరణ పొందాలంటే ఇది స్థానికంగా, సరసమయిన ధరలకు దొరకాలి. తక్కువ ధరలుంటే ప్రకృతి ఆహారం కాదన్న అభిప్రాయాన్ని వినియోగదారులు వదులుకొంటే అంతా సరయిన దిశలో పయనిస్తుంది.


వ్యాపార సరళి వ్యవసాయం విఫలం కాక తప్పదు

వ్యాపార సరళి వ్యవసాయ విధానాన్ని మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ వచ్చాను. ఈ విధానం జపాను రైతుకు గిట్టుబాటు కాదు. ఒక వస్తువును ప్రాసెసింగ్ చేసి తిరిగి అమ్మితే దాని విలువ పెరుగుతుందన్నది వ్యాపారస్తుల సిద్ధాంతం. కాని ఈ విషయాలు అనుకొన్నంత తేలిక కావు. ఎరువులూ, దాణా, పరికరాలూ, రసాయనాలూ – అన్నీ విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. వీటి ధర ఎప్పుడు ఎట్లా ఉంటుందో ఎవరికీ తెలియదు. అంతా వ్యాపారస్తుల మీద ఆధారపడి ఉంటుంది. రైతు ఉత్పత్తి చేసే వాటి ధరలను కూడా వ్యాపారస్తులే నిర్ణయిస్తారు. అంటే రైతు చేతుల్లో ఏమీ లేదు. తమ ఆదాయం కోసం ఇతరుల మీద ఆధారపడి ఉండాల్సిందే.

వ్యాపార సరళిలో వ్యవసాయం అన్నది సుస్థిరమయిన ప్రతిపాదన కాదు. లాభాల గురించి ఆలోచించకుండా తనకు కావలసిన ఆహారం పండించుకొంటే రైతు పరిస్థితి ఎంతో మెరుగుగా ఉంటుంది. ఒక వరి గింజను నాటితే అది వెయ్యి గింజలవుతుంది. ఒక వరుసలోని టర్నిప్‌లతో శీతాకాలానికి సరిపడా పచ్చడి పెట్టుకోవచ్చు. ఈ విధంగా ఆలోచిస్తే ఏమంత కష్టపడకుండానే తినటానికి కావలసిన దాని కన్నా ఎక్కువే లభిస్తుంది. అలా కాకుండా డబ్బు సంపాదించాలని లాభాల వేటలో పడితే అది తనతో పాటు నిన్నూ ఊబిలోకి దించుతుంది.

ఇటీవల నేను వైట్ లెగ్ హార్న్ (విదేశీ జాతి) కోళ్ళ గురించి ఆలోచిస్తున్నాను. ఇవి సంవత్సరానిక 200 కు పైగా గుడ్లు పెడతాయట. వీటిని వ్యాపార సరళిలో పెంచటం లాభసాటిగా ఉంటుందట. పెద్ద పెద్ద వరుసలో ఉన్న చిన్న కేజెస్‌లో నిర్బంధించి పెంచుతారు. ఇవి నరకకూపాలను పోలి ఉంటాయి. తమ జీవితంలో ఒక్కసారి కూడా ఈ కోళ్ళు నేల మీద కాళ్ళు మోపవు. రోగాలు సాధారణం కాబట్టి యాంటిబయాటిక్స్ విపరీతంగా వాడతారు. విటమిన్లూ, హార్మోనులూ ఉన్న దాణా మేపుతారు.

లెగ్‌హార్న్‌తో పోలిస్తే దేశవాళి కోళ్ళలో (ఫామొ, చాబొ జాతులు) గుడ్ల ఉత్పత్తి చాలా తక్కువ. ఈ కారణం వల్ల దేశవాళి కోళ్ళు జపానులో దాదాపు అంతరించి పోతున్నాయి. కొండవాలుల్లో నేను రెండు దేశవాళీ పెట్టలనూ, ఒక పుంజునూ వదిలిపెట్టాను. సంవత్సరం తరువాత చూస్తే వీటి సంఖ్య ఇరవై నాలుగుకు పెరిగింది. గుడ్లు పెట్టడం లేదనుకొన్న కాలంలో ఇవి తమ సంసారాన్ని వృద్ధి చేసుకొంటూ క్షణం తీరిక లేకుండా గడిపాయి.



పనికి సిద్ధం

దేశవాళీ రకాలతో పోలిస్తే లెగ్‌హార్న్ మొదటి సంవత్సరంలో ఎక్కువ గుడ్లు పెడుతుంది. కాని ఒక సంవత్సరానికే దాని శక్తి అంతా ఉడిగిపోయి ఎందుకూ పనికి రాకుండా పోతుంది. అదే దేశవాళి కోడి అయితే ఒకటికి పదయినా ఆరోగ్యంగా తోటలో చెట్లకింద తిరుగుతూ ఉంటుంది. లెగ్‌హార్న్ కోళ్ళకు కృత్రిమమయిన పోషకాహారాన్ని మేపాలి. విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్న వ్యాపారస్తుల నుండి, వాళ్ళు నిర్ణయించిన ధర చెల్లించి దీనిని కొనాలి. దేశవాళి కోడి దాణాకి పైసా ఖర్చు ఉండదు. గింజలూ, గడ్డి అవే ఏరుకు తింటాయి. పురుగూ పుట్రా గీరుకు తింటాయి. ప్రకృతి సహజమయిన, రుచికరమయిన గుడ్లను పెడతాయి.

వ్యాపార సరళిలో పెంచిన కూరగాయలు ప్రకృతి సహజమయినవన్న అభిప్రాయం భ్రమ అవుతుంది. నత్రజని, భాస్వరం, పొటాష్ రసాయనాల సమ్మేళనమే నేటి కూరగాయలు. వీటిని తయారు చేయడానికి విత్తనం ఒక ఆధారం మాత్రమే. వీటి రుచి కూడా ఇందుకు తగ్గట్లే ఉంటుంది. వ్యాపార సరళిలో ఉత్పత్తి చేసిన గుడ్లు (మీకు అనాలనిపిస్తే వీటిని గుడ్లు అనవచ్చు) కృత్రిమ దాణా, రసాయనాలు, హార్మోనుల మిశ్రమం తప్ప వేరేమీ కాదు. ఇది ప్రకృతి సహజమయిన ఉత్పాదన కాదు. మానవులు తయారు చేసిన దానికే గుడ్డు ఆకారాన్ని ఇచ్చారు. ఈ విధంగా కూరగాయలూ, గుడ్లు ఉత్పత్తి చేసే వాళ్ళని నిజానికి ఉత్పత్తిదారులని కాకుండా తయారీదారులనాలి.

వ్యాపార సరళిని చేపట్టినా రైతుకు ఏమీ మిగలటం లేదు. వ్యాపారం తెలియని మూర్ఖుడిగా ఇతరులు జమకడుతున్నారు. నిజానికి లాభాలను రాజకీయ నాయకులూ, అమ్మకందారులూ జుర్రేసుకుని రైతుకు ఏమీ మిగలకుండా చేస్తున్నారు./

పూర్వకాలంలో సైనికులూ, రైతులూ చేతిపనులవారూ, వ్యాపారస్తులూ ఉండేవారు. వ్యాపారం, వస్తువుల తయారీ కంటే

వ్యవసాయమే ప్రకృతి మూలానికి దగ్గరగా ఉన్నట్లు భావించేవారు. దేవతలకు సమీపాన కూడా రైతే ఉండేవాడు. అతని జీవితంలో ఏనాడూ దేనికీ లోటు లేదు. తినటానికి ఎప్పుడూ కొరత ఏర్పడలేదు.

కానీ ఇప్పుడు అందరూ డబ్బు సంపాదనకు ఎగబడుతున్నారు. ఇంతకు ముందు లేని ద్రాక్ష, టొమాటో, పుచ్చకాయలు వంటివి ఇప్పుడు వ్యాపార సరళిలో పండిస్తున్నారు. కాలంకాని కాలంలో గాజుగదుల్లో పండ్లూ, పూలు సాగుచేస్తున్నారు. లాభసాటిగా ఉందనే చేపల ఉత్పత్తి మొదలు పెట్టారు. పశువుల పెంపకం చేపట్టారు.

ఈవిధంగా రైతులు లాభాల పరుగులో పాల్గొనడం వల్ల వచ్చే పరిణామాలు కనపడుతూనే ఉన్నాయి. ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. లాభాలు ఉన్నాయి కానీ నష్టాలూ వస్తాయి.

ఈ విధానం విఫలం కాక తప్పదు. జపనీస్ వ్యవసాయం దిశను కోల్పోయి అస్థిరమై పోయింది. వ్యవసాయ మూలసూత్రాలను విడిచి పెట్టి వ్యాపార దిశకు మళ్ళింది.

ఎవరి ప్రయోజనాల కోసం ఈ పరిశోధనలు ?

దున్నకుండా నేరుగా వరి, శీతాకాలపు పంటలను విత్తే ప్రయోగాలు చేపట్టిన మొదట్లో కొడవలితో పంటను కోసేవాడిని. వరుసలలో విత్తితే కొయ్యటానికి అనువుగా ఉంటుందనిపించింది. నాకున్న కొద్దిపాటి పరిజ్ఞానంతో పలుమార్లు ప్రయత్నించి చివరకు చేతితో నడిపే వరుసల్లో విత్తే పరికరాన్ని తయారు చేశాను. ఇది ఇతర రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందేమోనని పరిశోధన కేంద్రానికి తీసుకు వెళ్ళాను. ఇది పెద్ద పెద్ద యంత్రాల యుగమనీ, నేను తయారు చేసిన చేతి పరికరం ఎందుకూ పనికి రాదనీ చెప్పి అక్కడి అధికారి నన్ను తిప్పి పంపించేశాడు.

తరువాత వ్యవసాయ పరికరాలు తయారుచేసే వ్యక్తి దగ్గరకు వెళ్ళాను. నా పరికరాన్ని చూసి దీనిని తయారు చేసి అమ్మితే మూడున్నర డాలర్లకు మించి ధర పెట్టడానికి వీలులేదన్నాడు. దీనివల్ల వేలడాలర్లకు అమ్ముతున్న పెద్ద పెద్ద పరికరాలు ఎందుకూ పనికి రావని రైతులనుకొంటారన్నాడు. వరినాట్ల యంత్రాన్ని తయారు చేసి సాధ్యమయినంత సొమ్ము చేసుకొని ఇంకొక కొత్త దాన్ని కనిపెట్టి విడుదల చెయ్యటమే ప్రస్తుత విధానంగా ఉంది. చిన్న ట్రాక్టర్లకు బదులు ఇంకా పెద్ద యంత్ర పరికరాలను రూపొందించటానికి పూనుకొంటున్నారు. ఈ పరిస్థితుల్లో నా చేతి పరికరం పాత యుగానికి పోవటం వంటిదన్నాడు.

ప్రస్తుత అవసరాలను తీర్చటానికి పనికిరాని పరిశోధనలపై నిధులు వ్యర్థం చేస్తున్నారు. నా పరికరం మాత్రం అలాగే అటకమీద ఉంది.

ఎరువులలోనూ, రసాయనాలలోనూ జరుగుతున్న పరిశోధనల్లో కూడా ఇదే పరిస్థితి. రైతులను దృష్టిలో పెట్టుకొని ఏదీ జరగటంలేదు. ఏదో ఒకటి కొత్తది కనిపెట్టి డబ్బు చేసుకొనే ప్రయత్నమే అన్ని చోట్లా కనపడుతోంది. పరిశోధన కేంద్రాలలో కొంత కాలం సాంకేతిక నిపుణులుగా పనిచేసిన తరువాత పెద్ద పెద్ద రసాయనిక కంపెనీల్లో ఉద్యోగస్థులుగా చాలామంది చేరుతున్నారు.

వ్యవసాయ, అటవీశాఖలో సాంకేతిక అధికారిగా పని చేస్తున్న అసాడాను ఇటీవల కలిశాను. ఆయన కొన్ని ఆసక్తికరమయిన విషయాలు తెలియచేశాడు. గాజు గదుల్లో పండిస్తున్న కూరగాయలు ఏ మాత్రం రుచిగా ఉండటం లేదట. శీతాకాలంలో ఎగుమతి చేస్తున్న వంకాయల్లో విటమిన్లు లేవనీ, దోసకాయల్లో రుచి ఉండటం లేదనీ తెలుసుకొని అతను పరిశోధనలు మొదలు పెట్టాడు. కూరగాయలు పండిస్తున్న గాజు గదుల గోడలనుంచీ, వినైల్ కప్పు నుంచీ సూర్యకాంతిలోని కొన్ని కిరణాలు లోపలికి ప్రవేశించ లేకపోతున్నాయి. దీనిని సరిచెయ్యటానికి గాజు గదుల్లో ఏ విధమయిన కాంతిని కల్పించాలన్న పరిశోధన మొదలు పెట్టాడు.,

కాలం కాని కాలంలో వంకాయలూ, దోసకాయలూ తినటం అంత ముఖ్యమా అన్న మౌలిక ప్రశ్న ఇతను వేసుకోలేదు. కాలం కాని కాలంలో పండించటం వల్ల ఎక్కువ ధర లభిస్తుంది. కాబట్టి పై సమస్యకు పరిష్కారం కనిపెడతారు. కొంతకాలం తరువాత ఇలా పండిస్తున్న కూరగాయల్లో పోషక విలువలు ఏ మాత్రం లేవని కనుగొంటారు. దీనితో పోషక విలువలు నష్టపోకుండా ఉండటానికి మరో సాంకేతిక నిపుణుడు పరిశోధనలు మొదలు పెడతాడు. కాంతి

ప్రసరణలో సమస్య ఉందనుకొని దానిపై పరిశోధనలు చేస్తాడు. గాజుగదుల్లో పండించే వంకాయల్లో విటమిన్లు ఉండేలా చేస్తే సమస్య పరిష్కారమవుతుందనుకొంటాడు. ఈ విధమయిన పరిశోధనల కోసం జీవితాలను అంకితం చేసిన వాళ్ళున్నారని నేను విన్నాను.

అనేక పరిశోధనలు చేసి, ఎంతో ప్రయాసపడి పండించిన ఈ వంకాయల్లో పోషక పదార్థాలు ఎక్కువగా ఉన్నాయంటూ ప్రచారం చేస్తారు. దీనితో ఇవి హెచ్చు ధరకు అమ్ముడుపోతాయి. "లాభసాటిగా ఉండి, అమ్మగలిగినప్పుడు ఏమి చేసినా చెల్లుతుంది" అన్నది ఈనాటి సత్యం.

మనుషులు ఎంత కష్టపడినప్పటికీ ప్రకృతికి మించి మంచి కూరగాయలనూ, పండ్లనూ సాగు చేయలేరు. కృత్రిమ విధానాల్లో పండించిన పంట ద్వారా ప్రజల గొంతెమ్మ కోర్కెలు తీర్చవచ్చు. కాని ఇవి మనిషి శరీరాన్ని బలహీన పరుస్తాయి. శరీర రసాయనిక ధర్మాన్నే మార్చేసి ఇటువంటి ఆహారం పైనే ఆధారపడేట్లు చేస్తాయి. ఈ పరిస్థితుల్లో విటమిన్ బిళ్ళలూ, టానిక్కులూ అవసరమవుతాయి. వీటన్నిటివల్లా రైతుకు అదనపు శ్రమ, వినియోగదారులకు అనారోగ్యం మిగులుతాయి.

ఏది మానవుల ఆహారం ?

ప్రకృతి ఆహారం గురించి చెప్పమంటూ ఒకరోజు ఎన్.హెచ్.కె. టెలివిజన్ కేంద్రం నుంచి ఒక విలేఖరి వచ్చాడు. అనేక విషయాలు మాట్లాడుకున్నాం. కోళ్ళ ఫారాల్లో కేజెస్‌లో పెట్టిన గుడ్డునూ, పండ్లతోటలో స్వేచ్ఛగా తిరుగుతూ పెట్టిన గుడ్డునూ పోల్చి చూడమని ఇచ్చాను. కొండమీద స్వేచ్ఛగా తిరుగుతున్న కోళ్ళు పెట్టిన గుడ్డులో పచ్చసొన ముదురు నారింజ రంగులో ఉండి చక్కగా గుండ్రంగా నిలకడగా ఉంది. అదే కేజెస్‌లో ఉండే కోళ్ళు పెట్టిన గుడ్డులో పచ్చసొన పేలవంగా పలచగా మెత్తగా ఉంది. పట్టణంలో సుషి రెస్టారెంట్ నడుపుతున్న వృద్ధుడు ఆ సమయంలో మాతో ఉన్నాడు. స్వేచ్ఛగా తిరుగుతున్న కోళ్ళు పెట్టిన గుడ్లుతిని ఏదో అపూర్వ సంపద దొరికినట్లు అతను సంబర పడిపోయాడు. అసలయిన గుడ్డు అంటే ఇదేనని, మళ్ళీ పాతకాలపు రోజులు గుర్తొస్తున్నాయని అతను మెచ్చుకొన్నాడు.

పండ్లతోటలో క్లోవరు మధ్య, రకరకాల కలుపు మొక్కల మధ్య కూరగాయల మొక్కలు కూడా పెరుగుతున్నాయి. టర్నిప్, బర్డాక్, దోసజాతి, వేరుశనగ, కారట్, బంగాళాదుంప, ఉల్లిపాయ, ఆవ, కాబేజి, అనేక రకాల చిక్కుళ్ళు, ఇంకా ఎన్నో మూలికలు, కూరగాయలు అన్నీ కలసి పెరుగుతున్నాయి. ఇట్లా పిచ్చిగా పెరుగుతున్నట్టనిపిస్తున్న కూరగాయల రుచికీ, ఎరువులు ,రసాయనాలు వేసి తోటల్లో పెంచేవాటి

రుచికీ, పెరటితోటలో పెంచేవాటి రుచికీ ఎటువంటి తేడా ఉందన్న అంశం మీదకి చర్చ మళ్ళింది. తిని చూసినప్పుడు రుచుల్లో ఒకదానికీ ఇంకొక దానికీ పోలికే లేదు. పిచ్చిగా పెరుగుతున్న కూరగాయల రుచి అద్భుతంగా ఉన్నట్లు చివరికి తేల్చాం.

పొలం తయారు చేసి, రసాయనిక ఎరువులు వేసినప్పుడు కూరగాయలకు నత్రజని, భాస్వరం, పొటాష్ అందుతాయి. సేంద్రియ పదార్థంతో సారవంతంగా ఉన్న నేలలో, ఇతర మొక్కల మధ్య కూరగాయలు పెంచినప్పుడు వాటికి కావలసిన పోషక పదార్థాలన్నీ కావలసిన మోతాదులో అందుతాయి. రకరకాల కలుపు మొక్కలు, గడ్డి మొక్కలు ఉన్నాయంటే కూరగాయ మొక్కలకు అవసరమయిన పోషకపదార్థాలూ, సూక్ష్మ పోషకపదార్థాలూ అందుబాటులో ఉన్నాయని అర్థం. ఈ విధమయిన వాతావరణంలో పెరిగిన కూరగాయలకు ఒక ప్రత్యేకమయిన రుచి ఉంటుంది.

తినడానికి పనికి వచ్చే ఆకు మొక్కలూ, పిచ్చిగా పెరుగుతున్న కూరగాయలు, కొండల మీదా, మైదానాల్లో పెరుగుతున్న మొక్కలలో పోషక విలువలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఇవి మందుగా కూడా ఉపయోగపడతాయి. నిజానికి ఆహారమూ, మందూ వేరు కాదు. ఒకే నాణానికి బొమ్మా, బొరుసు వంటివి. రసాయనాలతో పండించిన కూరగాయలను ఆహారంగా తీసుకోవచ్చు. కాని మందుగా ఏ మాత్రం ఉపయోగపడవు.

వసంత కాలపు ఏడు మూలికలను[1] సేకరించి తింటే మృదుస్వభావం అలవడుతుంది. బ్రాకెన్ మొక్కలు (ఫెర్న్‌జాతికి చెందిన మొక్క,

1. ఇవి వాటర్ క్రెస్ (హిందీలో బ్రహ్మిసాగ్, పానీసాగ్, తెలుగులో ఆడేలు కూర అంటారు), షెఫ్‌హర్డ్స్ పర్స్, అడవి టర్నిప్, కాటన్‌వీడ్, చిక్‌వీడ్ (హిందీలో బడియోలా అంటారు), అడవి ముల్లంగి, నెటిల్. వీటి బొమ్మలు 135వ పేజీలో ఉన్నాయి.

హిందీలో లింగ్రి అంటారు), ఆస్మండ్, షెప్‌హర్డ్స్ పర్స్ తింటే ప్రశాంత చిత్తం చేకూరుతుంది. ఆందోళన, అసహన భావాలను నిదానింప చేయటానికి షెప్‌హర్డ్స్ పర్స్ అన్నిటికంటే బాగా ఉపయోగపడుతుంది. షెప్‌హర్డ్స్ పర్స్‌గానీ, విల్లో మొగ్గలుగానీ, చెట్లలో ఉండే పురుగులు గానీ తింటే పిల్లల్లో మారాం చేసి, బాగా ఏడ్చే స్వభావం పోతుందని అంటారు. ఒకప్పుడు వీటిని పిల్లలకు తరచూ తినిపించేవారు. 'డైకాన్' (జపనీస్ ముల్లంగి) 'నజునా' (షెప్‌హర్డ్స్ పర్స్) నుంచి వచ్చింది. నజునా అన్న పదానికీ 'నగోము' అన్న పదానికి సంబంధం ఉంది. నగోము అంటే మెత్తబరిచేది అని అర్థం. కాబట్టి డైకాన్ అంటే 'చిత్తాన్ని మెత్త పరిచే మూలిక'.

ప్రకృతిలో సహజంగా దొరికే ఆహారంలో సాధారణంగా పురుగుల్ని లెక్కలోకి తీసుకోరు. యుద్ధ సమయంలో పరిశోధన కేంద్రంలో



పనిచేస్తున్నప్పుడు తినటానికి అనువయిన పురుగులేవో తేల్చే పని నాకు అప్పగించారు. ఈ దిశలో అన్వేషణ మొదలు పెట్టినపుడు తినటానికి అనువయిన పురుగులను చూసి నాకే ఆశ్చర్యం వేసింది.

ఉదాహరణకు ఒక రకమయిన పేలు (lice), మిణ్ణల్లుల (fleas) నే తీసుకోండి. ఇవి ఎందుకూ ఉపయోగపడవనే అందరూ అనుకొంటారు. పేలను నూరి, శీతాకాలపు ధాన్యంతో పాటు తింటే మూర్ఛరోగానికి (ఎపిలెప్సి) మందుగా పని చేస్తుంది. మిణ్ణల్లులు ముంచుదెబ్బ (ఫ్రాస్ట్‌బైట్)కు ఉపయోగపడతాయి. లద్దె పురుగు (లార్వా) దశలో ఉన్న అన్ని పురుగుల్నీ తినవచ్చు. అయితే ఇవి బతికి వుండాలి. పురాతన పుస్తకాలు తిరగేస్తూ ఉంటే లద్దె పురుగులతో తయారు చేసే రుచికరమయిన వంటకాల గురించి కనపడింది. పట్టు పురుగు రుచితో మరేదీ పోటీ పడదని ఈ పుస్తకాల్లో ఉంది. దీపపు పురుగుల (మాథ్స్) రెక్కల నుంచి రంగుపొడి దులిపేసి తింటే చాలా రుచిగా ఉంటాయి.

మనుషులు సాధారణంగా ఏవగించుకొనే పదార్థాలు వాస్తవానికి చాలా రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యరీత్యా కూడా ఎంతో మంచివి.

కూరగాయ మొక్కలన్నీ అడవి రకాల నుంచి వచ్చినవే. ఇవి అడవి రకాలను ఎంత దగ్గరగా పోలి ఉంటే వీటి రుచి, ఆహార విలువలు అంత ఎక్కువ. ఉదాహరణకు ఉల్లిజాతి ('నీరా', వెల్లుల్లి, చైనీస్ వెల్లుల్లి, పచ్చ ఉల్లి, ముత్యపు ఉల్లి, ఉల్లిగడ్డ) మొక్కలను తీసుకొందాం. వీటిల్లో నీరా, చైనీస్ వెల్లుల్లి మొక్కలు అడవి రకాలకు దగ్గరగా ఉంటాయి. ఇవి చాలా ఎక్కువ పోషక విలువలు కలిగి ఉన్నాయి. మూలికలుగా ఉపయోగపడతాయి. ఆరోగ్యాన్ని కాపాడే టానిక్‌గా పనిచేస్తాయి. కానీ అడవి రకాలకు దగ్గర పోలికలు లేని పచ్చఉల్లి, ఉల్లిగడ్డ చాలా మందికి చాలా రుచికరంగా అనిపిస్తాయి. ఏ కారణాల వల్లనోగాని అడవి రకాలకు

బాగా దూరమయిన కూరగాయల రకాలనే మనుషులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

ఇదే ధోరణి మాంసాహారంలోనూ ఉంది. మనం పెంచిన కోళ్ళూ, బాతుల కంటే అడవి పిట్టలు వంటికి ఎంతో మంచివి. వాటి సహజ వాతావరణానికి చాలా దూరంగా పెంచిన కోళ్ళను బాగుందంటూ లొట్టలేసుకొంటూ తింటారు. వీటికి ఎక్కువ ధర కూడా చెల్లిస్తారు. ఆవుపాల కంటే మేకపాలు మంచివి. కానీ ఆవు పాలకున్నంత గిరాకి మేక పాలకు లేదు.

సహజ వాతావరణానికి దూరంగా, రసాయనికంగా లేదా కృత్రిమ వాతావరణంలో పండించిన ఆహారం శరీర రసాయనిక ధర్మాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేస్తుంది. చాలా అనారోగ్య పరిస్థితులకు దారి తీస్తుంది.

ఎవరేమి తింటారనేది వాళ్ళ వ్యక్తిగత ఇష్టం, స్వేచ్ఛ అనటం సరికాదు. ప్రజల అసహజ రుచులూ, కోరికలూ తీర్చటానికి రైతులనూ, మత్స్యకారులనూ కష్టాలకు గురిచేస్తున్నాం. కోరికలు పెరుగుతున్నకొద్దీ వాటిని సంతృప్తి పరచటానికి మరింత పని చేయాల్సి ఉంటుందని నా అభిప్రాయం. ట్యూనా, ఎల్లో టేల్ చేపలను పట్టుకోటానికి సముద్రంలోకి చాలా దూరం వెళ్ళాల్సి ఉంటుంది. కానీ తుళు చేపలు (స్మార్డైన్), సముద్రపు బ్రీమ్, చందువాయి చేప (ఫ్లౌండర్), ఇతర చిన్న చిన్న చేపలు ఇన్‌లాండ్ సముద్రంలోనే పుష్కలంగా దొరుకుతాయి. పోషక విలువల రీత్యా చూస్తే మంచి నీటి నదులూ, కాలవల్లో దొరికే చేపలూ, నత్తలూ, పీతలూ వంటివి ఉప్పునీటిలో దొరికేవాటికంటే మేలయినవీ, వంటికి మంచివి. మంచినీటి జీవుల తరువాత సముద్రంలో తక్కువలోతులో దొరికే జీవులూ, ఆ తరువాత దూరసముద్రాల్లో బాగా లోతులో దొరికే చేపలూ మంచివి. మనుషులకు అతి దగ్గరలో

దొరికే ఆహారం చాలా మంచిది. ఎంతో కష్టపడి సంపాదించిన ఆహారం అంతగా ఉపయోగకరమయినదిగా ఉండదు.

అందుబాటులో ఉన్నది గ్రహిస్తే అంతా బాగుంటుంది. ఈ గ్రామంలో ఉండే ప్రజలు కేవలం ఇక్కడ పండించేవి, ఇక్కడ సేకరించినవి తింటే ఏ లోపమూ జరగదు. దంపుడు బియ్యం, పాలిష్ చెయ్యని బార్లీ, చిరుధాన్యాలను ఆయా కాలాల్లో కాసే కూరగాయలతో పాటు తీసుకోవటం తేలిక. ఆరోగ్యానికి మంచిదీ, రుచికరమయినదీ అయిన ఆహారం ఇంతకు మించి ఉండదు. కొండమీద గుడిసెల్లో నివసిస్తున్న యువతీయువకులు ఇంతకంటే సాదా జీవితం లేదని గ్రహించారు. చివరకు అందరూ ఇదే నిర్ణయానికి వస్తారు.

ప్రకృతి సేద్యం కింద ఉన్న పావు ఎకరం నుంచి 585కిలోల బియ్యం, 585 కిలోల శీతాకాలపు ధాన్యం పండించవచ్చు. ఈ ఆహారం అయిదుగురికి సరిపోతుంది. వీళ్ళు పొలంలో సగటున రోజుకు ఒక గంట పనిచేస్తే చాలు. ఇదే పొలాన్ని పచ్చిక బీడుగా మార్చి పశువులను మేపాం అనుకొందాం. లేదా దీంట్లో పండిన ఆహార ధాన్యాన్ని పశువులకు మేపాం అనుకొందాం. అప్పుడు ఈ పావు ఎకరం కేవలం ఒక వ్యక్తికే సరిపోతుంది. ఎక్కువమందికి నేరుగా ఆహారాన్ని ఇవ్వ గల భూమిని పశుపాలన కిందకు మళ్ళించినపుడు మాంసం భోగ వస్తువు అవుతుంది. ఇటువంటి ఆహారాన్ని తీసుకొనేటప్పుడు తాను ఎన్ని కష్టాలకు కారకుడవుతున్నాడో ప్రతి వ్యక్తీ ఒక్కసారి ఆలోచించాలి.

స్థానికంగా ఉత్పత్తి అయ్యే కూరగాయలు, ఆహారధాన్యాల కంటే మాంసం, దిగుమతి చేసుకొంటున్న ఆహార పదార్థాల ఉత్పత్తికి ఎక్కువ శక్తి, వనరులు వినియోగమవుతాయి. కాబట్టి వీటిని భోగ వస్తువులుగానే పరిగణించాలి. ఇటువంటి భోగవస్తువులకు బదులు

స్థానికంగా ఉత్పత్తి అయ్యే సీదాసాదా ఆహారానికి పరిమితమయిన వ్యక్తి తక్కువ పనిచేస్తే సరిపోతుంది.

మాంసం, దిగుమతి చేసుకొన్న ఆహారం తినే అలవాటును కొనసాగిస్తే జపాన్ పది సంవత్సరాలలో ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ముప్పై సంవత్సరాలలో తీవ్ర కొరత ఏర్పడుతుంది. వరి అన్నానికి బదులు బ్రెడ్డు తినడమంటే పురోగమించటమన్న వింత అభిప్రాయం జపనీయుల్లో చోటుచేసుకొంది. ఇది సరయినది కాదు. దంపుడు బియ్యం, కూరగాయలు తినడం మోటుగా అనిపించవచ్చు. కానీ ఇది చాలామంచి పోషకాహారం. దీని ద్వారా మనుషులు సీదాసాదాగా జీవించడానికి వీలవుతుంది.

ఆహార సంక్షోభం ఏర్పడితే అది ప్రకృతి శక్తుల లోపం వల్ల కాదు. గొంతెమ్మ కోర్కెలతో మనం సృష్టించుకొన్నదే.

బార్లీ సాగు – ప్రభుత్వ అవక తవక నిర్ణయాలు

నలభై సంవత్సరాలక్రితం అమెరికా జపాన్‌ల మధ్యవైరుధ్యాలు తారాస్థాయినందుకోవడంతో అమెరికా నుంచి గోధుమ దిగుమతి ఆగిపోయింది. స్థానికంగా గోధుమ సాగు చెయ్యడానికి దేశవ్యాప్తంగా ఒక ఉద్యమం మొదలు పెట్టారు. అప్పుడు సాగులోఉన్న అమెరికన్ గోధుమ రకాలు దీర్ఘకాలిక మయినవి. ఇవి జపాన్‌లో వానాకాలం మధ్య కోతకు వచ్చేవి. రైతులు కష్టించి పండించినదంతా వానలో కుళ్ళిపోయేది. ఈ రకాలు తెగుళ్ళకు ఎక్కువగా లోనయ్యేవి. ఈ కారణాల వల్ల గోధుమసాగు చెయ్యడానికి రైతులు అంత ఉత్సాహం చూపేవారు కారు. పైగా ఇవి అంత రుచిగా కూడా ఉండేవి కావు.

జపాన్ లో తరతరాలుగా సాగులో ఉన్న రై, బార్లీ పంటలు వర్షాకాలానికి ముందు మేనెలలో కోతకు వస్తాయి. కాబట్టి వర్షాల వల్ల నష్టపోవు. అయినప్పటికీ రైతులపై బలవంతంగా గోధుమ సాగును రుద్దారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల ప్రజలు నవ్వుకొన్నప్పటికీ ఓపికగా దానిని అనుసరించారు.

యుద్ధం ముగిసిన తరువాత అమెరికానుంచి తిరిగి పెద్ద ఎత్తున గోధుమ దిగుమతి సాధ్యమయ్యింది. దీనితో జపానులో పండించిన గోధుమ ధర బాగా పడిపోయింది. గోధుమసాగు మాన్పించడానికి ఇది ఒక మంచి కారణమయ్యింది. వ్యవసాయ శాఖ అధికారులు "గోధుమసాగు

మానండి, గోధుమసాగుమానండి" అని చెప్పసాగారు. రైతులు సంతోషంగా గోధుమసాగుమానుకొన్నారు. దీనితో పాటు ప్రభుత్వం సంప్రదాయ శీతాకాలపు పంటలయిన రై, బార్లీ సాగును కూడా నిరుత్సాహపరచసాగింది. దీనివల్ల జపాన్‌లో పొలాలు చలికాలంలో ఖాళీగా ఉండిపోతున్నాయి.

పదిసంవత్సరాల కిందటి మాట. ఎన్.హెచ్.కె. టెలివిజన్ వారు ప్రతిఏటా 'ఉత్తమ రైతు' పోటీలను నిర్వహిస్తారు. ఈపోటీలో నేను ఏహైమ్ ప్రాంతం నుంచిపాల్గొన్నాను. ఆసమయంలో ఒక న్యాయనిర్ణేత "ఫుకుఓకా ! మీరు రై, బార్లీ సాగుఎందుకు మాన లేదు?" అని ప్రశ్నించారు. "రై, బార్లీ పంటలను తేలికగాసాగు చేయవచ్చు. వరి తరువాత ఈ పంటలు సాగుచెయ్యడం ద్వారా జపాను పొలాలనుంచి అత్యధికదిగుబడులు సాధించవచ్చు. అందుకే వీటి సాగు మానలేదు"అని సమాధానమిచ్చాను.

వ్యవసాయ మంత్రిత్వ శాఖనిర్ణయాన్ని వ్యతిరేకించిన వారికి ఉత్తమరైతు బిరుదు రాదన్న సంగతి నాకు అప్పుడే స్పష్టమయ్యింది. "ఇటువంటి పక్షంలో నాకు ఈ బహుమతే వద్దు" అని తెగేసి చెప్పాను. "విశ్వవిద్యాలయంలోఉద్యోగం వదిలి పెట్టి వ్యవసాయం చేయాల్సి ఉంటే నీలాగే చేస్తాను" అని ఒక న్యాయనిర్ణేత వ్యక్తిగతంగా నాతో చెప్పాడు.

ఈ ఘటన జరిగిన తరువాత కొద్ది కాలానికే ఎన్.హెచ్.కె. టెలివిజన్ వారు వివిధ విశ్వవిద్యాలయ అధ్యాపకులతో ఏర్పాటు చేసిన ఒక చర్చా గోష్ఠిలో పాల్గొన్నాను. "రై, బార్లీ సాగు ఎందుకు వదిలి పెట్టడం లేదు?" అని నన్ను మళ్ళీ అడిగారు. నేను ఇంకోసారి స్పష్టంగా వీటిని సాగు చెయ్యకుండా ఉండటానికి సరయిన కారణం ఒక్కటికూడ కనపడటంలేదని చెప్పాను. శీతాకాలపు పంటలు

పండించకుండా ఉండటానికి ఆసమయంలో "ప్రశాంత మయిన చావు" అన్న నినాదం లేవదీశారు. అంటే వరితరువాత శీతాకాలపు పంటలసాగు క్రమేపి అంతరించి పోవాలని వారి ఉద్దేశం. నిజానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ పంటలకు 'దిక్కూ మొక్కూ లేనిచావు' రావాలని కోరుకొంటోంది. దీనికి 'ప్రశాంతమయిన చావు' అని పేరు పెడితే ఎలా సరిపోతుంది? ప్రభుత్వ అసలు ఉద్దేశం గ్రహించిన నేను కోపంతో మండి పోయాను.

నలభై సంవత్సరాలక్రితం గోధుమ సాగు చెయ్యమని ప్రోత్సహించారు. ఇది జపానుకు చెందిన పంట కాదు. దీనివల్లి ఉపయోగాలు లేకపోగా సాగులో అనేక సమస్యలుండేవి. రై,బార్లీ లలో గోధుమ లో ఉన్నన్ని పోషక విలువలు లేవని వీటి సాగు మానుకోమన్నారు. రైతులు అయిష్టంగానే వీటిసాగు మానుకొన్నారు. జపానులో జీవన స్థాయి పెరగడంతో మాంసం గుడ్లు, పాల వినియోగం పెరిగాయి. బ్రెడ్డు తినడం గొప్ప అయ్యింది. రాను రాను మొక్క జొన్న, సోయా చిక్కుడు, గోధుమలను అధిక మోతాదులో దిగుమతి చేసుకోసాగారు. ఈవ్యవసాయ విధానం వల్ల రైతులు తాము పండించనవి మార్కెట్టులో కొనుక్కోడానికి పట్టణాల్లో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇప్పుడు మళ్ళీ ఆహార కొరత మీద ఆందోళన పెరుగుతోంది. రై,బార్లీ ఉత్పత్తితో స్వయం సమృద్ధి సాధించాలంటున్నారు. దీనికోసం సబ్సిడీలు కూడా ఇస్తారంట. ఈ పంటలను రెండు సంవత్సరాల పాటు సాగు చేసిన తరువాత మళ్ళీ వద్దనరని నమ్మక మేముంది? వ్యవసాయ మంత్రిత్వ శాఖకు ఏ పంటలు పండించాలో సరయిన అవగాహన లేదు. పండించే పంటలకూ, ప్రజల ఆహారానికీ మధ్య సంబంధం ఈ శాఖకు తెలియదు. ఇక స్థిరమయిన వ్యవసాయ విధానం ఎలా ఏర్పడుతుంది?

కొండల్లోకి, మైదానాల్లోకి వెళ్ళి వసంతకాలపు ఏడుమూలికలు ఆకురాలేకాలపు ఏడుమూలికలు[1] సేకరించి, తిని చూస్తే మానవ పోషకావసరాలకు ఆధార మేమిటో మంత్రిత్వశాఖ సిబ్బందికి తెలిసివస్తుంది. మరికొంత పరిశోధించి చూస్తే సంప్రదాయంగా పండిస్తున్న వరి, బార్లీ, రై, బక్‌వీట్, కూరగాయలతో ఆరోగ్యప్రదమయిన జీవితం గడపగలమని గ్రహిస్తారు. అప్పుడు వీటిని మాత్రం పండిస్తే చాలన్న నిర్ణయానికి రాగలుగుతారు. దీనితో వ్యవసాయం చాలి తేలిక అవుతుంది.

స్వయం సమృద్ధి ప్రాతిపదికపై కొనసాగే చిన్న కమతాలసాగు సరయినది కాదనీ, ఇది పాత కాలపు పద్ధతి అనీ, సాధ్యమయినంత త్వరగా దీనిని నిర్మూలించాలనీ ఆధునిక అర్థశాస్త్రవేత్తల అభిప్రాయం. అమెరికాలో మాదిరి భారీఎత్తున వ్యవసాయం చేపట్టడానికి పెద్ద పెద్ద కమతాలుండాలని వీరంటారు. ఈవిధమయిన ఆలోచన ఒక్క వ్యవసాయంలోనే కాక అన్ని రంగాల్లోనూ ఉంది.



1. ఇవి చైనీస్ బెల్‌ఫ్లవర్, ఆరోరూట్, థరోరూట్, వాలెరినేసీ, బుష్‌క్లోవర్, వైల్డ్ ఫ్రింగ్‌డ్ పింక్, జపనీస్ పంపాస్ గడ్డి.

వ్యవసాయంపై ఆధారపడి సాధ్యమయినంత తక్కువమంది ఉండాలన్నది వీరి ఆశయం. పెద్ద పెద్ద యంత్రాలనుపయోగించి కొద్ది మందితోనే అధిక దిగుబడులు రాబట్టవచ్చని వ్యవసాయ ఆధికారుల అభిప్రాయం. దీనిని వాళ్ళుప్రగతిగా భావిస్తారు. యుద్ధం తరువాత జపానులో 70-80 శాతం ప్రజలు వ్యవసాయం పైఆధార పడేవారు. అతి కొద్దికాలంలోనే ఆ సంఖ్య 50 శాతానికి, ఆ తరువాత 30 శాతానికి, 20 శాతానికి తగ్గి పోయింది. ప్రస్తుతం వ్యవసాయంపై ఆధార పడి 14 శాతం ప్రజలున్నారు. యూరపు, అమెరికాల్లో పది శాతం ప్రజలే వ్యవసాయంపైఆధారపడి ఉన్నారు. ఈదేశాల స్థాయికి చేరు కోవాలని వ్యవసాయ మంత్రిత్వశాఖవారితాపత్రయం.

నూటికి నూరు శాతం ప్రజలూ వ్యవసాయం చేయడం బాగుంటుందని నా అభిప్రాయం. జపానులో ప్రతివ్యక్తికి సగటున పావు ఎకరం సాగు భూమి లభిస్తుంది. అంటే అయిదుగురున్న కుటుంబానికి ఒకటింపావు ఎకరం వస్తుంది. అయిదుగురికి సంవత్సరం పొడవునా కావాల్సిన ఆహారాన్ని ఈభూమినుండి తేలికగా పొందవచ్చు. ప్రకృతి సేద్య విధానాన్ని అనుసరిస్తూ సామాజిక కార్యక్రమాలలోనూ, గ్రామీణ సమావేశాల్లో నూ పాల్గొనడానికి రైతులకు కావలసినంత తీరిక లభిస్తుంది. ఈదేశాన్ని సుభిక్షంగా, ఆనందమయంగా చేయడానికి ఇంతకన్నా తేలిక మార్గం మరొకటి లేదు.

ప్రకృతిని సేవిస్తే చాలు...
అంతా బాగుంటుంది

కోరికల తీవ్రత కారణంగా ప్రపంచం ప్రస్తుత ఈస్థితిలో ఇరుక్కొంది.

ఇంకా ఇంకా ఎక్కువ, ఇంకా ఇంకా వేగంగా అన్నది అభివృద్ధికి మారు పేరయ్యింది. ఇది సమాజ పతనానికి దారితీస్తుంది. ఇది మనిషినీ ప్రకృతినీ వేరు చేస్తుంది. మానవాళి భౌతిక వస్తువుల పట్ల కోరిక, వ్యక్తిగత లాభాలు విడనాడి ఆధ్యాత్మిక చైతన్యం దారిలో పయనించాలి.

పెద్ద పెద్ద యంత్రాల బారినుండి వ్యవసాయం బయటపడి,



“ ఆధునిక వ్యవసాయంలో రైతుకు ఒక పాట రాయడానికి గాని, ఒక కవిత అల్లడానికి గాని సమయం లేకుండా పోయింది.”

జీవితంతో ముడి పడి ఉన్న చిన్న చిన్న కమతాల వైపు మొగ్గాలి. భౌతిక జీవితానికీ, ఆహారానికి ప్రాధాన్యత తగ్గాలి. ఇది జరిగిన నాడు పని ఆహ్లాదంగా ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితానికి తగిన సమయం దొరుకుతుంది.

రైతు తన కమతాన్ని ఎంతగా పెంచుకొంటూ పోతే అతని శరీరం, ఆత్మ అంతగా డస్సి పోతాయి. ఆధ్యాత్మికంగా సంతృప్తికరమయిన జీవితంనుంచి అతను దూరమవుతాడు. చిన్న చిన్న కమతాలవ్యవసాయం అనాగరికంగా కనిపంచవచ్చు . కాని ఈ విధమయిన జీవితం లోనే మహాపథాన్ని[1] దర్శించ గలరు. మనిషి తన పరిసరాలను లోతుగా అర్థం చేసుకొంటే అతనికి సమస్త లోకాలూ విశదమవుతాయి.

ఒకప్పుడు వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత రైతు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో కొండల్లో కుందేళ్ళను వేటాడుతూ గడిపేవాడు. అతడు పేదరైతు కావచ్చు, కాని అతనికి ఈ విధమయిన స్వాతంత్రం ఉండేది. కొత్త సంవత్సరపు ఈ సెలవలు క్రమేపి రెండు నెలలకు, ఒక నెలకు తగ్గుకుంటూ వచ్చాయి. ఇప్పుడు మూడు రోజుల సెలవలు మాత్రమే మిగిలాయి.

రైతు ఊపిరాడని పనుల్లో ఇరుక్కుపోయాడని ఇది తెలియ చేస్తోంది. పని పాటలతో ఆధ్యాత్మికంగా సంతృప్తి కరమయిన జీవితం అతనికి దూరమయ్యింది. ఆధునిక వ్యవసాయంలో రైతుకు ఒకపాట రాయడానికిగాని, ఒక కవితఅల్లడానికి గాని సమయం లేకుండా పోయింది.

ఒక రోజు నేను గ్రామంలోని గుడి గోడలమీదున్న ఫలకాలను

1. జీవితంలోని దుఃఖాన్ని అధిగమించటానికి బుద్ధుడు సూచించిన ఎనిమిది సూత్రాలను మహాపథమనీ, ఎనిమిది సూత్రాల మార్గమని వ్యవహరిస్తారు. ఈ ఎనిమిది సూత్రాలు : సరయిన విశ్వాసం, సరయిన దృక్పథం, సరయిన వాక్కు, సరయిన క్రియ, సరయిన జీవిత విధానం, సరయిన ప్రయాస, సరయిన ఆత్మ చైతన్యం, సరయిన ధ్యానం.

శుభ్ర పరుస్తున్నాను. వీటి మీద మాసిపోయిన అక్షరాల్లో డజన్ల కొద్ది హైకూ[1] కవితలు కనపడ్డాయి. ఇంత చిన్నగ్రామంలోనూ 20-30 మంది హైకూ కవితలు రాసి గుడిలో సమర్పించు కొన్నారు. ఆ రోజుల్లో వాళ్ళ జీవితాల్లో అంత తీరిక ఉండేదన్నమాట. వీటిల్లో కొన్నికొన్ని చరణాలను కొన్ని వందల సంవత్సరాల క్రితం కూర్చి ఉంటారు. ఇప్పటితో పోలిస్తే వాళ్ళు 'పేద' వాళ్ళే అయ్యుంటారు. అయినా వాళ్ళకు హైకూ కవితలు రాసే తీరిక ఉండేది.

మరి ఇప్పుడో? గ్రామంలో ఒక్కరికి కూడా కవిత్వం రాసే తీరికలేదు. చలి బాగా ఉన్ననెలల్లో కొద్ది మంది రైతులు మాత్రం ఒకటి రెండురోజుల పాటు కుందేళ్ళ వేటకు వెళ్ళగలరు. ఏమయినా తీరిక సమయం దొరికితే టి.వి.ముందు కాలక్షేపం చేస్తారు. ఒకప్పుడు రైతుల జీవితాలను సుసంపన్నం చేసిన ఆట, పాటలు ఈనాడు అంతరించి పోయాయి. వ్యవసాయం ఆధ్యాత్మికంగా బలహీనపడి, దారిద్ర్యాన్ని అనుభవిస్తోందనటంలో నా ఉద్దేశం ఇదే. వ్యవసాయానికి భౌతిక లాభాలు మించి మరో విషయం పట్టడంలేదు.

ఒక చిన్న ఊరిలో పరి పూర్ణమయిన జీవితాన్ని గడపవచ్చని టావో తత్వవేత్త లావోత్సు[2] అభిప్రాయం. జెన్‌మత[3]సంస్థాపకుడయిన

1. ఇది జపాను సంప్రదాయ సిద్ధమయిన కవిత. ఇందులో మాత్రాచంధస్సుతో మూడు పంక్తులుంటాయి. మొదటి రెండు పంక్తులలో ఉన్న విషయానికి మూడో పంక్తి 'కామెంట్'లాగా ఉంటుంది. ఉదా॥ విసనకర్రల వ్యాపారి/ గాలిమోసుకెళ్తున్నాడు/ఊపిరాడని ఉక్కపోత.
2. క్రీస్తుపూర్వం 604 సం॥లో చైనాలో జీవించిన తత్వవేత్త. మనకు గోచరించే వైరుధ్యాలన్నిటి వెనుక "ఐక్యత" ఉందంటాడు. 'టావొచిచింగ్' అన్న పుస్తకం రాశాడు. ఇతని తత్వాన్ని టావోయిజమ్ అంటారు.
3. 'ధ్యానానికి' ప్రాధాన్యమిచ్చే మహాయానా బౌద్ధమత సంప్రదాయం. చైనాలో 'చాన్' అంటారు. చైనాలో క్రీ॥శ॥ 6వ శతాబ్దంలోనూ, జపాన్‌లో 12వ శతాబ్దంలోనూ వృద్ధి చెందింది.

బోధిధర్ముడు ఎటూ కదలకుండా ఒక గుహలో 9 సంవత్సరాల పాటు గడిపాడు. డబ్బు గురించి చింతించడం, ఇంకా ఇంకా విస్తరించాలనుకోవడం,అభివృద్ధి చెందాలనుకోవడం, వ్యాపార పంటలు సాగు చెయ్యడం, ఎగుమతి చెయ్యటం వంటివి రైతు జీవిత విధానం లోవి కావు. తన చిన్న మడిని జాగ్రత్తగా చూసుకొంటూ పూర్తి స్వేచ్ఛ, కావలసినంత తీరికతో ప్రతిరోజూ గడపటమే అసలయిన వ్యవసాయ విధానం.

అనుభూతిని భౌతికం, ఆధ్యాత్మికం అని రెండుగా విడగొట్టటం సంకుచిత దృష్టి అవుతుంది. విషయాన్ని గందరగోళ పరుస్తుంది. మనిషి ఆహారం మీద ఆధార పడి బతకటంలేదు. ఆమాట కొస్తే అసలు ఆహారమేదోమనకు తెలియదు. ఆహారం గురించి ప్రజలు ఆలోచన మానటం మంచిది. ఇదేవిధంగా జీవితపరమార్ధం ఏమిటో తెలుసుకొనే ప్రయత్నాలు ఆపటం మంచిది. పెద్ద పెద్ద ఆధ్యాత్మిక సమస్యలకు జవాబులు బోధపడవు. దీనివల్ల నష్టమేమిలేదు. జీవితమనే వాస్తవాన్ని ముఖాముఖి ఎదుర్కోటానికేమనం ఈప్రపంచంలో పుట్టాం, బతుకుతున్నాం.

పుట్టుక ఫలితమే జీవితం. ఇంతకు మించి ఏమీ లేదు. బతకటానికి ఏమితిన్నా, లేదా బతకటానికి ఏవేవి తప్పనిసరిగా తినాలని మనుషులను కొన్నా ఇదంతావాళ్ళు ఊహించుకొన్నదే. తమ ఆలోచనలను పక్కకు పెట్టి ప్రకృతికి అనుగుణంగా ప్రజలు బతికితే ఆకలికి మాడవలసిన పరిస్థితి ఈప్రపంచంలో రాదు.

ఈక్షణం, ఇలా బతకటానికి మించి మానవ జీవితానికి వేరే పరమార్ధం లేదు. శాస్త్ర విజ్ఞానం జీవితానికి మూలమయిన నాడు మనుషులు పిండి పదార్ధం, కొవ్వు, మాంస కృత్తుల మీద ఆధారపడి బతుకుతున్నారనీ, మొక్కలు నత్రజని, భాస్వరం, పొటాష్ మీద

ఆధారపడి బతుకుతున్నాయనీ అనిపిస్తుంది.

ప్రకృతిని ఎంత సోధించినా, ఎన్ని పరిశోధనలు చేసినా చివరకు అది అంతుపట్టని అద్భుతమన్న నిర్ణయానికి శాస్త్రజ్ఞులు రాకతప్పదు. పరిశోధనల ద్వారా, ప్రయోగాల ద్వారా ప్రకృతికి మించి సృష్టి చెయ్యగలమనుకోవటం కేవలం భ్రమ. అంతు తెలియని ప్రకృతి తత్వం గుర్తించడానికి మనుషులు పాట్లు పడుతున్నారనిపిస్తోంది.

రైతు ప్రకృతికి సేవ చేస్తే చాలు... అంతా బాగుంటుంది. ఒకప్పుడు వ్యవసాయం పవిత్రమయిన పనిగా ఉండేది. ఈ ఆదర్శం నుండి మానవాళి వేరు కావడం వల్లనే ఆధునిక, వ్యాపార సరళి వ్యవసాయం పుట్టింది. డబ్బులు కోసం పంటలు పండించటం మొదలు కావడంతో అసలు సూత్రాలను రైతు మరచిపోతున్నాడు.

వ్యాపారికి సమాజంలో పాత్ర ఉంది. కాని దానిని అందలం ఎక్కించిననాడు జీవితమూలాన్ని గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రకృతి సిద్ధాంతాల కనుగుణంగా చేపట్టిన వ్యవసాయం జీవిత మూలానికి అతి దగ్గరగా ఉంటుంది. ప్రకృతి పరిసరాల మధ్య జీవిస్తూ, పనిచేస్తూ గడిపే రైతులకూ ప్రకృతి అంటే తెలియకపోవచ్చు. అయినప్పటికీ ప్రకృతి గురించి మరింత ఎరుక ఏర్పడటానికి వ్యవసాయంలోనే ఎక్కువ అవకాశాలున్నాయని నా అభిప్రాయం.

"వసంతంలో వానే వస్తుందో వరదే వస్తుందో ఏ మెరుక, ఈ రోజు మాత్రం పొలంలో నా పని సాగుతుంది ఆగక". ఇవి ఓ జానపద గీతంలోని పదాలు. జీవిత విధమయిన వ్యవసాయ సత్యాన్ని ఈ పదాలు వ్యక్తపరుస్తాయి. ఎంత దిగుబడి అయినా రానీ, తినటానికి సరిపడా ఉండనీ, ఉండకపోనీ. ప్రకృతి కనుసైగల కనుగుణంగా పంట విత్తి, మొక్కలను జాగ్రత్తగా చూసుకోవటంలో ఎంతో ఆనందముంది.

సేంద్రియ వ్యవసాయంలో విభిన్న ధోరణులు

'పని' అన్న పదం ఉపయోగించటమే నాకు అంతగా ఇష్టముండదు. ఈ ప్రపంచంలో మనుషులొక్కరే పని చెయ్యాల్సిన అవసరమున్న జంతువులు. ఇంతకంటే హాస్యాస్పదమయినది మరొకటి లేదు. ఇతర జంతువులు హాయిగా బతికేస్తాయి. కాని మనుషులే బతకటానికి పని చెయ్యాలన్న అభిప్రాయంతో పగలూ రాత్రీ కష్టపడుతుంటారు. ఎంత ఎక్కువ పని ఉంటే, సమస్య ఎంత క్లిష్టంగా ఉంటే అంత బాగుందనుకొంటారు. ఈ విధమయిన ఆలోచన విడిచిపెట్టి కావలసినంత తీరిక సమయంతో సుఖమయ జీవితం గడపటం మొదలు పెట్టాలి. జంతువులు పొద్దున లేచి తినటానికి ఏముందో వెతుక్కుంటాయి. పగలంతా హాయిగా నిద్రపోతాయి. వాటిది ఎంత చక్కని జీవితం అనిపిస్తుంది.

ప్రతి వ్యక్తీ తన రోజువారీ అవసరాలను తానే ఉత్పత్తి చేయటం మొదలు పెడితే మనుషులు కూడా ఇంత సంతోషమయ జీవితాన్ని గడపవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో అందరూ అనుకొనే 'పని' ఉండదు. కేవలం అవసరమయినంతవరకు చేస్తే సరిపోతుంది.

మానవ సమాజం ఈ దిశలో పయనించేటట్లు చెయ్యటమే నా లక్ష్యం. కొండపైన గుడిసెల్లో సామూహిక జీవితంలో పాలుపంచుకొంటూ వ్యవసాయ కార్యక్రమంలో సహాయపడుతున్న ఏడెనిమిది మంది యువతీయువకులది కూడా ఇదే లక్ష్యం. చిన్న చిన్న గ్రామాలు,

సామూహిక కేంద్రాలు నెలకొల్పి వ్యవసాయం చేస్తూ జీవితం గడపాలన్న ఉద్దేశంతో వీళ్ళున్నారు. వ్యవసాయంలో మెలకువలను గ్రహించటానికి ఇక్కడకు వచ్చారు.

దేశవ్యాప్తంగా పలుచోట్ల కొత్తగా ఎన్నో సామూహిక కేంద్రాలు ఏర్పడుతున్నాయి. కొంతమంది వాళ్ళని హిప్పీ[1]లనవచ్చు. నాకు అభ్యంతరం లేదు. కలసి పని చేయటం, కలసి జీవించటం, తిరిగి ప్రకృతి విధానాలకు చేరుకోవాలనుకోవటంలో వాళ్ళు 'రేపటి రైతు'కు ఆదర్శప్రాయులు. స్థిరంగా వేళ్ళూనుకోవటం అంటే సొంత భూమి నుంచి వచ్చిన దాని మీద బతకటమని వాళ్ళకు తెలుసు. తమ ఆహార అవసరాలను స్వయంగా సమకూర్చుకోలేని బృందం ఎంతో కాలం నిలవదు.

వీళ్ళలో చాలామంది భారత దేశం తిరిగి ఉంటారు. ఫ్రాన్స్‌లో గాంధిగ్రామం[2] చూసి ఉంటారు. ఇజ్రాయల్‌లోని కిబ్బుట్జ్[3]లో కొంత

1. 1960లో అమెరికా యువతలో అప్పటి సామాజిక వ్యవస్థ, విలువలకు వ్యతిరేకంగా పుట్టిన ఉద్యమం. వీరి వేషధారణ ఆనాటి సమాజానికి భిన్నంగా ఉండేది. జీవితంలో స్పందన, వ్యక్తిగత సంబంధాలు ఉండాలని కోరుకొన్నవాళ్ళు. విశాల చైతన్యం అలవరచుకోటానికి మత్తుమందులు ఉపయోగించేవారు.
2. మహాత్మాగాంధీ వల్ల ప్రభావితమయిన వాళ్ళూ, ఆయనను కలసిన వాళ్ళూ తమ దేశాలకు తిరిగి వెళ్ళి అక్కడ గాంధీ గ్రామాలనూ, ఆశ్రమాలనూ నెలకొల్పారు. ఇది అటువంటిదే అయి ఉంటంది.
3. హిబ్రూ భాషలో కిబ్బుట్జ్ అంటే సమావేశం, సహజీవనం అని అర్థం. 1948లో ఇజ్రాయల్ ఏర్పడక ముందు జ్యూయిష్ నేషనల్ ఫండ్ కింద ఉన్న భూమిలో ఈ సహజీవన కేంద్రాలు ఏర్పడ్డాయి. మొట్టమొదటి కిబ్బుట్జ్ 1910లో ఏర్పడింది. ప్రజల ప్రాథమిక అవసరాలు, ఆరోగ్యం అవసరాలు, సామాజిక అవసరాలు తీరిన తరువాత మిగిలిన లాభాలను తిరిగి పెట్టుబడిగా పెట్టేవారు. కలిసి వండుకొని కలిసి తినేవారు. పెద్దవాళ్ళకు విడిగా నివాసం ఉండేది. పిల్లలందరూ కలసి ఉండేవాళ్ళు. వాళ్ళ సంరక్షణ కలసికట్టుగా జరిగేది. కిబ్బుట్జ్‌లను అందులో నివసిస్తున్న ప్రజలే నిర్వహించేవాళ్ళు.

కాలం గడిపి ఉంటారు. పశ్చిమ అమెరికా ఎడారుల్లోనూ, కొండల్లోనూ అనుభవం పొంది ఉంటారు. టొకారో దీవుల సమూహంలోని సువనోస్ దీవిలో కుటుంబ జీవనంలో కొందరు కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. గిరిజనుల పద్ధతులకు సాధ్యమయినంత చేరువుగా వెళ్లాలని చూస్తున్నారు. ఇటువంటి వాళ్ళ ఉద్యమ ఫలితంగానే మంచి రోజులకు దారి ఏర్పడుతుందని నా అభిప్రాయం. సేంద్రియ వ్యవసాయ విధానం ప్రస్తుతం వీళ్ళలోనే చోటు చేసుకొని విస్తరిస్తోంది.

వివిధ మతాలకు చెందిన బృందాలు కూడా సేంద్రియ వ్యవసాయం చేపట్టడానికి ముందు కొస్తున్నాయి. మనిషి అసలు స్వభావం ఏమిటో గ్రహించటానికి ఏ పద్ధతి అనుసరించినప్పటికీ ఆరోగ్యం పట్ల శ్రద్ధతో మొదలుపెట్టడం తప్పనిసరి. పరిపూర్ణమయిన, సహజమయిన ఆహారాన్ని పండిస్తూ, తింటూ గడిపే రోజువారీ జీవనమే సరయిన 'ఎరుక'కు దారితీస్తుంది. అందుకే చాలామంది సేంద్రియ వ్యవసాయం మొదలు పెట్టడం సబబనుకొన్నారు.

నేను వ్యక్తిగతంగా ఏ మతానికి చెందను. నా అభిప్రాయాలను అందరితో స్వేచ్ఛగా చర్చిస్తాను. క్రైస్తవం, బౌద్ధం, షింటో ఇంకా ఇతర మతాల మధ్య తేడాలునాకు పట్టవు. కానీ అన్ని మతాల వారు నా పొలం పట్ల ఆకర్షితులవటం నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. భూసార విశ్లేషణ, ఉదజని సూచిక, దిగుబడులు వంటివి లెక్కలోకి తీసుకోని తత్వశాస్త్రం మీద ప్రకృతి వ్యవసాయం ఆధారపడి ఉండటమే దీనికి కారణమనిపిస్తుంది.

కొంతకాలం క్రితం పారిస్‌లోని సేంద్రియ వ్యవసాయ కేంద్రం నుంచి ఒక వ్యక్తి వచ్చాడు. కొండ పైన ఒక రోజంతా కబుర్లతో గడిపాం. పారిస్‌లో సేంద్రియ వ్యవసాయం పై అంతర్జాతీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారట. దీనికి సన్నాహాలలో భాగంగా ఈ వ్యక్తి ప్రపంచంలోని సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తున్నాడు.

పండ్లతోట చూసిన తరువాత టీ తాగుతూ గత ముప్పై ఏళ్ళ నా అనుభవాలనూ, అభిప్రాయాలనూ చర్చించాం.

చైనా, కొరియా, జపాన్ దేశాల్లో శతాబ్దాల తరబడి వస్తున్న వ్యవసాయ పద్ధతులకూ, పాశ్చాత్య దేశాల్లో ప్రస్తుతం ఆచరణలో ఉన్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులకూ అంతగా తేడా లేదని చెప్పాను. జపానులో మైజీ, తైషో (క్రీ.శ . 1868-1926) శకాలలోనూ, రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే వరకు కొన్ని ప్రాంతాల్లోనూ ఈ పద్ధతులు ఆచరణలో ఉండేవి.

ఈ విధానంలో పెంటపోగు ఎరువుకూ, పశువుల పెంట, మానవ మల మూత్రాలను తిరిగి వినియోగించటానికి ప్రాధాన్యం ఉండేది. పంటల మార్పిడి, మిశ్రమ పంటలు, పచ్చిరొట్ట పైరులు వంటివి ఆచరణలో ఉండేవి. భూమి పరిమితం కాబట్టి ఎప్పుడూ ఖాళీగా వదిలి పెట్టేవారు కారు. కాలానుగుణంగా నాట్లు, కోత జరిగేవి. సేంద్రియ పదార్థాన్నంతటినీ పెంటపోగు ఎరువుగా మార్చి పొలాలకు వాడేవారు. అధికారులు కూడా పెంటపోగు ఎరువు వాడకాన్ని ప్రోత్సహించేవారు. సేంద్రియ పదార్థాల పైనా, పెంటపోగు తయారు చేసే పద్ధతులపైనా వ్యవసాయ పరిశోధనలు కేంద్రీకరించేవి.

ఆధునిక కాలం మొదలయ్యే వరకు పశువులు, పంటలు, మనుషులు ఒకటిగా ఉన్న వ్యవసాయ విధానం జపానులో ఉంది. దీని నుంచే పాశ్చాత్య దేశాలలోని సేంద్రియ వ్యవసాయ విధానం పుట్టిందని చెప్పవచ్చు.

ఆ తరువాత ప్రకృతి సేద్యంలో రెండు ధోరణులున్నాయని చెప్పాను. మొదటి దాని పరిధి చాలా విస్తృతమయినది, ఈ భౌతిక ప్రపంచానికి అతీతమయినది. రెండవది ఈ సాపేక్షిక ప్రపంచానికి[1] పరిమితమయిన సంకుచిత ప్రకృతి వ్యవసాయం. బౌద్ధమత పరిభాషలో

1. ఇది మేథస్సు అర్థం చేసుకోగల ప్రపంచం.

చెప్పాలంటే మొదటిది మహాయాన, రెండవది హీనాయాన[1] ప్రకృతి సేద్యం.

మనిషి ప్రకృతి ఒకటయినప్పుడు విస్తృతమయిన, మహాయాన ప్రకృతిసేద్యం దానంతట అదే పుట్టుకొస్తుంది. ప్రకృతి ఏవిధంగా ఉంటే మానవ బుద్ధి ఏ విధంగా ఉంటే ఇదీ అదే విధమయిన రూపం తీసుకొంటుంది. మనిషి తనను తాను ప్రకృతికి అప్పగించుకొంటే ప్రకృతి సమస్తమూ సమకూరుస్తుందన్న విశ్వాసంపై ఇది ఆధారపడి ఉంది. పోలిక చెప్పాలంటే ప్రపంచాతీత ప్రకృతి సేద్యంలో మనిషికీ, ప్రకృతికీ మధ్య సంబంధం ఆదర్శ వివాహంలోని భార్యాభర్తల వంటిది. ఈ వివాహం ఒకరు చేసిందీ కాదు, ఒకరు అంగీకరించిందీ కాదు. ఈ ఆదర్శమయిన దాంపత్యం దానంతట అదే ఏర్పడుతుంది.

దీనికి విరుద్ధంగా సంకుచితమయిన ప్రకృతి సేద్యం 'సేంద్రియ' పద్ధతి అనో, ఇతర పద్ధతి అనో బుద్ధి పూర్వకంగా ప్రకృతిని అనుకరించడానికి చేసే ప్రయత్నం. ఒక నిర్దుష్ట లక్ష్యాన్ని చేరుకోడానికి వ్యవసాయం ఉపయోగపడుతోంది. ప్రకృతిని ఎంత గాఢంగా ప్రేమించినప్పటికీ, వివాహానికి ఎంతగా సంసిద్ధత వ్యక్త పరిచినప్పటికీ ఇద్దరి మధ్య సంబంధం తాత్కాలిక మయినదే. ఇక ఆధునిక వ్యాపార సరళి వ్యవసాయానికి అదేమిటో అంతుపట్టనప్పటికీ జ్ఞానాన్ని కోరుకొంటుంది. దీనికి సాధనంగా ప్రకృతిని ఉపయోగించుకొంటుంది. ఎవరితో బంధం ఏర్పరచుకోవాలో తెలియక నిరంతరం కొట్టుమిట్టాడు తుంటుంది.

1. మహాయాన, హీనాయాన అన్నవి బౌద్ధమతంలో రెండు ప్రధాన ధోరణులు. బౌద్ధమత ధర్మాలను; సూత్రాలను సంపూర్ణంగా అవగాహన చేసుకొన్న ధోరణిగా 'మహాయానా' క్రీ.పూ. 2-క్రీ.శ. 2 శతాబ్దాల మధ్య కాలంలో ముందుకు వచ్చింది. ఈ దృక్పథాన్ని అంగీకరించని వాళ్ళని 'హీనాయాను'లన్నారు.

నేలకు సేంద్రియ ఎరువులు వేయటం మంచిది. పశువులను పెంచటం మంచిది. ప్రకృతిని ఇంతకంటే సమర్ధంగా ఉపయోగించుకోలేం. సంకుచిత దృష్టితో చేసే సేంద్రియ వ్యవసాయం ఈ ధోరణిలో సాగుతుంది. వ్యక్తిగత ఆచరణ దృష్ట్యా చూస్తే ఇది మంచిదే. కానీ కేవలం దీనిద్వారానే ప్రకృతి వ్యవసాయాన్ని కాపాడలేం. సంకుచిత సేంద్రియ వ్యవసాయ విధానం కత్తియుద్ధంలో ఒకవేటు సిద్ధాంతం వంటిది. నైపుణ్యంతో కూడిన పద్ధతిని తెలిసి, కావాలని ఉపయోగిస్తుంది. ఆధునిక వ్యాపార సరళి వ్యవసాయం రెండువేట్లు సిద్ధాంతం వంటిది. కత్తితో ఎక్కువ దెబ్బలు కొట్టి రక్షణ వలయం నిర్మించుకోవడం ద్వారా గెలుపు సాధించ వచ్చని దీని నమ్మకం.

అసలయిన ప్రకృతి వ్యవసాయం ఈ రెంటికీ విరుద్ధంగా కత్తివేటునే ఉపయోగించని సిద్ధాంతం వంటిది. అది ఎక్కడికీ వెళ్ళదు. విజయం కోరుకోదు. "ఏమీ చేయకుండా ఉండటమే" ప్రతిరైతూ చెయ్యాలి. లావోత్సు క్రియా రహిత ప్రకృతి గురించి మాట్లాడాడు. అతడు రైతు అయినట్లయితే ప్రకృతి వ్యవసాయం చేపట్టి ఉండేవాడని నా అభిప్రాయం. గెలవాలనీ, వ్యతిరేకించాలనీ లేని మనస్సుతో కూడుకొన్న గాంధీజీ ఆచరణ విధానం, పద్ధతిలేని పద్ధతి ప్రకృతి వ్యవసాయానికి దగ్గరగా ఉంటుందని నా నమ్మకం. సుఖ, సంతోషాలు పొందాలన్న తాపత్రయంలో వాటిని కోల్పోతామని అర్థం చేసుకోగలిగిన నాడు ప్రకృతి వ్యవసాయ సారం బోధపడుతుంది. వ్యవసాయ అంతిమ లక్ష్యం పంటలు పండించటం కాదు. పరిపూర్ణ వ్యక్తిని తయారు చేయడం.



ఆహారం పట్ల గందరగోళం

కొండమీద గుడిసెలో మూడేళ్ళుగా ఉంటున్న ఒక యువకుడు ఒకరోజు "ప్రకృతి ఆహారం అన్న పదాన్ని అందరూ విరివిగా ఉపయోగించేస్తున్నారు. దీని వల్ల దానికి అర్థం లేకుండా పోతోంది" అన్నాడు.

నిజమే ప్రకృతి ఆహారం అన్న పదం ఎక్కువగా వాడుతున్నారు. అదంటే ఏమిటో స్పష్టంగా ఎవరికీ తెలియదు. కృత్రిమ రసాయనాలూ, ఇతర పదార్థాలూ కలవని ఆహారం ప్రకృతి ఆహారమని కొందరి అభిప్రాయం. ప్రకృతిలో దొరికిన ఆహారాన్ని అదే రూపంలో తీసుకోవటం ప్రకృతి ఆహారమని మరి కొందరు అనుకొంటారు.

నిప్పు, ఉప్పు ఉపయోగిస్తే ప్రకృతి ఆహారం అవుతుందా, కాదా అని ప్రశిస్తే సమాధానంగా అవుననీ చెప్పవచ్చు, కాదనీ చెప్పవచ్చు. ఆదిమ కాలంలోలాగా ఆకులూ, అలములూ ఏరుకు తినటం, జంతువులను వేటాడి తినటం మాత్రమే ప్రకృతి ఆహారం అయితే నిప్పు, ఉప్పు ఉపయోగించే ఆహారం ప్రకృతి ఆహారం కాదు. నిప్పు, ఉప్పుల ఉపయోగాన్ని అలవర్చుకోవటం మానవ జాతికి ప్రకృతి సిద్ధ గమ్యమని అనుకొంటే వీటిని ఉపయోగించి చేసిన ఆహారం కూడా ప్రకృతి ఆహారమవుతుంది. మానవుడు వండిన పదార్థాలు మంచివా, లేక సహజరూపంలో ఉన్న పదార్థాలు మంచివా? సాగుచేసిన పంటలు ప్రకృతి ఆహారమా, కాదా? ఏది ప్రకృతి ఆహారం? ఏది కాదు? తేల్చడానికి గీత ఎక్కడ గీస్తారు?

మై జీశకం (క్రీ.శ. 1868-1912)లో సాగెన్ ఇషిజుకా బోధనల ద్వారా మొట్టమొదట ప్రకృతి ఆహారం అన్న పదం వ్యాప్తిలోకి వచ్చింది. ఇతని సిద్ధాంతాలకు తరువాత కాలంలో సకురజావా, నికీలు మెరుగు పెట్టారు. ఐచింగ్[1] సిద్ధాంతమయిన ఇన్-యాంగ్[2] మీదా, అద్వైతం మీదా ఈ పోషక సూత్రాలు ఆధారపడి ఉన్నాయి. ఈ విధమయిన ఆహారంలో దంపుడు బియ్యం, కూరగాయలు ప్రధానంగా ఉండటంవల్ల ప్రకృతి ఆహారమంటే ఇదేనన్న అభిప్రాయ మేర్పడింది. కానీ ఇది సరికాదు.

మరి ప్రకృతి ఆహారమంటే ఏమిటి ?

మానవ జ్ఞానా సముపార్జనకు విచక్షణ చేసేది, విచక్షణ చేయనిది[3] అని రెండు విభిన్న మార్గాలున్నాయి. ప్రకృతి ఆహారంపట్ల గందరగోళానికి

1. చింగ్ అన్నది చైనాలో ప్రామాణిక గ్రంథాలకు వ్యవహార పదం. క్రీస్తు పూర్వం 551 సంవత్సరంలో పుట్టిన కుంగ్ (Kung) రాసిన అయిదు పుస్తకాల్లో ఐ చింగ్ (I Ching) ఒకటి. పరిణామాలకు సంబంధించిన పుస్తకం (Book of Changes).
2. ఇన్-యాంగ్ (Yin Yang) అన్నవి ప్రతి దాంట్లోనూ ఉండే రెండు అంశాలు. ఇన్ స్త్రీ అంశమయితే, యాంగ్ పురుషాంశం. ఈ రెండింటిమధ్య గతి తార్కిక సంబంధం ఉంటుంది. టావో తత్వం మూలం ఇదే.
3. ప్రాచ్యదేశాల తత్వవేత్తలు అనేక మంది ఈ రెండు మార్గాల గురించి పేర్కొన్నారు. విశ్లేషణాత్మక మానవ మేధ అనుభవాన్ని తార్కిక చట్రంలోకి క్రమపరచే ప్రయత్నం వల్ల విచక్షణ చేసే జ్ఞానం పుడుతుంది. ఈ ప్రక్రియలో మనిషి తనను తాను ప్రకృతి నుంచి వేరు చేసుకొంటాడని ఫుకుఓకా నమ్మకం. దీనిని "పరిమిత శాస్త్రీయ సత్యం, నిర్ణయం", అని అంటారు.

   వ్యక్తి చేతనమయిన ప్రయత్నాలన్నిటినీ వదిలిపెట్టి, ఎటువంటి భాష్యాలు చెప్పకుండా అనుభవాన్ని యథాతథంగా అంగీకరించటం ద్వారా విచక్షణ చేయని జ్ఞానం పుడుతుంది.

   ప్రాపంచిక సమస్యలను విశ్లేషించటానికి విచక్షణ చేసే జ్ఞానం అవసరమే కానీ ఇది చాలా సంకుచిత దృక్పథాన్ని మాత్రమే ఇస్తుందని ఫుకుఓకా అభిప్రాయం.

కారణమిదే. విచక్షణ ద్వారానే ఖచ్చితంగా అర్థం చేసుకోగలమని చాలామంది పొరబడుతుంటారు. కాబట్టి ప్రకృతి అన్న పదం ఉపయోగించినపుడు విచక్షణ ద్వారా మానవ మేధస్సు అర్థం చేసుకొన్న ప్రకృతి అని చెప్పుకోవాలి.

మానవ మేధ సృష్టించే ప్రకృతి చిత్రాన్ని నేను తృణీకరిస్తాను. విచక్షణ చేయని బుద్ధి ద్వారా అనుభవంలోకి వచ్చే ప్రకృతి దీనికంటే ఎంతో భిన్నమయినది. ప్రకృతిపట్ల మనం ఏర్పరచుకొన్న తప్పుడు అభిప్రాయాన్ని తొలగించుకోగలిగితే ప్రపంచంలోని గందరగోళమంతా తొలగిపోతుందని నా నమ్మకం.

విచక్షణ చేసే జ్ఞానం నుంచే పాశ్చాత్య దేశాల్లో విజ్ఞాన శాస్త్రాలు పుట్టాయి. దీని నుంచే ఇక్కడ కూడా ఐచాంగ్ ఇన్-యాంగ్‌ల సిద్ధాంతం రూపొందింది. శాస్త్రీయ సత్యాలు ఎన్నటికీ అసలయిన సత్యాన్ని చేరుకోలేవు. తత్వశాస్త్రాలన్నీ ఈ ప్రపంచానికిచ్చే భాష్యాలు మాత్రమే. విధ్వంసానికి గురయిన ప్రకృతే శాస్త్రీయ విజ్ఞానానికి బోధపడుతుంది. ఇది ఆత్మ లేని అస్థిపంజరం లాంటిది. తాత్విక



మధ్యాహ్నపు భోజనం

జ్ఞానం అర్థం చేసుకొనే ప్రకృతి మానవ ఊహల్లో పుట్టినది. దీనికి ఆత్మ ఉంటుంది కానీ రూపంలేని భూతం వంటిది.

విచక్షణ చేయని జ్ఞానాన్ని పొందటానికి సహజ జ్ఞానం (ఇన్ట్యూషన్) తప్ప వేరే మార్గం లేదు. దీనిని కూడా ప్రజలు తమకు తెలిసిన సహజాతం(ఇన్స్టింక్ట్)తో ఇమడ్చాలని అనుకొంటారు. వాస్తవానికి జ్ఞానం మూలం ఎవరికీ తెలియదు. విచక్షణ చేసే బుద్ధిని విడిచిపెట్టి, సాపేక్ష ప్రపంచాన్ని అధిగమించినప్పుడే ప్రకృతి అసలు రూపం బోధ పడుతుంది. మొదటి నుంచీ తూర్పు, పడమరలు లేవు. నాలుగు కాలాలు లేవు. ఇన్-యాంగ్ లేవు.

"అంటే మీరు ఒక్క విజ్ఞాన శాస్త్రాలనే కాక ఐ చాంగ్ ఇన్-యాంగ్ సూత్రాల మీద ఆధారపడిన ప్రాచ్య దేశాల తత్వ శాస్త్రాన్ని కూడా నిరాకరిస్తున్నారా?" అని ఒక యువకుడు ప్రశ్నించాడు.

మార్గం చూపేవిగా, తాత్కాలిక సహాయంగా ఇవి ఉపయోగ పడతాయి. కానీ ఇవే అసలు పరమార్థం అనుకోకూడదు. శాస్త్రీయ సత్యాలూ, తత్వశాస్త్రాలూ ఈ సాపేక్ష ప్రపంచానికి చెందినవి. ఇందులో మాత్రమే వీటికి విలువ ఉంటుంది. ఉదాహరణకు ప్రకృతి అస్తవ్యస్తమై, శరీరమూ, ఆత్మా శిథిలమై సాపేక్ష ప్రపంచంలో నివసిస్తున్న ఆధునిక కాలపు ప్రజలకు ఇన్-యాంగ్ సరయిన మార్గాన్ని చూపే దిక్సూచిగా బాగా ఉపయోగపడుతుంది.

ప్రకృతి ఆహారాన్ని అలవర్చుకొనే దాకా ఇటువంటి సిద్ధాంతాలు ఆహారాన్ని పరిమితం చేసుకోటానికి ఎంతగానో ఉపయోగపడతాయి. సాపేక్ష ప్రపంచాన్ని అధిగమించి, స్వేచ్ఛా జగత్తులో విహరించడం మానవుని అంతిమ లక్ష్యం అని గుర్తించినపుడు ఏదో ఒక సిద్ధాంతాన్ని పట్టుకొని వేలాడటం ఎంత దురదృష్టకరమో బోధ పడుతుంది. ఇన్-యాంగ్ తిరిగి ఏకమయిన ప్రపంచంలోకి మనిషి చేరుకొన్ననాడు ఈ

గుర్తుల అవసరం తీరిపోతుంది.

"ప్రకృతి జీవి అయిననాడు ఏది కావాలనుకొంటే అది తినవచ్చా?' అని ఇటీవలే ఇక్కడకు వచ్చిన ఒక యువకుడు అడిగాడు.

చీకటి గుహకు అవతలి వైపు వెలుతురుంటుందని ఆశిస్తే గుహలోని చీకటి మరింత సేపుంటుంది. రుచికరమయినది తినాలని లేనపుడు తినే ప్రతిదాని అసలు రుచి తెలుస్తుంది. సాధారణ మయిన పదార్థాలతో ప్రకృతి ఆహారాన్ని సిద్ధం చెయ్యడం ఏమంత కష్టం కాదు. కానీ ఇటువంటి పదార్థాలను నిజంగా ఆస్వాదించ గలవాళ్ళు చాలా అరుదు.

ప్రకృతి ఆహార మండలం

ప్రకృతి వ్యవసాయం పట్ల నాకున్న అభిప్రాయాలు ప్రకృతి ఆహారానికి కూడా వర్తిస్తాయి. విచక్షణ చేయని బుద్ధితో ప్రకృతిని అవగాహన చేసుకొన్న విధానానికి అనుగుణంగా ప్రకృతి వ్యవసాయం ఉంటుంది. ఇదే విధంగా పిచ్చిగా పెరుగుతున్న, ప్రకృతి విధానానికి అనుగుణంగా పెంచిన ఆహారాన్ని సేకరించి తినడం ప్రకృతి ఆహారమవుతుంది. ఇది విచక్షణ చేయని బుద్ధి, ఉద్దేశ రహిత చర్యలతో ఉంటుంది.

ఉద్దేశ రహిత చర్యల గురించీ, పద్ధతి లేకపోవటం గురించీ మాట్లాడినప్పటికీ రోజువారి చర్యల ద్వారా ఉత్పన్నమై, తరతరాలుగా వస్తున్న విజ్ఞతను అంగీకరించాలి. ప్రకృతి నుంచి వేరుగా మానవుడు వేసిన మొట్ట మొదటి అడుగని నిప్పు, ఉప్పుల ఉపయోగాన్ని కొందరు విమర్శించవచ్చు. ఆదిమ ప్రజలు అలవరుచుకొన్న సహజవిజ్ఞతగా భావించి ప్రకృతి ప్రసాదంగా వీటిని అంగీకరించాలి.

మానవుని నివాస ప్రాంతాలలో వందల వేల ఏండ్లలో రూపొందిన పంటల రకాలు విచక్షణ చేసే జ్ఞానం వల్ల తయారయినవి కావు. వీటిని సహజ ఆహారంగా స్వీకరించవచ్చు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రకరకాల పద్ధతుల ద్వారా రూపొందించే పంటల రకాలు ప్రకృతి ఆహారం కావు. ఇవి ప్రకృతికి దూరంగా ప్రయోగశాలల్లో పుట్టాయి. ఇదే విధంగా సాంద్ర పద్ధతుల్లో పెంచిన చేపలూ, పశువులూ ప్రకృతి ఆహారం కోవలోకి రావు.

వ్యవసాయం, చేపలు పట్టడం, పశుపాలనా, ఆహారానికి సంబంధించి రోజువారీ అవసరాలూ, కట్టుకోడానికి బట్టా, ఉండటానికి ఇల్లూ, ఆధ్యాత్మిక జీవితమూ – అన్నీ ప్రకృతి తో ఏకం కావాలి.


ప్రకృతి ఆహారాన్ని వివరించడానికి రెండు బొమ్మలు గీశాను. ఇవి వైజ్ఞానిక, తత్వశాస్త్రాల పరిధికి అందవు. ప్రజలు తేలికగా సేకరించుకోగల ఆహార పదార్థాలను మొదటి బొమ్మలో పొందుపరిచాను. ఇవి పండ్లు, కూరగాయలు, సముద్ర ఆహారం వంటి విభిన్న సమూహాల్లో ఉన్నాయి. ఏ నెలలో ఏ విధమయిన ఆహారం దొరుకుతుందో రెండవ బొమ్మలో చూపించాను. ఈ రెండు బొమ్మలూ ప్రకృతి ఆహార మండలాన్ని[1] సూచిస్తాయి. ఈ బొమ్మలను చూస్తే అనంతమయిన ఆహార వనరులు ఈ భూమి మీద ఉన్నాయని అర్థమవుతుంది. ఇన్-యాంగ్‌ల గురించి తెలియకపోయినా "మేధ లేమి"[2]తో ప్రజలు ఆహారాన్ని సేకరిస్తే పరిపూర్ణమయిన ప్రకృతి ఆహారం పొందగలరు.

పల్లెల్లోని రైతులకూ, చేపలు పట్టే వాళ్ళకూ ఈ బొమ్మల అవసరం లేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వివిధ కాలాల్లో దొరికే ఆహారం ఏరుకొని ప్రకృతి విధానాన్ని వీరు తేలికగా అనుసరిస్తున్నారు.

వసంతం మొదలు కావడంతోనే వసంతకాలపు ఏడు మూలికలూ మొలుచుకొస్తాయి. ఏడు రకాల రుచులను అందిస్తాయి. వీటితో పాటు తినటానికి ఈ కాలంలో దొరికే మంచినీటి నత్తలు, సముద్రపు ఆల్చిప్పలు, టర్బన్ షెల్ ఫిష్ ఎంతో రుచిగా ఉంటాయి.

---

1. మండలం అన్నది మన సంప్రదాయంలోనూ, కళలోనూ వృత్తాకారంలో ఉండే బొమ్మ. ఇది ఒక విషయం సమగ్రతనూ, పరిపూర్ణతనూ ప్రతిబింబిస్తుంది.
2. "no-mind" - వ్యక్తికీ, "బయట" ప్రపంచానికీ మధ్య తేడా చూపని స్థితికి బౌద్ధమతంలో ఉపయోగించే పదం.



మార్చి నుండి ఆకు కూరల కాలం మొదలవుతుంది. హార్స్‌టేల్, బ్రాకెన్, మగ్‌వర్ట్, ఒస్మండ్, కొండల్లో దొరికే ఇతర మొక్కలు; తునికి, అత్తి(పీచ్) చెట్ల లేత ఆకులు, కొండ పెండలం మొలకలు దొరుకుతాయి. ఇవన్నీ ఎంతో రుచిగా ఉంటాయి. వీటిని రకరకాలుగా ఉపయోగించవచ్చు. ఈ కాలంలో సముద్ర తీర ప్రాంతాల్లో నాచు, నోరి, రాక్‌వీడ్ వంటివి విరివిగా దొరుకుతాయి.

వెదురు మొక్కలు కొత్త పిలకలు వేసినప్పుడు గ్రేరాక్‌కాడ్ (గండుమీను వంటి), సముద్రపు బ్రీమ్, స్ట్రైప్డ్ పిగ్ ఫిష్ వంటి చేపలు చాలా రుచిగా ఉంటాయి. ఐరిస్ పూత పూసినపుడు దీనితో పాటు రిబ్బన్ ఫిష్, మాకెరెల్ చేపలు పసందుగా ఉంటాయి. పచ్చి బఠాణి, మంచు బఠాణి, లీమా చిక్కుళ్ళు, ఫావా చిక్కుళ్ళు వలుచుకొని గింజలు తినడానికి ఎంతో బాగుంటాయి. వీటిని దంపుడు బియ్యం, గోధుమ, బార్లీతో ఉడక పెట్టుకొని తినవచ్చు.

వానాకాలం ముగిసే నాటికి[1] ఉప్పుతో ఆల్బకరా (ప్లమ్) పండ్లను నిల్వ చేస్తారు. స్ట్రాబెర్రీ, రాస్ప్ బెరీ పండ్లు బాగా దొరుకుతాయి. నీరుల్లిగడ్డ (స్కాలియాన్), లకోటా (లోక్వాట్), జల్దరు (ఆప్రికాట్), అత్తి పండ్లు నోరూరించే కాలం కూడా ఇదే. లకోటా పండ్లు తినటానికి పసందుగా ఉంటాయి. వీటి గింజలతో కాఫీ మాదిరి పొడి తయారు చేయవచ్చు. వీటి ఆకులతో చేసిన టీ మందుగా ఉపయోగపడుతుంది. అత్తి, తునికి చెట్ల ముదురు ఆకులతో దీర్ఘాయుష్షుకు ఉపయోగపడే మందు చేస్తారు.

వేసవిలో చెట్టునీడలో పుచ్చకాయ తింటూ, తేనె నాకటం కంటే సంతృప్తినిచ్చే విషయం మరొకటి ఉండదు. కారట్, స్పినాచ్

---

1. జపానులో వానాకాలం జూన్‌లో మొదలయ్యి జులై మధ్య వరకు ఉంటుంది.


(బచ్చలి జాతికి చెందిన ఆకుకూర), ముల్లంగి, దోస వంటి వేసవి కూరగాయలు ఈ కాలంలోనే తయారవుతాయి. వేసవి బద్దకాన్ని వదిలించుకోటానికి శరీరానికి వనస్పతి, నువ్వుల నూనె అవసరమవుతుంది.

వేసవిలో ఆకలి కొంచెం మందగిస్తుంది. వసంతంలో కోతకొచ్చిన శీతాకాలపు పంటలు ఈ కాలానికి అనువుగా ఉంటాయి. అందుకే ఈ కాలంలో బార్లీతో రకరకాల సేమ్యా(నూడుల్స్) ఎక్కువగా తయారు చేస్తారు.

ఆకు రాలే కాలం మొదలు కావటంతో సోయాచిక్కుళ్ళూ, అజుకి చిక్కుళ్ళూ, రకరకాల పళ్ళూ, కూరగాయలూ, చిరుధాన్యాలూ కోతకు వచ్చి విందు చేస్తాయి. "చంద్ర దర్శనం" పండగ రోజు చిరుధాన్యాలతో చేసిన తీపి వంటకాలు పసందుగా ఉంటాయి. ఉడక బెట్టిన సోయాచిక్కుళ్ళను చామ గడ్డలతో పాటు వడ్డిస్తారు. ఆకురాలే కాలం గడిచే కొద్దీ ఎర్రచిక్కుళ్ళు, పుట్టగొడుగులు, చెస్ట్‌నట్‌తో ఉడక బెట్టిన మొక్కజొన్న, వరి ఎంతో రుచిగా ఉంటాయి. వేసవి అంతా సూర్యరశ్మిని గ్రహించిన వరి ఈ కాలంలోనే తయారవుతుంది. అంటే చలికాలానికి తగిన శక్తిమంత మయిన ఆహారం తయారయ్యింది.

చలికాలం మొదలయ్యేసరికి చేపలవేట మళ్ళీ మొదలవుతుంది. ఎల్లో టేల్, ట్యూనా వంటి చేపలు ఈకాలంలో దొరుకుతాయి. ఈకాలంలోనే దండిగా దొరికే జపనీస్ ముల్లంగి, ఇతర ఆకు కూరలు ఈ చేపలతో పాటు తినటానికి చాలా బాగుంటాయి.

ప్రత్యేకంగా ఊరబెట్టిన, ఉప్పేసి నిలవ చేసిన పదార్థాలతో కొత్త సంవత్సరం నాడు రకరకాల వంటకాలు చేస్తారు. ఈ పండగపుడు జలుగు చేప (సాల్మన్), రెడ్ స్ర్టీమ్ చేపలూ, హెర్రింగ్ గుడ్లు, సముద్రపుఎండ్రకాయ, సముద్రపునాచు, నల్ల చిక్కుళ్ళు వడ్డించటం



తరతరాలుగా వస్తున్న ఆనవాయితి.

చలికాలంలో మంచు, మట్టి పొరల్ని తవ్వి ముల్లంగి, టర్నిప్ దుంపలను సేకరించటం ఎంతో సరదాగా ఉంటుంది. ఆహార ధాన్యాలు, రకరకాల చిక్కుళ్ళు సంవత్సరం పొడవునా అందుబాటులో ఉంటాయి. చలికాలం తీవ్రంగా ఉన్నపుడు నిలవ ఉంచిన కాబేజి, ముల్లంగి దోస జాతిపండ్లు, చిలగడ దుంపలతో పాటు రకరకాల ఆహార పదార్థాలు దొరుకుతాయి. ఈకాలంలో దొరికే ఆల్చిప్పలు, సముద్రపు కుకుంబర్ తో పాటు వెల్లుల్లి, నీరుల్లిగడ్డలు ఎంతో బాగుంటాయి.

మంచు పొరల్ని తొలగించుకొని కోల్ట్స్‌ఫుట్ మొలకలూ, తీగ స్ట్రాబెరీ జెరానియం ఆకులూ మొదట వస్తాయి. ఇవి వసంతం వస్తోందని తెలియ చేస్తాయి. ఆడేలుకూర, షెఫ్‌హర్డ్స్ పర్స్,చిక్‌వీడ్, ఇతర మూలికలు రావడంతో పెరడులోనే ఎన్నో కూరలు దొరుకుతాయి.

ఈవిధంగా వివిధ కాలాల్లో ప్రకృతి ప్రసాదించే వివిధ ఆహారాలను వాటి ప్రత్యేక రుచి కోల్పోకుండా తీసుకొంటూ గ్రామస్థులు ఎంతో సాధారణ జీవితం గడుపుతున్నారు.

గ్రామస్థులకు వివిధ రుచులు తెలుసు. కానీ ప్రకృతి వింతపోకడలు తెలియవు. కాదు. ప్రకృతి పోకడలు తెలుసుకానీ దానిని వాళ్ళు మాటల్లో వ్యక్త పరచలేరు.

ప్రకృతి ఆహారం మీ ముంగిటే ఉంది.

మన ఆహార సంస్కృతి

అన్నం ఎందుకు తింటున్నావు అన్న ప్రశ్నకు శరీర అవసరాలకూ, ఎదుగుదలకూ ఆహారం అవసరమన్న వాస్తవానికి మించి చాలామందికి మరేమి తట్టదు. ఆహారానికీ మానవ ఆత్మకూ మధ్య సంబంధం ఏమిటన్న లోతైన ప్రశ్న ఉండనే ఉంది. తినటం, ఆడుకోవటం, నిద్రపోవటంతో పశువుల జీవితం గడిచిపోతుంది. మంచి ఆహారం, భారం కాని రోజువారి పనులు, సుఖనిద్రతో మానవులు సంతృప్తి పడగలిగితే ఎంతో బాగుంటుంది.

'రూపమే శూన్యం – శూన్యమే రూపం' అని బుద్ధుడు అన్నాడు. ఇక్కడ రూపం అంటే పదార్థం, వస్తువులు అని అర్థం. శూన్యమంటే మనసు, మేథ. కాబట్టి బుద్ధుడు అన్నదానికి పదార్థమూ, మనసూ ఒకటేనని అర్థం. వస్తువులకు రకరకాల రంగులూ, రుచులూ, ఆకారాలుంటాయి. మానవుల బుద్ధి ఒకదాని మీద నుంచి ఇంకోదాని మీదకు వెంపరలాడుతుంటుంది.

రంగు

ప్రపంచంలో ఏడు మూల రంగులున్నాయి (ఇంద్రధనుస్సు లోనివి). ఈ ఏడు రంగులూ కలిస్తే తెలుపు అవుతుంది. స్ఫటిక (ప్రిసం) తెలుపును ఏడు రంగులుగా విడగొడుతుంది. ప్రపంచాన్ని మనిషి 'మేథ లేకుండా' చూస్తే రంగు లోని రంగు మాయమవుతుంది. విచక్షణతో కూడుకొన్న ఈ ఏడు రంగుల మేథతో చూసినప్పుడే రంగులు కనపడతాయి.

నీరు ఎన్నో మార్పులు చెందుతుంది. కానీ నీరు నీరే. ఇదే విధంగా చేతన మేథ మార్పు చెందుతున్నట్లు అనిపించినా అసలయిన స్థిరమయిన మేథ ఏ మార్పూ చెందదు. ఈ ఏడు రంగుల ఆకర్షణలో పడినప్పుడు బుద్ధి తేలికగా గతితప్పుతుంది. ఆకులు, పళ్ళు, కొమ్మల రంగులు కనపడతాయి కాని రంగుకు మూలం ఏమిటో గుర్తించలేరు.

ఆహారంలోనూ ఇంతే. మానవ ఆహారానికి అనువయిన సహజ పదార్థాలెన్నో ఉన్నాయి. బుద్ధి వీటిని మంచి లక్షణాలు కలవీ, చెడు లక్షణాలు కలవీ అని విడగొడుతుంది. తినదగినవి అనుకొన్నవి ఎన్నుకోవటం సరిపోతుంది. దీనితో మానవ ఆరోగ్యానికి వివిధ ప్రాంతాలకూ, వివిధ పరిస్థితులకూ ప్రకృతి ప్రసాదించిన ఆహారాన్ని గుర్తించడం సమస్యగా మారుతోంది.

హైడ్రాంజియా పూలలాగా ప్రకృతిలోని రంగులు కూడా తేలికగా మార్పు చెందుతుంటాయి. ప్రకృతి నిరంతరం చలనంలో ఉందని చెప్పవచ్చు. కదలిక లేని చలనంలో ఉందని కూడా చెప్పవచ్చు. ఆహారాన్ని ఎన్నుకోటానికి కారణాలు కనిపెట్టడంతో ప్రకృతి పట్ల స్థిరమయిన అభిప్రాయమేర్పడుతుంది. ఫలితంగా ప్రకృతిలోని కాలానుగుణమయిన మార్పులను గుర్తించలేరు.

ఆహార పదార్థాలను తెలివిగా ఎన్నిక చేసి, దానికి గల కారణాలను వివరించగల విజ్ఞానులను తయారు చెయ్యటం ప్రకృతి ఆహార లక్ష్యం కాదు. చేతనంగా ఏ విధమయిన తేడా చూపకుండా ఆహారాన్ని తీసుకోగల ఏమీ తెలియని ప్రజలను తయారు చెయ్యటమే దీని లక్ష్యం. ఇది ప్రకృతి విధానానికి వ్యతిరేకంగా వెళ్ళదు. "మేథ లేకుండా", రూపంతో భ్రమపడకుండా, రంగు లేని తనపు రంగుని గుర్తించినపుడు సరయిన ఆహారం మొదలవుతుంది.

రుచి

'తింటే కానీ రుచి తెలియ' దంటారు. అయినప్పటికీ తిన్న వ్యక్తి మీదా, పరిస్థితుల మీదా కూడా రుచి ఆధారపడి ఉంటుంది.

రుచి అంటే ఏమిటని శాస్త్రజ్ఞుడిని అడిగితే వివిధ విశ్లేషణలు చేసి తీపి, పులుపు, చేదు, ఉప్పు, కారం ఏ పాళ్ళలో ఉన్నాయో కనుక్కొని జవాబు చెప్పటానికి ప్రయత్నిస్తాడు. కానీ ఈ విధమయిన విశ్లేషణల వల్ల రుచి చెప్పలేరు. నిజానికి నాలుక కూడ రుచిని తెలుసుకోలేదు. నాలుక ద్వారా సందేశాలను అందుకొన్న మెదడు వాటికి అర్థం చెబుతుంది.

సహజ శక్తులు పని చేసే వ్యక్తి సరయిన ఆహారం తీసుకో గలుగుతాడు. సీదాసాదా ఆహారంతో అతడు సంతృప్తి చెందుతాడు. ఇది పోషకాలను కలిగి ఉండటమే కాకుండా రుచిగా ఉంటుంది. రోజువారి మందుగా కూడా ఉపయోగపడుతుంది. ఆహారమూ, మానవ ఆత్మా ఒకటవుతాయి.

ఆధునిక ప్రజలు తమ సహజ శక్తులను కోల్పోయారు. ఫలితంగా వాళ్ళు వసంతకాలపు ఏడు మూలికలను ఏరుకొని, తిని ఆనందించలేక పోతున్నారు. రకరకాల రుచుల కోసం పాకులాడుతుంటారు. వాళ్ళ ఆహారం గందరగోళమవుతుంది. కొన్ని ఇష్టమయినవీ, మరికొన్ని ఇష్టం లేనివీ ఏర్పడతాయి. రానురాను వాళ్ళ సహజశక్తి మరింత అయోమయంలో పడిపోతుంది. ఈ దశలో వంటల్లో మసాలా ఎక్కువగా వెయ్యటం మొదలవుతుంది. వంటకు ఎక్కువ సమయం తీసుకొంటుంది. క్రమేపి గందరగోళం పెరుగుతుంది. ఆహారం - మానవ ఆత్మ మధ్య పెద్ద అగాధం ఏర్పడుతుంది.

ఈరోజు చాలామందికి (వరి) అన్నం రుచి తెలియకుండా పోయింది. బియ్యాన్ని బాగా పాలిష్ చేసి తెల్లగా ఉండేట్టు చేస్తారు.

ఇందులో ఏ రుచీ లేని పిండి పదార్థాలు మాత్రమే మిగులుతాయి. దంపుడు బియ్యానికి ఉండే ప్రత్యేకమయిన రుచి, వాసన పాలిష్ బియ్యానికి ఉండవు. అందుకే నంజుకోటానికి కూరలు, పచ్చళ్ళు లేనిదే పాలిష్ బియ్యంతో వండిన అన్నం తినలేరు. అన్నంలో పోషక పదార్థాలు లేకపోతే విటమిన్ బిళ్ళలూ, టానిక్కులూ లేదా మాంసం వంటి వాటితో వీటిని పూర్తి చేసుకొంటే సరిపోతుందని పొరపడుతుంటారు.

ఆహారంలో రుచి ఉండదు. ఒక వ్యక్తి అనుకోవటంలో రుచి ఉంటుంది. చాలామందికి ఎద్దు మాంసం, కోడి మాంసం ఇష్టం కావచ్చు. ఆరోగ్య కారణాల వల్లగానీ, మతపరమయిన విశ్వాసాల వల్లకానీ వీటిని తినగూడదనుకొన్నప్పుడు ఇవి అసహ్యకరంగా కనిపిస్తాయి.

ఆడుకుంటూ, లేదా ఏమీ చెయ్యకుండానే పిల్లలు చాలా సంతోషంగా గడిపేస్తారు. దీనికి భిన్నంగా పెద్దవాళ్ళు ముందుగా తమకు ఏది సంతోషాన్నిస్తుందో నిర్ణయించుకొంటారు. అటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడే సంతృప్తి చెందుతారు. దీనివల్ల ప్రకృతి సహజమయిన రుచి, శరీరానికి శక్తినిచ్చే గుణం ఉన్న ఆహారం పై సహజమయిన ఇష్టం ఏర్పడదు. ఫలానా ఆహారం రుచికరమయినది అన్న అభిప్రాయం ఉండటం వల్ల అటువంటి ఆహారమే రుచిగా అనిపిస్తుంది.

గోధుమతో చేసిన సేమ్యాలు చాలా రుచిగా ఉంటాయి. వెండింగ్ మెషీన్[1] నుంచి కొనుక్కొనే సేమ్యాలు ఏమీ బాగుండవు. కాని

1. బరువు చూసుకొనే యంత్రాల్లో నాణం వేస్తే బరువు తెలియచేస్తూ టిక్కెట్టు బయటకు వచ్చినట్లు రకరకాల పదార్థాలను అమ్మే యంత్రాలు ఉన్నాయి. సూచించిన నాణాలను వీటిలో వేసినప్పుడు నిర్ణీత మోతాదులో పదార్థం వెలువడుతుంది.

ప్రకటనలు గుప్పించి వీటిని చాలా మంది ఇష్టపడేలా చేయగలుగుతున్నారు.

ఒక నక్క చెప్పిన మాయమాటలను కొంతమంది నమ్మి గుర్రపు పెంట తిన్నారన్న కథ చెపుతారు. దీంట్లో నవ్వాల్సింది ఏమీ లేదు. ఈ రోజుల్లో ప్రజలు శరీరంతో కాకుండా బుద్ధితో తింటున్నారు. చాలామందికి వాళ్ళ ఆహారంలో మోనోసోడియం గ్లూటామేట్[1] ఉందన్న విషయం పట్టదు. నాలిక కొసతోటే రుచిచూస్తారు కాబట్టి తేలికగా మోసపోతారు.

ఎంతో కష్టపడి వండి, మసాలాలు కలిపితే కాని ఆహారం రుచిగా ఉండదన్న అభిప్రాయానికి ఆధునిక మానవులు వచ్చారు. ఆహారాన్ని రుచిగా చెయ్యాలన్న ప్రయత్నం మానుకొన్నప్పుడు ప్రకృతి దానిని రుచిగా తయారు చేసి ఉంచిందని తెలుస్తుంది.

ఆహారం దానంతట అదే రుచిగా అనిపించేలా జీవించటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కాని ఇవ్వాళ అందరూ ఆహారాన్ని రుచిగా మలచటానికి పూనుకొంటున్నారు. దురదృష్టమయిన విషయమేమిటంటే దీనివల్ల రుచి అయిన ఆహారపదార్థాలన్నీ అంతరించి పోయాయి.

రుచికరమయిన రొట్టె చెయ్యాలని పూనుకోవటంతో రుచికరమయిన రొట్టె మాయమై పోయింది. మంచి వంటకాలు చెయ్యాలనుకొని ఎందుకూ పనికి రానివి తయారు చేశారు. ఇప్పుడు ప్రజల తృప్తి తృప్తి లేకుండా పోయింది.

ప్రకృతి సహజమయిన రుచిని అలా ఉంచగలగటమే ఉత్తమమయిన వంట. ఈ విధమయిన విజ్ఞత ఒకనాడు ఉండేది. కూరగాయలను

1. ఆహారపదార్థాలు, ప్రత్యేకించి మాంసం నిల్వ ఉంచటానికి ఉపయోగించే రసాయనిక పదార్థం; దీని వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది.

ఎండబెట్టి, ఉప్పు కలిపి సహజమయిన రుచి పోకుండా రకరకాల పద్ధతుల్లో పచ్చళ్ళు పెట్టేవారు.

సముద్రపు ఉప్పుతోటి, కణకణమండే మంటతోటి పాకకళ మొదలవుతుంది. ప్రాథమిక సూత్రాలు అవగాహన చేసుకొన్న వ్యక్తి వండితే సహజరుచులు అలాగే ఉంటాయి. పదార్థానికి కొత్త కొత్త రుచులు వచ్చినా, నాలుకకు సంతృప్తికరంగా ఉండేట్టు చేసినా అది నిజమయిన వంట కాదు.

సంస్కృతిని కేవలం మనుషులు రూపొందించి కాపాడి, అభివృద్ధి చేయలేరు. మనిషీ, ప్రకృతీ కలయికతోనే సంస్కృతి పుడుతుంది, రూపు దిద్దు కొంటుంది. సంస్కృతికీ, రోజువారీ జీవితానికీ ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఈ విధంగానే ఇది తరతరాలకు సంక్రమిస్తూ నేటివరకూ కొనసాగుతూ వచ్చింది.

మానవ అహంకారం నుంచీ, సుఖాన్వేషణ నుంచీ పుట్టింది నిజమయిన సంస్కృతి కాదు. నిజమయిన సంస్కృతి ప్రకృతిలో పుట్టి స్వచ్ఛందంగా, సీదాసాదాగా, అణుకువగా ఉంటుంది.

సహజమయిన ఆహారాన్ని త్యజించి, పై పై మెరుగులకు పాకులాడటం మొదలు పెట్టిననాడే వినాశనానికి దారిని సమాజం ఎన్నుకొంది. ఈ విధమయిన ఆహారం నిజమయిన సంస్కృతి నుంచి పుట్టింది కాకపోవటమే దీనికి కారణం. ఆహారమంటే జీవం. మరి జీవం ప్రకృతి నుంచి ఒక్క అడుగు కూడా దూరం కాకూడదు.

దంపుడు బియ్యానికి మించింది లేదు

రుచికరమయిన భోజనానికి మించింది లేదు. కానీ చాలామంది శరీరపోషణకూ, పనిచేసే శక్తికోసం, ముసలితనం వరకు బతికుండటానికీ తింటున్నామనుకొంటారు. అందుకే పిల్లలకు ఆహారం రుచికరంగా అనిపించకపోయినా సరే, వాళ్ళకి ఇష్టం లేకపోయినా సరే వాళ్ళ శరీరాలకు 'మంచిది' కాబట్టి తినమని తరచు తల్లులు బలవంతం చేస్తుంటారు.

కానీ పోషణను రుచి నుంచి వేరు చెయ్యలేం. శరీరానికి మేలు చేసే పోషకాహారం ఆకలిని పెంచటమే కాకుండా చాలా రుచిగా ఉంటుంది.

కొంతకాలం క్రితం వరకు మిసో[1], ఊరబెట్టిన కూరగాయలతో వరి, బార్లీ అన్నమే జపాను రైతుల ప్రధాన ఆహారం. దీర్ఘాయుష్షుకూ, శరీర సౌష్టవానికీ, ఆరోగ్యానికీ ఈ ఆహారమే ఆధారం. వండిన కూరలు, ఆవిరిపట్టిన అన్నం, ఎర్రచిక్కుళ్ళతో నెలకొకసారి విందారగించేవారు. ఇంతటి సీదాసాదా ఆహారంతోనే రైతుల బలిష్టమయిన శరీరాలకు తగిన పోషణ లభించేది.

తూర్పు దేశాలలో సంప్రదాయ ఆహారం పాశ్చాత్య దేశాల ఆహారం కంటే చాలా భిన్నమయినది. పాశ్చాత్యపోషణశాస్త్రం ప్రకారం నిర్దేశించిన మోతాదుల్లో పిండి పదార్థాలు, కొవ్వు, మాంసకృత్తులు,

1. సోయా చిక్కుళ్ళను నానబెట్టి, రుబ్బి, పులియబెట్టిన పిండి.

విటమిన్లు ప్రతిరోజూ తీసుకోకపోతే అది పరిపూర్ణ ఆహారం కాదు. ఇది శరీర ఆరోగ్యాన్ని కాపాడ లేదని భావిస్తారు. ఈనమ్మకం వల్లనే పిల్లల నోట్లో "పోషకా"హారం కుక్కే తల్లులు పుట్టు కొస్తారు.

సుదీర్ఘమయిన సిద్ధాంతాల, లెక్కింపుల కారణంగా "సరయిన ఆహార" విషయంలో పాశ్చాత్య పోషక విజ్ఞానంలో ఎటువంటి అనుమానాలకు తావుండదని భావించవచ్చు. వాస్తవానికి ఇది సమస్యలను పరిష్కరించేబదులు కొత్తవాటిని సృష్టిస్తుంది.

ఆహారాన్నీ, ప్రకృతి చక్రాన్నీ సమన్వయ పరచడానికి ప్రయత్నించకపోవడం పాశ్చాత్య పోషక శాస్త్రంలో పెద్దలోపం. దీనివల్ల ప్రకృతికీ మనిషికీ మధ్య అగాధం ఏర్పడుతుంది. అంతేకాకుండా ప్రకృతి అంటే భయమేర్పడుతుంది. అబద్రతా భావన వెన్నాడు తుంటుంది.



ఆహారానికీ మానవ ఆత్మ, అనుభూతులకూ ప్రత్యక్షసంబంధం ఉంది. దీన్ని పూర్తిగా విస్మరించటం మరొకలోపం. మనిషి అంటే కేవలం పనిచేసే యంత్రం అని భావించినపుడు ఆహారాన్ని సమగ్రంగా అర్థం చేసుకొనే అవకాశం ఉండదు. గందరగోళంలో మిడి మిడి జ్ఞానాన్ని అంతా ఒక దరికి చేరిస్తే ప్రకృతికి దూరమయిన, లోపభూయిష్టమయిన ఆహారం తయారవుతుంది.

"ఒక దాంట్లో సమస్తమూ ఇమిడి ఉంటుంది. కానీ అన్నింటినీ ఒకచోటకు తీసుకువస్తే ఏఒక్కటీ పైకిరాదు". దీంట్లో ఇమిడి ఉన్న ప్రాచ్యదేశాల విజ్ఞతను పాశ్చాత్య దేశాలు అర్థంచేసుకే లేకపోతున్నాయి. ఒక వ్యక్తి విసుగు పుట్టేంత వరకు సీతాకోక చిలుకను పరిశీలించవచ్చు, విశ్లేషించవచ్చు. కానీ అతను ఎన్నటికీ ఒకసీతాకోక చిలుకను సృష్టించ లేడు.

పాశ్చాత్య సిద్ధాంతాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఆహార అలవాట్లను మలుచుకొన్నప్పుడు పరిణామాలు, పరిస్థితులు ఎలా ఉంటాయి? సంవత్సరం పొడుగునా పశుమాంసం, గుడ్లు, పాలు, కూరగాయలు, బ్రెడ్డు, ఇతర ఆహార పదార్థాలు అందుబాటులో ఉండాలి. దీనికోసం పెద్ద ఎత్తున ఉత్పత్తి చెయ్యటమే కాకుండా దీర్ఘకాలంపాటు ఆహారాన్ని నిలవ చేయాలి. ఈవిధమయిన ఆహారపు అలవాట్లను అలవరుచు కోవడం వల్ల జపానులో వేసవికాలపు పంటలయిన ఆకు కూరలు, దోసకాయ, వంకాయ, టొమాటొ వంటి వాటిని రైతులు శీతాకాలంలో పండిస్తున్నారు. కాలంకాని కాలంలో పండ్లను ఉత్పత్తి చేస్తున్నారు.

కాలంతో సంబంధం లేకుండా రకరకాల ఆహారపదార్థాలను అందిరచటం ద్వారా పరిపూర్ణ, సమతౌల్య ఆహారాన్ని పొంద గలమనుకోవటంలో అర్థం లేదు.సహజ కాలంలో తయారయిన

పండ్లు, కూరగాయలతో పోలిస్తే కృత్రిమ పరిస్థితుల్లో,కాలంకాని కాలంలో తయారయిన వాటిల్లో చాలా తక్కువ విటమిన్లు, పోషక పదార్థాలు ఉంటాయి. సహజ, సేంద్రియ పద్ధతుల్లో పండించిన వేసవి కూరగాయలకు ఉండేరుచి, సువాసన కృత్రిమ పద్ధతుల ద్వారా శీతాకాలంలో పండించినపుడు ఏమాత్రం ఉండవు.

రసాయనిక విశ్లేషణా,పోషక పదార్థాల నిష్పత్తులూ వంటి వాటిని లెక్కలోకి తీసుకోవటమే అన్ని పొరపాట్లకు మూలం. ఆధునిక విజ్ఞానం సిఫారసు చేస్తున్న ఆహారం జపాను సంప్రదాయం కంటే చాలాభిన్న మయినది. ఇది జపనీయుల ఆరోగ్యాన్ని దిగజారుస్తోంది.

ఆహారం గురించి ఆఖరి మాటలు

ఈప్రపంచంలో నాలుగు రకాల ఆహార విధానాలున్నాయి.

1. అలవాట్లు, కోర్కెలు, ఇష్టా ఇష్టాలకు అనుగుణంగా ఉండే ఆహారం. ఈవిధమయిన ఆహారాన్ని పాటించేవారు తమ కోర్కెలూ, రుచులూ ఆడించినట్లు ఆడతారు. దీనిని భోగలాలస లేదా ఉత్తుత్తి (ఏమీలేని) భోజనంగా పరిగణించవచ్చు.

2. జీవశాస్త్ర సిద్ధాంతాల కనుగుణంగా అధిక సంఖ్య ప్రజలు తీసుకొనే ప్రామాణిక పోషకాహారం. ప్రాణంనిలబెట్టు కోవాలన్న ముఖ్య ఉద్దేశంతో పోషకాహారం తీసుకొంటారు. దీనిని భౌతిక, శాస్త్రీయ భోజనంగా భావించవచ్చు.

3. ఆధ్యాత్మిక సిద్ధాంతాలు, ఆదర్శాత్మక తత్వం పై ఆధారపడిన ఆహారం. దీంట్లో ఆహారాన్ని చాలా వరకు పరిమితం చేసుకొంటారు."ప్రకృతి" ఆహారం తీసుకొనే వాళ్ళలో చాలా మంది ఈకోవలోకి వస్తారు. దీనిని సూత్ర బద్ధమయిన భోజనంగా చెప్పుకోవచ్చు.

4. ప్రకృతి అభీష్టాన్ని అనుసరించే సహజ ఆహారం. దీంట్లో మానవ పరిజ్ఞానాన్నంతా వదిలేస్తారు. విచక్షణ చేయని భోజనంగా దీనిని పేర్కొనవచ్చు.

భోగలాలస, ఉత్తుత్తి భోజనం అంతులేని రోగాలకు కారణమవు తుంది. చాలామంది దీనిని విడిచిపెట్టి ప్రాణాన్ని నిలిపే శాస్త్రీయ

భోజనం చేపడతారు. దీనితోనూ అసంతృప్తి చెంది సూత్ర బద్ధ భోజనానికి మారవచ్చు. చివరికి దీనిని కూడా అధిగమించి విచక్షణ చేయని భోజనానికి చేరుకొంటారు.

విచక్షణ చేయని భోజనం

మానవ ప్రాణం తన శక్తి ద్వారా నిలబడటం లేదు. మానవులకు జన్మనిచ్చి, వాళ్ళప్రాణాలను ప్రకృతి కాపాడుతోంది. ప్రకృతికీ మనిషికీ మధ్య ఉన్న సంబంధం ఇది. ఆహారం ప్రకృతి వరప్రసాదం. ప్రకృతి నుండి ఆహారాన్ని ప్రజలు ఉత్పత్తి చెయ్యరు. ప్రకృతే వాళ్ళకు ఆహారాన్ని ప్రసాదిస్తోంది

ఆహారం, శరీరం, హృదయం, మేధస్సు ప్రకృతిలో పూర్తిగా ఏకమయిననాడు సహజాహారం సాధ్యమవుతుంది. సహజజ్ఞానాన్ని అనుసరించి రుచిగా ఉన్నది తీసుకొంటూ, రుచిగా లేనిది వదిలి పెడుతూ శరీరంస్వేచ్ఛగా ప్రవర్తిస్తుంది.

సహజ ఆహరానికి నియమాలూ,నిష్పత్తులూ ఏర్పరచటం సాధ్యం కాదు.[1] స్థానిక జీవావరణాన్ని అనుసరించీ, వ్యక్తిగత శరీర నిర్మాణమూ, అవసరాలూ అనుసరించీ సహజ ఆహారం దానంతట అదే ఏర్పడుతుంది.

సూత్ర బద్ధమయిన ఆహారం

ప్రకృతి ఎప్పుడు పరిపూర్ణంగా, సమతౌల్యంలో, సామరస్యస్థితిలో ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ప్రకృతి ఆహారం పరిపూర్ణ మయింది. దీంట్లోనే పోషణ, విభిన్న రుచులు ఇమిడి ఉంటాయి.

ఇన్-యాంగ్ సిద్ధాంతాన్ని అన్వయించటం ద్వారా ఈవిశ్వం

1. మనంతట మనం నిర్ణయాలు తీసుకోటానికి నియమావళీ, విధానమూ ఉండటానికి వీలులేదు. ప్రకృతి, లేదా శరీరం సరయిన బాటను చక్కగా చూపగలుగుతాయి. కానీ కోరికలూ, విచక్షణ చేసే బుద్ధీ సృష్టించే గందరగోళంలో ప్రకృతి సూచనలు వినపడకుండా పోతున్నాయి.

పుట్టుకనూ, ప్రకృతిమార్పులనూ అర్థంచేసుకోగలమని కొందరు భావిస్తారు. మానవ శరీరంలోని సమతౌల్యస్థితిని నిర్ధారించవచ్చనీ, చేతనంగా దానిని కాపాడు కోవచ్చనీ మరి కొందరి అభిప్రాయం. కానీ ఈ సిద్ధాంతాల లోతులకు వెళితే శాస్త్ర రంగంలోకి ప్రవేశించి విచక్షణ చేసే దృక్పధం నుంచీ బయటపడలేరు.

శాస్త్రీయ బద్ధమయిన ఆహారంతీసుకొనే వ్యక్తి మానవ విజ్ఞాన పరిమితుల్ని గుర్తించకుండా దాని జిలుగు వెలుగుల్లో పడికొట్టుకుపోతాడు. ఇతని దృష్టినంతటినీ ఇతర వస్తువులు ఆకర్షిస్తాయి. ఈ విశాలమయిన, అనంతమయిన ప్రకృతిని అర్థం చేసుకొనే ప్రయత్నంలో అతను తన చుట్టు పక్కల జరుగు తున్న చిన్న చిన్న విషయాలను పట్టించుకోడు.

రోగిష్టి వ్యక్తి ఆహారం

ప్రకృతి నుంచి దూరమయినప్పుడే రోగాలు వస్తాయి. ప్రకృతి నుంచి ఎంత దూరమయితే రోగాలు అంత తీవ్రమవుతాయి. ఒక రోగి తిరిగి ఆరోగ్య వంతమయిన వాతావరణానికి చేరుకొంటే అతని రోగం మటుమాయమవుతుంది. ప్రకృతి నుంచీ దూరమయిన కొద్దీ రోగుల సంఖ్య పెరుగుతుంది. ఇటువంటప్పుడు తిరిగి ప్రకృతిని చేరుకోవాలన్న కోరిక పెరుగుతుంది. తిరిగి ప్రకృతిని చేరుకోవాలన్న 'ప్రయత్నమే' కానీ ప్రకృతి అంటే సరయిన అవగాహన ఉండదు. కాబట్టి ఈ ప్రయాసలన్నీ వృథా అవుతాయి.

కొండల్లో ఆదిమ ప్రజలలాగా జీవించటం మొదలుపెట్టినంత మాత్రాన అసలు లక్ష్యం బోధపడినట్లు కాదు. ఏదయినా చెయ్యాలని 'ప్రయత్నించినపుడు' ఆ ప్రయాసలు ఆశించిన ఫలితాన్ని సాధించలేవు.

నగరాల్లో జీవిస్తున్న వారు సహజ ఆహారం అలవర్చుకోటానికి ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. సహజ ఆహారాన్ని రైతులు పండించటం లేదు కాబట్టి అది అందుబాటులో లేదు. ఒకవేళ అందుబాటులో ఉన్నా ప్రజలు వాటిని జీర్ణం చేసుకోగలరా అన్నదీ అనుమానమే!

ఇటువంటి పరిస్థితుల్లో ఆరోగ్యకరమయిన పరిపూర్ణ ఆహారం తీసుకోవాలన్నా, ఇన్-యాంగ్ సమతౌల్య ఆహారం తీసుకోవాలన్నా ఏమేమి తీసుకోవాలో నిర్ణయించటానికి అద్భుత, అతీంద్రియశక్తులు ఉండాల్సిందే. తిరిగి ప్రకృతిని చేరుకోవటం అటుంచి సంక్లిష్టమయిన విచిత్ర 'ప్రకృతి' ఆహారం తయారయి ప్రకృతికి మరింత దూరమవుతారు.

'ఆరోగ్య ఆహారం' అమ్ముతున్న కొట్లలోకి తొంగిచూస్తే కనపడే వస్తువులు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. తాజాపండ్లు, కూరగాయల నుంచి ప్యాకెట్లలో నిల్వ చేసిన ఆహారం, విటమిన్లు వరకు అక్కడ ఉంటాయి. దీనికి సంబంధించిన పుస్తకాలలో రకరకాల ఆహార పదార్థాలను 'సహజమయినవి', పోషణనిచ్చేవి, ఆరోగ్యానికి మంచివి అని పేర్కొంటారు. రకరకాల కూరగాయల్ని కలిపి ఉడకపెట్టి తినడం మంచిదని ఒకళ్ళంటే, దీనివల్ల ఖచ్చితంగా రోగిగా మారతారని మరొకరంటారు. కొందరు ఆహారంలో ఉప్పు ప్రాముఖ్యత గురించి నొక్కి చెపుతారు, మరి కొందరు ఉప్పు ఎక్కువయితే రోగాలొస్తాయని వాదిస్తారు. కొందరు పండ్లను 'ఇన్' అనీ, కోతుల ఆహారమనీ తీసి పారేస్తే మరికొందరు దీర్ఘాయుష్షుకూ, పరిపూర్ణ ఆరోగ్యానికీ పండ్లు, కూరగాయలే ఉత్తమమయినవని అంటారు.

వివిధ సందర్భాల్లో, వివిధ సమయాల్లో పైన పేర్కొన్న అన్ని వ్యాఖ్యానాలూ సరయినవేనని చెప్పవచ్చు. దీనివల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడుతుంది. ఇంకొక విధంగా చెప్పాలంటే గందరగోళంలో ఉన్న వ్యక్తిని మరింత గందరగోళపరచటానికే ఈ సిద్ధాంతాలు ఉపయోగ పడతాయి.

ప్రకృతి నిరంతరం మార్పు చెందుతుంటుంది. నిమిషనిమిషానికి మారుతుంటుంది. అందుకే ప్రకృతి నిజ స్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకోలేరు. ప్రకృతిని మనం తెలుసుకోలేం. తెలుసుకోలేని దానిని

సూత్రాలలోనూ, సిద్ధాంతాలలోనూ బంధించాలనుకోవటమంటే సీతాకోక చిలుకలను పట్టే వలతో గాలిని బంధించాలనుకోవటం లాగా ఉంటుంది.

గురి సరిగా ఉన్నప్పటికీ లక్ష్యం సరయినది కాకపోతే విఫల మయినట్లే.

మానవాళి గుడ్డివాడు వంటిది. ఎక్కడికి పోతోందో తెలియదు. విజ్ఞానం అనే కర్రతో తడుముకొంటూ, ఇన్-యాంగ్‌ల మీద ఆధారపడి దారి వేసుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటుంది.

చెప్పేది ఏమిటంటే మెదడు తో తినవద్దు. అంటే విచక్షణ చేసే బుద్ధిని చెత్త బుట్టలో వెయ్యండి. ఇంతకు ముందు చిత్రించిన ఆహార మండలం వివిధ ఆహారాల మధ్యా, ఆహారానికీ-మనిషికీ మధ్యా గల సంబంధాలు తెలుసుకోటానికి ఉపయోగపడుతుంది. ఒకసారి చూసిన తరువాత దీన్ని కూడా పారవేయవచ్చు.

తనకు కావలసిన ఆహారాన్ని ఎన్నుకొనే స్థితికి శరీరాన్ని ఎదగనివ్వటమే ముఖ్యం. కేవలం ఆహారం గురించి ఆలోచించటమన్నది బుద్ధుడిని బయట ఉంచి గుడికి వెళ్ళి, మంత్రాలు వల్లించటం లాగా ఉంటుంది. ఆహారాన్ని అర్థం చేసుకోటానికి తత్వశాస్త్రాలు చదవటం కంటే, రోజువారీ ఆహారం నుంచీ ఒక అవగాహనకు రావటం మంచిది.

డాక్టర్లు రోగులకు సేవ చేస్తారు. ఆరోగ్యవంతులకు ప్రకృతిసేవ చేస్తుంది. రోగం వచ్చిన తరువాత నయమవ్వటానికి సహజ ఆహారాన్ని సాధించటంలో కొట్టుమిట్టాడటం కంటే సహజ వాతావరణంలో జీవిస్తూ రోగాలను దరి చేరనివ్వకుండా ఉండటం మేలు.

ఇక్కడకు వచ్చి కొండమీద సాదాసీదా జీవితం కొనసాగిస్తున్న యువతకు మానవాళి అంతిమలక్ష్యం గురించి అవగాహన ఉంది. సహజ ఆహారం తీసుకొంటూ, ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఈ అంతిమలక్ష్యానికి అనుగుణంగా జీవిస్తున్నారు.

ఆహారమూ, వ్యవసాయమూ

ఆహారం, వ్యవసాయం నాణానికి బొమ్మా, బొరుసు వంటివి. కాబట్టి ప్రకృతి సేద్యం మీద రాసిన పుస్తకంలో సహజ ఆహారం గురించిన ప్రస్తావన ఒక అంశం అవుతుంది. ప్రకృతిసేద్యం సాధ్యం కానిదే సహజ ఆహారం సాధ్యం కాదనేది నిర్వివాదాంశం. అదే విధంగా ప్రకృతి ఆహారాన్ని నిర్ధారించకపోతే రైతుకు ఏమిసాగు చెయ్యాలో తెలియదు.

మనుషులు ప్రకృతి జీవులుగా మారితే తప్పించి ప్రకృతి సేద్యమూ, ప్రకృతి ఆహారమూ ఉండవు. కొండమీద ఓ గుడిసెలో చలిమంటకాగే ప్రదేశంలో దేవదారుచెక్క మీద 'సరయిన ఆహారం, సరయిన చర్య, సరయిన చైతన్యం'[1] అని రాసిపెట్టాను. ఈ మూడింటినీ ఒకదాని నుంచి ఒకటి వేరు చెయ్యలేం. ఏ ఒకటి లోపించినా మిగిలినవి సాధించలేం. ఒకటి సాధిస్తే మిగిలినవి సాధించవచ్చు.

సంఘర్షణ, గందరగోళం లోంచే ఈ ప్రపంచం 'ప్రగతి' సాధిస్తుందన్న నమ్మకంతో ప్రజలు తమకు ఏమీ పట్టనట్టు ఉంటారు. కానీ అర్థం లేని, వినాశకరమయిన ప్రగతి ఆలోచనలను గందరగోళ పరచటమే కాక మానవాళి క్షీణతకూ, అంతరించిపోటానికి దోహదం చేస్తుంది. అన్ని చర్యలకూ ఆధారమయిన నిశ్చల మూలం ఏమిటో, ప్రకృతి ఏమిటో స్పష్టంగా అర్థం చేసుకోలేకపోతే మానవ ఆరోగ్యాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదు.

---

1. ఆత్మజ్ఞానానికి బౌద్ధమతం నిర్దేశించిన ఎనిమిది సూత్రాల మార్గం ఆధారంగా తయారు చేసిన నినాదం.

V



తెలివితేటల ముసుగులో మూర్ఖత్వం

ఆకురాలే కాలం. రాత్రులు చలిగానూ, దీర్ఘంగానూ ఉంటాయి. కణకణ మండుతున్న నిప్పుల చుట్టూ చేరి వేడి టీ తాగుతూ హాయిగా కాలం గడిపెయ్యవచ్చు. మంట చుట్టూ చేరినప్పుడు ఏ విషయమయినా ఇబ్బంది లేకుండా మాట్లాడుకోవచ్చంటారు. అందుకని నా తోటి రైతుల సమస్యల గురించి చర్చిస్తే బాగుంటుందని వీటి ప్రస్తావన తెచ్చాను.

ఏ పనికీ ప్రయోజనం లేదనీ, మానవాళికి ఏమీ తెలియదనీ, దేని కోసమూ పాకులాడనవసరం లేదనీ, ఏమి చేసినా వ్యర్థమేననీ ఇంతసేపూ చెబుతూ వచ్చాను. ఇది చెప్పిన తరువాత కూడా ఇంకా ఎట్లా మాట్లాడుతూ కూర్చోను? ఏదయినా రాద్దామంటే రాయటం వల్ల ఏమీ ప్రయోజనం లేదనే రాయాలి. ఇది బలే చిక్కు సమస్య.

నా గతం గురించి నేనే అంతగా ఆలోచించను కాబట్టి రాయటానికి ఏమీ లేదు. జ్యోతిష్యుడను కాను కాబట్టి భవిష్యత్తు గురించీ రాయలేను. మంట పక్కన కూర్చుని కట్టెలను ఎగదోస్తూ రోజువారీ విషయాల గురించి ఏదో మాట్లాడుతుంటాను. నా ఛాదస్తపు భావాలను నమ్మమని ఎవరికయినా ఎలా చెప్పను?

పండ్లతోటలోని ఎత్తయిన గట్టు మీద చిన్న చిన్న గుడిసెలున్నాయి. అక్కడ కొంతమంది సీదాసాదా సహజీవనం చేస్తున్నారు. ఇక్కడ ఆధునిక సౌకర్యాలు ఏమీలేవు. ప్రశాంత సాయంకాలాలను దీపం

బుడ్డి వెలుగులోనో, కొవ్వొత్తి వెలుగులోనో గడిపేస్తారు. దంపుడు బియ్యం, కూరగాయలు, ఒక బట్ట, ఒక గిన్నె ఇవీ వాళ్ళ అవసరాలు. ఎక్కడెక్కడ నుంచో వస్తారు. ఇష్టమయినన్ని రోజులు ఉండి వెళ్ళిపోతారు.


నా అతిథుల్లో ఆడవాళ్ళు, మగవాళ్ళు ఉంటారు. ముసలి వాళ్ళు, పడుచువాళ్ళుంటారు. వివిధ దేశాలకు చెందిన వ్యవసాయ శాస్త్రజ్ఞులు, విద్యార్థులు, పండితులు, రైతులు, హిప్పీలు, కవులు, దేశదిమ్మరులు ఉంటారు. అంతర్ముఖులై ఆలోచించుకోవాల్సిన అవసరమున్న యువతీయువకులు నా దగ్గర ఎక్కువ రోజులుంటారు.

దారి పక్కని ఈ ఇంటిని సంరక్షిస్తూ వచ్చేపోయే బాటసారులకు సేవ చేయడమే నాపని. వాళ్ళు పొలం పనులలో సాయం చేస్తూ దేశదేశాల కబుర్లు చెబుతుంటే వినడం నాకెంతో సంతోషాన్నిస్తుంది.

ఇదంతా వినటానికి బాగానే ఉంటుంది. కానీ వాస్తవానికి ఇక్కడి జీవితమంతా సుఖమయంగా ఉండదు. 'ఏమీ చెయ్యాల్సిన అవసరం లేని' వ్యవసాయాన్ని నేను ప్రచారం చేస్తుంటాను. దాంతో ఇక్కడ భూతలస్వర్గముందనీ, మంచంమీద నుంచి దిగకుండా హాయిగా గడిపెయ్యవచ్చనీ చాలామంది వస్తుంటారు. ఇటువంటివాళ్ళకు నిరాశే మిగులుతుంది. పొద్దునే మంచుతెరలు తొలగిపోకముందే కాలవ కెళ్ళి నీళ్ళు తీసుకురావాలి. చేతులు బొబ్బలు ఎక్కేలా కట్టెలు కొట్టాలి. మడమలోతు బురదలో పనిచెయ్యాలి. అందుకే చాలామంది వచ్చినంత త్వరగా వెళ్ళిపోతుంటారు.

ఇవ్వాళ కొంతమంది కలిసి ఒక చిన్న గుడిసె కడుతుంటే చూస్తూ కూర్చున్నాను. ఎక్కడినుంచో ఒక యువతినడుచుకొంటూ వచ్చింది.

ఎందుకు వచ్చావని అడిగాను. "నేను వచ్చాను. ఇంతకు మించి ఏమీ తెలియదు" అంది.



పై కొండమీద నుంచి కనపడుతున్న పండ్లతోట, గుడిసెలు

"నువ్వు జ్ఞానివి కాకపోతే చెప్పటానికి ఏమీ ఉండదు. అంతేనా? విచక్షణ చేసే శక్తుల ద్వారా ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనుకోవటం వల్ల అసలు భావం తెలియకుండా పోతోంది. అందుకే ప్రపంచం ఇలా చిక్కుల్లో ఉంది కదూ?" అని అడిగాను.

"మీరు అలా అనుకొంటే అవును" అని మెల్లగా బదులిచ్చింది.

"జ్ఞాని కావటమంటే ఏమిటో నీకు ఒక స్పష్టమయిన అవగాహన లేదనుకొంటా. ఇంతకు ముందు ఏ ఏ పుస్తకాలు చదివావు?" అని అడిగాను.

ఏమీ చదవలేదన్నట్లు తల అడ్డంగా ఊపింది.

ఏదో అర్థం కాలేదన్న భావనతో ప్రజలు పుస్తకాలు చదువుతారు. కానీ పుస్తకాలు చదవటం వల్ల ప్రయోజనం ఉండదు. ఎంతో కష్టపడి అన్నీ చదివిన తరువాత కానీ మనుషులు ఏమీ అర్థం చేసుకోలేరనీ, అర్థం చేసుకోవటమన్నది మానవ పరిధికి బయట ఉందనీ తెలిసి రాదు.

తొమ్మిది విషయాల గురించి తెలిసి ఒక విషయం గురించి

తెలియనప్పుడు సాధారణంగా ప్రజలు అర్థం కాలేదన్న పదం ఉపయోగిస్తారు. కానీ పది విషయాలు అర్థం చేసుకోవాలన్న ఉద్దేశంతో బయలు దేరితే చివరకు ఒక్క విషయం కూడా బోధపడదు. వందపూల గురించి తెలిస్తే 'తెలియంది' ఒకటి ఉంటుంది. అర్థం చేసుకోటానికి ప్రజలు కిందా మీదా పడతారు. అర్థమయ్యిందని తమను తాము మభ్యపెట్టు కొంటారు. కానీ చివరకు ఏమీ తెలుసుకోకుండానే చనిపోతారు.

వాళ్ళు చేస్తున్న పని ఆపి పెద్ద నారింజ చెట్టు కింద చతికిలబడి ఆకాశంలో మబ్బులకేసి చూడసాగారు.

భూమి మీద నుంచి ఆకాశం వైపు చూపులు మళ్ళిస్తే స్వర్గం కనపడుతుందని ప్రజలు అనుకొంటారు. నారింజపండునూ, ఆకులనూ వేరు చేసి చూస్తారు. పండు నారింజ రంగూ, ఆకుల పచ్చదనమూ తెలుసనుకొంటారు. ఆకుపచ్చ, నారింజ అని తేడా చూపిన మరుక్షణం అసలు రంగులు మాయమవుతాయి.

కొన్ని విషయాలతో సాన్నిహిత్యం ఏర్పడటంవల్ల వాటి గురించి తెలుసనుకొంటారు. కానీ ఇదంతా మిడిమిడిజ్ఞానమే. ఖగోళ శాస్త్రజ్ఞుడికి నక్షత్రాల పేర్లు తెలిసి ఉండటం, వృక్షశాస్త్రజ్ఞుడికి చెట్ల వర్గీకరణ తెలిసి ఉండటం, కళాకారుడికి ఆకుపచ్చ, ఎరుపు రంగులలోని అందం తెలిసి ఉండటం వంటిదే ఇది. భూమి, ఆకాశం, పచ్చదనం, ఎరుపు గురించి తెలియటమంటే ప్రకృతి గురించి తెలియటం కాదు. తమ తమ బుర్రల్లో పడిన ముద్రలకు వివరణ నివ్వటానికి మించి ఖగోళశాస్త్రజ్ఞుడు, వృక్షశాస్త్రజ్ఞుడు, కళాకారుడూ ఏమీ చెయ్యలేరు. బుద్ధికి సంబంధించిన పనుల్లో ఆసక్తి పెరిగిన కొద్దీ వాళ్ళు ప్రకృతికి మరింత దూరమవుతూ ఉంటారు. సహజంగా జీవించటం మరింత కష్టమవుతుంది.

తమ ఇష్టానికి అనుగుణంగా ప్రకృతిని మలుచుకోవచ్చని ప్రజలు అనుకొంటారు. మనుషులు వినాశనానికి పూనుకోగలరు కానీ ప్రకృతిని

సృష్టించలేరు. విచక్షణ, విభజన, తెలిసీ తెలియనీతనం - ఇవీ మానవజ్ఞానానికి ఆధారం. ప్రకృతిని సమగ్రంగా అర్థం చేసుకోలేక, తమకు అర్థమయిన మేరకు ఏదో తయారు చేసి ప్రకృతికి ప్రతిరూపాన్ని తయారుచేశామని భ్రమపడతారు.

ప్రకృతిని తెలుసుకోవాలంటే నిజంగా తనకేమీ తెలియదనీ, తనేమీ తెలుసుకోలేననీ గుర్తించాలి. అప్పుడు విచక్షణ చేసే జ్ఞానం మీద ఆసక్తి పోతుంది. దీనిని త్యజించినపుడు విచక్షణ చేయని జ్ఞానం దానంతట అదే వస్తుంది. తెలుసుకోవాలని ప్రయత్నించకపోతే, అర్థం చేసుకోవాలన్న తాపత్రయం లేకపోతే అన్నీ అర్థమయ్యేరోజు వస్తుంది. అహాన్ని అణగతొక్కటం, ఆకాశం-భూమి నుంచి వేరుగా మనిషి ఉన్నాడన్న భావనను విడనాడటం కంటే మరోమార్గం లేదు.

నా మాటలు వింటూ అన్నీ తెలిసినవాడికి మల్లే ఉదాసీనముఖం పెట్టి కూర్చున్న యువకుని పై కోపంతో మండిపడ్డాను. "తెలివయినవాడివి కంటే మూర్ఖుడివి కావటం మేలు. కానీ నీకళ్ళల్లో ఆ చూపు ఏమిటి? తెలివితేటల ముసుగువేసుకొన్న మూర్ఖత్వం. నువ్వు తెలివయిన వాడివో, మూర్ఖుడివో నీకు తెలుసా? లేదా తెలివయిన మూర్ఖుడివి కావాలనుకొంటున్నావా? ఇటు తెలివయిన వాడివీ అటు మూర్ఖుడివీ కాలేని స్థితిలో కూరుకుపోయావు. అంతేనా?"

కోపంలో నాకు తెలియకుండానే ఏదేదో అనేశాను. చెప్పిన మాటలే మళ్ళీ మళ్ళీ చెప్పాను. పైగా నాకే అర్థం కాని మాటలు. నిశ్శబ్దంలోని విజ్ఞతకు మాటలు ఎన్నడూ సరితూగలేవు.

సూర్యుడు మెల్లగా కుంగుతున్నాడు. అంతటా సంధ్య కాంతులు అలుముకోసాగాయి. దూరంగా పట్టణంలో లైట్లు మిణుకు మిణుకు మంటున్నాయి. సాయంత్రం భోజనానికి అందరూ ఇంటిదారి పట్టారు. వాళ్ళ నీడల్ని అనుసరిస్తూ నేనూ బయలుదేరాను.

ఎవరు మూర్ఖులు ?

మనిషి అంతటి తెలివయిన జీవి మరొకటి లేదంటారు. ఈ తెలివిని ఉపయోగించే అణుబాంబులను తయారు చేశారు.

ఒసాకా స్టేషనుకు ఎదురుగా ఉన్న సహజ ఆహారం అమ్మే కొట్టు యజమాని ఒకసారి వచ్చాడు. అతనితో పాటు మరో ఏడుగురున్నారు. మధ్యాహ్నం భోజన సమయంలో వారిలో ఒకతను ఈ పిట్ట కథ చెప్పాడు. "పిల్లల్లో రకరకాల మనస్తత్వాల వాళ్ళుంటారు. ప్రతి తరగతిలో ప్రపంచం అంటే ఏమిటో పట్టకుండా ఆడుతూపాడుతూ హాయిగా ఉండేవాడు ఒకడుంటాడు. 'గుర్రం స్వారీ' ఆటలో ఎప్పుడూ గుర్రంగా ఉండేవాడు మరొక డుంటాడు. ఇతరుల భోజనాన్ని తెలివిగా కాజేసే మూడోవాడుంటాడు. క్లాసు లీడరు ఎన్నిక జరిగే ముందు మంచి నాయకుడిలో ఉండాల్సిన లక్షణాలు వివరించి సరయిన నిర్ణయం తీసుకోవటం ఎంతో ముఖ్యమని వివరిస్తూ ఉపాధ్యాయుడు గంభీర ఉపన్యాసం ఇస్తాడు. ఎన్నిక జరిగి తీరా ఫలితాలు చూస్తే ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపే పిల్లవాడు లీడరవుతాడు."

నాకిది సహజమనిపించింది. మిగిలిన వాళ్ళకు వింతగా అనిపించిందేమో ఒక్కసారిగా నవ్వేశారు.

గెలుపు ఓటముల బేరీజులో చూస్తే గుర్రంస్వారీ ఆటలో ఎప్పుడూ గుర్రమయ్యే బాలుడు ఓడిపోయే వాడని అనుకోవాలి. కానీ పిల్లలకు ఈ ప్రమాణాలు వర్తించవు. మూడవ పిల్లవాడు అందరి లోకీ

తెలివయిన వాడని ఉపాధ్యాయునికి అనిపించి ఉండవచ్చు. ఈ తెలివితేటలను అతను సరయిన మార్గంలో కాక ఇతరులను అణచి వెయ్యడానికి ఉపయోగిస్తాడని మిగతాపిల్లలు గుర్తించారు.

పెద్దల విలువల ప్రకారం తెలివిగా ఉండటం, తన సంరక్షణ తానే చూసుకోగలగటం గొప్ప అవుతుంది. తన పని తాను చూసుకొంటూ, హాయిగా తిని, సుఖంగా నిద్రపోతూ ఏ చీకూ చింతా లేకుండా ఉండేవాడు చాలా సంతృప్తి కరమయిన జీవితం జీవిస్తున్నాడు. ఏమీ సాధించాలని లేని వాడికంటే గొప్పవాడు మరొకడుండడు.

ఈసాపు నీతి కథల్లో ఒకదాంట్లో కప్పలు తమకు రాజునిమ్మని దేవుడిని అడుగుతాయి. దేవుడు ఒక దుంగని వాళ్ళకు రాజుగా ఇచ్చాడు. కదలక మెదలక పడి ఉండే దుంగను చూసి కప్పలు బాగా ఎగతాళి చేశాయి. ఈ దుంగ రాజు వద్దు, మరొక గొప్ప రాజు నివ్వమని అడిగాయి. దేవుడు కొంగను రాజుగా పంపించాడు. ఈ కొంగ కప్పలనన్నింటినీ ఒకటొకటిగా తినేసిన సంగతి మనకు తెలిసిందే.

ముందు నడిచేవాడు చాలా గొప్పవాడయితే అతన్ని అనుసరించేవాళ్ళు చాలా కష్టనష్టాలకు గురి అవుతారు. ఒక మంచి వ్యక్తిని ముందు ఉంచితే ఆ తరువాత వచ్చేవాళ్ళకు ఏ సమస్యా ఉండదు. బలవంతుడూ, తెలివయిన వాడే గొప్పవాడని ప్రజలను కొంటారు. అందుకే డీజిల్ ఇంజిన్ మాదిరి దేశాన్ని ముందుకు లాగేవాడిని ప్రధానిగా ఎన్నుకొంటారు.

"ఎటువంటి వ్యక్తి ప్రధాని అయితే బాగుంటుందంటారు?"

"ఒక దుంగ" అని బదులిచ్చాను. "దరుమాసాన్[1] కు మించి

---

1. జపాన్‌లో విశేష ఆదరణ పొందిన బొమ్మ. ఇది ధ్యానముద్రలో ఉన్న యోగి బొమ్మ. బూరతో తయారు చేస్తారు. కింద బరువుండటంవల్ల పడతోసినప్పటికీ మళ్ళీ లేచి కూర్చుంటుంది.

మంచి ప్రధాని మరొకడుండడు. ధ్యానముద్రలో కూర్చుని ఒక మాట కూడా మాట్లాడకుండా సంవత్సరాల తరబడి కూర్చుంటాడు. ఒక తోపుతోస్తే కింద పడిపోతాడు. కానీ ఏ మాత్రం ప్రతిఘటించక పోవటంవల్ల మళ్ళీ లేచి కూర్చుంటాడు. దరుమాసాన్ ఏమీ చెయ్యటం లేదనుకొంటే పొరబడినట్లే. అతడు కాళ్ళు ముడుచుకొని, చేతులు కట్టుకొని ఉంటాడు. చేతులు కట్టుకొని కూర్చోవాలని తెలుసు కాబట్టి ప్రతి విషయంలోనూ వేలు పెట్టాలనుకొనే వాళ్ళను కోపంగా చూస్తుంటాడు."

"ఏమీ చెయ్యకపోతే ఈ ప్రపంచమెలా నడుస్తుంది? ప్రగతి లేకపోతే ప్రపంచం ఏమౌతుంది?"

"ప్రగతి, పురోగమనం ఎందుకు సాధించాలి? ఆర్థిక ప్రగతి 5 శాతమో, పది శాతమో ఉంటే సంతోషం రెట్టింపు అవుతుందా? సున్నా శాతం ఎదుగుదల ఉంటే ఏమవుతుంది? ఇది ఒక రకంగా స్థిరమయిన ఆర్థిక విధానం కాదా? సాధారణమయిన జీవనం గడుపుతూ



"ప్రస్తుత పరిస్థితుల్లో ఏమీ చెయ్యకుండా ఉండటానికి ఒక 'ఉద్యమం' తీసుకురావటం తప్పించి మరోమార్గం లేదు"

అన్నిటినీ తేలికగా తీసుకోగలగటం కంటే మించినది మరేదయినా ఉందా?"

కాని మనుషులు అలా ఊరుకోరు. కొత్తది కనుగొంటారు. అది ఎలా పనిచేస్తుందో నేర్చుకొంటారు. దాని సహాయంతో ప్రకృతిని ఉపయోగించుకొంటారు. ఇదంతా మానవాళికి మేలుచేస్తుందని అనుకొంటారు. కానీ ఇప్పటి వరకు జరిగిందేమిటి? భూగోళం కాలుష్యమయమయింది. ప్రజలు గందరగోళంలో ఉన్నారు. ఆధునిక కాలపు సంక్షోభాలన్నీ కోరి తెచ్చుకొన్నవే.

ఇక్కడ ఈక్షేత్రంలో 'ఏమీ చెయ్యనవసరం లేని' వ్యవసాయాన్ని అనుసరిస్తున్నాం. రుచికరమూ, ఆరోగ్యకరమూ అయిన ధాన్యం, కూరగాయలు, పండ్లు తీసుకొంటున్నాం. జీవితానికి ఆధారమయిన వాటికి దగ్గరగా బతకటంలో అర్థమూ, సంతృప్తి ఉన్నాయి. జీవితం ఒక పాట. ఒక కవిత.

ప్రపంచాన్ని శోధించటం మొదలుపెట్టి ఏమి చేస్తే బాగుంటుందో నిర్ణయించిన తరువాత రైతుకు క్షణం తీరిక లేకుండా పోయింది. ఇది చెయ్యకుండా ఉంటే ఎలా ఉంటుంది, అది చెయ్యకుండా ఉంటే ఎలా ఉంటుంది అన్న దిశలో నా పరిశోధనలు సాగాయి. ఏమీ చెయ్యకుండ ఉంటే రైతులు హాయిగా ఉంటారని ఈ ముప్పై ఏళ్ళ అనుభవాలు నిరూపించాయి.

పనులు పెరిగిన కొద్దీ, సమాజం 'పురోగమించిన' కొద్దీ సమస్యలు పెరుగుతాయి. ప్రకృతి నిర్లక్ష్యానికి గురవుతోంది. మానవ ఆత్మ క్షీణించి, హీనమవుతోంది. ఏదో సాధించాలన్న తాపత్రయం వల్లనే ఈ సమస్యలన్నీ. మొదట్లో ప్రగతి సాధించటానికి ఏమీ ఉండేది కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏమీ చెయ్యకుండా ఉండటానికి ఒక 'ఉద్యమం' తీసుకు రావటం తప్పించి మరో మార్గంలేదు.

బడికి వెళ్ళటానికే పుట్టాను

ఒకరోజు మేం పొలంలో పని చేస్తుండగా భుజాన ఒక చిన్న సంచితో ఒక యువకుడు అక్కడికి వచ్చాడు.

"ఎక్కడినుంచి వస్తున్నావు?" అని అడిగాను.

"అక్కడినుంచి"

"అక్కడికి ఎలా వచ్చావు?"

"నడిచాను."

"ఇక్కడకు ఎందుకు వచ్చావు?"

"ఏమో తెలియదు."

ఇక్కడికి వచ్చే వాళ్ళలో చాలామందికి తమ పేరు, తమ గతం చెప్పుకోవాలన్న తొందర ఉండదు. ఎందుకొచ్చారో కూడా స్పష్టంగా చెప్పరు. చాలామందికి తాము ఎందుకొచ్చారో తమకే తెలియదు. అందుకే నాకతని ప్రవర్తన వింతగా అనిపించలేదు.

నిజానికి మనిషికి తాను ఎక్కడి నుంచి వస్తున్నాడో, ఎక్కడికి వెళుతున్నాడో తెలియదు. తల్లి గర్భం నుంచి పుట్టి, మట్టిలో కలుస్తామని చెప్పటం జీవశాస్త్ర పరంగా ఇచ్చే వివరణ అవుతుంది. పుట్టుక ముందు ఏమి ఉంది, చనిపోయిన తరువాత ఏ లోకాలున్నాయి అనేవి ఎవరికీ తెలియదు.

పుట్టుకకు కారణం తెలియదు. చనిపోయిన తరువాత ఏ అనంతలోకాలు వేచి ఉన్నాయో తెలియదు - నిజంగా మనిషికన్నా విషాదజీవి మరొకటి లేదు.

షికోకు దేవాలయాలనుంచి ఒకసారి వచ్చిన యాత్రికులు ఇక్కడ ఉన్నితో అల్లిన ఒక టోపి మరిచిపోయి వెళ్ళారు. దాని మీద "అసలు తూర్పూ లేదూ, పడమరాలేదు/పదిఅనంతదిశలు మాత్రమే" అని అల్లి ఉంది. ఆ టోపి ఇప్పుడు నా చేతిలోనే ఉంది. ఆ వచ్చిన యువకుడిని ఎక్కడి నుంచి వచ్చావని మళ్ళీ అడిగాను. కనజావాగుడి పూజారి కొడుకుననీ, రోజంతా శాస్త్రాలు చదవటం మూర్ఖత్వమని గ్రహించి రైతుగా బతుకుదామని వచ్చాననీ చెప్పాడు.

తూర్పూ లేదు, పడమరా లేదు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడని, పడమరన అస్తమిస్తాడని అంటాం. ఇది ఖగోళశాస్త్రజ్ఞుని పరిశీలన మాత్రమే. తూర్పు, పడమరలను అర్థం చేసుకోలేమని తెలుసుకోవటం సత్యానికి దగ్గరగా ఉంటుంది. సూర్యుడు ఎటునుంచి పొడుస్తున్నాడో ఎవరికీ తెలియదు.

ఎన్నో వేల శాస్త్రాలు మనకున్నాయి. 'హృదయసూత్రం' అన్నదాంట్లో అన్ని ముఖ్య విషయాలూ ఉన్నాయి. ఈ సూత్రంలో బుద్ధభగవానుడు ఇలా ప్రకటించాడు. "రూపమే శూన్యం, శూన్యమే రూపం. భౌతికమూ, ఆధ్యాత్మికమూ ఒకటే, కానీ ఉన్నది మాత్రం శూన్యం. మనిషి జీవించి లేడు, మరణించి లేడు; పుట్టుక లేదు, చావు లేదు; ముసలితనం లేదు, అనారోగ్యం లేదు; ఎదుగుదల లేదు, తరుగుదల లేదు."

ఒకరోజు పొలంలో వరి కోస్తున్నాం. గడ్డి కుప్పకు ఆనుకుని విశ్రాంతి తీసుకొంటూ మిగిలిన వాళ్ళతో ఈ విధంగా అన్నాను. "వసంతంలో వరినాట్లు వేస్తున్నప్పుడు వరి గింజ మొలకలు తొడిగినట్లనిపించింది ఇప్పుడు వరికోస్తుంటే చనిపోతున్నట్లనిపిస్తోంది. ప్రతి సంవత్సరం ఈ పొలంలో వరి మొలుస్తుంది, చనిపోతుంది. ఈ ఏటి చావే మరుసటి జననానికి దారి తీస్తుంది. కాబట్టి ఇప్పుడు కత్తిరిస్తున్న వరి నిరంతరం బతికే ఉంటుందని చెప్పవచ్చు."

చావు పుట్టుకలను మానవులు చాలా సంకుచిత దృష్టితో చూస్తారు. వసంతంలో మొలకలెత్తడం, ఆకురాలే కాలంలో చనిపోవడం ఈ గడ్డిపరకకు ఏం పట్టింది? జీవితం సంతోషమనీ, చావడం విచారమనీ మనుషులకు అనిపిస్తుంది. భూమిలో దాగి ఉండి వసంతంలో మొలకలెత్తినప్పుడూ, ఎండిపోయి రాలిపోతున్నప్పుడూ వరి గింజలో జీవిత ఆనందం ఒకే విధంగా నిండుగా ఉంటుంది. జీవితంలోని ఆనందం చావుతో విడిపోదు. క్షణంలో కదిలిపోయే ఘటన మృత్యువు. ఈ వరి గింజకు జీవించడంలోని ఆనందం పూర్తిగా తెలుసుకాబట్టి మరణించడంలోని దుఃఖం తెలియదనిపించటం లేదూ?

వరి, బార్లీలో జరిగేటటువంటి పరిణామాలే మానవ శరీరంలో నిత్యమూ జరుగుతుంటాయి. రోజురోజుకు జుట్టు పెరుగుతుంది, గోళ్ళు పెరుగుతాయి. ప్రతిరోజూ వేలకొద్ది కణాలు చనిపోతుంటాయి, పుడుతుంటాయి. ఇవ్వాళ నీ శరీరంలో ప్రవహిస్తున్న రక్తం, నెలరోజుల క్రితం నీలో ప్రవహించిన రక్తం ఒకటి కాదు. నీ గుణాలే నీ పిల్లల్లోనూ, మనుమల్లోనూ కొనసాగుతాయని గుర్తించినప్పుడు రోజూ చస్తూ, రోజూ పుడుతున్నా చనిపోయిన తరువాత కూడా తరతరాలుగా బతికి ఉంటామని తెలుస్తుంది.

ఈ జనన మరణ చక్రాలలో పాల్గొని, అనుభూతి పొంది, ఆనందించగలిగితే అంతకు మించి ఏమీ సాధించాల్సిన అవసరం లేదు. కాని బతుకు గడుస్తుంటే, రోజురోజుకీ మార్పు చెందుతుంటే చాలామంది ఆనందాన్ని పొందలేరు. తమకు తెలిసిన జీవితాన్నే పట్టుకు వేళ్ళాడుతుంటారు. అందుకే చావంటే అంత భయం. చేజారిన గతం మీదా, ఇంకా రాని రేపు మీదా దృష్టినిలిపి ఇక్కడ, ఈక్షణంలో భూమి మీద బతికున్నామన్న సంగతి మరచిపోతారు. గందరగోళంలో కొట్టుమిట్టాడుతూండటంవల్ల జీవితం కలలాగా గడిచిపోతుంది.

"చావు పుట్టుకలు వాస్తవమయినప్పుడు మరి బాధ ఎలా తప్పుతుంది?"

"చావు పుట్టుకలన్నవే లేవు."

"ఈ మాట ఎలా చెప్పగలుగుతున్నారు?"

అనుభవమనే ప్రవాహంలో ఈ ప్రపంచమంతా ఒకటే. మానవ మేధస్సు దీనిని చావు–పుట్టుకలు, ఇన్–యాంగ్, పదార్థం–శూన్యం అని విడదీస్తుంది. ఈ పంచేంద్రియాల ద్వారా పొందే అనుభూతులే యదార్థమని మెదడు విశ్వసిస్తుంది. అందుకే పదార్థం రకరకాల వస్తువులుగా గోచరిస్తుంది.

ఈ భౌతిక ప్రపంచంలోని రూపాలూ, చావు–పుట్టుకలూ, సుఖదుఃఖాలు, ఆరోగ్యం–అనారోగ్యం అన్న సిద్ధాంతాలూ మానవుని మెదడులోంచి పుట్టినవే. అంతా శూన్యమని బుద్ధుడనటంలో మానవ మేధస్సు ఊహించుకొన్నవాటినన్నిటినీ తిరస్కరించడమే కాకుండా, మానవ ఉద్రేకాలు కూడా ఒట్టి భ్రమలని ప్రకటిస్తున్నాడు.

"అంతా భ్రాంతియేనా? ఏమి మిగిలిలేదా?"

"ఏమీ ఎందుకు లేదు. శూన్యమన్న సిద్ధాంతం ఇంకా నీ మెదడులో మిగిలిలేదూ?" అని ఆ యువకుడితో అన్నాను. "నువ్వు ఎక్కడినుంచి వచ్చావో తెలియదు. ఎక్కడికి వెళుతున్నావో తెలియదు. నా ముందు ఇక్కడ నిలిచి ఉన్నావని మాత్రం ఖచ్చితంగా ఎలా చెప్పగలవు? ఉండటమనేది అర్థరహితం కాదా?"

"....................."

ఒకరోజు ఒక నాలుగేళ్ళ పిల్ల తల్లినగుడుతోంది "నేను ఎందుకు పుట్టాను? బడికి వెళ్ళటానికేనా?" అని.

"అవును. బడికి వెళ్ళటానికే పుట్టావు" అని ఆ తల్లి నిజాయితీగా

చెప్పలేకపోయింది. చూస్తుంటే బడికెళ్ళటానికే మనుషులు పుడుతున్నారనిపిస్తోంది.

ఎందుకు పుట్టారో తెలుసుకోటానికి కష్టపడి కాలేజి వరకు చదువుతారు. జీవితం నాశనం అయినా సరే ఎందుకు పుట్టామొ తెలుసుకొంటే చాలని పండితులూ, తత్వవేత్తలూ తంటాలు పడుతుంటారు.

మనిషి జీవితానికి ఒక ఉద్దేశమంటూ లేదు. అది ఉందని ఊహించుకొని, దానిని తెలుసుకోవాలన్న తాపత్రయంతో కొట్టుమిట్టాడుతుంటారు. ఇది ఒకే వ్యక్తి చేసే ముష్టియుద్ధంవంటిది. జీవితానికి ఉద్దేశమంటూ ఊహించుకోనవసరం లేదు, దాని కోసం వెతకనవసరం లేదు. ఉద్దేశం లేని జీవితం అర్థరహితమేమో పిల్లల్ని అడిగి చూడండి.

నర్సరీలో చేరిన రోజునుండి పిల్లలకష్టాలు మొదలవుతాయి. మనిషి సంతోష జీవే. కానీ కష్టాలు కొని తెచ్చుకొని వాటి నుంచి బయటపడటానికి సతమతమవుతున్నాడు.

ప్రకృతిలో చావు పుట్టుకలు లేవు. ప్రకృతి సంతోషమయంగా ఉంది.

మానవసమాజంలో చావు పుట్టుకలున్నాయి. ప్రజల్లో విషాదముంది.

తేలిపోయే మబ్బులూ, విజ్ఞానపు భ్రమలూ

నారింజ పళ్ల నిలవ చేసే డబ్బాలు కడగటానికి ఈ ఉదయం నదికి వెళ్లాను. ఒక బండ రాయి మీద వంగుని నీటిలో చెయ్యి పెట్టగానే చలికి జివ్వుమని లాగింది. మబ్బులేని నీలాకాశం ముందు ఎర్రని ఆకులతో నది ఒడ్డునున్న చెట్లు కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయి. ఆకాశం తెరమీద పరుచుకొన్న చెట్ల కొమ్మల అందాలు నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తాయి.

ఈ ఒక్క దృశ్యంలోనే అనుభూతి ప్రపంచమంతా ఇమిడి ఉంది. ప్రవహిస్తున్న నీళ్ళూ, ప్రవహిస్తున్న కాలం; కుడివైపు గట్టూ, ఎడమవైపు గట్టూ; ఎండపొడ, నీడ ముసుగు; ఎర్రని ఆకులు, నీలాకాశం – అన్నీ ప్రకృతి పుస్తకంలోని నిశ్శబ్ద, పవిత్ర పుటలుగా కనిపిస్తాయి. ఇందులో రెల్లుగడ్డి పోచవంటివాడు మనిషి.

ప్రకృతి అంటే ఏమిటి అని ప్రశ్నించిన తరువాత, ఆ 'ఏమిటి' అంటే ఏమిటని ప్రశ్నించుకోవాలి. అంతే కాదు ఆ 'ఏమిటి'ని ఏమిటని ప్రశ్నించే ఈ మనిషి ఏమిటి అని ప్రశ్నించుకోవాలి. ఈ విధంగా అనంతమయిన ప్రశ్నల వలయంలో చిక్కుకు పోతాం.

తనని ఆశ్చర్యంలో ముంచేదీ, ఆనందంలో ఓలలాడించేదీ ఏమిటో తెలుసుకోటానికి రెండు మార్గాలున్నాయి. తనలోకి తాను చూసుకొని "ప్రకృతి ఏమిటి?" అని ప్రశ్నించే దెవరో తెలుసుకోవటం మొదటి మార్గం.

మనిషి నుంచి ప్రకృతిని వేరు చేసి పరిశీలించటం రెండవ మార్గం.

మొదటి మార్గం తత్వశాస్త్రంలోకి, మతంలోకి తీసుకెళుతుంది. శూన్యంలోకి దృష్టి సారిస్తూ నీళ్ళు ఎగువనుంచీ దిగువకు పారుతున్నాయనటంలో అసహజమేమి లేదు. అదే విధంగా నీళ్ళు నిలకడగా ఉండి, వంతెన ప్రవహిస్తోందనటం లోనూ తప్పేమి లేదు.

రెండవ మార్గం అనుసరిస్తే అనేక అంశాలకు దారితీస్తుంది. నీళ్ళూ, నీటివేగం, అలలు, గాలి, తెల్లని మబ్బులు వేరు వేరుగా ఉండి అన్నీ పరిశీలించ దగ్గ అంశాలవుతాయి. ఇది మరిన్ని ప్రశ్నలకు దారితీస్తుంది. ఇవి అన్ని దిక్కుల్లోకి విస్తరిస్తాయి. ఇది విజ్ఞాన పంథా.

ఒకప్పుడు ప్రపంచం చాలా సహజంగా ఉండేది. పొద్దునే మైదానంలో నడిస్తే మంచు బిందువులు చల్లగా తగిలేవి. ఈ ఒక్క మంచు బిందువును శాస్త్రీయంగా వివరించడానికి పూనుకోవడంతో ఇప్పుడు అంతులేని మేథాజగత్తులో కూరుకుపోయారు.

ఉదజని, ప్రాణవాయువుల పరమాణువులతో నీటి అణువులు తయారవుతాయి. పదార్థం పరమాణువు కంటే చిన్నగా ఉండదని ఒకప్పుడు అనుకొన్నారు. ఆ తరువాత ఈ పరమాణువులలో ఒక కేంద్రకం(న్యూక్లియస్) ఉందని కనుక్కొన్నారు. కేంద్రకంలో మరింత సూక్ష్మపదార్థాలున్నాయని కూడా కనుక్కొన్నారు. కేంద్రకంలో ఉండే ఈ సూక్ష్మ పదార్థాల్లో కొన్ని వందల రకాలున్నాయని అంచనా. వీటి పరిశీలన ఎక్కడ, ఎలా ముగుస్తుందో ఎవరికీ తెలియదు.

పరమాణువులో కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగు తుంటాయి. అనంత విశ్వంలో తోకచుక్కలు తిరుగుతున్నట్లు ఉంటుందిది. పరమాణువును అధ్యయనం చేసే భౌతిక శాస్త్రవేత్తకు ఈ సూక్ష్మ పదార్థాల ప్రపంచమే విశ్వమంత విశాలమనిపిస్తుంది. మనమున్న పాలపుంతలాంటివే లెక్కలేనన్ని ఉన్నాయి. వీటినన్నిటినీ అధ్యయనం

చేసే వ్యక్తికి మన విశ్వం ఎంతో సూక్ష్మంగా గోచరిస్తుంది.

నీటిబొట్టు చాలా చిన్నదనీ, రాయి స్థిరమయినదీ, చలనం లేనిదనీ భావించే వ్యక్తి ఏమీ తెలియని మూర్ఖుడు. ఇతనికి ఏ చీకూ చింతా ఉండదు. ఒక నీటి చుక్క అనంత విశ్వమనీ, రాయిలో సూక్ష్మ పదార్థాలు రాకెట్టు వేగంతో చలిస్తూ ఉంటాయని తెలిసిన శాస్త్రజ్ఞుడు తెలివయిన మూర్ఖుడు. మామూలుగా చూస్తే ఈ ప్రపంచం వాస్తవమయినదీ, అందుబాటులో ఉన్నదనీ అనిపిస్తుంది. సంక్లిష్టంగా చూస్తే ఏమీ అర్థంకాని, దూరాన ఉన్న వింతలా భయపెడుతుంది.

చంద్రుడినుంచి మట్టి ముద్దలు తీసుకువచ్చినపుడు, సంతోషించిన శాస్త్రజ్ఞులు పిల్లల మాదిరి "చందమామ రావే..." అంటూ సంబర పడగలరా? నీటిలో చంద్రుని పూర్ణబింబం చూసి ఆనందించగలరా? ఆకాశానికి ఎగసి, చంద్రుని మీద నడవటంవల్ల లక్షలాది పిల్లలూ, పెద్దలూ ప్రేమించే చంద్రుడిని ఒకింత కళంకం చేయటం కంటే ఇంకేమి సాధించలేదు.

విజ్ఞానశాస్త్రం మానవాళికి ఉపయోగమని ఎందుకనుకొంటారు?

ఒకప్పుడు ఈ ఊళ్ళో పిండి పట్టడానికి చేతితో తిప్పే రాతి తిరగలి ఉండేది. తరువాత పక్కనున్న నదీ ప్రవాహాన్ని ఉపయోగించుకొని నీటితో నడిచే మర తయారయ్యింది. చేతితో తిప్పే తిరగలి కన్నా దీని శక్తి ఎన్నో రెట్లు ఎక్కువ. ఆ తరువాత చాలా సంవత్సరాలకు నదిపై ఆనకట్ట కట్టి జలవిద్యుత్ కేంద్రం స్థాపించారు. దీనితో విద్యుచ్ఛక్తితో నడిచే పిండి మర వచ్చింది.

ఈవిధమయిన యాంత్రిక ప్రగతి వల్ల మానవాళికి ఏం ప్రయోజనం కలిగింది? బియ్యం పిండి పట్టే ముందు పాలిష్ చేస్తారు. అంటే ముందు ఊకతీసి తరువాత తౌడు, పైపొర మొలక వచ్చే భాగం తీసేస్తారు. దీని వల్ల ఆరోగ్యానికి అవసరమయినదంతా పోయి ఎందుకూ

పనికిరాని పిండి మిగులుతుంది.[1] అంటే ఈ సాంకేతిక పరిజ్ఞానమంతా దంపుడు బియ్యాన్ని రెండు అసంపూర్ణ భాగాలుగా విడదియ్యటానికి ఉపయోగపడింది. తేలికగా జీర్ణమయ్యే తెల్ల బియ్యం ప్రధాన ఆహారం అయినవాడు అందులో పోషక పదార్థాలు లోపిస్తాయి. విటమిన్లూ, టానిక్కులూ ఆదనంగా అవసరమవుతాయి. పొట్ట కండరాలూ, పేగులూ చేయాల్సిన పనిని యంత్రాలు చేయడంతో ఇవి మందకొడిగా తయారవుతున్నాయి.

ఇంధనం విషయంలోనూ ఇంతే. వంధల వేల ఏళ్ళ క్రితం చెట్లు భూమిలో పడి ఆ వత్తిడికీ, వేడికీ కణాలు మార్పు చెంది ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ఏర్పడింది. దీనిని భూమిలోంచి పైకి తీసి గొట్టాల ద్వారా, ఇతర రవాణా సాధనాల ద్వారా దూర దూర ప్రాంతాలకు చేరవేస్తారు. పెద్ద పెద్ద కర్మాగారాల్లో శుద్ధి చేసిన తరువాత కిరోసిన్, పెట్రోలు తదితర పదార్థాలు లభిస్తున్నాయి.

ఈ కిరోసిన్‌ను ఉపయోగించటం తేలికా? ఇంటి ముందున్న దేవదారు చెట్టు పుల్లలను ఉపయోగించటం తేలికా?[2] కిరోసిన్‌లోనూ, కట్టెపుల్లలోనూ ఉన్నది ఒకటే. కానీ కిరోసిన్ ఇక్కడకు చేరుకోటానికి చాలా సమయం పట్టింది. చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చింది.

---

1. జపాన్‌లో పదాలు రాయడానికి ఉపయోగించే అక్షరాలను 'కారెక్టర్స్' అంటారు. ఒక్కొక్క కారెక్టర్‌కి ఒక విశిష్టమయిన అర్థం ఉంటుంది. ఉదాహరణకు తవుడును జపానులో 'నూక' అంటారు. దీనిని 'బియ్యం', 'ఆరోగ్యం' అన్న కారెక్టర్స్‌తో రాస్తారు. తవుడు పోగా మిగిలిన దానిని 'కాసు' అంటారు. దీనిని 'తెల్ల', 'బియ్యం' అన్న కారెక్టర్స్‌తో రాస్తారు.
2. ప్రపంచవ్యాప్తంగా పలుప్రాంతాల్లో కట్టెపుల్లల కొరతఎదుర్కొంటున్నారన్నది అందరికీ తెలిసిందే. మరిన్ని చెట్లు నాటాల్సిన అవసరం ఉందన్న విషయం ఫుకుఓకా వాదనలో దాగి ఉంది.
రోజువారీ జీవన అవసరాలకు ఫుకుఓకా తేలిక మార్గాలను సూచిస్తున్నారు.

మనకున్న శిలాజ ఇంధనాలు చాలవనీ, అణుశక్తిని అభివృద్ధి చేయాలనీ అంటున్నారు. దీనికోసం ముందుగా అరుదయిన యురేనియం కోసం వెదకాలి. తరువాత దీనిని అణుఇంధనంగా మార్చాలి. పరమాణు రియాక్టర్‌లో దీనిని మండించాలి. ఇదంతా కట్టెపుల్లలు మండించటమంత తేలికయిన విషయం కాదు. కట్టెపుల్లలు మండిస్తే మిగిలేది బూడిద మాత్రమే. కానీ అణుఇంధనం మండించగా మిగిలే వ్యర్థ పదార్థం కొన్ని వందల వేల ఏళ్ళవరకూ అణుధార్మిక గుణం కలిగి ఉంటుంది.

వ్యవసాయానికీ ఇది వర్తిస్తుంది. ఎల్లప్పుడూ నీళ్ళు నిలవగట్టిన పొలంలో నవనవ లాడే నాజూకు వరిమొక్కను పెంచితే అది తేలికగా చీడపీడలకు గురవుతుంది. 'అభివృద్ధి పరచిన' విత్తనాలు వాడితే తప్పనిసరిగా రసాయనిక ఎరువులూ, పురుగుల మందలూ వాడాల్సి ఉంటుంది.

దీనికి విరుద్ధంగా ఆరోగ్యమయిన వాతావరణంలో దృఢమయిన మొక్కలను పెంచితే రసాయనాల అవసరం ఉండదు.

వరిపొలాన్ని నాగలితో గానీ, ట్రాక్టరుతోగానీ దున్నితే నేలలో ప్రాణవాయువు లోపిస్తుంది. మట్టినిర్మాణ స్వరూపం దెబ్బ తింటుంది. వానపాములు వంటి చిన్న చిన్న జీవులు చచ్చిపోతాయి. ఫలితంగా నేల జీవరహితమై గట్టిపడుతుంది. ఆ తరువాత ప్రతిసంవత్సరం పొలాన్ని దున్నక తప్పదు.

పొలం సహజంగా దానంతట అదే దున్నుకొనే విధానాన్ని అనుసరిస్తే నాగలి కానీ, ట్రాక్టరు కానీ అవసరముండవు.

నేలలో సేంద్రియ పదార్థం, సూక్ష్మజీవులు జీవం లేకుండా చేసినపుడు రసాయనిక ఎరువులు అవసరమవుతాయి. రసాయనిక ఎరువులు వాడినపుడు వరి త్వరగా, ఏపుగా పెరుగుతుంది. కానీ వరితో పాటు కలుపు కూడా పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో కలుపునాశిని

మందులు వాడి అవి ఎంతో ఉపయోగపడ్డాయనుకొంటారు.

వరితో పాటు క్లోవరు విత్తి మొత్తం గడ్డీ, సేంద్రియ పదార్థాన్నీ తిరిగి నేలకు అందించినపుడు కలుపునాశిని మందులు, రసాయనిక ఎరువులు, పెంటపోగు ఎరువు లేకుండా పంటలు పండించవచ్చు.

వ్యవసాయంలో తప్పనిసరిగా అవసరమయ్యేవి చాలా తక్కువ. ఎరువులూ, కలుపునాశిని మందులూ, పురుగుల మందులూ, యంత్రాలూ అవసరమయ్యే పరిస్థితులు కల్పించినపుడు విజ్ఞాన శాస్త్రం అవసరమవుతుంది.

అత్యంత ఆధునిక, శాస్త్రీయ పద్ధతుల ద్వారా సాధించిన దిగుబడులను నా పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పొందాను. అతి తక్కువ వనరులూ, అతి తక్కువ శ్రమా ఉపయోగించి 'ఏమీ చెయ్యనవసరం లేని' వ్యవసాయం ద్వారా అంతే దిగుబడులు సాధించినపుడు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం సాధించిందేమిటి?

సాపేక్ష సిద్ధాంతం

శీతాకాలపు ఎండలో చుట్టూ ఉన్న పొలాలను పరికిస్తూ ఆశ్చర్యపోయాను. నా పొలంలో తప్పించి అన్ని పొలాల్లో వరి కోసే యంత్రాలూ, వరి కోసి – నూర్చే యంత్రాలూ పని చేస్తున్నాయి. గత మూడు సంవత్సరాల్లో ఈ ఊరు గుర్తుపట్టలేనంతగా మారిపోయింది.

ఇతరులు యంత్రాలను ఉపయోగించటం చూసి కొండమీద నివసిస్తున్న యువతీ యువకులు ఏమీ అసూయపడటం లేదు. పాతకాలపు కొడవలితో ప్రశాంతంగా కోత కోయటాన్ని వాళ్ళు ఎంతో ఇష్టపడతారు.

ఆరోజు సాయంత్రం అందరం భోజనం చేసి టీ తాగుతున్నాం. ఊళ్ళో వచ్చిన మార్పుల గురించి చెప్పాను. ఒకప్పుడు అందరూ, పొలాన్ని చేత్తోతవ్వేవారు. ఒకరోజు ఒకవ్యక్తి ఈపనికి ఆవును ఉపయోగించాడు. దుక్కి పనిని తేలికగా, త్వరగా చేయగలిగి నందుకు అతను ఎంతో గర్వపడ్డాడు. ఇరవై ఏళ్ళ క్రితం ఊళ్ళోకి మొట్టమొదటసారి ట్రాక్టరు వచ్చింది. గ్రామస్థులందరూ చేరి దుక్కి పశువు మంచిదా, ట్రాక్టరు మంచిదా అని తీవ్రంగా చర్చించారు. ట్రాక్టరుతో మరింత తేలికగా, త్వరగా పని ముగించవచ్చని రుజువు కావటంతో ఇంకేమి ఆలోచించ కుండా దుక్కిపశువులకు స్వస్తి పలికి ట్రాక్టరు ఉపయోగించసాగారు. పక్కవాని కంటే తొందరగా పని ముగించాలన్న ఆత్రం తప్పించి మరో ఆలోచన లేదు.



"కొడవలికి పదును"

వేగంగా మార్పు చెందుతున్న ఆధునిక వ్యవసాయంలో తానూ ఒకపావుగా మారాడన్న సంగతి రైతు గుర్తించడం లేదు. తాను తీసుకోవాల్సిన నిర్ణయాలన్నింటినీ వ్యవసాయ యంత్రాలు అమ్మేవాళ్ళ చేతుల్లో పెట్టేశాడు.

ఒకప్పుడు ప్రజలు ఆకాశంలోని నక్షత్రాలకేసిచూసి ఈ అనంత విశ్వం పట్ల అబ్బురపడేవారు. ఇప్పుడు కాలం,స్థలం వంటివి శాస్త్రజ్ఞుల కోసం వదిలి పెట్టేశారు.

భౌతికశాస్త్రంలో సాపేక్షసిద్ధాంతం రూపొందించినందుకు ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి ఇచ్చారట. ఈసిద్ధాంతం ప్రపంచంలోని సాపేక్షతను వివరించి, మనుషుల్ని కాలం, స్థలం అన్న బంధాల నుంచి విడుదల చేసి మరింత ప్రశాంత, సంతోషభరిత జీవితానికి దారి తీసి ఉంటే ఈ బహుమతికి అర్ధం ఉండేది. అతని వివరణ ఒకపట్టాన అర్ధంకాదు. ఈప్రపంచం చాలా సంక్లిష్టమయినదనీ, దీనిని అర్ధం చేసుకోలేమనీ అనిపించేలా చేస్తుంది. 'మానవ ఆధ్యాత్మిక సుఖశాంతులను' చెడగొట్టినందుకు అతనికి బహుమతి ఇచ్చి ఉంటేసరిపోయేది.

ప్రకృతిలో సాపేక్ష ప్రపంచమంటూ ఉండదు. అనుభవానికి మానవ మేధస్సు ఇచ్చే రూపమే సాపేక్షత. ఇతర ప్రాణులు అవిభాజ్యమయిన వాస్తవిక ప్రపంచంలో జీవిస్తాయి. ఈమేధస్సు సృష్టించిన సాపేక్ష ప్రపంచంలో కూరుకు పోయినవారు కాలానికి అతీతమయిన కాలాన్నీ, స్థలానికి అతీతమయిన స్థలాన్నీ గ్రహించలేరు.

"శాస్త్రజ్ఞుల్ని ఎప్పుడూ ఏదో ఒకటి అంటూండటం మీకు వింతగా అనిపిస్తుందేమో" టీ తాగడానికి కాసేపు ఆగుతూ అన్నాను. వాళ్ళంతా చిరునవ్వుతో చూస్తున్నారు. మంట వెలుగులో వాళ్ళముఖాలు చిత్రంగా మెరుస్తున్నాయి. "మెదడులో విచక్షణ నిర్వహించే పాత్రనే సమాజంలో శాస్త్రజ్ఞులు నిర్వహిస్తున్నారు"

యుద్ధమూ, శాంతీ లేని ఊరు

ఒకపాము కప్పను పట్టుకొని జరజరమంటూగడ్డి లోకిపాకి పోయింది. అదిచూసి ఒక అమ్మాయి కెవ్వుమంటూ అరిచింది. కుర్రవాళ్ళలో ఒకడు పాముని తిడుతూ రాయితీసుకొని అదివెళ్ళిన దిశలో విసిరేశాడు. మిగతా వాళ్ళంతా ఒక్కసారిగా నవ్వారు. రాయి విసిరిన అబ్బాయి వైపు తిరిగి "ఏంచేద్దామనుకున్నావు?" అని అడిగాను.

గద్దపామును వేటాడుతుంది. తోడేలు గద్దను పడుతుంది. ఒకమనిషి తోడేలును చంపుతాడు. ఆ మనిషే క్షయ క్రిములకు గురయ్యి చచ్చిపోతాడు. మానవ శవంలో రకరకాల సూక్ష్మకిములు వృద్ధి చెందుతాయి. ఇవి అందుబాటులోకి తెచ్చే పోషక పదార్థాల పై ఆధారపడి గడ్డి మొక్కలూ,చెట్లూ,బతుకుతాయి.పురుగులు చెట్లపై దాడిచేస్తాయి. కప్పలు పురుగుల్ని తింటాయి.

జంతువులూ, మొక్కలూ, సూక్ష్మ జీవులూ,అన్నీ జీవిత చక్రంలో భాగమే. సహజ పరిస్థితుల్లో అనువయిన సమతౌల్యానికి ఇవి చేరుకొంటాయి. ఈప్రపంచంలో బలమయిన ప్రాణి బల హీనమయిన దానిని కబళిస్తుందనుకోవచ్చు. లేదా ఒకదానికొకటి సహకరిస్తూ కలసి జీవిస్తున్నాయని అనవచ్చు. ఏదన్నా వివాదాస్పదమే అవుతుంది. అలజడి రేపి, గందరగోళం సృష్టిస్తుంది.


కప్పమీద జాలిచూపాలనీ, పామును అసహ్యించుకోవాలనీ పెద్దవాళ్ళు అనుకుంటారు. ఈ అభిప్రాయం సరయినదేకావచ్చు. కానీ ఇదే సత్యమా అనికూడా ఆలోచించాలి.

ఒకయువకుడు ఇలా అన్నాడు: "జీవితం ఒకపోటీ అనీ,ఇందులో బలవంతులు బలహీనుల్ని తుదముట్టిస్తారనీ అనుకొంటే భూతలం రణరంగంగా మారేది. బలవంతమయినవి బతకాలంటే బలహీనమయినవి బలికాకతప్పదు. బలమయినవి నెగ్గి, కొనసాగటమూ,బలహీనమయినవి అంతరించిపోవటం ప్రకృతిసిద్ధాంతం. బతుకు సంఘర్షణలో విజయంసాధించిన ప్రాణులే ఈభూమి మీద ఇప్పుడు మిగిలి ఉన్నాయి. బలమయినవే మనగలుగుతాయన్నది ప్రకృతి నియమం అనవచ్చు".

మరొకవ్యక్తి ఇలా అభిప్రాయ పడ్డాడు: "గెలిచిన వాళ్ళకు అలాగే అనిపిస్తుంది మరి. ఈప్రపంచం సహజీవనం, పరస్పర సహకారంతో కూడుకొన్నదని నాకనిపిస్తుంది. ఈ వరి పొలంలో క్లోవరూ, అనేక రకాల గడ్డిమొక్కలూ, కలుపుమొక్కలూ ఒకదానికొకటి తోడ్పడుతూ బతుకుతున్నాయి. చెట్టు మొదలుకు ఒకతీగ అల్లుకొంటుంది. కొమ్మల మీద నాచూ ఇతర మొక్కలూ పెరుగుతాయి. అడవిలో చెట్లనీడలో ఫెర్న్ మొక్కలు పెరుగుతాయి. పక్షులూ, మొక్కలూ, పురుగులూ, చిన్న జంతువులూ, సూక్ష్మ జీవులూ వంటి సమస్తప్రాణులూ నిర్వర్తించే కీలకమయిన పాత్రలుంటాయి. అన్నీ ఒకదానికొకటి ఉపయోగ పడతాయి."

మూడోవ్యక్తి " ఈప్రపంచంలో బలహీనమయిన దానిని బలమయినది కబళించటమూ ఉంది. సహజీవనమూఉంది. బలమయిన జీవి తనకు అవసరమయిన దానికంటే ఎక్కువ ఆహారం తీసుకోదు. బలమయినది ఇతర జీవులపై దాడి చేసినప్పటికీ ఇది సమతౌల్యానికి దోహదం చేస్తుంది. ఈభూమిపై శాంతి.సుస్థిరత వెల్లి విరిసేలా ప్రకృతి ఉక్కుపిడికిలితో పాలన చేస్తుంది"అని అన్నాడు.

ముగ్గురు వ్యక్తులు, మూడు విభిన్న అభిప్రాయాలు. నేను మూడింటినీ తిరస్కరించాను.



"ప్రకృతిలో సాపేక్ష ప్రపంచం లేదు"

పోటీ సిద్ధాంతంపై ఆధారపడి ఉన్నానా, సహజీవన సిద్ధాంతం పై ఆధారపడి ఉన్నానా అని ప్రపంచం తనను తాను ప్రశ్నించుకోదు. మానవబుద్ధిలోని సాపేక్ష దృష్టితో చూసినప్పుడే బలమయినవీ, బలహీనమయినవీ, పెద్దవీ, చిన్నవీ కనిపిస్తాయి.

ఈవిధమయిన సాపేక్ష దృక్పధం ఉందనటంలో ఎటువంటి సందేహమూలేదు. ఒక్కక్షణం మానవుల ఈ సాపేక్షదృష్టి పొరపాటనుకొందాం. అంటే పెద్దవీ, చిన్నవీ అన్నీ కిందా, పైనా అనీ ఇటువంటి ఆధారాలేవీ లేవనుకొందాం. అప్పుడు మానవ విలువలూ, నిర్ణయాలూ అన్నీ కుప్పకూలతాయి.

"ఈవిధంగా ప్రపంచాన్ని చూడటం కేవలం ఊహకాదా? వాస్తవంలో పెద్ద దేశాలున్నాయి, చిన్న దేశాలున్నాయి. పేదరికమూ సంపద, బలవంతుడూ, బలహీనుడూ వంటివి ఉన్నప్పుడు సంఘర్షణ తప్పని సరిగా ఉంటుంది. ఫలితంగా గెలిచిన వాళ్ళుంటారు, ఓడిన వాళ్ళుంటారు. ఈవిధమయిన సాపేక్ష దృష్టి, దాని వల్ల వచ్చే ఉద్రేకాలూ మానవసహజమనీ, కేవలం మానవులకేసాధ్యమయిన ఏకైక అంశమనీ చెప్పవచ్చేమో?" అని ఎవరయినా అనవచ్చు.

ఇతర జంతువులూ పోట్లాడుకొంటాయి. కానీ యుద్ధంచెయ్యవు. బలవంతుడూ, బలహీనుడూ అన్న భావాలపై ఆధారపడి యుద్ధం చెయ్యటం మనుషులకు మాత్రమే సాధ్యమయ్యే అంశమంటే బతుకు హాస్యాస్పదమవుతుంది. ఈ హాస్యాస్పదమయిన దాన్ని హాస్యాస్పదమయినదిగా గుర్తించలేకపోవటం లోనే మానవ విషాదం ఉంది.

వైరుధ్యాలూ, విభేధాలూ లేని ప్రపంచంలో పిల్లలు ప్రశాంతంగా జీవిస్తారు. వెలుతురూ, చీకటీ, బలమయినదీ,బలహీనమయినదీ వంటివి గ్రహిస్తారు. కానీ ఏవిధమయిన తీర్పులు చెప్పరు. పాము,కప్ప ఉన్నప్పటికీ పిల్లవానికి బలమయినదీ, బలహీనమయినవి అర్థంకావు. పిల్లల్లో జీవితానందం ఉంటుంది. చావు భయం అప్పుడే ఏర్పడదు.

పెద్దవాళ్ళు ప్రదర్శించే ప్రేమ, ద్వేషం వేరువేరుకాదు. ఒకేబొమ్మకు రెండువైపులవంటివి. ద్వేషానికి కారణం ప్రేమ కల్పిస్తుంది. ప్రేమబొమ్మయితే, ద్వేషం బొరుసవుతుంది. ఎటువంటి ప్రమాణాలూ, విలువలూ లేని స్థిరప్రపంచానికి చేరుకోగలిగితేనే ఈదృశ్య ప్రపంచం సృష్టించే వైరుధ్యాలనుంచి బయటపడగలుగుతాం.

నేను-నువ్వు అన్న భేదాన్ని ప్రజలు చూపిస్తారు. నేను(అహం), నువ్వు(పరాయివ్యక్తి) ఉన్నంతకాలం ప్రజలు రాగద్వేషాలనుంచి విముక్తులు కాలేరు. అహాన్ని ప్రేమించేహృదయమే ద్వేషించడానికి పరాయి వ్యక్తిని సృష్టిస్తుంది.మనుషులు ఎంతో అభిమానంగా చూసుకొనే ఈ అహమే మొదటి శత్రువు, ప్రధాన శత్రువు.

ప్రజలు దాడిచేస్తారు. లేదా ఆత్మరక్షణ చేసుకొంటారు. ఫలితంగా ఏర్పడే వివాదానికి నువ్వు కారణమంటే నువ్వు కారణమని ఆరోపించుకొంటారు. తప్పట్లు కొట్టి కుడిచెయ్యి శబ్దం చేసిందా, ఎడమచెయ్యిశబ్దం చేసిందా అని అడిగి నట్లు ఉంటుంది ఇది. వివాదాల్లో తప్పొప్పులు లేవు, మంచీ చెడులు లేవు. మేథ చేసే విభేదాలన్నీ ఒకేసారి పుట్టినవి. అన్నీపొరపాట్లే.

కోటకట్టడం మొదటి నుంచీ తప్పు.నగర రక్షణకోసమని సాకుచూపినా పాలకుని వ్యక్తిత్వంలోంచే కోటపుట్టుకొస్తుంది. ఆతరువాత చుట్టుపక్కల ప్రాంతాలపై బలప్రయోగం జరుగుతుంది.దాడి జరుగుతుందన్న భయంతో కోటఅవసరమని చెప్పి, ఆయుధాలను నింపి చివరకు తాళం చెవిని తలుపుకేవదిలి పెడతాడు.

ఆత్మరక్షణ అన్నది దాడి అవుతుంది. 'ఆత్మరక్షణకోసం ఆయుధాలు' అన్నది యుద్ధాన్ని రెచ్చగొట్టేవారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. నేను/నువ్వు, బలవంతుడు/బలహీనుడు, దాడి/ఆత్మరక్షణ అన్న మిధ్యాభేదాలను గోరంతలు కొండంతలు చేసిచూపటం, సమర్థించడం వల్లనే యుద్ధసంక్షోభం పుడుతుంది.

సాపేక్షదృష్టి అనే కోట నుంచి బయటపడి, మైదానంలో క్రియలేని ప్రకృతి మధ్యకు చేరటానికి మించి శాంతికి మరొకమార్గంలేదు. అంటే కత్తికి బదులు కొడవలికి పదును పెట్టాలి.

ఒకప్పుడు రైతులు చాలా ప్రశాంత జీవితం గడిపేవారు. ఇప్పుడు మాంసం గురించి ఆస్ట్రేలియాతో వాదిస్తున్నారు. చేపలకోసం రష్యాతో ఘర్షణ పడుతున్నారు. గోధుమ, సోయా చిక్కుళ్ళకు అమెరికా పై ఆధారపడి ఉన్నారు.

జపాన్‌లో మనం ఒకపెద్ద చెట్టు నీడ కింద ఉన్నామని నాకు అనిపిస్తోంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు పెద్దచెట్టునీడన ఉండటంప్రమాదకరమయింది. రాబోయేయుద్ధంలో మొదటి లక్ష్యంగా ఉండే 'అణుశక్తి గొడుగు' కిందకు చేరటం మూర్ఖత్వం. ప్రస్తుతం మనం ఆ నీలి నీడల కిందే భూమిని దున్నుతున్నాం. లోపల నుంచీ, బయటనుంచీ సంక్షోభం ఎదుర్కోబోతున్నామని నాకనిపిస్తోంది.

లోపలా, బయటా అన్నవి వదిలించుకోవాలి. ప్రపంచంలో ఎక్కడున్నా రైతులంతా ఒక్కటే. శాంతికి పరిష్కారం భూమికి దగ్గరలోనే ఉంది.

గడ్డి పరకతో విప్లవం

ఈకొండ మీద గుడిసెల్లో ఉండటానికి వచ్చే యువతీ యువకుల్లో కొందరు అన్ని ఆశలూ వదులుకొని వచ్చిన వాళ్ళుంటారు. వాళ్ళకు ఒక జత చెప్పులు కూడా ఇవ్వలేని ముసలి వాడినని బాధపడుతుంటాను. ఒక్కటి మాత్రం నేనివ్వగలను.

అది గడ్డి పరక.

గుడిసెముందున్న గడ్డి నుంచి ఒక పరక తీసి పట్టు కొని "ఈ ఒక్క గడ్డి పరక నుంచి విప్లవం పుడుతుంది" అన్నాను.

"ఒక వైపున సర్వనాశనమవుతోంటే ఈ గడ్డి పరకను పట్టుకొని బయట పడదామేను కొంటున్నావా?" అని ఒక యువకుడు అడిగాడు. అతని గొంతుకలో నిరాశ.

ఈగడ్డి పరక చాలా చిన్నదిగా, చాలా తేలికగా కనిపించవచ్చు. కానీ చాలా మందికి దీని నిజమయిన శక్తి తెలియదు. ఈగడ్డి పరక విలువను గుర్తించిన నాడు దేశాన్నీ, ప్రపంచాన్నీ మార్చి వేయగల మానవ విప్లవం మొదలవుతుంది.

నాచిన్న తనంలో ఇనుయోస్ పాస్ దగ్గర ఒకవ్యక్తి ఉండేవాడు. కొండమీద నుంచి రెండు మైళ్ళదూరాన ఉన్న 'గుంచు' రేవుకి గుర్రంమీద బొగ్గు రవాణా చేసేవాడు. రేవులో బొగ్గు దింపిన తరువాత ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు గుర్రపుపెంటా, గడ్డి పరకలూ ఏరుకొని పొలంలో వేసేవాడు. "ఒక గడ్డి పరకను కూడా విలువయినదిగా చూడు, ఒక అడుగు కూడా అనవసరంగా వేయవద్దు" అన్నదే అతని సిద్ధాంతం. ఇదే అతనిని ధనవంతునిగా చేసింది.

"గడ్డిని తగల బెట్టినా విప్లవం రగుల్కొంటుందని నేననుకోను" అని ఒకతను అన్నాడు.

పండ్ల చెట్ల మధ్య గాలి గలగలలాడింది. సూర్యకిరణాలు పచ్చని ఆకుల మధ్య తళతళలాడాయి. వరిసాగులో గడ్డి ఉపయోగం గురించి మాట్లాడసాగాను.

వరి, బార్లీసాగులో గడ్డి ప్రాముఖ్యతను గ్రహించి నలబై సంవత్సరాలయ్యింది. కోచి రాష్ట్రంలో ఎన్నాళ్ళుగానో సాగులో లేని ఒక వరి పొలం పక్కనుంచి వెళుతున్నాను. పొలంపై అల్లుకుని ఉన్న గడ్డి, కలుపుమొక్కల మధ్య బలంగాపొడుచు కొస్తున్న వరి మొక్కలను గమనించాను. దీని ఆధారంగా కొన్నిసంవత్సరాలు రకరకాల ప్రయోగాలు చేసి వరి, బార్లీ సాగుచెయ్యటానికి కొత్త పద్ధతి ప్రతిపాదించసాగాను.

ఇది సహజమయిన, విప్లవాత్మకమయిన వ్యవసాయ విధానమని నమ్మి దీన్ని గురించి పుస్తకాల్లో, పత్రికల్లో రాశాను. రేడియోలో, టి.వి.లో ఎన్నో కార్యక్రమాలు ఇచ్చాను.

ఇది చాలాచిన్న విషయమనిపిస్తుంది. కానీ గడ్డి పట్ల రైతులకు చాలా స్థిరమయిన అభిప్రాయాలున్నాయి. వీళ్ళలో మార్పు రావడమన్నది అంత తేలిక .కాదు. అగ్గి తెగులు, కాండం కుళ్ళే తెగులుకు సంబంధించిన బీజాలు వరిగడ్డిలో ఎప్పుడూ ఉంటాయి. కాబట్టి తాజాగడ్డిని పొలం మీద పరవటంవల్ల ఒక్కొక్కసారి సమస్యలకు దారి తీయవచ్చు. గతంలో ఈ తెగుళ్ళు ఎంతో హాని చేశాయి. వరిగడ్డిని పెంట పోగు ఎరువుగా చేసి వాడటానికి ఇదొక కారణం. అగ్గితెగులును ఎదుర్కోటానికి ఒకప్పుడు సామూహికంగా గడ్డినితగల బెట్టేవారు. హొక్కైడో ప్రాంతంలో వరిగడ్డి నంతటినీ తగలబెట్టాలని చట్టాలు కూడా ఉండేవి.

కాండంతొలిచేపురుగులు వరిగడ్డిలోకి చేరి శీతాకాలం అందులోనే గడుపుతాయి. ఈపురుగులు తిరిగి దాడి చెయ్యకుండా ఉండటానికి వరిగడ్డిని పెంట పోగుగా మార్చి జాగ్రత్త పడేవారు. ఈ కారణాలవల్ల జపాను రైతులు తమ పొలాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుతారు. గడ్డిని ఎక్కడపడితే అక్కడ వదిలేస్తే అందుకు తగిన శాస్తి జరుగుతుందన్నది వారి అనుభవం.

ఎన్నో ప్రయోగాలు చేసి విత్తడానికి ఆరునెలలు ముందే వరిగడ్డిని పొలం మీద చల్లటం వల్ల ఎటువంటి సమస్యా ఉండదన్న నా సిద్ధాంతాన్ని ఇప్పుడు సాంకేతిక నిపుణులు కూడా ధ్రువ పరుస్తున్నారు. దీంతో ఇంతకు ముందున్న అభిప్రాయాలన్నీ చెల్లకుండా పోయాయి. దీన్ని అంగీకరించి, రైతులు తిరిగి వరి గడ్డిని ఉపయోగించటానికి మరికొంతసమయం పడుతుంది.

పెంటపోగుతో మంచి ఫలితాలు పొందడానికి రైతులు కొన్ని శతాబ్దాల నుంచి కృషి చేస్తున్నారు. వ్యవసాయ మంత్రిత్వశాఖ దీనిని ప్రోత్సహించి ఏటా పోటీలు నిర్వహించేది. పెంటపోగు అంటే తమపొలాలను కాపాడే దేవత అన్న అభిప్రాయం రైతుల్లో పడిపోయింది. వానపాముల తోటీ, ఇతర పదార్ధలతోటీ మరింత 'మంచి' పెంట పోగు తయారు చెయ్యడానికి ఇప్పుడు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెంటపోగు తయారు చెయ్యనవసరం లేదనీ, ముక్కలు చేయకుండానే పొలం మీద చల్లితే సరిపోతుందనీ నేను చెప్పినంత మాత్రాన అంత తేలికగా వింటారా?

టోక్యో వెళుతూ టొకైడో రైలునుంచి బయటకు చూస్తుంటే గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మార్పు కనపడుతుంది. పదిసంవత్సరాల్లో శీతాకాలపు పొలాలు మారిపోయిన తీరు చూస్తే వ్యక్తం చేయలేనంత కోపం వస్తుంది. ఒకప్పుడు ఈ పొలాలు బార్లీతో, చిక్కుళ్ళతో, ఆవపూలతో కళకళలాడుతుండేవి. ఇప్పుడు సగం కాలిన గడ్డి కుప్పలు అలాగే వానలో నానుతున్నాయి. నిర్లక్ష్యానికి గురయిన ఈ వరిగడ్డే ఆధునిక వ్యవసాయంలోని అపసవ్యతకు నిదర్శనం. రైతుల ఆత్మల మాదిరే ఈ పొలాలు కూడా బీడు వారి బావురు మంటున్నాయి. వ్యవసాయ విధానంలో విజ్ఞత లోపించిందని ఇది సూచిస్తోంది.

శీతాకాలంలో జపాను పొలాలు బీడు పడి ఉండటం నేను ఇంకా ఎంత మాత్రం సహించలేను. ఈగడ్డి పరకతో విప్లవం మొదలు పెడతాను.

నాచుట్టూ చేరి నిశ్శబ్దంగా వింటున్న యువతీయువకులంతా ఒక్కసారి పెద్ద పెట్టున నవ్వారు.

"ఒక వ్యక్తి తెచ్చే విప్లవం! క్యోటో[1]మాదిరి భుజాన సంచి వేసుకొని అందులో బార్లీ, వరి, క్లోవరు విత్తనాలు నింపుకొని రేపే టొకైడో లోని పొలాల్లో వెదజల్లి వద్దాం రండి" అన్నారు.

"ఇది ఒక వ్యక్తి తెచ్చే విప్లవం కాదు" నవ్వుతూ నేనన్నాను "గడ్డి పరకతో విప్లవం!"

గుడిసె లోంచి బయటకొచ్చి మధ్యాహ్నపు ఎండలోకి అడుగుపెట్టాను. ఒక నిముషం ఆగి పండ్లతో నిండి ఉన్న చెట్లనూ, కలుపు మొక్కల మధ్య గీరుకు తింటున్న కోళ్ళనూ చూసి పొలాల మధ్య నుండి నాకు అలవాటయిన దారి గుండా కిందకు దిగసాగాను.

---

1. జపనీస్ పురణాల్లోని ఆరోగ్యదేవత భుజాన పెద్ద సంచి వేసుకొని సంచరిస్తూ అదృష్టాన్ని వెదజల్లుతుంటాడని అంటారు.